భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

అక్టోబరు 1979

సంపుటము : 56 **సంచిక : 10**

విడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

అక్టోబరు 1979

సర్వ స్వామ్య సంకలితం

శ్రీ వఝల కాళిదాసు

ప్రజలారా, నిరు
 పేద ప్రజల్లారా, నిరు
ద్యోగుల్లారా, కరువు కల్పించిన
యోగుల్లారా ! ...
  మన కథ మనమే రాసుకుందాం
  మన బాధ మనమే పాడుకుందాం
  మన గాథ మనమే విందాం
  మనం మనలోమనకే వినిపిద్దాం !

మాడుతున్న కడుపుల్ని
మడత పెట్టి,
తడుస్తూన్న ఎండుతున్న
బడుగు శరీరాలని
పడుకోబెట్టి
దీని కంతటికి మేమే స్వా
ధీన ప్రభువుల మని
అనుకుంటూ
అర్పిద్దాం
అశ్రుతర్పణం !

*   *   *

ప్రజాస్వామ్యం మనది
ప్రజాతంత్రం మనది
ప్రజా ప్రభుత్వం మనది !
  ప్రతి దానికీ ముందు
  'ప్రజ'ని తగిలించి మరీ
  పాలకులు — క్షమించండి —
  ప్రజాపాలకులు
  ప్రజాపీడ సాగిస్తూ
  పీడిత ప్రజానీకానికి
  వేడుకలు కల్పిస్తున్నామని
  విద్యాదానం చేస్తున్నామని
  విజ్ఞాన దీపం వెలిగిస్తున్నామని
  వేనోళ్ల చాటుతూ ఉంటే
  విస్తుపోయి విభ్రాంతులై
  వింటూన్న ప్రజల్లారా
  వినండి, ఇదండీ మనకథ !

*   *   *

స్వామ్యాలంటూ ఉండవంటూ
సామ్యవాదులం మేం అంటూ
సర్వసమానత్వం మేం
సాధించి తీరుతాం అంటూ
అరుస్తూన్న ఈ ప్రజా మంత్రులు
అబద్ధాలమ్మడం నేర్చిన ప్రబుద్ధులు.
తెల్లముఖం వేసుకు వింటూ మనం
దినం దినం క్షణం క్షణం
దిగనారి పోతున్నాం కేవలం
దీన జనాభాకింద మారుతున్నాం !
మనల్ని నిర్జీవ పజగా భావించి
మన మాన ప్రాణ ధనాలమీద
చిత్తాను సారంగా శాసిస్తూన్న
ప్రభువులు వీరు, గురువులు వీరు
మనమీద అన్ని హక్కులూ
''మావే'' అని అరుస్తున్నారు
సర్వస్వామ్య సంకలితం అని !

శ్రీ రేకళిగె మఠం వీరయ్య

శివలెంక మంచన్నగారి గురించి

శివలెంక మంచన వీరశైవ శివ శరణుల యందలి అగ్రగణ్యులలో నొకరు. వచన సాహిత్యమునందు వీరి వచనములు ప్రఖ్యాతములు. వీరిని మంచన పండితుడని కూడ అందురు. వీరు అఖండ పాండితీ సంపన్నులు. వీరిని 'పండితత్రయము'లోని వారని అందురు. ఈ పండితత్రయము, "ఆరాధ్య సాంప్రదాయమునకు చెందిన వార"ను నొక వాదము గలదు. గాని 'పండితత్రయ' మనబడు — శ్రీపతి పండితుడు, శివలెంక మంచన, మల్లికార్జున పండితుడు— ముగ్గురి పేరులను 'శివగణ సహస్ర మాలిక' యందు స్తుతింపబడినందున వీరు వీరశైవ గణములలోని వారనుటలో సందేహముండదు. అంతే కాక, పాలకురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రయందు 'ఈ ముగ్గురిని కూడ కఠోర శివభక్తాగ్రేసరులని వచించినందున వీరిని వీరశైవ సంప్రదాయమునకు చెందిన పండితత్రయ మనుటయే సముచితముగా నుండును.

పాల్కురికి సోమనాథుడు తన బసవ పురాణమునందు శివలెంక మంచన్నగారు కాశియందలి విశ్వేశ్వరలింగమునకు నిత్య త్రికాలముల యందు అర్చించునప్పుడు, తన పది వ్రేళ్ళను అర్పించి మరల వానిని విశ్వేశ్వరుని వరప్రభావంబున బడయుచుండిన శివభక్తాగ్రేసరుండని వచించియున్నాడు. అంతేగాక కాశియందు శివలెంకమంచన్న శివుడొక్కండే ఉత్పత్తి, స్థితి, లయములకు కారకుండని; ఆగమ శాస్త్రముల వలనను, శృతిస్మృతి పురాణేతిహాసముల వలనను, అన్య మతీయులతో వాదించి ప్రతిపాదించినట్లును, వాదమునందు వోడిన వితండవాదుల కోరికపై అతడు విష్ణుదేవాలయమునుండి, విష్ణువు (విగ్రహము) ను నడిపించుకొనుచుబోయి విశ్వేశ్వరునకు నమస్కరింపజేసి, శివాధిక్యతను నిరూపించిన ప్రమథపుంగవుండనియు, సోమనాథుడు తెలిపియున్నాడు. శివునియందలి ఇతని అనన్య భక్తియేగాక, శివభక్తులయెడ నితడు కింకర భావమును వహించి యుండెననునది ఇతని పేరు నందలి 'శివలెంక'యను పదము వలన తెలియుచున్నది. కన్నడ సాహిత్యమునందును వీరి చరిత్ర నిటులనే తెలుపబడియున్నది.

మంచన్నగారి తాత, సోమశంభు దేశికుడు. గొప్ప పాండితీ ప్రభగలవాడు. ఇతని తండ్రి సుప్రసిద్ధ విద్వాంసుడగు శంభు భట్టుడు. అతడు కామకాది శివాగమములను వృత్తుల యందు రచించి ప్రకాశింపజేసిన 'సకలాగమాచార్యుడు'. ఇట్టి ఘన అనుభావు వంశమునందుబుట్టిన, శివలెంక మంచన పరనాథులనోడించి, విష్ణువుచే విశ్వేశ్వరునకు నమస్కరింపజేసి, శివాధిక్యతను నిరూపించుట స్వభావ సిద్ధమే!

శివలెంక మంచన, బసవని భక్తి ప్రభావములను, సదాచార సంపన్నతను, అనుభవ మంటపము ప్రసిద్ధిని విని, కల్యాణమునకు వచ్చి, బసవేశ్వరుని సందర్శించి, కొంతకాల మచ్చట నుండి; 'అనుభవ మంటపము' నందలి గోష్ఠులలో పాలుగొనుచు, తన అనుభవమును తన వచనముల ద్వారా తెలియజేయుచుండెనని తెలియవచ్చుచున్నది. కనుక ఇతడు బసవని సమకాలీనుండనియు పన్నెండవ శతాబ్దము నాటివాడనియు తెలియుచున్నది.

శివలెంక మంచన్నగారి కుమారుడు, ఉరిలింగదేవుడు. ఇతడును ఉరుతర శివశరణుండు. ప్రఖ్యాత వచనకర్త. ఇతని బాల్యవ్వన దశలయందలి విశేషములు తెలియవు. ఇతడు మరాఠ్వాడాకు చెందిన నాందేడు జిల్లాలోని, కందహారు పట్టణమున నుండెననియు, అచంచల శివభక్తిగలిగి లింగ నిష్ఠాపరుండై వెలసెనని తెలియుచున్నది. ఒకనాడు ఇతడు ఇష్ట లింగ ధ్యానమందు నిమగ్నుడై యుండగా, ఇతని కుటీరమునకు ఎవరో నిప్పు నంటించిరనియు, ఆ జ్వాలలకు ఇతడు చలించక లింగనిష్ఠయందే యుండెననియు, ఇతని కెట్టి హానియు కలుగలేదనియు; చివరకు నిప్పు నంటించిన దురాత్ములే పరాభవము నొందిరనియు నొక ఇతిహాసము గలదు. ఇతని శిష్యులలో ఉరిలింగ పెద్దియు నొక ఉజ్జ్వల శివశరణుడు, ఉత్తమ వచన కర్త. ఇతడును మరాఠ్వాడా నివాసియనియు తెలియుచున్నది.

శివశరణులలో ఇట్లు పరంపరాగతముగ, శరణ సంతతికి జెంది, అనుభవ మంటపమునందు గణుతికెక్కిన శరణులై తమ అనుభావ జ్ఞాన వచనములను, వచించినవారు అరుదు. అందును మంచన పండితుడు కర్ణాటక, మహారాష్ట్ర, సంస్కృత భాషల యందు, ఉద్దామపండితులై, శివానుభావజ్ఞాన సంపన్నులై, లింగ భోగోపభోగులై, లింగాంగ సామరస్యానుభావులై వెలయుట (ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర) ఈ మూడు ప్రాంతములకును గౌరవప్రద మనదగును.

ఇట్టి శరణ శ్రేష్ఠుండగు శివలెంక మంచనగారి కన్నడ వచనము లందలి ఉన్నత భావములు, ఉదాత్తమగు తత్త్వములు తెలుగు సోదరులకు తెలియజేయవలయునను తలంపుతో, వారి కొన్ని వచనముల అనువాదమును ఇందు చేర్చియున్నాను.

వచనముల అనువాదము

ఎండమావులవలె, కనపడుచున్న నున్నువు
నాద బిందువులం దొనగూడు విధమెట్టిదోయి?

నాదము దీర్ఘమై బిందువు గుండ్రమై
కళ పరిపూర్ణమై నిండిననేగాని,
ద్వైభావము నాస్తిగాదు. నాస్తియైన పిదప
ఈశాన్యమూర్తి నిరాకారమూర్తి యగును.
మల్లికార్జున లింగము స్వయంభువగును.
వేదము అనంతర (అపర) విషయము నరసెను.
పురాణము పుణ్యమును గోరెను.
శాస్త్రము జయాపజయములకు లోనయ్యెను.
శ్రుతి నాదమునందు చిక్కుకొనెను.
శ్రుతి బిందువులందు నాదము నిలిచి,
గోళాకారము కాగా, త్రివిధమునకు దూరమయ్యెను.
ఈశాన్యమూర్తి మల్లికార్జున లింగము స్వయంభువయ్యెను.

★ ★

ఆది వస్తువు అనాది వస్తువను
భేదము నొనరించునప్పుడు,
అది తన తెలివి(జ్ఞాన) భేదమా ? లేక,
ఆయా వస్తువుల రూపములందలి భేదమా ?
ఆది మధ్యాంతములు, చెరుకున కుండునేగాని,
చెక్కెర కుండునా ?
ఆది అనాది యను భేదము,
తన మనసు నందలి భావమేగాని,
ఆ వస్తువు నిత్యము సత్యము.
ఈశాన్యమూర్తి మల్లికార్జున లింగము
స్వయంభువగు ఏకమూర్తి.

★ ★

అంగమునకు లింగమునిచ్చి, ఆచార్యుడయ్యె.
మనకు జ్ఞానమునుజూపి, మోక్షాచార్యుడయ్యె.
మోక్ష విమోక్షముల రెంటి గురుతును జూపి,
దేహ ధర్మమమున తప్పించి,
జనన మరణముల విడిపించి,
తద్రూపమును జూపెను జ్ఞానగురువు.
అతడే పరను ప్రకాశుడు, ఈశాన్యమూర్తి
మల్లికార్జున లింగము.

★ ★

రుచి జూచుటకు నాలుకవయ్య,
వాసన జూచుటకు నాసికమయ్య,
రూపము జూచుటకు కన్నులయ్య,
శబ్దము వినుటకు చెవులయ్య.
స్పర్శ నరయుటకు చర్మమయ్య.
ఇట్లు ఈ ఘటమునందు నిలిచి,
పంచ వక్త్రుడవైతివి గద, ఓ,
ఈశాన్యమూర్తి, మల్లికార్జున లింగమా !

★ ★

విశ్వమయ రూపుడవయ్య యుండి
జ్ఞానియగు నొక ఆత్మయందే,
ఇమిడి యుంటివిగద !
తాళమునకు మరలెన్ని యున్నను,
ఒకే ద్వారమును బిగించియుండునటులు,
భక్తుల చిత్తమందు,
నిశ్చలుండవై యుంటివిగద,
ఓ ఈశాన్యమూర్తి మల్లికార్జున లింగమా !

★ ★

బహురూపునకు తగిన భాషాంగములు
లేకున్న మెచ్చదీ జగము.
గురుచర రూపముల దాల్చిన;
గురుమూర్తికి తగిన గంభీరత,
చరమూర్తికి తగిన నిస్పృహతలు ఉండవలయును.
ఇటులీ ఉభయమూర్తులు
కామ విరహితులై నిలిచిన,
వారే ఈశాన్యమూర్తి మల్లికార్జున లింగము.

★ ★

పర ధనమును, ముట్టకుండుటే వ్రతము.
పర వధువును కోరకుండుటే శీలము.
సకల జీవుల చంపకుండుటే నీమము.
సత్యాసత్యముల భేదము, తెలియుటే నీమము.
ఇది ఈశాన్యమూర్తి మల్లికార్జున
లింగమునకు సందేహములేని వ్రతము.

★ ★

కాయమున్ననే, జీవునకు తావుండును.
జీవమున్ననే, జ్ఞానముకు నెలవుండును.
జ్ఞానము వలననె ఆత్మ ప్రకాశమొందును.
ఒకదానితో నింకొక దానిని తగ్గించి
చూచు మార్గమును జూపుము. ఓ,
ఈశాన్యమూర్తి మల్లికార్జున లింగమా!

★ ★

లింగము గురుతు దెలిసిన,
శివలింగమును పూజించవలయు.
ఆత్మకు ఆకలి గలిగిన,
వచ్చిన పదార్థమును,

లింగార్పితము జేయవలయు,
ఇది జ్ఞానమునకు మూలము,
జ్ఞానియగుటకు గురుతు,
సర్వసమన్వయుండగు, యుక్తి.
ఈశాన్యమూర్తి మలి కార్జున
లింగమును దెలియు శక్తి.

★ ★

పాద తీర్థమును గొనిన, దప్పి ఆరెను.
ప్రసాదమును గొనిన ఆకలి దీరెను.
భృత్య భావమునందు,
ప్రత్యుత్తర మీయకుండునది
ఈశాన్యమూర్తి మల్లికార్జున
లింగమునకు 'లెంక'త్వ భావము.

★ ★

పరస్త్రీల గోరకుండిననే,
గురుని జ్ఞానము సాధ్యమగును.
పరధనము నాశింపకుండిననే,
లింగ జ్ఞానము సాధ్యమగును.
నిందజేయుట మానిన చోనే
జంగమ భక్తి సాధ్యమగును.
ఇటులీ త్రివిధముల, మానుకొను నతడు
ఈశాన్యమూర్తి మల్లికార్జున,
లింగమును చేరగలుగును.

* *

కాయమును దేవాలయముగ నెరింగి,
గురు డిచ్చిన లింగమును దైవముగా తలంచి,
చూచు కన్నులను పూజించు పూలుగా నెంచి,
ఆనందాశ్రువులను సకల భోగములని తలంచి,
అష్టవిధార్చన, షోడశోపచార విధుల
పూజించుచో, ఈశాన్యమూర్తి
మల్లికార్జున లింగానుభావము గలుగును.

ఆగు

శ్రీ పంతులజోగారావు

అక్కడే ఆగు —
అడిగిందానికి జవాబుచెప్పి మరీ
ముందుకు సాగు.

ఎవరయ్యా! ఎవరు నువ్వు?
ఈ కాంతి కిరణాలని ఖాతరు చేయకుండా
ఎంతదూరం తప్పించుకు పోగలవు?
నిజాల శిలీముఖాలు నిన్ను చీల్చి చెండాడుతాయి.

నవనవాలైన విపుల శబ్ద సంచయాన్ని వినకుండా
చెవులు మూసుకుని తొలగిపోతున్నావు
శ్రామిక జన శ్రమ వివృతముఖయంత్ర సంజనిత
ఆర్తరవాలు నిన్ను ఆకులీ భూతుడ్ని చేస్తాయి; ఆగమని
గద్దిస్తాయి.

ఎత్తిన పిడికిళ్ళ బలాన్ని గుర్తించకుండా
మత్తు ప్రపంచంలోకి మటుమాయ మవుతానంటావు —
నీదారేదో నువ్వు వెతుక్కుంటా నంటావు

కానీ —
ఒక్కడివీ ఎక్కడికి పోగలవులే!
ఈ అంధకారచ్ఛుట తొలగిపోయి కాంతి వెల్లువ నిన్ను
కాంతిమయం చేసే రోజు —
ఈ జన సముద్రఘోష నిన్ను
ఒక క్షణమైనా ఊపిరాడనివ్వనిరోజు —
నువ్వుకూడా ఆ వెల్లురు సముద్రంలో కలిసిపోతావు
ఆ మహోదధిలో కేవలం ఒక్క బిందువుగా మిగిలిపోతావు!

డా. బి. ఆర్. కె. రావు

బ్రిటిషు పాలనలో క్షామం, నిరుద్యోగం, పేదరికం

రామమోహన్‌రాయ్, నౌరోజి, రమేష్‌చంద్రదత్, గోవిందరనడే, గోపాలకృష్ణ గోఖలేల భారతీయ ఆధునిక ఆర్థిక ఆలోచన

(గత సంచిక తరువాయి)

రమేష్‌చంద్రదత్

రమేష్‌చంద్రదత్ కలకత్తాలో 1848 లో జన్మించాడు. 1869 లో ఇండియన్ సివిల్ సర్వీసులో ఉద్యోగిగా చేరాడు. సివిల్ పరిపాలన సర్వీసులో ఉండగ భారతీయ ప్రజల వాస్తవ జీవన పరిస్థితుల్ని గురించి, ముఖ్యంగా బెంగాలు రైతుల జీవన పరిస్థితుల్ని గురించి సమాచారం సేకరించాడు. 1892 లో కంపానియన్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్ అనే బిరుదును పొందాడు. 1897 లో ఐ. సి. యస్. నుండి పదవీ విరమణ చేశాడు. తదుపరి హెచ్చుగా యూరోపులో ఉన్నాడు. అయినా భారత రాజకీయాల్లో క్రియాశీలంగల అభిరుచిని చూపాడు. 1899లో భారత జాతీయకాంగ్రెసు లక్నో మహాసభలో ఆ సంస్థ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. దేశభక్తి ప్రేరణవల్ల భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటి కావాలని కోరాడు. బ్రిటిషు పరిపాలన క్రింద జరిగిన భారతదేశ ఆర్థిక చరిత్రను వ్రాసి, అందులో భారతదేశపు పేదరికానికి కారణాలను వివరించాడు. ఈపేదరికాన్ని తొలగించాలనే ఉద్దేశ్యమే ఆయన చేత అలా వ్రాయించింది. బ్రిటిషు పరిపాలనలో లభించిన శాంతి, పాశ్చాత్య విద్య, న్యాయశాఖ, పరిపాలన, చట్టాన్ని అనుసరించి జరిగిన పాలన (Rule of the Law) మొదలైన వాటి కాయన హర్షామోదాలు తెలియజేసాడు. ఆర్థిక సౌభాగ్య ప్రగతి ఉన్నట్లయితే వాటికి అర్థం ఉండేది. కాని బ్రిటిషు పరిపాలన దీనినే లేకుండా చేసింది. ఈ దుస్థితిని వివరాలతోసహా నిష్పాక్షికమైన వాస్తవిక దృష్టితో బయల్పరచాడు. అలా చేయడంవల్ల బ్రిటిషు అధికారుల చేత అంతవరకు అవలంబించిన విధానాలలోని తప్పులను గుర్తింపజేసి భారతదేశానికి అనుకూలమైన విధానాలను అవలంబించేటట్లు చేయడం తన నైతిక కర్తవ్యమనుకున్నాడు. అంతవరకు భారతీయ ఆర్థిక వ్యవస్థలో అంతర్భూతమైన బలహీనతలు పేదరికానికి, క్షామములకు కారణమని బ్రిటిషువారి విధానాలందుకు కారణంకాదని అనుకున్నారు. దత్ ఈ నమ్మకాన్ని గట్టిగ ఖండిస్తూ "ఈ పైపై సంజాయిషీలక్రింద లోతుగా దాగిఉన్న భారతీయ పేదరికానికి, భారతదేశంలో వచ్చిన క్షామములకు కారణాలను తెలుసుకోవాలి" అని చెప్పాడు.

భారతీయ సివిల్ సర్వీసులో పనిచెయ్యడంవల్ల బ్రిటిషుపాలన ఇండియాలో అవలంబించిన విధానాలను ఖండించడం నైతికంగా ఆయనకు కష్టమయ్యింది అనే విషయాన్ని ఈ విధంగా చెప్పాడు : "నా జీవితంలో ఉత్తమోత్తమము, సుఖవంతము అని చెప్పదగిన కాలాన్ని భారతీయ పరిపాలన శాఖలో గడపడంవల్ల ఆ పరిపాలన బలహీనతను గురించి, భారత ప్రభుత్వ విత్త, ఆర్థిక విధానాలను గురించి ఆలోచించడము అంద విహీనంగాను, బాధాకరంగాను ఉంటుంది. ఈ సమయంలో బ్రిటిషు పాలనలో ఉన్న భారతదేశపు ఆర్థిక కథను చెప్పి, భారత ప్రజల్లో పాతుకుపోయిన పేదరికాన్ని గురించి వివరించాలి కాబట్టి నేనాపనికి పూనుకున్నాను" అని బ్రిటిషు పరిపాలన ఉద్దేశ్యపూర్వకంగా అమలుజరుపుతున్న విధానాలే ఈపేదరికానికి కారణమని గ్రహించడంవల్ల ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా (వాల్యూం I, రౌట్‌లెడ్జ్ అండ్ కేగన్ పాల్ లిమిటెడ్, ఎనిమిదవ ఇంప్రెషన్, 1956, ప్రిఫేస్) అనే గ్రంథంలో దత్ వ్రాసారు.

దత్ గొప్ప ఆర్థిక చరిత్ర రచయిత. ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా అనే గ్రంథాన్ని రెండుభాగాలుగా వ్రాసాడు. మొదటి భాగం బ్రిటిషువారి పాలన తొలిదశను గురించి, రెండవ భాగం విక్టోరియా శకంలోని బ్రిటిషు ఇండియాను గురించి చెబుతాయి.

"ఫామిన్స్ ఇన్ ఇండియా" అనేది దత్ వ్రాసిన మరొక మంచి గ్రంథము. అధికార రికార్డు లన్నిటిని వెదకి, వివిధ ఆర్థిక సంఘటనల మధ్య సంబంధాలను తెలుసుకొని, వివిధ ఆర్థిక దృగ్గోచరాల కనుగుణ్యంగా ఇచ్చేవాదనల నిజమైన అర్థాన్ని దత్ బయల్పరచాడు. ఆయన చెప్పిన చారిత్రిక కథనం ఈనాటి తీవ్రమైన వస్త్వాశ్రయ పరీక్షకు (test of objectivity) ఆగకపోవచ్చు. అతనిగ్రంథంలో ఆర్థిక చరిత్ర, ఆర్థిక వాదము కూడ ఉండటమే ఇందుకు కారణం కావచ్చు. అతని ఆర్థిక వాదము భారతదేశ పేదరికాన్ని తొలగించాలని కోరింది. అందుచేత ఈ వాదన ముందుగానే అనుకొని వ్రాసిన విషయంగా కన్పిస్తుంది.

ఆర్థికవాదంలో ప్రాతిపదికంగా ఐక్యత ఉన్నదని, అది ఆర్థిక వ్యవస్థ అలాగో, ఇలాగో ఉండటంమీద ఆధారపడదని దత్ చెప్పారు. పెరుగుతున్న పేదరికానికి, వృద్ధి చెందుతున్న సౌభాగ్యానికి పరిపాలన అనుసరించే ఆర్థిక విధానాలు వాస్తవ కారణాలు· "భారతదేశంలో పనిచేస్తున్న ఆర్థిక సూత్రాలు ప్రపంచమంతటా పనిచేస్తున్నట్టివే. ఇతర దేశాల్లో సంపదకు మూలమైన కారణాలే భారతదేశంలో కూడ సౌభాగ్యానికి త్రోవతీస్తాయి. ఇతర దేశాల్ని పేదరికంలో పెట్టిన కారణాలు భారతదేశాన్ని కూడ పేదరికంలో ఉంచగలవు. అందువల్ల ఇతర దేశాల భాగ్యం, పేదరికాలను గురించి ఆలోచించడానికి అనుసరించే పద్ధతే భారతదేశానికి సంబంధించిన ఈ విషయాలను గురించి అన్వేషించడానికి ఆర్థిక శాస్త్రవేత్త ఉపయోగిస్తాడు" అని "ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా" పీఠికలో దత్ వ్రాసాడు·

తన సమకాలికులైన నౌరోజి, రనడేలను ఎదుర్కొన్న సమస్యలే దత్‌ను కూడా ఎదుర్కొన్నవి. దత్ కూడ తన సమకాలీనుల వలెనే ప్రధానంగా భారత ప్రజల పేదరికాన్ని, చర్విత చరణమౌతున్న క్షామములను గురించి ఆందోళన వెలిబుచ్చారు. భారతదేశం ఆర్థికంగా ఖాళీ (Drain) అయిపోవడము, మూలధన ఏర్పాటు నెమ్మదిగా జరగడము, బీద స్థితిలో ఉన్న వ్యవసాయము, పన్నుల భారము మొదలైనవి అతన్ని కలవరపర్చినవి. అతడు చారిత్రక అధ్యయన పద్ధతి నవలంబించాడు· అతని ఆర్థికవాదన, నిర్ణయాలు భారతీయ ఆర్థిక చట్రంలో చేయబడిన వాస్తవికాలు. అతని సమకాలీనులు సాంప్రదాయక ఆర్థిక శాస్త్రవేత్తలు చేసిన ఆర్థికవాదన విలువను అనుమానించారు. దత్‌కు ఆ వాదనలోని ప్రాతిపదిక విలువ సత్యంగా కన్పించింది. వాటిని అనువర్తింపచేయడానికి మాత్రమే సంస్థాగత చట్టాన్ని గణనలోకి తీసుకోవాలి. దత్ ఇటువంటిదృష్టి కల్గి ఉన్నప్పటికి బ్రిటిషు అధికారులవలంబించిన తిరోగామిక ఆర్థిక విధానం పూర్వ నిర్ధారిత విశ్వాసమని విచారాన్ని వ్యక్తపరచాడు. అతని ఆర్థిక చరిత్రను చదివితే ఈ విషయం బయటపడుతుంది: "దత్‌కు చరిత్ర రచయిత కుండవలసిన లక్షణాలన్నీ ఉన్నవి. అధికార రికార్డులను నిశితంగా పరిశీలించే తీవ్రమైన అభిలాష, సమకాలీన విషయాలమధ్య, ప్రాపంచిక విషయాలమధ్య సంబంధాలను చెప్పగల శక్తి, తేలికగా అర్థమయ్యే రీతిలో వాదించే సామర్థ్యము, వివరించి చెప్పేశక్తి ఉన్నవి. అతను చెప్పేవి పూర్వ నిర్ధారితాభిప్రాయాలని చదివేవారికి అనిపిస్తుంది. అతని గ్రంథాల్లో చాలా పుటల్లో నిజమైన చరిత్ర రచయితగా కంటె సమర్థవంతంగా వాదించే వ్యక్తిగా తెలియజెప్పే విషయాలున్నవి. అతని ఆర్థికచరిత్ర ప్రత్యేక మార్గాల్లో ఆర్థిక విధానాన్నవలంబించాలని వాదించే తీవ్రమైన సిద్ధాంతంగా కన్పిస్తుంది" అని భబతోష్‌దత్ "ది ఎవల్యూషన్ ఆఫ్ ఎకనామిక్ థింకింగ్ ఇన్ ఇండియా" (పే. 10) అనే గ్రంథంలో వ్రాసారు.

భారత ప్రజల నిరుపేదరికానికి కారణాలుగా చూపించే చాలా వాటిని సమంజసమైన వివరణలుగా రమేష్‌చంద్రదత్ అంగీకరించలేదు. భారతదేశంలో శాంతిలేకపోవడంవల్ల పేదరికం వచ్చిందనే వాదానికి వ్యతిరేకంగా అతని ఆలోచన మొదలయ్యింది. బ్రిటిషు పరిపాలనవల్ల దేశం అనుభవిస్తున్న లాభాలలో శాంతి ఉండటము ఒక పరిస్థితి. భారతదేశం ఇంకా పేద దేశంగా ఉండటానికి బ్రిటిషు పాలకులు లాభదాయకమైన చర్యలు తీసుకునే అవకాశం లేకపోవడం గాక, వారవలంబించిన తప్పు విధానాలు కారణము. దురదృష్టవశాత్తు భారతీయ పరిపాలన చక్రవర్తి (Crown) చేతుల్లోకివచ్చిన తరువాత కూడ ఈ తప్పు విధానాలను తొలగించలేదు. భారతదేశంలోని బ్రిటిషు చక్రవర్తి పరిపాలన తగిన ఆర్థిక విధానాన్ని అనుసరించి ఉన్నట్లయితే క్షామము చర్విత చరణమయ్యేది కాదు. పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నా, క్షామములు పదే పదే వచ్చినవి. "భూమి సారవంతమైనది. ప్రజలు శాంతంగాను, విధేయులుగాను, కష్టపడి పనిచేసేవారుగాను, మిత వ్యయం మాత్రమే చేసేవారుగాను ఉన్నారు. అనేక తరాల బ్రిటిషు పాలకులకు భారతదేశ పరిపాలనలో నెరవేర్చవలసిన విధ్యుక్త ధర్మాలలో శిక్షణ ఇవ్వబడింది. అయినా క్షామములు అంతరించలేదు. నలభై సంవత్సరాలలో భారతదేశంలో పది క్షామములు వచ్చినవి. ఈ నలభై సంవత్సరాల్లో, మితవాద దృక్పథంతో అంచనా వేసినా, ఈ క్షామాలతో వచ్చిన ఆకలి బాధ, వ్యాధులవల్ల కోటిన్నరమంది ప్రజలు చనిపోయారు. ఇటువంటి విచారగ్రస్తమైన దృగ్గోచరాన్ని ఆధునిక కాలంలో నాగరికతగల పరిపాలన ఉన్న ఏ దేశం కూడా అనుభవించలేదు" అని రమేష్ చంద్ర దత్ "ఫామిన్స్ ఇన్ ఇండియా" (పే. 16) అనే గ్రంథంలో వ్రాసారు. పేదరికం, క్షామాలకు కారణాలుగా చెప్పబడుతున్న ఒకో విషయాన్ని తీసుకుని ఆయన అబద్ధమని రుజువు చేసారు. ఇందులో ఒక కారణం జనాభా వత్తిడి. భారతదేశ జనాభా బ్రిటిషు జనాభా కంటే వేగంగల రేటులో వృద్ధి నొందడంలేదని దత్ చూపించారు. దత్ అధ్యయనం చేసిన కాలానికిముందు భారత జనాభా వాస్తవానికి ఏ మాత్రం కూడా పెరగలేదు. భారత రైతాంగంలో పొదుపరితనము లేదనే వాదనతో దత్ అంగీకరించలేదు. పంటలు పండకపోవడము క్షామానికి కారణమనే వాదనను కూడ దత్ తిరస్కరించాడు. భారతదేశంలో మొత్తం పంటలన్నీ ఎప్పుడూ పండకుండా పోలేదు. ఉన్న ఆహార నిల్వలను పంపిణీచేసే యంత్రం మాత్రమే తన పనిలో అపజయం పొందింది. వడ్డీ వ్యాపారస్థునికి రైతు శాశ్వతంగా రుణపడే ఉంటున్నాడనేది మరొక అర్థరహిత వాదనని దత్ అన్నాడు. ఇలా రైతు శాశ్వతంగా రుణపడి ఉండటానికి అధి

కంగా పన్నులు వసూలుచేసిన రెవెన్యూ విధానమే కారణం గాని, అప్పుడప్పుడు పంటలు పోవడంగాని, రైతులు వృథాచేసే అలవాట్లు గాని కారణం కాదని దత్ వాదించాడు. పన్నులు చెల్లించిన తర్వాత రైతువద్ద భోజనానికి సరిపోయే గింజలే ''అస్తుబిస్తు''గా మిగిలేవి. పంట పండకపోయినా, పంట దిగుబడి సరిగా రాకపోయినా రైతును ఆదుకునే వ్యవస్థ లేకపోయింది.

భారతీయ ఆర్థిక వ్యవస్థ పనిచేసిన తీరు పేదరికంలో ఉన్న రైతులను ఆకలి బాధకు గురి చేసింది. భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకగా ఉన్నది. కాని వ్యవసాయంలో సరైన పెట్టుబడిలేక క్షీణించిపోతూ ఉన్నది. పేదరికంలో ఉన్న రైతుకు పెట్టుబడి చేసే శక్తి లేకుండా పోయింది. ఆర్థిక ఖాళీ (Drain) వల్ల వ్యవసాయం ఇచ్చే పన్నులవల్ల వచ్చిన రాబడి ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి చేయడానికి వీలులేకుండా పోతోంది. ఆర్థిక చరిత్ర వివరణల్లో అధిక పన్నుల భారాన్ని దత్ ఖండించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ వారు తమ పరిపాలన తొలి రోజుల్లో భారతదేశాన్ని తమ ఎస్టేటుగాను, పెద్ద తోటగాను భావించి, దేశంలోని భూమి నుండి వచ్చిన ఉత్పత్తి అంతా తమదిగానేఎంచి, మామూలు సంవత్సరాల్లో సేద్యం చేసేవారికి, భూాభా మందులకు కేవలం వారు తినడానికి మాత్రం కావలసిన దాన్ని మాత్రమే వారికి వదిలారు. ఇందువల్ల పన్నులు విధించబడే ఆధారము, చెల్లించే శక్తి తగ్గిపోయినవి. అందువల్ల ఈస్ట్ ఇండియా కంపెనీ ''పర్మనెంట్ సెటిల్‌మెంట్'' విధానాన్ని అవలంబించి వసూలు చేసిన పన్నుల నుండి తొంభై శాతాన్ని తీసుకోవడానికి సమకట్టింది. మొదట్లో ఈ పద్ధతి దారుణంగా పిండివేసే పద్ధతిగా భావించబడింది. వ్యవసాయోత్పత్తుల ధరలను పెంచడం ద్వారా ఈ బాధను కొంతవరకు తగ్గించారు. కాని ఈ పెంపుదలవల్ల వచ్చిన లాభం రైతులకు పోలేదు. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన క్రింద లేని భారతదేశంలో నిర్ణీత కాల వ్యవధులలో పన్నులవల్ల వచ్చే రాబడిని గురించి పునరాలోచిస్తూ ఉండేవారు. ఇక్కడ కూడా రెవెన్యూ డిమాండ్ చాలా హెచ్చుగానే ఉన్నది. 1855లో పన్నురిచ్చే ఆదాయ మొత్తంలోని యాభై శాతాని కిది తగ్గించబడింది. కాని ఇప్పటికే వ్యవసాయోత్పాదక శక్తికి తగినంత దెబ్బ తగిలింది. భారత చేతి వృత్తులు, పరిశ్రమలు దెబ్బతిన్న కారణంగా జనాభా వత్తిడి పెరిగి వ్యవసాయోత్పాదకత దెబ్బతిన్నది. ఈ విధంగా యాభై శాతాన్ని తీసుకోవడంవల్ల వ్యవసాయకులు సేద్యంమీద పెట్టుబడి చేసే శక్తికి దెబ్బ తగిలింది. దీనికితోడు ప్రభుత్వ ఆర్థిక విధానాలు కొన్ని ఆటంకాలు కల్గించినవి. నీటిపారుదల సౌకర్యాలను ఏర్పర్చడానికి బదులుగా పభుత్వం రైల్వేల నిర్మాణానికి పూనుకుంది. సేద్యాన్ని మెరుగుపర్చడానికి, వర్షం మీదనే ఆధారపడే స్థితిని తొలగించడానికి, తద్వారా వ్యవసాయోత్పత్తిలో నిలకడ తేవడానికి నీటిపారుదల సౌకర్యాల ఏర్పాటు అవసరము. అయితే బ్రిటిషు అధికారులు మాత్రం, రైల్వేలు కూడా భారతీయ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయగల మార్పులు తేవడానికి అవసరమని చెప్పారు. కాని రైలు మార్గాలను భారతదేశ ఆర్థిక అవసరాలకు అనుగుణ్యంగా నిర్మించలేదని దత్ చెప్పారు. బ్రిటిష్‌సామ్రాజ్య ప్రయోజనాలు తీర్చడాని కనుగుణ్యంగానే అవి నిర్మించబడినవని చెప్పాడు. అందువల్ల చాలా ప్రముఖమైన రైలు మార్గాలు వ్యాపారాని కనుకూలం కాలేదు. రైలు మార్గాల నిర్వహణ భారత బడ్జెట్ ఆదాయాన్ని ఖాళీచేసి ఇంగ్లండుకు పంపడానికి తోడ్పడింది. ఇంగ్లండులో ఉన్న రైల్వే డైరెక్టర్ల జీతాలు చెల్లించడానికి చాలా ద్రవ్యము భారతదేశ ఆదాయం నుండి ఖాళీ అయి వెళ్లిపోతూ ఉండేది. అంతేగాక రైల్వేలు, ఇండియా ఆదాయాన్ని ఖాళీ (Drain) చేయడానికి ఉపయోగించే భారతఎగుమతులను పెంచడానికి తోడ్పడినవి. అందువల్ల మొత్తంమీద, రైల్వేలు భారతీయ సంపదను తగ్గించడానికి తోడ్పడినవేగాని భారత ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చడానికి ఉపయోగ పడలేదు. బ్రిటిషు అధికారులు స్వేచ్ఛా వ్యాపార విధానాన్ని అవలంబించి భారత పరిశ్రమలను నిరుత్సాహపర్చి, బ్రిటిషు పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించడం ఈఅనర్థానికి తోడయ్యింది. ఇందువల్ల భారతదేశంలోని బ్రిటిషు ప్రభుత్వం భారతీయ వ్యవసాయం ప్రాతిపదికను బలహీనపర్చడమేగాక వ్యవసాయం ఆర్థిక వ్యవస్థకు పునాది కావడానికి వీలులేకుండా చేసింది. ''శరదృతువులో వర్షాలు పడకపోవడంవల్ల పంటలు చెడినాయనడంలో సందేహంలేదు. అయితే మనిషికి వీటిమీద నియంత్రణ లేదు. వర్తమానక్షామాల తీవ్రతకు చర్విత చరణానికి, వనరులు లేకపోవడము తమ జీవన నిర్వహణకు రైతుల కాధారంగా ఉన్న భూమియొక్క శక్తిని అధికంగా అంచనావేసి, పన్నుల భారాన్ని హెచ్చించడంవల్ల ఏర్పడిన దీర్ఘకాలీన పేదరికము కారణమని చెప్పక తప్పదు'' అని దత్ తన ''ఫామిన్స్ ఇన్ ఇండియా'' (పే.32)అనే గ్రంథంలో వ్రాసారు. భారత ప్రభుత్వం చేసిన రుణాల భారం ధారావాహిక పెరుగుదల ఈఅధ్వాన్న పరిస్థితిని మరింత అధ్వాన్నం చేసింది. బ్రిటిషు మూలధనాన్ని భారతదేశంలోకి దిగుమతి చేసుకోవడంవల్ల భారతదేశం అప్పుల పాలయ్యిందనే అసమంజస విశ్వాసాన్ని దత్ ఖండించారు. దత్ అభిప్రాయంలో భారతదేశం అప్పులపాలు కావడాని కిది మూలంకాదు. ఈస్ట్ ఇండియా కంపెనీ తన పరిపాలన నుండి విరమించే సమయానికి డెబ్భై మిలియన్ల రూపాయిల అప్పుచేసి పేర బెట్టింది. ఇదే సమయంలో వడ్డీతో లెక్క లేకుండా నూటయాభై మిలియన్ల రూపాయిల కప్పాన్ని అన్యాయంగా భారతదేశం నుండి తీసుకున్నారు. భారతదేశానికి బయట జరిగిన ఆఫ్ఘన్, చైనా యుద్ధాలు మొదలైన వాటి ఖర్చులను భారతదేశం నుండి రాబట్టారు. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ముగిసేటప్పటికి, న్యాయంగాజూస్తే, భారతదేశం కంపెనీకి ఏమీ ఇవ్వనవసరంలేదు. భారతదేశం అప్పు కల్పితమైనది. భారతదేశం నుండి తీసుకున్నదాంట్లో వంద మిలియన్ల రూపాయిలు భారతదేశపు నిల్వలు మాత్రమే. అయితే చక్రవర్తి పరిపాలనలోని మొదటి పద్దెనిమిది సంవత్సరాలలో ''1857 తిరుగుబాటు''ను అణచడానికి చేసిన ఖర్చు క్రింద నలభై మిలియన్ల రూపాయలు ఖర్చుకాగా అప్పు రెట్టింపు అయ్యింది. ఈ అప్పుకు 1867 లో జరిగిన అబిసీనియా యుద్ధం కూడా కారణమే. 1900వ సంవత్సరం నాటికి గ్యారంటీ తీసుకున్న కంపెనీలు, ఇండియాలోని బ్రిటిషు ప్రభుత్వము మన దేశంలో రైలు మార్గాల నిర్మాణానికి

చేసిన ఖర్చులవల్ల 1878, 1897 సంవత్సరాల్లో జరిగిన ఆఫ్ఘన్ యుద్ధాల నిర్వహణకు ఖర్చుచేయడంవల్ల భారతదేశంలోని ప్రభుత్వపు అప్పు రెండువందల ఇరవైనాల్గు మిలియన్లరూపాయిలకు పెరిగింది.

ఎక్సయిజు పన్నుల భారం మోపకుండా భారతీయ పరిశ్రమలను ప్రోత్సహించాలని దత్ కోరాడు. సివిల్ మిలటరీ పరిపాలన ఖర్చుల్ని జాగ్రత్తతోచేసి విదేశాలకు మన ద్రవ్యం పోకుండా ఆపాలన్నాడు. భూమి పన్నుల రేట్లను తగ్గించి, వ్యవసాయకుని వద్ద ధనం మిగిలేటట్లుచేసి సేద్యంపై పెట్టుబడికి వీలుకల్పించాలన్నాడు. ప్రభుత్వం చేసే ఆర్థిక నిర్ణయాల ప్రక్రియలో భారతీయులకు భాగం కావాలన్నాడు. ప్రభుత్వ రెవెన్యూ డిమాండ్‌ను ఒక నిర్ణీత స్థాయివద్ద ఉంచిన మేరకు పర్మనెంట్ సెటిల్‌మెంట్ మంచిదే నన్నాడు. ప్రభుత్వ ఆర్థిక విధానంవల్ల భూమి చిన్న ఖండాలుగా విభజింపబడటము, విపణివీధి సౌకర్యాలు లోపించడము, రైతులు అప్పులపాలు కావడము మొదలైన అనర్థాలు జరుగుతున్నవని దత్ చెప్పాడు. భారతదేశ రెవెన్యూలో నుండి ఇరవై అయిదు శాతాన్ని ''హోమ్ చార్జెస్'' పేరిట ఇంగ్లండుకు చెల్లించడాన్ని ఆయన ఖండించాడు. వీటికితోడు బ్రిటిషు ఉద్యోగులకు పెద్ద జీతాలు చెల్లించడము, భారతదేశ అప్పునుతిరిగి చెల్లించడము పెద్దభారంగా తయారై పేదరికాన్ని ఏర్పరుస్తోంది. ఈ ఖర్చులు భారతదేశం లోపలనే జరిగితే వస్తువులకు డిమాండ్ పెరగడము, మనుష్యులకు ఉద్యోగాలు దొరకడము జరిగేదని దత్ చెప్పారు.

గోపాలకృష్ణ గోఖలే

దేశభక్తిగల్గి, ఆర్థిక సమస్యల పరిష్కార మార్గాలలో శ్రద్ధ జూపిన తొలి ఆర్థిక శాస్త్రవేత్తల్లో గోపాలకృష్ణ గోఖలే ఒకరు. ఆయన కొల్హాపూర్‌లో జన్మించాడు. పూనా ఫెర్గుసన్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసిన పిదప, ఆ కళాశాల హిస్టరీ పొలిటికల్ ఎకానమీ పీఠానికి ఆచార్యత్వం పొందాడు కాని ఆయన శుద్ధ ''అకాడమీ షియన్' కాదు. దేశానికి సంబంధించిన విషయాల్లో హెచ్చు శ్రద్ధ తీసుకోవడంవల్ల పూనా సర్వజనిక సభవారి పత్రికను నడిపాడు. బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిలు సభ్యుడయ్యాడు. వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిలు సభ్యుడుగా ఉన్నాడు. 1905లో భారతజాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. అదే సంవత్సరం సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీని స్థాపించాడు. భయపడకుండా ధైర్యంతో తన అభిప్రాయాలను తెలియపర్చడంలో గోఖలే అందెవేసిన చేయి. తన సమకాలీన దేశభక్తులవలె పేదల సంక్షేమంలో గోఖలే శ్రద్ధ కనబర్చారు. ఆయన ప్రభుత్వ విత్తనీతి దేశ సౌభాగ్య పురోగమనానికి సాధనాయుధం కావాలన్నాడు. చెప్పదలచిన విషయాలను పద ఆడంబరంతో నింపేవాడు కాదు. తన వాదనలో గొప్ప విశ్లేషణాశక్తిని కనబర్చేవాడు.

గోఖలే చేసిన బడ్జెట్ ఉపన్యాసాల్లోను, వెల్బీ కమిషన్ ముందతడిచ్చిన సాక్ష్యంలోను అతని ఆర్థిక ఆలోచన చాల వరకు కన్పిస్తుంది. పబ్లిక్ ఫైనాన్స్‌లోను, విత్తసంబంధ వ్యవహార పాలన లోను అతను మంచి అభిప్రాయాలు వెలిబుచ్చాడు. ప్రభుత్వఖర్చులు జాగ్రత్తగా చెయ్యాలన్నాడు. ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి తోడ్పడాలని, పన్నుల భారం తగ్గించాలని చెప్పాడు.

అతని వాదనల ముఖ్యోద్దేశ్యాన్ని తెలుసుకోవాలంటే అతని కాలంనాటి ఆర్థిక రాజకీయ పరిస్థితుల్ని అర్థం చేసుకోవాలి. ఈ కాలంలో బ్రిటిషు ప్రభుత్వం తన సామ్రాజ్యాన్ని విస్తృతం చేయడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తోంది. ఒకవైపున రష్యా దండయాత్రచేస్తే ఎదుర్కోవడానికి రక్షణ ఏర్పాటు చేస్తోంది. మరో వైపున తనసరిహద్దుల్ని పెంచడానికి ప్రయత్నిస్తోంది. 1885లో తదనుసారంగా బర్మాను కలుపుకున్నది. ఇందువల్ల సైనికంగా తయారు కావడానికి, సైనికచర్యలకు బాగా ఖర్చులు జరిగినవి. వాణిజ్యానికి పనికిరాని రైలు మార్గాలు నిర్మించబడినవి. మిలటరీ కట్టడాలుకూడా నిర్మింపబడినవి. సివిల్ పరిపాలనకు చేస్తున్న ఖర్చుల భారం బాగా పెరిగింది. దేశంలో ఆర్థిక వ్యవస్థ చర్విత చరణంగా వస్తున్నా క్షామములవల్ల అతలకుతలమై పోతోంది. ప్రభుత్వ ఖర్చులు పెరుగుతూ, ప్రజల పన్నులచెల్లింపు శక్తి తగ్గిపోతున్న సమయంలో ఇండియాలోని బ్రిటిషు ప్రభుత్వంమీద లాంక్‌షైర్ మిల్లు యజమానుల వత్తిడి ఎక్కువయ్యింది. అందువల్ల రాబడిని పెంచడానికి కస్టమ్స్ పన్నులను హెచ్చించవలసి ఉండగా వాటిని తొలగించి, ఉప్పు మొదలైన వాటిమీద, దేశంలో అంతర్గత పన్నులను హెచ్చించారు. ప్రభుత్వాన్ని విత్త సంబంధమైన ఇబ్బందులు ఎదుర్కొన్నవి. పదే పదే వచ్చిన క్షామములు, దేశీయ సాంప్రదాయక గృహ పరిశ్రమల క్షీణింపు ఈ బాధలను పెంచినవి.

ఉప్పు పన్నును, దాన్ని హెచ్చించడాన్ని గోఖలే బాగా ఖండించారు. భారతదేశంలో బడ్జెట్ లోపమున్నప్పటికి, ప్రభుత్వ కోశాగారాన్ని రాబడితో నింపడానికి, కామన్స్ సభ, భారతదేశంలోని బ్రిటిషు ప్రభుత్వం లాంక్‌షైర్ మిల్లు యజమానుల వత్తిడివల్ల దిగుమతి పన్నులు వేయడానికి నిరాకరించడాన్ని గోఖలే పెద్దతప్పుగా బట్టబయలు చేసాడు. భారతదేశం 1896లో నేత వస్తువులన్నిటి మీద మూడున్నర శాతము పన్ను వేయగా, భారతీయ తయారీవస్తువుల మీద ఇంగ్లండు ప్రతిపన్ను వేయడాన్ని గోఖలే ఖండించారు. ''లాంక్‌షైర్ లాభం కోసము తగనటువంటి సమయంలో భారత ప్రభుత్వం దేశం లోపలఉన్న పరిశ్రమపై పన్ను విధించేటట్లు బలవంతం చేయబడింది'' అని గోఖలే 1903 లో తన బడ్జెట్‌పై ఇచ్చిన ఉపన్యాసంలో చెప్పారు.

భారతదేశంలో తలెత్తిన విత్త సంబంధ సమస్య లన్నింటికి, విత్త సంబంధ విషయాలు పన్నులు చెల్లించేవారి నియంత్రణలో లేకపోవడమే కారణము. భారత విత్తము విదేశీయులచే చాలాదూరం నుండి ప్రత్యేకనియంత్రణ వ్యవస్థద్వారా నడుపబడుతోంది. అందుకుగాను చాలా పెద్ద ఖర్చుతో సివిల్‌శాఖ నడపబడుతోంది. సామ్రాజ్య విస్తరణకే విధానం ఉపయోగించుకోబడుతోంది. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో భారతీయులకు ఎక్కువ స్థానాలు ఇవ్వాలి. బడ్జెట్‌ను అంశం తర్వాత అంశం చొప్పున చర్చ జరిగిన తర్వాతనే ప్యాసు చెయ్యాలి. మొత్తంమీద జరిగే విత్తనియంత్రణను తనిఖీ చేయడానికిమాత్రమే ఇంగ్లండులో ఒక ప్రత్యేక కమిటీని నియుక్తి చెయ్యాలి.

భారత ప్రభుత్వ సివిల్, మిలటరీ ఖర్చుల పరిపాలనా నిర్వహణను గురించి విచారించడానికి, భారత బ్రిటిషు ప్రభుత్వాలు రెంటికి ప్రయోజనమున్న విషయాలపై జరిగిన ఖర్చులను ఈ రెండు దేశాలమధ్య పంచేవివరాలను ఏర్పర్చడానికి బ్రిటిషుప్రభుత్వం నియమించిన వెల్బీ కమిషన్ ముందు 1895లో గోఖలే పైచెప్పిన తన వాదాన్ని బలపరుస్తూ సాక్ష్యమిచ్చాడు. భారతదేశపు ఖర్చులు పెరగడాన్ని భారత సౌభాగ్యపు పెరుగుదలగా ఈ కమిషన్ ముందు చెప్పడాన్ని గోఖలే నిశితంగా ఖండించారు. పెరుగుతున్న ఖర్చు పెరుగుతున్న ప్రభుత్వావసరాలను మాత్రమే సూచిస్తుందని గోఖలే చెప్పారు. మామూలుగా ప్రభుత్వ ఖర్చుల్ని ప్రజాసంక్షేమాన్ని పెంచడానికి పెంచాలి. కాని భారతదేశంలో ప్రభుత్వఖర్చుల పెరుగుదల సివిల్, మిలటరీఖర్చుల రూపంలో వృధా అయిపోతోంది. ఇందువల్ల భారత ప్రభుత్వ కోశాగారము ఖాళీకాగా మన ద్రవ్యము ఇంగ్లండుకు పోతోంది. అందువల్ల ప్రభుత్వఖర్చులను తగ్గించాలని, ఆర్థిక వృద్ధి జరిగితేనే పన్నులు పెంచాలని గోఖలే చెప్పారు. క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితులమధ్య ప్రభుత్వం తన ఖర్చుల్ని జాగ్రత్తగా చేస్తూ, కొన్ని రంగాల్లో పన్నుల్ని తగ్గించాలి. భూమి పన్నులను తరచుగా మార్చరాదు. భూమి వెరశి ఉత్పాదన విలువలో అయిదవ వంతుకు మించి పన్నుల భారం ఉండరాదు అని గోఖలే ఖచ్చితంగా చెప్పారు.

విత్తనియంత్రణ వెల్బీ కమిషన్ ముందున్న రెండవ సమస్య. విత్త నియంత్రణ వైస్రాయి కౌన్సిల్‌చేతుల్లో ఉండాలి. వైస్రాయి కౌన్సిల్‌లో భారతీయులకు ఇంకా ఎక్కువ ప్రత్యక్ష నియంత్రణ ఉండాలి అయితే కామన్సు సభ వారి కమిటి దీనిపై తనిఖీచేసే అధికారాన్ని ఉంచుకోవాలి. ఈ కమిటీకి విత్త సంబంధమైన రికార్డులను, ప్రతిపాదనలను పరిశీలించే హక్కు ఉండాలి. వైస్రాయి కౌన్సిల్ సభ్యులు ఈ కమిటీకి అప్పీలు చేసుకునే హక్కు ఉండాలి.

సంయుక్త ఖర్చుల్ని భారత ఇంగ్లండుల మధ్య పంచే ప్రాతిపదిక వివరాలు వెల్బీ కమిషన్ ముందున్న మూడవసమస్య ఇందులో కమిషన్ తక్కువ ప్రాముఖ్యతగల విషయాలమీద కొద్దిపాటి రాయితీలు ఇచ్చారు. ఈ ఖర్చుల్ని రెండు దేశాలమధ్య న్యాయసమ్మతంగా పంచాలని గోఖలే చెప్పారు. కమిషన్‌లోని మెజారిటి సభ్యుల నివేదిక గోఖలే అభిప్రాయాలను అంగీకరించకపోయినా మైనారిటీ సభ్యుల నివేదిక గోఖలే అభిప్రాయాలను పూర్తిగా అంగీకరించింది.

విత్త సంబంధమైన వ్యవహారంలో సమాఖ్యనీతి (Federal Policy) అవలంబించాలని గోఖలే వాదన. అప్పట్లో విత్తసంబంధ అధికారాలు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో కేంద్రీకరించబడినవి. 1882 ఏర్పాట్ల ప్రకారం కేంద్ర, రాష్ట్ర, సంయుక్త విత్త విషయాలుగా విత్త వ్యవహారాలను విభజించినా, కేంద్రం చేతుల్లోనే హెచ్చు అధికారాలున్నవి. కేంద్రం ఖర్చు చేయవలసిన విషయాలు తక్కువ. రాష్ట్రాలు ఆర్థిక సాంఘిక సేవలన్నిటిమీద ఖర్చు చెయ్యాలి. అందువల్ల రాష్ట్రాల ఆదాయవనరుల్ని యింకా యెక్కువ వ్యాకోచం (Elastic)లో ఉంచి, వాటికి హెచ్చు విత్త సంబంధ అధికారాలను ఇవ్వాలని గోఖలే గట్టిగా వాదించారు.

భారతీయ ఆర్థిక ఆలోచన ముఖ్య లక్షణాలు

రాజారామమోహనరాయ్, మహదేవ గోవింద రనడే, రమేష్ చంద్ర దత్, గోపాలకృష్ణ గోఖలే-సుప్రసిద్ధ దేశభక్తులు, జాతీయవాదులు ఉదార దృక్పథం గలవారు. జన సంక్షేమా కాంక్ష వారిలో నిండుగా ఉన్నది. ఈ లక్షణాలే వారిచే ఆర్థికాభివృద్ధిద్వారా పేదరికాన్ని పారద్రోలి ప్రజలకు ఆర్థిక సంక్షేమాన్ని సమకూర్చాలనే ఆర్థిక ఆలోచన చేయించినవి. ఇందులోని ముఖ్య విషయాలివి: వీరి ఆర్థిక ఆలోచన ఆర్థిక సమస్యలైన పేదరికం, క్షామం తొలగింపునకు సంబంధించినది. భారతదేశానికి వనరులు, ఆర్థికవృద్ధి పొందడానికి కావలసినశక్తి సామర్థ్యాలు ఉన్నవి. బ్రిటిషువారు తమ స్వేచ్ఛా వ్యాపార విధానం ద్వారా అడ్డుపడకుండాజేసి, తగిన ఆర్థిక విధానాల ద్వారాను, పథకాల ద్వారాను భారతదేశ ఆర్థిక వృద్ధిని సాధించాలి. వ్యవసాయంపై ఉన్న జనాభా వత్తిడిని, ఔద్యోగితా కల్పన ద్వారా తొలగించితే పేదరికం ఉండదు. ఇందుకు కేవలం వ్యవసాయం మీదనే ఆధారపడకుండా, పరిశ్రమలను అభివృద్ధి చెయ్యాలి. పెద్ద పరిశ్రమలు, నూతన సాంకేతిక పద్ధతులు అవసరము. అయితే వ్యవసాయానికి నీటి పారుదల సౌకర్యాలను అందజేసి అభివృద్ధిచెయ్యాలి. వ్యవసాయంమీద, దిగుమతులమీద పన్నులు తగ్గించాలి. దిగుమతులమీద పన్నులువెయ్యాలి ఆర్థిక నిర్ణయాలు చెయ్యడంలో పన్నులు చెల్లించేవారికి భాగస్వామ్యం ఉండాలి. పరిశ్రమల అభివృద్ధి ద్వారా దీర్ఘకాలీన ఆర్థిక వృద్ధిని, అభివృద్ధి నిలకడను సాధించవచ్చు. వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి పరస్పర నిర్భరితాలు. వ్యవసాయానికి పరపతిని అందించడంతో పాటు, వ్యవసాయ సంస్కరణలను కూడా ప్రవేశపెట్టాలి. సివిల్ మిలటరీ పరిపాలన ఖర్చులను తగ్గించాలి. విదేశీయులకు పెద్ద ఉద్యోగాలు ఇవ్వకుండా ఆపడము ద్వారాను, భారతదేశాన్ని యుద్ధాల్లో జొప్పించకుండా ఆపడము ద్వారాను, యుద్ధానికికాక వస్తు సరఫరాకు, వాణిజ్యాభివృద్ధికి పనికివచ్చే రైల్వే మార్గాల నిర్మాణం ద్వారాను భారతదేశం ఖర్చులను తగ్గించి ఇతర దేశాలకు భారతదేశపు డబ్బు ఖాళీ అయిపోకుండా ఆపవలెను. వాణిజ్య రైల్వేమార్గ నిర్మాణము వ్యాపార, ఆర్థికాభివృద్ధి పనులకు తోడ్పడి దేశానికి లాభం కల్గుతుంది. ఆర్థికరంగంలో ప్రభుత్వజోక్యంవల్ల భారతదేశానికి ఆర్థిక నష్టం కల్గడంగాక, ఆర్థిక అభివృద్ధి లభ్యమయ్యేట్లు చెయ్యాలి. ఆర్థికంగా వెనుకపడిఉన్న భారతదేశానికి స్వేచ్ఛా వ్యాపార విధానంగాక, ఆర్థిక రక్షణ పద్ధతి లాభదాయకంగా ఉంటుంది. ఈ మహామేధావులైన దేశభక్తుల ఆర్థిక విధానాలను జాగ్రత్తగా ఆలోచించి అవసరమైన రీతిలో అమలుజరిపితే భారతదేశంలో పేదరికము, క్షామముతొలగి ఆర్థికాభివృద్ధి, ఆర్థిక సంక్షేమము సమకూరగలవు.

[అ యి పో యిం ది]

జ్వరకుసుమం

సాంధ్యశ్రీ

ప్రాచీ దిశ రుధిర సుమం
పుట్టగానే
కవోష్ణ పరిమళం ...

విరిసినకొద్దీ
పుప్పొడి వేడి
నిశ్శబ్దంగా వీచే గాలిలో
కలిసి అల్లుకుపోయిన
మెలికలు ...

ఎప్పటినుంచీ మోస్తున్నాడో
తలకెత్తుకొని
సవిత
ముక్కంటి ఐశ్వర్యాన్ని
దగ్ధమౌతున్న
ధూళి వసనంలో
రాలని పాడిని...!

దిక్కుల్లో
దిక్కుతోచని నిట్టూర్పు సెగలు
ఏ నిద్రా సమయంలోవో!

రాత్రిపూట
చెట్లమీదనుండి
చెమట్లు పోసుకుంటూ ...

చిత్ర రథుడు విడిచిన
కాలానికి
జ్వర తీవ్రతలో
సంధి ప్రదోషం
తిరిగి
రక్తసుమం. జ్వరకుసుమం!

టార్చి ఆవేదన

శ్రీ సి. ఎమ్. మోహనరావు

చీకటి కొండలను కూడా
దొలిచి
ముందుకు పోగలిగిన
నేను
వెలుగు పగుళ్ళలో

విందులారగిస్తున్న
చినచీకటి నలుసునుకూడా
ఏమీచేయలేకున్నా
పదవుల పరపతుల
మిరుమిట్లు గొలిపే
కొలువు కూటంలో

కుర్చీ క్రింద కులుకుతోన్న
తెలిసిన
దొంగనుకూడా
పట్టుకోలేని పోలీసులా
శిక్షించలేని న్యాయంలా!



డా॥ కిళాంబి జ్యోతిర్మయి

శక్తిమతీ కోలాహలము రసాభాసము

రామరాజభూషణ కవి ప్రణీతమైన వసుచరిత్రలో శక్తిమతీ కోలాహల వృత్తాంతం అత్యంత రమణీయమైన ఘట్టం. ఈ సందర్భంలో కవి నదీ పర్వతాలకు ద్వైరూప్యాన్ని ఆపాదించి రచించాడు. ఇలా రచించడం కేవలం చమత్కారానికి మాత్రమే కాదు.

లౌకికానుభవానికి సంబంధించిన రాగబంధ రీతులను తెలియ జేయడం ఒక కారణం. నదీ పర్వతాలకున్న భౌగోళిక సంబంధాన్ని మానవ దృష్టితో పరిశీలించి విమర్శించడం రెండవ కారణం.

శక్తిమతియొక్క 'నిత్య నిర్మలాకార కాంతిధార' కు (వసు. ద్వి. 110) కోలాహలుడు వశుడవడం విచిత్రమైన మనోవిలాసం. 'కామీస్వతాం పశ్యతి' అని కాళిదాస వచనం. శక్తిమతి తనను ఆదరిస్తుందని కోలాహలుని నమ్మకం. ఆమె అభిమతం తెలిసికొనే ప్రయత్నం చెయ్యకుండా ఆమెను పొందడానికి 'నిశ్చితాత్ము' (వసు. ద్వి. 117) డయ్యాడట. తత్పర్యవసానం తెలిసినదే.

కావ్యదృష్టితో పరికించేవారు శక్తిమతీ కోలాహల వృత్తాంతాన్ని రసాభాసమన్నారు. ఏక త్రైవాను రాగం కారణంగా ఈ సన్నివేశంలో పోషింపబడినది రసాభాసమనడం ఆలంకారిక సమ్మతమే.

భూషణకవి యుద్దేశమింత మాత్రమే కాదు. నదీ పర్వతాలకున్న భౌగోళికమైన జన్యజనక సంబంధాన్ని కవి గమనించాడు. నది పర్వతంలో పుడుతుంది. భూమిమీద ప్రవహిస్తుంది. సాగరంలో సంగమిస్తుంది. ఇది సహజ ప్రవృత్తి. ఈ యంశాన్ని కవి వాచ్యం చేయలేదు. దాచిపెట్టడం కూడా అతని అభిమతం కాదు. అవకాశాన్నిబట్టి కవి తనఅభిప్రాయాన్ని వ్యక్తావ్యక్తంగా సూచించాడు. ఇది అతని రచనా రామణీయకం.

'గోత్రాజన విత్రాసద
గోత్రార్భటి కోర్వలేక ఘూర్ణిలి నదియున్
మాత్రాతీత భయ భ్రమ
పాత్రాశయ యగుచు ధాత్రిఁ బదపడి యలమెన్.'
(వసు. ద్వి. 147)

ఈ పద్యంలో (భూజనులకు భయంకరమైన 'గోత్ర+ఆర్భటికిన్= పర్వతము యొక్క ఆర్భాటానికి నది ఓర్వలేక ఘూర్ణిల్లింది.' అతి మాత్రమైన భయభ్రమలు కలిగిన ఆశయం (మనస్సు)తో ధాత్రిన్= భూమిని, తల్లిని - అలముకొన్నదట) గూఢ శ్లేషలో జనక స్థానీయుడైన తండ్రి ఆర్భాటానికి బెదరి, భయభ్రమిత మానస యైన కుమార్తె దీనంగా తల్లిని కౌగిలించుకున్నదని కవి తెలియ జేస్తున్నాడు.

మరో సందర్భంలో గిరికావసురాజుల పరిణయానికి నదులు, పర్వతాలు రావడాన్ని కవి ఇలా వర్ణించాడు.

'ఉత్సాహంబున నిట్లనేక తటినీ వ్యూహంబులే తేరగా
వత్సాళిన్ వెనుగొన్న గోగణము శేవన్ వచ్చెఁదోడో మహీ
భృత్సందోహము.........(వసు. 5–33)

తమ లేగదూడలను వెనుదగిలి గోగణం వచ్చేలా తమవలన పుట్టే నదులను వెన్నంటి పర్వతగణం వచ్చినదట. గుప్తమైన తన అభిప్రాయాన్ని వాచ్యం చేయడానికి ఇంతకంటే తగిన అవకాశం కవికి కలుగలేదు.

నది, పర్వత జన్యమనే విషయాన్ని ప్రస్ఫుటంచేసే ఉద్దేశంతో, కవి గిరికను కూడ ఒకచోట సెలయేఱుగ తీర్చడం గమనార్హం. 'ఆకోలాహల శైల సంభవ' (వసు. 6-75)యైన గిరిక 'శ్రీ కల్యాణ+గుణ+అర్ణవుని' చెరబోయినట్లు వర్ణించడంలో కవి, నది సముద్రంలో సంగమించే విషయాన్నికూడా సూచిస్తున్నాడు.

రసాభాసానికి అనుచిత వర్తనమే మూలకారణం. లోకయాత్రాను విధాయిగా ఏకత్రైవాను రాగాదులును ఈ కారణం చేతనే రసాభాస మనబడుతున్నాయి. అందువల్లనే ధ్వన్యాలోక కర్త యిలాగన్నాడు :

'అనౌచిత్యాదృతే నాన్య ద్రస భంగస్య కారణం
ప్రసిద్ధౌచిత్య బంధస్తు రసస్యోపనిషత్పరా॥'

రసగంగాధర కర్త 'అనుచిత విభావాలంబనత్వం రసాభాసత్వమ్'అని వివరించాడు. కోలాహల వర్తనంలోని అనౌచిత్య మెటువంటిదో రామరాజభూషణ కవి శక్తిమతీ కోలాహలుల సంభాషణలో చక్కగా ధ్వనింపజేశాడు.

'నగరాజు ఘనధ్వని గరిమకుఁ గలగి......వినయము
నయంబు, భయమును మనమునఁ బెనగొనగ శక్తిమతి'
(వసు. 2-131)

యిట్లన్నది

'మా బోంట్లతోఁ జెల్మి యేట్లు పొసగు...నీకు'
(వసు. 2–132)

నదులకు, పర్వతాలకు ప్రణయం పొసగదని శుక్తిమతి వాచ్యం చేస్తూ, ఈ క్రింది విధంగా పునరుద్ఘాటిస్తున్నది.

'పుడమి నచలేంద్రు లెచ్చట
జడవాహిను లెచట, నెచటి సఖ్యము, వినఁబో
వ్వడదు, పొడవడరు మీయెడ
నెడపక మారసము లెచటికెక్కు మహాత్మా'
(వసు. 2–133)

పర్వతాలకు, నదులకు సఖ్యమా? వినటానికే యుక్తంగాలేదు. పర్వతాల నుండి నదులు పుట్టి పల్లానికి ప్రవహిస్తాయి. ఆ నదీ జలం పర్వతానికెక్కడం ప్రకృతి విరుద్ధం. (జడవాహిని – జలవాహిని); ఇట 'మారసములు' అనడంలో శ్లేషరమ్యం. రసములంటే అనురాగ (రస)ములని రెండవ అర్థం. జన్య జనక సంబంధంలో పుత్రికా వాత్సల్యముండాలి గాని అనుచితమైన ప్రణయానురాగ ముండకూడదని శుక్తిమతి ఉగ్గడించింది. వావి వరుసలు తెలిసి వర్తించాలని బోధించింది. అది నియమరహిత వర్తనమని శుక్తిమతి సూచించినందువల్లనే అతడు '...వట్టి నేమములు చాలు' (2 137) అని సమర్థించడానికి ప్రయత్నించాడు.

కోలాహలుని 'వదనంబున విన్నదనంబు' (2 – 134) తోచుటకు కూడ కారణమదే. 'ఘన నిర్వృతిఁ దెప్పలఁ దేల్చు' (2–134) మని ప్రార్థించాడు· ఇక దాపరికంవల్ల లాభం లేదని శుక్తిమతి ఇలా సమాధానం చెప్పింది –

'అగ్గలమగు పంచసాయక వికారమునన్ నిజ గౌరవోన్నతు
ల్దలపవు గాని, మాదృశ జడస్థితిఁ దెప్పలఁ దేలుచున్న మీ
కులగిరి కోటిలోఁ గడు లఘుత్వముగాదె? తలంచి చూడుమా'
(2–135)

మదన వికారంలో 'గౌరవాన్ని' మరచిపోకూడదు. ['గురు' శబ్దానికి అనేకార్థాలున్నాయి. తండ్రి అని కూడా ఒక అర్థం. 'గౌరవ' మంటే గురు సంబంధియైన భావం. అంటే పితృస్థాన లక్షణం] ఇలా మరవడంవల్ల కులపర్వతాలకు అతనిపై 'లఘుత్వం' –చులకన భావం కలుగుతుందని తెలియజేసింది.

అంతేకాక తాను పరకీయనని కూడా సూచించింది.

'మతిఁ గ్రీడారతి గల్గెనేని సకలక్ష్మాపుణ్య దేశాళిఁగాం
చితసూర్తి మెయిం గ్రుశించి వనరాశిం జెందుమా బోంట్లను
ద్ధతిచేఁ గమ్మగనేల నీకుఁగలవే తారుణ్య లావణ్య జృం
భిత రంభాది నిలింప భామలన భూభృన్మౌళి రాగాంధుడై'
(2–136)

పుణ్యదేశాలు తిరిగి భర్తృవియోగ తపనంచేత శరీరం కృశించగా, భర్తను (సముద్రుని)వెదకికొనిపోయే అభిసారికనని వాచ్యంచేస్తోంది. నదులు కొండలలో పుట్టి, పుణ్య ప్రదేశాలలో ప్రవహించి వనరాశిని (సముద్రాన్ని) చెందుట లక్షణం. ఇటువంటి తనపై ఉద్ధతి పనికిరాదనీ అతడు తరుణులైన రంభాదులను ఆశ్రయించటం యుక్తమనీ శుక్తిమతి ఉపదేశించింది.

తరువాతి పద్యంలోనే 'నానా నదీకాంతుడైన రత్నాకరుని' (2–137) పేర్కొనడంచేత కవి ఉద్దేశం మరింత స్పష్టపడుతోంది.

శుక్తిమతి ఉపదేశంవల్ల గ్రహించాల్సిన అంశం ఒకటి ఉంది. పర్వతాలకు (వలపుకి కాని, వరణానికి కాని) దివ్య వనితలతో సాంగత్యమే సహజ లక్షణంగా కనబడుతుంది. కోలాహలుని తండ్రి హిమవంతుడు· అతడు వరించింది మేనక అనే దివ్యాంగనని. కాళిదాసే ఇలా వ్రాశాడు.

'సమానసీం మేరుసఖః పితౄణాం కన్యాం కులస్య స్థితయే స్థితిజ్ఞః
మేనాం మునీనామపి మాననీయామాత్మానురూపాం విధినోపయేమే'
(కు. సం. 1 18)

అని కులప్రతిష్ఠకొరకు తన కనురూపయైన మేనకను హిమవంతుడు వివాహమాడినట్లు కుమారసంభవంలో ఉన్నది. అందులోనే, మైనాకుని (కోలాహలుని సోదరుని) '. .. నాగ వధూప భోగ్యం మైనాక'మ్మని కాళిదాసు ఉపలక్షించాడు. దివ్య స్త్రీలకూ, పర్వతాలకూ కల అనురూప దాంపత్యాన్ని సూచించడానికే శుక్తిమతి 'నీకుఁ గలవే తారుణ్య లావణ్య జృంభిత రంభాది నిలింప భామ' లని పేర్కొన్నది.

కాబట్టి పర్వతాలకు దివ్య వనితలతో సాంగత్యమే ప్రసిద్ధం. నదులతో సాంగత్యం అప్రసిద్ధం. అందుకే కోలాహలుని వర్తనం శుక్తిమతికి తొలుత వింతగా తోచింది. అతని వలపును పసిగట్టి ఆమె చతురంగా '...మదుపరి జాతాభినవానురాగ సంపత్తి గదా' (2–124) అని పలికింది. ఆమె 'అభినవానురాగ' మని అనగానే అతనికేదో ఒక సమాధానం చెప్పక తప్పలేదు. '... పూర్వజన్మ కృతముల్గాఁబోలు నీ నెయ్యముల్' (2–127) అని సమర్థింప జూచాడు. (భావస్థిరాణి జననాంతర సౌహృదాని అని కాళిదాసు) 'నన్ను నదీను (నదీ + ఇనున్) జేయవే' (2–130) అని వేడుకున్నాడు. శుక్తిమతి తిరస్కరించింది. అతడు బలోద్ధతితో ఆమెను పొందదలచాడు. దీనిని కవి 'ప్రాతికూల్య పరుషోద్ధ్యత్వాధి' (2–139) అన్నాడు. కోలాహల వర్తనం 'ఉద్వృత్తి' (2–143) అని వసురాజు నిర్ణయించి 'ఖలగోత్ర ధ్వంసనం' (2–150)చేశాడు.

కాబట్టి ఈ ఘట్టంలోని రసాభాసానికి 'ఏకత్రైవానురాగం' మాత్రమే కారణం కాదనీ, అంతకంటే వావివరుసలు తప్పిన ఒక అనుచితవర్తనం కారణమనీ గ్రహించాలి·

సముద్రం

ఎంత చీకటి చీకటి !
    ఎంత చిగురుల వెలుతురు !
ఎవరవే నువు వెలుతురా
ఎవరికైనా కూతురా ?
ఎవ్వరే కన్నారు నిన్ను
నీకు నీవే తల్లివా ?

(ఐ సెలిబ్రేట్)
ఎలా ఆవిర్భవించినా నువ్వు
నవ్వులాగా స్వచ్ఛతవు సౌమ్యతవు సమగ్రతవు
నీముందు బలాదూర్ ఉపమానాలు
కాళిదాసు మనసులో
కదిలిన ఉపమానంలా
సంభవించావు
నువ్వు **నా** బాల్యానివి
కవిత్వపు యౌవనానివి
వార్ధక్యపు జ్ఞానానివి
కవనానివీ దవనానివీ
అన్నా నిన్ను
తక్కువే
మక్కువా ? **ఎక్కువే !**

కాసంతటి కనికారం
కానరాని లోకంలో
నీ నీడే ఒక చల్లని
మేడ
నీ తలపే వట్టివేళ్ళ
గూడు
నువ్వుండగా వేరే
స్వర్గంలేదు అమృతం లేదు
నువ్వు **నా**
మొదటి కానుగ చెట్టువి
సృష్టి ఇన్ని చీరలెలా మారుస్తుందో
ఇన్నిసార్లు ఇంత మంచు కురిసి
ఆకులురాలి చివుర్లు తొడిగి
ఎండలు మండిపడి
పిండివెన్నెల పండుగలెన్ని భూగోళాన్ని
ఎంతగా కమ్ముకుంటాయో
నువ్వు కారణంగా గ్రహించాను

పాఠానివే నువ్వయిన ఉపాధ్యాయినివి
మౌనం గానమై
నిశ్చలనం నృత్యమై
నిర్లిప్తత స్నిగ్ధహాసమైన
నువ్వు
పువ్వులా
నడిచే ఎదిగే ఒదిగే
నవ్వులా
సుప్రభాతాల నయనాల్లోంచి
సుప్తవీణల మత్తు తీగల్లోంచి
ఆకాశనీలిమల ఆప్యాయతలోంచి
నన్ను ఆవహించావు
ఆవరించావు
సవ్వడి లేకుండా ఎగసిపడే
సముద్రం !

సృజన

కౌలంతో
    కలం నింపి
వేదనాంగుళులతో
స్పృశిస్తే
వైచిత్రి చిత్రకవాటాలు
తెరుచుకుంటాయి

వెలుగు రెక్కలు తట్టి
అనుభూతి నాదాలు
గుప్పుమని ఎగసిపోతాయి
గుర్తుగా
గీతాలు మిగిలిపోతాయి !

కేఎస్వీ

శ్రీ క్రొవ్విడి లింగరాజు

కథ కావాలి!

'మీ దగ్గరకొక తొందరపనిమీద వచ్చానండి!'

'చెప్పండి.'

'రేపు ఉదయానికొక కథ వ్రాసి ఇవ్వాలండీ.'

'కథా! ఎందుకు వ్రాయాలి.'

'అలా అంటారేమిటండీ.'

'మరేమనమంటారు?'

'మీరు కథలు రాస్తుంటారు కదండీ. మా పత్రిక ఎల్లుండి అచ్చుపడి పోవాలండీ. అందులో ఒక కథపడి తీరాలండీ.'

'కథ రాయడానికి నాకు తీరిక ఉండద్దా — రాద్దామనే బుద్ధి పుట్టద్దా!'

'అదేమిటండీ! కథకు 75 రు.లు పారితోషికమిస్తామండీ.'

'నాకు గవర్నమెంటు ఉద్యోగంలో డబ్బిస్తున్నారయ్యా. వాళ్ల పని చూడద్దా! ఇప్పుడు నాకంత డబ్బవసరం లేదండీ.'

"ఇదేం చిత్రమండీ! ఇలా మాట్లాడినవారు నాకు మీరే కనిపిస్తున్నారు."

"అయితే మీ ప్రశంసకు నేను సంతోషించవలసిందే."

"సరే కానిండి, ఒక కథ వ్రాయండీ."

"ఏం కథ వ్రాయమంటారు?"

"మీ యిష్టమండీ. మీరు రాయాలంటే ఎంతసేపండీ."

"కాదండీ, కథ రాయాలంటే రచయితకొక అనుభవమో, అనుభూతో, సందేశమో ఉండనక్కరలేదుటయ్యా! అంతేకాకుండా ఆ సందేశాన్ని లోకానికందివ్వడానికి కవిత్వంచెప్పాలో, కథరాయాలో, రచయితకు స్ఫురించాలి కదండీ. మీరిల్లా తొందరపెడితే ఎలాగు?"

"సరిలెండి మీరు చెప్పే పద్ధతిని కథలు రాయాలంటే మా వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలు ఎల్లా నడుస్తాయండీ."

"వాటికేమి లోటండీ! అరగంటలో కథలు వ్రాసేవాళ్లు కొల్లలుగా ఉన్నారు. అందులోనూ స్త్రీ రచయితలు కావలసినంత మంది ఉన్నారు. ప్రేమ గథలు స్త్రీల కలం నుంచి బయటపడితే చదువుకునేవాళ్లు ఎక్కువ ఆసక్తితో చదువుతారుకదా! మీ పత్రికం ప్రచారం కూడా పెరుగుతుంది!"

"కావచ్చును కానండి, ఈ ప్రేమ కథలు, పేర్లు, స్థలాలు మార్పులు కాని పర్యవసాన మొక విధంగానే మూడు కోణాలమధ్య ప్రదక్షిణం చేస్తున్నాయండి. ఇద్దరు ఆడవాళ్ల ఇరుకున మగవాడో, ఇద్దరు మగవాళ్ల మధ్యన ఒక స్త్రీయో ఇరుకున పడుతున్నారు. పర్యవసానం, హత్యో, ఆత్మహత్యో! దుఃఖాంతమైనా, సుఖాంతమైనా ఇంతే!"

"స్త్రీ పురుషులు లేని ప్రేమగాథ గురించి కథ రాస్తే మీ పాఠకులు చదువుతారంటారా?"

"చదువుతారనుకోండి. వారు ఆపిమ్మట ఆనందించావచ్చును, ఆనందించకపోవచ్చును. మాకు దాంతో సంబంధమేమిటండీ."

ఈ సంభాషణ ఒక ప్రభుత్వయాజమాన్యంలో నడిచే పత్రిక సంపాదకుడికీ, ఒక రచయితకూ మధ్య జరిగినది.

* ★ *

తాను ప్రేమించిన సామాన్య స్త్రీని పెళ్లి చేసుకోవడానికి ఒకప్పుడు గొప్ప ఉచ్ఛదశలోనున్న బ్రిటిష్ చక్రవర్తి ఎనిమిదవ ఎడ్వర్డు రాజ్యాన్ని త్యాగం చేసిన కథ చదువుతూ ప్రేమనాథ్ అత్యుత్సాహంతో ఆ గాథను ఆకాశానికెత్తుతూంటే వింటున్న 'సర్వజ్ఞశ్రీ' నామకరణం దాల్చిన రచయిత 'ఆగవయ్యా ఆగు' అని అడ్డు తగిలేడు. ఏమండీ అంటూ ఆగిపోయాడు.

ఆ చింకిబట్ట కట్టుకుని తిరుగుతున్న పిచ్చి నాయరును చూశావూ? ఆతడి సంగతెప్పుడైనా తెలుసుకున్నావూ? అతని కథ చెప్తాను విను. ఆ నాయరు ఈ ఊరెప్పుడొచ్చాడో కాని, ఆతడి మంచి స్థితిలో ఉన్నప్పుడు జిల్లా జడ్జిగారి బంగళాలో వంట చేస్తూండేవాడు. అతడు అమృతప్రాయంగా వంట చేసేవాడని గొప్ప ప్రతీతి. ఆయన కొక కుక్క ఉండేది. ఇంట్లో వంటగదిలో పనిచేసినప్పుడు తప్ప ఆతడు దానితోటే కాలక్షేపం చేసేవాడు. వంట చావిడి వెనకాల వసారాలో ఆ కుక్కకొక గోనెగుడ్డ పరుపు దానిమీద పక్కవేసేవాడు. తానుమాత్రం చాపమీదనే పడుకునేవాడు. ఆ కుక్క హమేషా ఆతని ప్రక్కనే ఉండేది. ఆతని జోలికెవరైనా వస్తున్నారని దానికితోస్తే కరచినంత పనిచేసేది. ఈ ప్రపంచంలో ఆయన ప్రేమించినదా కుక్కతప్ప మరే జీవి ఉన్నట్లులేదు ఆయన జీవితంలో ప్రేమ సంబంధమైన ఆశాభంగమేమైనా ఉన్నదేమో కూడా ఎవరికీతెలియదు తానెప్పుడేమి తింటాడోకాని వేళకి కుక్కకు మాత్రం సుష్టుగా భోజనం పెడతాడు. మాంసాహారులైన ఉద్యోగులు ఆ బంగళాలో ఉన్నంతవరకూ, అతనికి కుక్కమీద ఉండే

ఆప్యాయతకు నవ్వుకునేవారు. కాని ఎప్పుడూ ఆయననేమీ అనేవాళ్ళు కాదు. వాళ్ళ జిహ్వలకు రుచిగా వండి పెడుతుండేవరకూ వాళ్ళకేమి కావాలి. ఇలా ఉండగా ఒక జడ్జీగారా బంగళాలో ప్రవేశించారు. ఆయన భార్య ఒక చిత్రమైన వ్యక్తి. ఆవిడకు కుక్కను చూస్తే చిరాకు. కోపం. కుక్క కరుస్తే మనుష్యులు చచ్చిపోతారని ఆమె నమ్మకం. అందుచేత ఆ బంగళాలో ఆమె ప్రవేశించడంతోనే నాయరును కుక్కను వదిలేయమని ఆజ్ఞాపించింది. నాయరు విని పించుకోలేదు. అది తనకు ప్రాణ సమానమని చెప్పేడు కాని అమ్మ గారి తలకా మాటెక్కలేదు. ఇంట్లో అందరికీ నాయరు వంటంటే ప్రీతి కలిగింది, అమ్మగారితో సహా. కాని ఆ కుక్కన్నా, దానిని అంతగా ప్రేమిస్తున్న నాయరన్నా అమ్మగారికి ద్వేషం ప్రబలిపో యింది. ఆ విషయమై కుటుంబంలో చర్చలుసాగేయి. చివరకు అమ్మ గారి ఆజ్ఞ జడ్జీగారి ఆజ్ఞకు కూడా పై ఆజ్ఞ అయింది. నాయరు కుక్కతో బంగళాను వదలిపెట్టవలసి వచ్చింది. కారణం తెలియదు కాని నాయరు మరెక్కడా ఉద్యోగానికి కుదురలేదు. ఆతని పాకశాస్త్ర ప్రతిభ నెరిగినవారు వంట చేయించుకుని ఏమైనాఇస్తే ఆ కుక్కకు ఇంతపెట్టి తాను తినేవాడు. కుక్క కోసం ఒక గోనె పట్టా చంకను పెట్టుకుని రాత్రివేళ ఏఅరుగుమీదనో దానిని పరుండబెట్టి తాను పడుకునేవాడు. నాయరు కథ కొంత వెలుగులో పడింది కనుక ఎవ్వరూ ఆతని జోలికీ, కుక్క జోలికి వెళ్లేవారు కాదు. ఆ రెండు జీవుల అన్యోన్య ప్రేమ అలా సాగిపోతోంది.

* * *

ఒకనాడు మ్యునిసిపాలిటీవారు పొరుగూరి నుంచి కుక్కలను పట్టించడానికి మనుష్యులను రప్పించారు. వాళ్ళ దృష్టి నాయరు కుక్కమీద పడింది. దాని మెళ్లో తోలుపట్టీలేదాయె. దాని ముఖాన మందు చల్లి అది మూర్ఛలోపడ్డాక కుక్కల బండిలో కెక్కించారు. నాయరు 'అది నా ప్రాణమ'ని మొర్రోమన్నాడు. నాలుగు రూపా యలు సంపాదనను, కుక్కలు పట్టేవాళ్ళు వదలుకుంటారా? కుక్క గతి ఏమైందో చెప్పనక్కరలేదు. నాయరుకు మాత్రం మతిపో యింది. అలా వీధుల్లో తిరుగుతుంటాడు. ఎవరైనా ఏమైనా పెడితే దారిలో కనబడ్డ కుక్కలకు పారేసి ఏమైనా తింటాడేమో.

అది నాయరు కథ — ప్రేమనాథ్ వంటి నాయరుకు కుక్క మీద ఉన్న ప్రేమ ఏస్థాయిదంటావు? ఎడ్వర్డు చక్రవర్తికి రాజ్యం పోయింది కాని దరిద్రం రాలేదు. మతి పోలేదు. నాయరుకంటావా ఒక జీవిమీది ప్రేమ అతని సర్వస్వాన్నీ నాశనం చేసింది.

'ప్రేమనాథ్‌కు సర్వజ్ఞశ్రీ ఈ కథ చెప్పి ఒక ప్రేమగాథతో హృదయాన్ని కరిగించే సందేశాన్ని అందచేశాడు.

* * *

కథ రాయాలంటే కథకుడికొక సందేశం ఉండాలి కదా!

ఉమర్‌ఖయ్యాం బాత్రూమ్ సాంగ్

మ హేం ద్ర

అంతూ పొంతూ తెలియని కాల సముద్రంలో నుంచీ
భగవానుడు ప్రసాదించిన ఒక బకెట్ నీరు ఈ జీవితకాలం
నిన్ను నీవే రుద్దుకోమని ఇచ్చిన వాసనల సబ్బు శరీరం
క్షణక్షణమూ నీరు కారిపోతుంది
అనుక్షణమూ సోపు అరిగిపోతుంది
శరీరంపై అరిగిన సబ్బు స్మృతుల వాసనలు వెదజల్లుతుంది
మిగిలిన సబ్బు రేపటి దినమనే ఊహకు వూపిరి పోస్తుంది
ఒక బకెట్ నీరేం చాలుతుందనుకోకు
అంతా శరీరంపై జారుతోందా —
లేదా వృధాగా జలదారిలోకి పారిపోతోందా చూసుకో
స్నానం పూర్తికాగానే
చావనే తువ్వాలుతో ఆత్మను శుభ్రంగా తుడుచుకుని
ఇంట్లోకెళ్ళిపో
అంతములేని ఈ భువనమంతయు ఒక పురాతన స్నానశాల.

శ్రీ ఇ. సాయిబాబా

గాహారతణకోసో

విస్తార ప్రాకృత సాహిత్యములో మూడవ ప్రధాన సంకలన కృతి 'గాహారతణ కోసం' – (గాథా రత్నకోశం). దీని కర్త జినేశ్వర సూరి అను జైన గురువు.

ప్రాకృత సారస్వతములోనే మకుటాయమానమైన శృఙ్గార మధుకోశము హాల సంచిత గ్రంథము, "గాహాకోసం" లేక గాథా సప్తశతి – ప్రథమ సంకలన గ్రంథము. ద్వితీయమైననూ, అద్వితీయ వర్ణనలకు, నైసర్గిక భావ బంధురములకు కాణాచి అగు జయవల్లభ కృత "జయువల్లభం" (వజ్జాలగ్గం) తొంబది నాలుగు 'వ్రజ్య'లుగ విభక్తమయిన సంకలన కృతి.

గాహాకోస, జయవల్లభం వలె గాహారతణ కోసం ముక్తక కావ్యం. లోచనకారుడు (అభినవ గుప్త) ముక్తకమును ఈవిధముగ నిర్వచించియున్నాడు–

"పూర్వాపర నిరపేక్షేణాపి యేన రస చర్వణా క్రియతే తదేవ ముక్తకమ్!" విశాల సంస్కృత సాహిత్యములో వలె, ప్రాకృతములో గూడ ముక్తకములు లెక్కలేనన్ని ఉన్నవి. (చూడు– "సత్త సతాఇం కవి వచ్ఛలేణ కోడీయ మజ్ఝమ్మి..." గాహాసత్తసఈ ౧–౩). ఇట్టి ముక్తకములను యథేచ్ఛగ హాల చక్రవర్తి వలె గాని, లేక విషయానుసారముగ విభజించి జయవల్లభుని వలెగాని సంకలించి, నిర్మించిన గ్రంథములను కోశములు అందురు. కావ్యా దర్శనములో దండి ఉటంకించిన 'కోశ' పదము (౧-౧౩) పయి వ్యాఖ్యానించుచు వాదిఘంఘాలుడు 'కోశో నానా కర్తృక సుభాషిత రత్న సమూహః' అనినాడు.

జినేశ్వరసూరి 'గాహారతణ కోసం'ను విషయానుగతముగా వింగడించినాడు. ఇందలి భాగములకు ప్రక్రమములు అని పేరు. 'జినస్తుతి'తో మొదలయి, 'శాన్తరస'ముతో అంతమగు ఈముక్తక కోశ కృతిలో ఏబది ఎనిమిది ప్రక్రమము లున్నవి. ఎనిమిది వందల ఇరువది ఎనిమిది గాథలు ఈ కోశంలో చోటు చేసికొన్నవి.

సంస్కృత, ఆన్ధ్ర కవులవలెగాక, ప్రాకృత రచయితలు, తమ రచనా కాలములను విస్పష్టముగ చెప్పికొన్నారు. ఇందుకు అపవాదు లేకపోలేదు. కాని క్వాచిత్కము. గాహారతణకోసం చివరనున్న కాలమును తెలుపుగాథ ఇది–

ససి–బాణ–సూర (౧౨౫౧) వరిసే
అట్ఠావణ్ణా య పక్కమా అత్త!
గాహాణం అట్మ సదా
రచిదో సహసో సిలో గాణం॥

ఇందు అలభ్యములగు ఆఢ్యరాజుని "మారీచ వధ", చతుర్ముఖుని "రామాయణము", పాదలిప్తుని "తరంగవతీ", సర్వసేనుని "హరి విజయం", అనన్దవర్ధనుని "విషమ బాణలీల", భద్రబాహుని "వాసుదేవకథ" మున్నగు ప్రాకృతకావ్యముల నుండియే గాక, లభ్య ప్రాకృత మహాకావ్యములగు గౌడవహో, పఉమచరియ, లీలావదీ, వసుదేవహిండీ – మున్నగు వాటి నుండి జినేశ్వర సూరి గాథలను ఏర్చి కూర్చినాడు.

గాహారతణకోసంలోని గాథలను గూర్చి ఇంచుక పరామర్శించెదను.

లచ్ఛీ దుహి ఆ, జామాదా
హరీ తధ అఘరిణీ గంగా!
అముయ మియంక సుదా
అహో కుటుంబం మహోదహిణో॥

– సముద్ర ప్రక్రమము.

తెనుగు దేశము గాహాకోసం (గాథా సప్తశతి) ప్రతులలో పై గాథ ఉన్నట్లు ఆల్బ్రెక్ట్ వీబరు తన గాథా సప్తశతి 1881 సం॥ ముద్రణలో తెల్పియున్నారు. వారు అనుబంధముగా దీనిని ముద్రించియున్నారు. కవి సార్వభౌమ శ్రీనాథ కవి తెనిగింపు లభ్యమగుటచే, శ్రీ వీబరు తలంపు నిక్కము. కవి సార్వభౌముని కమనీయపు తెనిగింపు ఇది–

ఆరయ జీవనం బమృత,
మల్లుడు విష్ణువు, సొమ్ములన్నియున్
సారపు రత్నము, ల్కొడుకు
చంద్రుడు, కూతురు లక్ష్మి, యాలు భా
గీరథి, తా సముద్రుడని
కీర్తన సేయుదు రెల్లవారు నా
క్షీర పయోధి నన్యులకు
జెల్లునె యిట్లు సమస్త భాగ్యముల్.

'ప్రబన్ధ రత్నావళి' లో ఐదువందల ఏబదియవ పద్యముగ ఉన్నది.

దీహర ఫణింద నాళే
మహిధర కేసర దిసాముహదలిల్లే!

ఓ పిబఇ కాల బ్బమరో
జణ మకరందం ప్రహవి ప ఉమే॥

— శాన్తరస ప్రక్రమము.

పై గాథ శార్ఙ్గదేవుని 'సంగీత రత్నాకరము'న రాగ వివేకాధ్యాయమందు షడ్జ కైశిక రాగమునకు లక్ష్యముగా ఇవ్వబడింది. పై గాథకు రసిక వతంసులగు శ్రీ రాళ్ళపల్లి అనన్త కృష్ణశర్మగారి తెనిగింపు ఇది —

ఉరగపతి నిడునాళమై, గిరులు కేస
రంబులై దిఙ్ముఖములు దళంబులైన
పుడమి తామర పూవునఁ గడఁగి గ్రోలు
మనుజ మకరందమును కాలమనెడి తేఁటి.

అమృతమయమును, నైసర్గిక భావ బంధురమయిన 'గాహా రతణ కోసం'లోని కతిపయ గాథలు దిగువ ఉదహరించబడుచున్నవి.

దఢ సిహేణనాళ పసరియ
సబ్బావ దళస్స రఇ సుగంధ స్స।
పెమోప్ప లస్స ముద్దే
మాణ తుసార చ్ఛియ విణాసో॥

(ప్రేమ ప్రక్రమః)

మోణం కాల విళంబో
ఉచ్చ దిట్ఠీ పరమ్ముహం వదణం।
భికుడీ అంతల్లా పో
ణక్కారా ఛవ్విధా ఖోం తి॥

(కుప్వామి ప్రక్రమః)

సాలంకారాహిం మణ
హ రాహిం అణ్ణుణ్ణరాగ రసియా హిం।
గాహా హిం పణఇణీహిం వి
దజ్ఝ ఇ హియయం అయంతీహిం॥

(కావ్య ప్రశంస ప్రక్రమః)

వంకే హిం పిఓ, సరలే హిం
సజ్జణో వరగుణే హిం మజ్ఝత్థో।
రో సారుణేహిం పిసుణో
ణయణాయ చదువ్విహో భంగో॥

(నయన ప్రక్రమః)

విస్ఫులింగాలు

ఏ నిమేషంలో కనులుమూసినాచాలు వేలాది వేలు
ఎంతో మరెంతో తేజోవంతాలైన అనంతరూపాలు
ఈరేడులో కాల ప్రకృతి చిత్రాల విచిత్రాల సచిత్రాలు
ఏకమై వెలుగొందే మహాద్భుత సౌందర్య దృశ్యాలు !

అలా...అలా...ఒక్క క్షణంలో ఒకే ఒక్క క్షణంలో
అర్ధ నిమీలితాలైన నేత్రాంచలాలలో
ఆనందజ్యోత్స్నార్ణవాల అపూర్వ లాస్యవిలాసాలు
అద్భుతావహ తాదాత్మ్యానురాగస్మృతుల సంపుటాలు !

ఉత్తుంగ తరంగాల ఉజ్వలోజ్వల సంగీతాలు
ఊర్ధ్వగమనాగమన నిశ్శబ్ద స్పందనాలు
విశ్వేశ్వరుని దివ్యానుగ్రహామృత జలపాతాలు
విశ్వాంతరాళాః విహారానుభూతుల విస్ఫులింగాలు !

పూజ

కోటి సమస్యల కుంపట్ల మంటల్లో
కోడి కూసింది.

ఎన్నో పద్మవ్యూహాలను ఛేదించుకొంటూ
నీ సందర్శనార్థం వచ్చాను;
ఈ ఉదయాన.

నిశలన్నీ కరిగిపోయాయి
నిదురలేని స్వప్నాలతో.

నావద్ద మిగిలిఉన్న కడగండ్లే
నైవేద్యం.
నేను మ్రింగలేని హాలాహాలమే
హారతి కర్పూరం !

శ్రీ కె. సభా

డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తం

త్రిలిఙ్గ లక్షణ శేషము

1·0. "...తుదకిప్పుడు తద్భారతాది గ్రంథ పరిశోధనంబుచే దొరకిన విశేష లక్షణ ప్రయోగముల నేర్చి కూర్చి త్రిలిఙ్గ లక్షణ శేషంబను నొక యపూర్వ వ్యాకరణమును దీని వ్రాసితి" అని శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యులవారు తమ వ్యాకరణానికి ఉపోద్ఘాతంలో ఉద్ఘాటించటాన్నిబట్టి, వారు తమ గ్రంథానికి 'త్రిలిఙ్గ లక్షణ శేషమ'నే నామాన్నే పెట్టినట్లు తెలుస్తుంది.

కాని వారుండగానే ప్రచురింపబడ్డ ఆ వ్యాకరణం తొలి పుట లోనే "త్రిలిఙ్గ లక్షణ శేషమ"నే పేరుతోపాటు "ప్రౌఢ వ్యాకరణము" అని కూడా ముద్రితమైందని, ఆ తొలి ముద్రణాన్ని చూచిన పెద్దలు[1] చెప్తున్నారు. తదాదిగా "త్రిలిఙ్గ లక్షణశేషము అను ప్రౌఢ వ్యాకరణము"అని ఈ లక్షణ గ్రంథం ముద్రితమౌతూ వుంది. దీన్నిబట్టి ఉపోద్ఘాతంలో చెప్పకపోయినా, "ప్రౌఢ వ్యాకరణమ"నే పేరుకూడా ఆచార్యులవారు కల్పించిందేనని; అది ముద్రణాలయంలో ఏ అజ్ఞాతాక్షర సంధాతో కల్పించింది కాదని విదితమౌతున్నది.

'ప్రౌఢ వ్యాకరణ మ'ంటే, బాల వ్యాకరణంతో బాహాటంగా పోటీ పడ్డట్లు వుంటుందని; ఉపోద్ఘాతంలో తాను చెప్పకపోతే, ఆ పేరు తాను పెట్టింది కాదని, ఎవరో కల్పించి తగిలించి వుంటారని లోకం భావిస్తుందనే ఆలోచన చేసి వుండవచ్చు, ఆచార్యులవారు. ఏమైనా 'త్రిలిఙ్గ లక్షణ శేషము' అంటే అందులోని లక్షణం ఏదీ యితర లక్షణ గ్రంథాల్లో వుండరాదు. అప్పుడే అది 'అపూర్వ వ్యాకరణ' మనిపించుకొంటుంది. కాని యిందులోని లక్షణా లనేకం, అనేక లక్షణ గ్రంథాల్లో కన్పిస్తున్నవే. ఆ కారణంగా 'త్రిలిఙ్గ లక్షణ శేషమ'నే నామం దీనికి సార్థకం కాదు. ఏయే లక్షణ గ్రంథాల్లోని లక్షణాల్ని ఆచార్యులవారు స్వకీయం చేసుకొన్నారో అన్వేషించి, అన్వయించటమే ఈ వ్యాసలక్ష్యం. ఆశ్చర్యమేమిటంటే, ఈ వ్యాకృతిపై వచ్చిన వ్యాఖ్యానాలేవి, ఈ లక్షణాల్ని ప్రదర్శించవు. ఆవ్యాఖ్యాతలు వీటిని చూచి వుండరనటం మర్యాదకాదు. కాకపోతే వారి వ్యాఖ్యాన పరిధిలో ఈ అన్వేషణం వుండివుండకపోవచ్చు. లేదా ఆ లక్షణ గ్రంథాలపై వారికి సరైన లక్ష్యం లేకపోవచ్చు. మరే యితర కారణమైనా కావచ్చు.

2. 1. కార–ఇఫ ప్రత్యయాలు :

"వర్ణాత్కారః, రస్యేఫః" అని వార్తికం. సంస్కృత వ్యాకరణ సంబంధమైన ఈ ప్రత్యయాల్ని "అనుక్తమన్య శబ్దానుశాసనవత్" "అనుక్తమన్యతో గ్రాహ్య" మనే ప్రాకృత వ్యాకరణోక్తుల్ననుసరించి, తెలుగు వ్యాకరణంలో తిరిగి చెప్పటం అనవసరం. అయినా ఆచార్యులవారు తమ వ్యాకరణానికి శ్రీకారం ఈ సూత్రంతోనే చుట్టారు.[2] "తెనుఁగు వ్యాకరణమున నీ సూత్ర మనావశ్యకమ"నే యభిప్రాయ ప్రకటనంతో 'తత్త్వబోధినీ'[3] వ్యాఖ్యానం ప్రారంభమైంది.

ఇంతకు పై నియమమం సంస్కృత వ్యాకరణంలోనే కాక అనంతుని ఛందో దర్పణంలోను ఈ రీతిగా వుంది :

"ఱాఁదొలంగి సమస్తాక్షరముల మీఁదఁ
గారమగుఁ గకారంబు క్షకార మనఁగ
నట రవర్ణంబుపై నిఫయనఁగఁ బరఁగుఁ
గన నిది రేఫయని పలుకంగ వలయు" (IV–128)

3. 1. "ఒకానొకచో జ కారం బుభయంబునగు"(సంజ్ఞా. ౫) అని సూత్రించి, శ్లేషలో ఒక అర్థంలో జ కారం దంత్యమని; వేరో అర్థంలో తాలవ్యమవుతుందని "అకట పాండురాజ! యశమెన్నవైతి" అనే రాఘవ పాండవీయ పద్యపాదం ఉదాహరించారు, ఆచార్యులవారు. "పాండురాజ!" అనే సంబుద్ధిలోని 'జ' కారం భారతార్థంలో 'దంత్యమ'ని నిర్దేశింపబడింది. కాని వాస్తవానికిట తాలవ్యోచ్చారణమే శ్రుతమౌతుంది.

3. 11. ఈ "ఉదాహరణము సరియైనదికాదు. ఇచట భారత పక్షమునను దాలవ్యముగనే యుచ్చరించుట లోకసిద్ధము. సంబోధనమున 'రాజా!' అని తాలవ్యముగనే యుచ్చరింతుమ"ని తత్త్వబోధినీ వ్యాఖ్యాత గుర్తించారు. కాని సరియైన ఉదాహరణాన్ని ప్రదర్శించటం విస్మరించారు. (పుట 8.)

3. 21. గుప్తార్థ ప్రకాశిక కర్తలు "పాండు రోగము ప్రకాశించు వాఁడా!" అన్న యుపాలంభార్థము–"ప్రకరణాను కూలమ"ని యది తాలవ్యమనే పేర్కొన్నారు. (పుట 2 : ద్వి. ము.) కాని అంతటి తర్కం చూపవలసిన అవసరంలేదు. ఇక్కడ సంబోధనం గ్రహించటం సముచితం.

3. 22 పాండురాజు + అ[4] → పాండురాజ! అని సంబుద్ధి.

'రాజు' శబ్దం సంధిలో ఉత్వాన్ని కోల్పోయినా, సంధిలో తాలవ్యాచ్చులతోఁగూడినా, పూర్వపు దంత్యోచ్చారణాన్ని కోల్పోదు.[5] 'రాజు + ఇట్లనియె → రాజిట్లనియే'. 'రాజు + ఏ → రాజే'; 'రాజు + అ → రాజ.' పై సంబుద్ధిలో కూడా న్యాయానికి ఈరీతిగా దంత్యో

చ్చారణమే వుండాలి కాని, ఎందుకో – బహుశః సంబుద్ధి రూపం సంస్కృత ప్రాతిపదికతో తుల్యరూపం కావటం చేతనేమో! తాల వ్యంగానే ఉచ్చరింపబడుతున్నది. కాని ఆచార్యులవారు ఇటువంటి సరిపడని లక్ష్యాన్నే ఎందుకివ్వాలి? ఎన్నో ఉదాహృతులు స్పష్ట మైనవి రాఘవ పాండవీయంలో వుండగా![6] అనే సందేహానికి సమా ధానం, ఆయన అప్పకవీయాన్ని అంధప్రాయంగా అనుసరించటమే అంటే తప్పు లేదనిపిస్తుంది. ఏమాత్రం ఆలోచించినా తగిన ప్రయోగాలు ప్రదర్శించేవాడనిపిస్తుంది.

3.3. 'జ' కారానికే ఉభయోచ్చారణాన్ని పరిమితం చేయటం లక్షణ సంకుచితత్వమే అవుతుంది, అనుకరణమే కారణం.

సంస్కృతాంధ్ర భాషాభేదాల్ననుసరించి 'చ' కారం తాల వ్యంగా పలికితే ఒకర్థం; దంత్యంగా పలికితే వేరో అర్థం. ఉదా: చలము=వణకు, చలము=మాత్సర్యం.[8] మంచము=ఎత్తుగా కట్ట బడిన వేదిక; మంచము=పరుండే మంచం. చాటు = ప్రియమైన మాట; చాటు పద్యములు, చాటు కవిత్వం అనే సందర్భాల్లో శిష్టు లనబడేవాళ్లుకూడా దన్త్యోచ్చారణం చేయటం విచార్యం.

చాటు : (క్రి.) విశదపఱుచు, చాటింపు.

(వి.) మఱుగు.

పంచ = అయిదు; పంచ : వసారా. ఇట్టివి అన్వేషించటం భాషా వినోదంగా భావించవచ్చు.

పంచదార = అయిదుగురికి భార్య–ద్రౌపది.

పంచదార = చక్కెర.

4.0. క్త్వార్థక సంధి :– నన్నయ భారత భాషలో ఇటు వంటి సంధి జరగలేదని పరిశోధకులు పేర్కొన్నారు.[9] నన్నయా నంతర భాషలో ఈ సంధి ప్రవర్తిల్లుతు వుండటంవల్లనే "క్త్వార్థతో నభవేత్సదా" అనే నిషేధకారిక వికృతి వివేకం[10] లోనేర్పడ్డ దనవచ్చు. అయిన కవులీ నిషేధాన్ని అంతగా పాటించినట్లు కనిపిం చదు. కొన్నిచోట్ల యీ సంధి శ్రుతిహితంగానే వున్నది.

4.1. అటువంటప్పు డెందుకు దీన్ని నిషేధించాలని సాహ సించి అడిదం సూరకవి తన కవి సంశయ విచ్ఛేదంలో ఈ క్రింది రీతిని లక్షణ మేర్పరచాడు.

"ఇడగవచ్చును ల్యప్పుపై నిత్యసంధి
మాత్ర మొక్కొక్క చోటను మట్టు మీఱ
గొలుతు నఘమడంప గోరింద శేఖరు
నన్నయట్లు కవి జనానుమతిని" (I–14)

వికృతి వివేకంలోని 'క్త్వార్థ' సంజ్ఞను వదలిపెట్టి, 'ల్యప్పు' అన టంలో ఇదేదో క్రొత్తగా చెప్పినట్లు, ఇటువంటి సంధి ఎక్కడైనా శ్రవణ సుభగంగా వుంటే చేయవచ్చునని చెప్పినట్లు స్ఫురిస్తుంది. ఉపసర్గపూర్వకమైన ధాతువులకు పరమయ్యే 'త్వ' అనే ప్రత్యయా నికి 'ల్యప్' ఆదేశంగా వస్తుందని ఆర్యవ్యాకరణ నిరూపణం.[11] తెలుగు లక్షణ గ్రంథాల్లో ఈ ఒక్కచోటనే యీ 'ల్యప్' గోచ రిస్తుందేమో!

4.2. ఏమైనా 'కోరి + ఇందు శేఖరు' అన్నప్పుడు సంధి చేయటం అంత సుభగంగా లేదనే అనిపిస్తుంది నాకు. కాని యిందుకు ప్రదర్శించిన ప్రయోగాల్లో 'చాపము నాకందిమ్మనుడు' అనే (భార. విరా. ౪ ఆ) తిక్కన సోమయాజి కావించిన సంధి శ్రుతి హితంగా వుంది. దీనికి సంస్కార పాఠాన్ని పండితులెవ్వరు సూచించలేదు. 'అందిమ్ము' అనేది శబ్ద పల్లవమని, ఏక పదమని ముందు అందుకొని తరువాత ఇవ్వటంకాదని కొందరు వాదించినా,[12] అందులో 'అంది + ఇమ్ము' అనే శబ్దాల కలయిక కాదనరాదని కొందరు[13] ఆ వాదాన్ని త్రోసిపుచ్చారు. తిక్కన ఉద్యోగ పర్వ ప్రయోగం[14] : 'ఎఱిగించిపుడే' అనేది శ్రుతిహితంగా లేదు. 'ఎఱి గించి తగన్' అనే సంస్కారపాఠం దీనికి ప్రతిపాదితం.

'అనించు కించుక' అనే నైషధ ప్రయోగం,[15] 'చించిచ్చు వారి దీవించు వారు' అనే ఆముక్తమాల్యదా[16] ప్రయోగం, 'అడిగి చ్చునో' అనే సుభద్రాపరిణయ[17] ప్రయోగం అంతగా బాగుండక పోయినా, సూరకవికి అవి మట్టు మీరినవిగా కనిపించాయి. అందుకే ప్రదర్శించి వుంటాడు. ఈ ఉదాహరణాల్లో ఒక నియతి గోచరి స్తుంది. అది–క్త్వారక ఇకారానికి ఇకారం పరం కావటం. సమాన స్వరం పరమయ్యేటప్పుడు సంధి చేయవచ్చుననే ఉద్దేశ్యం గోచరి స్తుంది. చిన్నయ సూరి కూడా తన తొలి రచన[18] లో ఇటువంటి చోట్ల క్త్వార్థక సంధిచేయవచ్చునని భావించాడని; కాని తరువాత బాలురు ఎక్కువగా దీన్ని చేస్తారనే భీతితో బాలవ్యాకరణంలో దీన్ని పూర్తిగా నిషేధించాడని విజ్ఞులు[19] భావించారు. పెద్దలు చేసినా, బాలురు చేయకూడదని, భాషను రక్షింపవలసిన బాధ్యత వీళ్లదే అని చిన్నయ భావంగా పండితులు భావిస్తున్నారు.

4.3. సూరకవి లక్షణాన్ననుసరించి, ఆచార్యులవారు ల్యప్పును; చిన్నయసూరి క్త్వార్థక సంజ్ఞను రెండింటిని వదలిపెట్టి "ఇ ప్రత్యయాంతా వ్యయంబునకు సంధియు జొపఁబడెడి" (సంధి–2) అని సూత్రించాడు. ఇ ప్రత్యయ మంటే సరిగా తెలు స్తుందో లేదో అని "భూతకాలికా సమాపక క్రియయొక్క 'ఇ' కారమునకుఁ బ్రామాణిక ప్రయోగములందును [20] గొన్ని యెడల సంధి గనఁబడుచున్నదని యర్థము" అని వివరించాడు.

4.31. 'ఇ ప్రత్యయాంతముల' నటంలో ఒక చిక్కు వస్తుంది. క్త్వార్థమంటే వ్యతిరేక క్త్వార్థమని గ్రహించవచ్చు. 'పాఱకొక' అనే రాఘవ పాండవీయ ప్రయోగాన్ని సూరకవి పేర్కొన్నాడు కూడ. ఇ ప్రత్యయమంటే, – అక ప్రత్యయాంతం స్ఫురించదు. దాన్ని ప్రత్యేకించి పేర్కొనాలి. సంజ్ఞ నుపయోగించు కోటంలోని సౌలభ్యం బాగా గుర్తించాలి ఏ లాక్షణికుడైనా.

4.32. 'భూత కాలికం' అనటంకన్న 'భూతార్థకం' అనటం సమీచీన మనిపించుకొంటుంది. వ్యాకరణంలో 'కాలికం' (Time) అని వాడటంకన్న అర్థకం (Tense) అని వాడటమే సముచితం.

4.4. గిడుగు రామమూర్తి పంతులుగారీ సంధిప్రవర్తిల్లటానికి నూటయేబది ప్రయోగాలు ప్రదర్శించారు[21]

4.41. తమ సుదీర్ఘపు జీవితపు టుత్తరార్థంలో భాషాపరిశోధనం విశేషంగాచేసిన 'అద్యత నాంధ్ర కవి ప్రపంచ నిర్మాతలు' చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారు ఈ సంధిని గూర్చి అనేక పర్యాయాలు ప్రస్తావించారు. "నన్నయ నుండి అందరు కొన్నిచోట్ల చేశారు" అని ఒకచోట;[22] "ఈ మహాకవి (వేంకటనాథకవి – పంచతంత్ర కర్త) శ్రుతి కటువుగా వుండని క్త్వార్థక సంధిని అసకృదావృత్తిగా చేసి, తమ సమ్మతిని చూపియున్నాడ"ని[23] వీరు పరోక్షంగా ఈ సంధిపట్ల తమకుగల సమ్మతిని తెలియజేసారు.

4.42. తాము తమ చిన్నతనంలో 'ఎటిగించిపుడే' అనే తిక్కన ప్రయోగం చదువుకొన్నామని; ఇప్పటి ప్రతుల్లో "ఎఱిగించి తగన్" అనే సంస్కార పాఠమే వుందని చెళ్లపిళ్లవారి సాక్ష్యం.[24] కవి ప్రయోగాలన్నీ ఈ రీతిగా, బాలవ్యాకరణానంతర కాలంలో తదనుకూలంగా మార్చటం గమనింపదగిన విషయం.

4.43. ఇంతటి చరిత్ర గల ఈ సంధిని ఆచార్యుల వారును సమ్మతించి, నిరూపించటం, కేవలం చిన్నయ సూరిపై స్పర్థని భావించే దానికన్న, "ప్రయోగ శరణా వైయాకరణాః"అనే ధర్మానికి కట్టుబడటంగానే భావించటం ధర్మం.

5 0. "శ్లేష్మతావాచకంబులగు నార్యాంబాద్యర్థక శబ్దంబులు పరంబులగుచో నన్ని యచ్చులకు సంధి నిత్యము" అని[25] యాచార్యుల వారేర్పరచిన లక్షణం అపూర్వమైంది కాదు. వికృతి వివేకంలోనే దీనికి ఆధారం ఈ రీతిగా ఉంది:

"సంధిర్నిత్యం ప్రత్యయాచ అచస్తథా ఆర్యాదిగస్యచ"[26]

ఈ విధంగా సంస్కృతంలో విరచితమైన లక్షణ గ్రంథంలోనేకాక, తెలుగులో బలారి నరసింహ రాజ కృతమైన 'కవిజనాంజనం'లో కూడ ఈ లక్షణం ఈ రీతిగా వుంది :

"అమ్మాదులు పరమైతే పూర్వాచ్చుకు నిత్యసంధిగాని వికల్ప సంధిలేదు–చంద్రమ్మ, లచ్చన" (పత్రం 36)

ఈ శ్లేష్మతావాచకాలు ప్రత్యేకంగా విరుచుకోని అర్థ వివేచనం చేయరాదని; అలా చేసి 'రామ+అమ్మ' 'సీత+అయ్య' వంటి శబ్ద సమ్మేళనం కుదరదని మా గురువులు కీ శే దువ్వూరి వేంకట రమణ శాస్త్రిగారు బోధించేవారు. అది నిజమే. కాని వ్యాకరణం శబ్ద ప్రధానమైంది. అవి శ్లేష్మతా వాచకాలుగా కొన్నిచోట సమర్థించటానికి కుదరకపోయిన సంధి సూత్రం జరిగిందని చెప్పక తప్పదు. ఈ సంధి చాలా ప్రగాఢంగా జరిగినట్లు కవులు భావించటం వల్లనే, వ్యంజన ప్రధానంగా గాను యతులు చేకూర్చినట్లు అప్పకవి ఉభయ యతుల్లో తొమ్మిదవదిగా[27] "వామాఖండవళులు"గా ఇట్టినాటిని నిరూపించాడు. అందలి లక్షణాన్ని పరిశీలించి ఆచార్యుల వారు తమ లక్షణాన్ని యింకా విస్తృతం చేసివుంటే బాగుండేదనిపిస్తుంది.

6.0. <u>ద్రుత ద్విత్వం</u> :

ఆంధ్ర శబ్ద చింతామణిలో "లుక్సం శ్లేషౌనాచి ద్రుతస్య" (సంధిన్) అని వుంది. ద్రుతాని కచ్చు పరమైతే లోప సంశ్లేష లుండవు. 'భజియింతున్+అంబను' 'భజియింతు నంబను' అని అవుతుందేగాని, 'భజియింతంబను'అని కాని, 'భజియింతున్నంబను' అని కాని కాదని బాలసరస్వతి[28] వివరించాడు.

6.1. ద్రుత ద్విత్వాన్ని 'దుస్సంధి' దోషంగా కవిజనాశ్రయాది లక్షణ గ్రంథాలు పేర్కొన్నాయి. అయినా కవిజన సంజీవనిలో (ముద్దరాజు రామన కృతం) ఈ సంధి ఈ రీతిగా అంగీకరింపబడింది.

"మిన్నగ నకార హల్లుల
కున్నచ్చులతోడ సంధిఁ గూర్పగఁ జెల్లున్
పన్నగ శయనుడు హరి యో
ర్చున్నఘములు భక్తులైన సుజనుల కనగన్" (IV–1)

ఇందుకు నన్నయ భారతం నుండి ఒకే పద్యం ఉద్ధరింపబడింది.[29]

6 12. ఈ సంధిని 'ఆనంద రంగరాట్ఛందము' కూడా ఆమోదించింది.[30] నన్నయ భారత ప్రయోగత్రయం[31]తో ఈ లక్షణం సమర్థింపబడింది.

6.2. ఈ విధంగా ఒకరి కిద్దరు లాక్షణికులు పేర్కొన్న లక్షణాన్నే ఆచార్యులవారు ఇలా ఉద్ఘాటించారు : "కొన్ని యెడలఁ బ్రామాణిక ప్రయోగంబులం ద్రుతంబున కచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి" (సంధి 3 సూ). కాని పూర్వ లాక్షణికు లుద్ధరించిన నన్నయ ప్రయోగా లీయన ప్రదర్శించలేదు. ఈలక్షణం తానే చెప్పున్నట్లు భ్రాంతి గల్గించాలని భావనేమో !

6.21 కవిత్రయం తరువాత ప్రామాణిక కవి నాచన సోముడు. "అఖిలంబున అక్షిణి డాచిన సర్వజ్ఞుడు"గ చిన్నయ సూరి గౌరవానికి పాత్రమైన వాడు. అట్టి సోమన ప్రయోగం : "ఘన చక్రాయుధ నిష్ఠుర క్షతగళద్రక్తార్ద్ర సర్వాంగుని. న్నను భూతా ప్రతిమ ప్రగల్భ పరివాండాంతర్విత్తో ద్వికమున్." ఇది చక్రాయుధం లాంటి తిరుగులేని ప్రయోగంగా ఆచార్యులవారు భావించి వుంటారు. కాని పండితులు దీనికి కూడా సంస్కార పాఠం కల్పించారు : 'అభ్యనుభూతా ప్రతిమ' అని[32] దీనితో ఆచార్యులవారి సూత్రంలోని 'ప్రామాణిక ప్రయోగములన్' అనే దళం వ్యర్థమౌతుంది. ఎందుకంటె పోతన భక్తకవి తక్కినవి ఆధునికాలు.

6.3. గిడుగు రామమూర్తిగారు బాలకవి శరణ్యంలో 'మహావిసంధి' 'దుస్సంధి' అనే శీర్షికను నన్నయ ఎఱ్ఱాప్రెగ్గడాది మహాకవి ప్రయోగాల్ని సంతరించారు. (పుటలు 222–23) 'భాషాభేషజము'లో పంతులుగారు నన్నయ తిక్కనాది మహాకవి ప్రయోగాలు పదునెన్మిది చూపారు. (పుటలు 120–130 ద్వి. ము.) ఇట్టి సంధుల్ని మార్చటంలో మన పండితుల 'అభినివేశం' గొప్పదని శ్రీ చెళ్లపిళ్లవారు పరామర్శించారు. (కథలు గాథలు: పుట 58)

6.4. చారిత్రకంగా జరిగిన హల్ద్విత్వ సంధులు కన్ + అదరె → కన్నదరె; విల్ + అందె → విల్లందె, మున్నగు[33] సంధుల సామ్యంవల్ల (analogy) ఇటువంటి ద్రుతద్విత్వ సంధులేర్పడి వుంటాయి.

6.42 పాదాంతంలో విసంధి చేసినా కొన్ని ప్రయోగాలు సరిపోతాయి. ఉదా: 'సర్వాంగునిన్ । అభ్యనుభూతా ప్రతిమ' అని విఱిచి చదివినా సరిపోతుంది. 'సర్వమున్ అతని' అని విసంధి చేయటం పూర్వు లంగీకరించరు. ఈ ద్విత్వం అలవోకగా ఉచ్చారణంలో ఏర్పడినట్లనిపిస్తుంది (Spontaneous doubling). సంస్కృతంలో సనాద్యంత సంధి యిట్టిదే. ఛందో నియమపాలనం వల్ల (Prosodical Contingency) కూడా ఇటువంటి ద్విత్వం కల్గియుండవచ్చు.

7.0. నుగాగమం: ''కొన్నిచోట్ల షష్ఠీ సమాసంబునం దుకారంబున్న కచ్చు పరంబగునపుడు నుగాగమంబునకు లోపంబు నగున''ని ఆచార్యులవారు సూత్రించి, 'గోకుల మిల్లిలు''బచ్చింట' 'శిరసందము' నే ప్రయోగాల్ని ఆచార్యులవారు ప్రదర్శించారు. (సంధి ౧౦)

దీనికి సర్వలక్షణ సారసంగ్రహంలో ఆధారం ఈ క్రింది రీతిగా వుంది.

''తగు నుకారాంతముల కర్మధారయమున
షష్ఠియగు చోటఁబైనచ్చు సంఘటిల్లె
నేని సంధులయెడ 'న' నిలుచుగొన్ని
యెడల గలుగక యుండు మహీశతాంగ'' (I–57)

7.1. షష్ఠికి నకారం రాకుండటానికి 'రాజంతవాని' అనే నైషధ ప్రయోగాన్ని (I–66); గట్టు రాజల్లుఁడు' అనే రామాభ్యుదయ ప్రయోగాన్ని (I–67) సర్వలక్షణ సారసంగ్రహకర్త ప్రదర్శించాడు.

7.2. సర్వసాధారణంగా వచ్చే ఆగమాలు సకృత్తుగా ఎక్కడైనా రాకుండగూడ వుండవచ్చు. అందుచేతనే 'ఆగమశాస్త్ర మనిత్య' మంటారు. ఆగమం రాదని ప్రత్యేకించి లక్షణం ఏర్పరచవలసిన అవసరం లేదు.

8.0. పూ, పూవు. (సంధి ౧౧) దీనికి మూలం సర్వలక్షణ సారసంగ్రహంలో ఈ రీతిగా వుంది: ''పూవు, పువు, పువ్వు, పూయన'' (II–175) ''అసమాసంబునం బూ శబ్దము పూవు శబ్దముయొక్క పర్యాయముగాఁగానంబడియెడినని యర్థము'' అని వివరించిన ఆచార్యులవారు అసమాసాన్ని పరిశీలించి యుదాహరించటానికి మారుగా ''కాలకంఠుని శిరసు పూ గగనగంగ'' (కాశీ. ౧–2) అని సమస్త రూపాన్నే పేర్కొన్నాడు. సర్వలక్షణ సారసంగ్రహంలోకూడా ఇదే ప్రయోగం ప్రదర్శితం.

8.1. తత్త్వబోధినీ వ్యాఖ్యానం ఈ ఉదాహరణం సరియైంది కాదని పేర్కొని, ఈ లక్షణాన్ని అనవసరమని త్రోసిపుచ్చింది. అసమాసం అన్వేషించకుండా త్రోసిపుచ్చటం భావ్యం కాదు. ''ఆనంద కాన నాభ్యంతరంబులయందు సింధువారమునఁబూ శిథిల పడఁగ'' అనే భీమఖండ ప్రయోగం దీనికి సరిపోతుంది. (II–46)

8.2. చిన్నయసూరి 'పూ' శబ్దాన్ని లుప్త శేషంగానే చూపారు. (బా. వ్యా. సంధి 37) ఆ కారణంగా 'పూ' అనే స్వతంత్ర పదంకూడా వున్నదని, ఆచార్యులవారి నిరూపణం. తమిళ కన్నడాల్లోను 'పూ' అనే వుంది. తమిళంలో 'పూ' అనే ధాతువుకు 'వికసించు' అని అర్థం.

8.21. 'పూ' శబ్దం లుప్త శేషం కాకపోతే 'ను' గాగమం రాదు. అపుడు సరళాదేశం ఉండదు.[34] దంత స్త్రీ సమాలకే 'ను' గాగమాన్ని విధించాడు చిన్నయ.[35] ఇది ఊ దంతం. ఈ విధంగా చిన్నయ పెట్టుకొన్న ప్రక్రియను భిన్నం చేశారు ఆచార్యులవారు. 'పూవు' అని గ్రహించినందువల్ల ప్రక్రియా సౌలభ్యం లభిస్తుంది. ఇది వర్ణనాత్మక వ్యాకరణ పద్ధతి. 'పూ' అనేది చారిత్రక రూపం.

9.0. రెన్నాళ్లు – మూన్నాళ్లు.

''కొన్ని యెడల 'న' వర్ణంబు పరంబగు నపుడు పూర్వ పదాంత్య డకారంబు నకారంబగు''నని ఆచార్యులవారు నియమించారు (సంధి ౧౫). దీనికి లక్ష్యాలుగా పైరూపాలు చూపించారు.

9.1. సర్వలక్షణ సారసంగ్రహంలో పై లక్షణానికి క్రింది ఆధారం లభిస్తుంది:

''ఏఁడు నూరనంగ మూఁడు నాళ్లనఁగను
బాడు నుయ్యనంగ బరగు శబ్ద
ముల నకారములును వలనొప్పఁడూలతో
శ్లిష్టమగుచు నుండు శ్రీమహేశ!'' (I–124)

లక్షణాన్నిబట్టి 'ఏడ్నూరు' 'రెడ్నాళ్లు' అనే శ్లిష్టరూపాలు సాధింపవలసిఉన్నా 'ఏణ్నూరు'[36] 'రెణ్నాళ్లు'[37] అనే రూపాలకు కాశీ ఖండంనుండి, ఆముక్త మాల్యదనుండి ప్రయోగా లుద్ధరింపబడ్డాయి.

9. 2. పై సంధి నీ క్రింది రీతిని ఆధునికంగా నిరూపించవచ్చు :

వేడి + నీళ్లు → వేడి + ణీళ్లు (మూర్ధన్య 'డ' కారంవల్ల న > ణ): పాక్షిక సమీకరణం.

వేడి + ణీళ్లు → వేణి + ణీళ్లు → వేణ్ణీళ్లు : పూర్ణసమీకరణం.

ఈ సమీకరణం ప్రక్కప్రక్కనున్న వర్ణాలకు జరగటంచేత; అందులో పరస్పర ప్రభావం ఉండటంచేత దీన్ని 'పరస్పర ప్రభావిత పార్శ్వవర్ణ పూర్ణ సమీకరణం' (Reciprocal juxta-positional complete assimilation) అని అభివర్ణించవచ్చు.

9. 3. 'వేడినీళ్లు', మూడునాళ్లు' అనే డకారాంత పూర్వ పదాలకే కాకుండ 'చలి + నీళ్లు' → చన్నీళ్లు అని 'ల' కారాంతాలకు కూడా ఈ సమీకరణం కల్గుతుంది.

10. 0. మకార ద్విత్వము.

సర్వలక్షణ సారసంగ్రహంలో ద్రుతంమీద 'మ' కారం వుంటె, ప్రాసస్థలాల్లో ఆ 'న' కారం 'మ'కారంతో సమీకారణాన్ని పొందటానికి నన్నపార్యుని ఆదిపర్వం[38] నుండి, ఆరణ్యపర్వం[39] నుండి ప్రయోగాలు ప్రదర్శింపబడ్డాయి. వాటిని పురస్కరించుకొని ఆచార్యులవారు "ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకారాదేశంబగు" అని లక్షణాన్నేర్పరచి, ఆ రెండు ప్రయోగాలే చూపారు (సంధి ౨౨).

10. 1. వికృతి వివేకంలో[40] ని కారిక "కేచిద్వదన్త్యభిస్తత్వ మనుస్వార మకారయోః" అనే లక్షణం, దాన్ని పురస్కరించుకొని అహోబలపతి[41] నన్నపార్యుని ఆదిపర్వంలోని పద్యముటంకించటంకూడా ఆచార్యులవారు పై రీతిగా లక్షణ మేర్పరచటానికి తోడ్పడి వుంటుంది.

10. 2. మకారం పరమైతేనే నకార మకారాలకు ద్విత్వం సంభవిస్తుంది. పకారం పరమైతే కాదు.[42] 'మునీంద్రలోక వద్యుం బరముం' అంటే ద్విత్వంరాదు. అందుచేత ఆ పద్యంలోని ప్రాస బిందుపూర్వక బకారమే అని గ్రహించాలి[43] అని కవిజనమండన టీక. కాని యీ సమస్య లేకుండా 'లోకవద్యుమ్మని నప్పరాశరసుతున్' అని వావిళ్లవారి ప్రతి.[44]

11. 0. మల్లురు :

చిన్నయసూరి 'బాలురు' 'నృపాలురు' 'దయాళురు' వంటి రూపాల్నే సాధించాడు. కాని 'మల్లురు' అనే రూపం, రేఫప్రాసగా రామాభ్యుదయం ప్రయోగం లభించటంవల్ల "ద్విత్వయుక్తలాంతంబుమీఁది ఉలలకును రురలాదేశంబులగు" అనే లక్షణాన్ని ఆచార్యులవారు పేర్కొన్నారు. (శబ్ద ౨౩)

11. 1. కాని త్రిలింగలక్షణ శేషంలోని ఈ లక్షణంకన్న మిన్నగా సర్వ లక్షణ సారసంగ్రహంలో ఈ క్రింది రీతిని వివరణ ముంది :

> మల్లు లను శబ్దమునకున్
> మల్లులు, మల్లురని కృతుల మానుగఁబలుకం
> జెల్లును గవి యనుమతి..." (I-139)

'మల్లులు' అనే రూపానికి తిక్కన భారత ప్రయోగం; 'మల్లురు' అనే దానికి రామాభ్యుదయ ప్రయోగం ప్రదర్శితమైనాయి. రెండు ప్రాసఘటితాలే. ఆచార్యులవారు తిక్కన ప్రయోగాన్ని తిలకించకుండా వుంటారా ? తమిళంలో 'మల్లర్' అని, తెలుగు మర్యాద ప్రకారం 'మల్లులు' అనటంలో విశేష లక్షణం లేదని ఆచార్యులవారారీతిగా పేర్కొని వుంటారు. ఏమైనా వర్ణనాత్మక వ్యాకరణ రచన 'చేసేటప్పుడు వాడుకలోని రెండు రూపాల్ని సాధించాలి. అందుచేత 'రురలు' విభాషగా ఆదేశిస్తే సరిపోయేది.

12. 0. <u>అర్ఘ్యవులోనగునవి :</u>

"అర్ఘ్యాదుల కడ యచ్చున కుత్వంబును, మీద వువర్ణకంబును వైకల్పికంబుగానగు : అర్ఘ్యవు అర్ఘ్యము; ధర్మువు - ధర్మము; వర్గువు - వర్గము" (శబ్ద ౨౫).

12. 1. ఈ లక్షణాని కాకరం కవిజన సంజీవనిలో ఈ రీతిగా వుంది :

> "కవి సమ్మతమై తగు ధ
> ర్మువు ధర్మమనంగఁగర్మమున్ గర్మువునా
> దివిజులు వినుతింపగ ధ
> ర్మువు బ్రోచెం గలుష మడచి మురహరుడనగన్॥
> (I-37)

12. 2. ఆచార్యులవా రుట్టంకించిన నన్నపార్యుని పద్యం ఇందులోనువుంది. కాని 'కర్మువు' అనే రూపమందువులోవుంది. 'ధర్మువు' అని ఆచార్యులవారిచ్చారు. కాని పరిశీలిస్తే 'కర్మువు' అంటమే సముచితమేమో ! ఎందుకంటె 'అవని యరాజకంబయిన యప్పుడ భగ్రప్రజయందు సర్వకర్మువులు' తొలిగిపోతాయి. యజ్ఞయాగాదులు చేయరు. అందుచేత 'దేవముని ముఖ్యులు' వదలిపోతారు. సకాలంలో వృష్టి వుండదు. కవి జనసంజీవని పాఠమే వుచితం. 'ధర్మువు'కు శాంతిపర్వ ప్రయోగం అందులో చూపబడింది. శ. ర. లో 'కర్మువు' అనే పదం లేదు. సూ. ని. లో వదంవుంది కాని ప్రయోగం లేదు.

13. 0. <u>రాహు—బాహులు :</u> "రాహు—బాహు శబ్దములకంతట వు వర్ణక లోపంబు వైకల్పికంబు — రాహువు — రాహు; రాహువులు—రాహులు; బాహువు—బాహు; బాహువులు బాహువు ఇత్యాదులు" అను ఆచార్యులవారి సూత్రానికి (శబ్ద ౨౮) సర్వ లక్షణసార సంగ్రహంలో ఈ క్రింది పద్యం పేరకమనవచ్చు.

> "మొనసి కృతుల నుకారాంతములఁ దెనుంగు
> సేయు నెడలను పూర్వాచ్చు చెడు నొకొక్క
> తఱిని రాహువు బాహువు తరువనంగ
> రాహు బాహువు తరునన రాజభూష." (I-83)

13. 1. ఇందులో లక్ష్యమంత స్పష్టంగా లేదు. ప్రయోగాలు పరిశీలిస్తే — 'బాహప్పళించి' అనే తిక్కయజ్వ ప్రయోగం (విరా. II-7) స. సా. సం. ప్రదర్శించిందే.

13. 2. ఆచార్యులవారు చూపిన 'రాహు, పర్వంబుగాకయ' అనే నన్నపార్యుని ప్రయోగాన్ని (సభా. II. 299) స. సా. సం.లో లేదు కాని తిక్కన శల్య పర్వప్రయోగాన్ని చూపింది.

13. 21. విరాటపర్వ ప్రయోగం 'బాహప్పళించి'అనేదాన్ని స. సా. సం. ప్రదర్శించింది. ఆచార్యులవారు దాన్ని పేర్కొన్నారు.

13. 22. స.సా.సం. లో 'ఊరులన్' 'రఘున్' 'తరులు' 'జంతులు' వంటి బహువచన ప్రథమాంత, ద్వితీయాంతములు, ద్వితీయైక వచనాంత రూపాలు నిరూపితాలు. కాని యిందులో 'వు' లోపం ప్రథమైక వచనాంతమైనవే అందుకే లక్షణం 'రాహు' 'బాహు'లకే పరిమితం. ప్రథమా విభక్తిలో 'జంతు' 'తరు' వంటి వుండవు. ఆచార్యులవారి 'అంతట' అంటే ప్రథమా విభక్తిలో కూడా నని అర్థం (శబ్ద ౨౮). సూరిగారి 'అంతట' అంటే (బా. వ్యా. తత్స. 48) అన్ని లింగాల్లోను అని అర్థం.

14. 00. <u>నిత్యైక వచనాంతాలు :</u>

"కేలేక వచనము" (కా. చూ. IX-91)

"ఏక వచనంబె కేలున కిరులకెల్ల"
(కవిజన సంజీవని II-29)

ఇట్టి లక్షణాల్ని పురస్కరించుకోనే ఆచార్యులవారు "దేశ్యమునం దక్కడాదులు నిత్యైక వచనాంతములు — అక్కడ, ఇరులు, కేలు" (శబ్ద ౨౮)

14. 1. <u>నిత్య బహువచనాంతములు :</u>

"ఆరుగ, వరి, ఇత్తడి మున్నగునవి" అని త్రిలిఙ్గ లక్షణ శేషము (శబ్ద ౨౮—౩౮)

> ఆంధ్ర భాషా భూషణము నందు
> "వఱలు కొలుచుల పేళ్లెల్ల బహువచనము
> గోదుమలు,వడ్లు, జొన్నలు, కొఱ్ఱులాళ్లు
> చోళ్ల నువుములు, పెసలనఁ జెల్లుగాన"
> (80—పద్యం)

కావ్యాలంకార చూడామణిలో కూడా నిట్టి లక్షణములు గలవు :

> "కొఱ్ఱులాళ్లు వడ్లు గోదుమ లనుములు
> కొల్లు లనెడి వీనికెల్ల నిట్లు

ప్రకటితంబులయ్యె బహువచనంబులు
నేక వచన నియతి యెపుడు లేదు.'' (IX-౯౨)

లక్షణ గ్రంథాల్లో 'గోధుమల'ని ఒత్తులేని శబ్దం నేటి వ్యవహారంలో 'గోధుమల'ని శ్రుతం.

15. 0. ''పెల్లడరఁ గొన్ని పదములఁ
దెల్లమిగాఁ జేతనను తృతీయకుఁ గృతులం
జెల్లును 'మై' యనుట'' అని (స. సా. సం. I-36) ఇట 'చేత' యనుట ప్రామాదికము-'తోడ' యని దీనిని సంస్కరింప నగును. ఇందుల కిచ్చిన ప్రయోగములు గూడ 'సహార్థమ'గు —తోడకు మాఱుగా వచ్చిన మై—మెయిలే.

ఇట్టి లక్షణాన్నిబట్టే ''జడ పదంబుమీది తోడకు 'మెయి,' 'మై' లు వికల్పంబుగా నగు (శబ్ద ౧౮)

ఈ రెండు గ్రంథాల్లోను, నిర్వచనోత్తర రామాయణము, నైషధము, కాశీ ఖండము మొదలగు వాటిలోనే ప్రదర్శితం. కాని నన్నయ ప్రయోగం : ''తెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్'' (అవతారిక.) ప్రదర్శింపకపోవటం విచార్యం.

16. 0. నగాగమం

''కదిసి ముకారాంతములగు
పదములపై సప్తమీ విభక్తి యొదవుచో
హ్రదమున హ్రదమున యందున్
హ్రదమందున్ హ్రదమునందు ననఁజను శర్వా''
(స. సా. సం. I-49)

''పరగ లోకము నందని పలుకుచోట
లోకమున యందనగ వచ్చు ప్రాకటముగ
వినుతి కెక్కె లోకమున యందుఁ జంద్ర రే
ఖావతంసుకీర్తి యన్నయట్లు'' (క. సం. వి. I-95)

లక్షణ గ్రంధములలో ఉన్న విషయాన్నే చేపట్టి ఆచార్యుల వారు ''ఉదంతములగు నమహార్తుల కందు వర్ణకము పరంబగు నపుడును నగాగమంబు కొన్ని యెడలఁ గానంబడియెడి (శబ్ద. ౨౧) అని పేర్కొన్నారు. నన్నయ, తిక్కనల్లో ఈ లక్షణానికి ప్రయోగాలు లేవు. ఎఱ్ఱాప్రెగ్గడ భారతంలో ప్రయోగం లభించింది. హరివంశ ప్రయోగం కూడా ప్రదర్శితం.

17. 0. లు, రు వర్ణాలకు ఉత్వలోపం :

''హలవసానంబులు పరంబులగునపుడు లు, రు వర్ణకంబుల యుత్వంబునకు లోపంబు వైకల్పికంబుగ నగు'' (శబ్ద 16) ఇందుకు ''పతతుల్ సాల్పడి... తత్పాలుర్ భయం బందగన్'' అనే నన్నయ ప్రయోగం ప్రదర్శితం.

ఈ లక్షణానికి మూలం సర్వలక్షణ సారసంగ్రహం ఇలా వుంది:

నరులుఱులు పొల్లులగుచుం
దిరముగఁ బైహల్లు గదిసి ద్విత్వముఁ జెందున్
సరవిని వేఱె యుండున్
సరి దైత్య వినాశ శైలకన్యాధీశా ! (I-166)

ఇందులో 'అవసానం' పరం గావటం పేర్కొనబడలేదు. నన్నయ ప్రయోగం చూపలేదు.

17. 1. ఇట్టి లక్షణమే ఆనంద రంగరాట్ఛందంలో గూడా వుంది ఈ రీతిగా :

''నుఱు లురులు బొల్లులగును దెనుఁగు సంధి
హేమమది పదార్వన్నె; సల్మోను లతఁడు
బ్రహ్మ; హరిఁగొల్చి యున్నవారె పరమ మునులు
కోటిలో నొప్పు సతికిఁ గన్గొనలయందు.'' (IV-5)

ఈ లక్షణ గ్రంధంలో పూర్వకవి ప్రయోగాలు లేవు.

18. 0. యొక్క లోపం :

''యొక్కకు లోపంబు బహుళంబ''ని (కారక. ౧౬) ఆచార్యులవారి లక్షణం. కాని సర్వలక్షణసార సంగ్రహకర్త 'యొక్క'కు మాత్రమే కాక 'కూర్చి'కి కూడా లోపాన్ని గుర్తించటం విశేషం.

'కూర్చి' యను ద్వితీయకును 'యొక్క' షష్ఠికి
పై విభక్తి గానఁబడక రాక
యడగి యుండుఁ గృతుల నాచార్యుఁ బ్రణమిల్లె
రాజు కొడుకనంగ రాజమకుట ! (I-14)

18. 1. కాని యిట 'రాజు కొడుక'ను నది సమాసం. సమాసంలో విభక్తికి లోపం వస్తుంది. 'యొక్క' లోపానికి పేర్కొన్న ప్రయోగం ఒక్కటే-హరిశ్చంద్రోపాఖ్యానంలోని 'రాజకుమారుఁడు' (I-18) అని. ఇది సమాసమే. కాని యసమాసములయందు విభక్తి లోపమునకు ఆచార్యులవారనేక ప్రయోగములను బ్రదర్శించిరి.

18. 2. నన్నపార్యుని పద్యం 'ఇమ్ముగ సర్వలోక జనులెవ్వని యేని' అన్నప్పుడు 'యొక్క' లోపం. స. సా. సం. ఈ లక్షణాన్ని గుర్తించలేదు. ఆచార్యులవారు గుర్తించారు. ఆ పద్యంలోనే 'పరాశరాత్మజ సుతుం బ్రణమిల్లి' అన్నప్పుడు 'కూర్చి'కి లోపం స. సా. సం. గుర్తించింది. ఆచార్యులవారు గుర్తించలేదు.

18. 3. 'గుఱించి' కూడా ఉద్దేశార్థంలో అనుప్రయుక్తమౌతుందని, సముచ్చయ గ్రహణంచే 'కూర్చి' జ్ఞాపకార్థమని పేర్కొన్న[45] ఆచార్యులవారు, దానికి లోపాన్ని పూర్వలాక్షణికుడు చెప్పినా, చెప్పకపోవటం విచార్యం.

19. 0. జడంబు సప్తమికి ప్రథమ :

''ఒక్కొకచో జడంబు సప్తమికిం బ్రథమయునగు''నని ఆచార్యులవారు 'తీర్థమాడి' త్యాదిగా నన్నపార్యాది కవుల ప్రయోగాల్ని ప్రదర్శించారు. (కారక ౨౦)

దీని కాధారం సర్వలక్షణసార సంగ్రహంలో ఈరీతిగావుంది:

"ఒనరఁ దృతీయకు సప్తమి
కిని యొక్కెడఁ బ్రథమ వచ్చుఁ గృతుల సుఖంబుం
డెను, చిచ్చురికె ననంగా
ఘన తరగోరాట్తురంగ కలుష విభంగా!" (I–66)

ఇందులోని రెండు లక్షణాలకు కాశీ ఖండ ప్రయోగాలే తిమ్మకవి ప్రదర్శించాడు. ఇందులో 'తృతీయకు ప్రథమ' రావటానికి చిన్నయ సూరి తన బాల వ్యాకరణంలో ఉదాహరించటం చేత[46] ఆచార్యుల వారా అంశాన్ని వదలి, సప్తమికి ప్రథమ రావటాన్నే పేర్కొని, భారతాదు లందుండి పదునాలుగు ప్రయోగాలు ధారాళంగా ఉద్ధరించారు.

20.0. విశేషణముల షష్ఠికి ప్రథమ

"ఒక్కచో సమాసాంతర్గత విశేష్యంబుల కగు విశేషణంబుల షష్ఠికిని ప్రథమ చూపట్టెడి" (కారక ౨౧) అను ఆచార్యులవారి లక్షణమునకు మూలము కవి సంశయ విచ్ఛేదము నందున్నది.

"అగునను క్రియతోఁ బాసియు
దగు పెక్కు విభక్తులం బ్రథమ చెందును భ
క్త గణ దయామాన చిత్తుం
డగజాధిపు కీర్తి దిశల నలమె ననంగన్."[47] (I–43)

"పార్థివ ప్రాగ్రసరుండు ధర్మసుత పన్పిది" అను శంభుదాసుని భారత ప్రయోగం ఈ లక్షణ గ్రంథంలో వున్నది. కాని యిందులో ఏకదేశాన్వయం పేర్కొనఁబడలేదు.

21.0. అలఘు రేఫము లఘు రేఫమగుట :

"అలఘురేఫము లుప్తాచ్క మగుచో లఘురేఫంబగు" – 'ఆపదకోర్చి' అను ఆచార్యులవారి సూత్రమున కాధారము సర్వలక్షణ సార సంగ్రహమునం దిట్లున్నది :

"అరయ గురురేఫ హల్లుతో బెరసినపుడు
ప్రాసముల విశ్రమములు రేఫములతోడ
గలసి యుండును సుకవి పుంగవుల కృతుల" (III–243)

'మూర్వురు'అనే ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణ ప్రయోగం, 'కార్చిచ్చు' అనే తిక్కయజ్వ ప్రయోగం, యింక అనేక భారత ప్రయోగాలు ప్రదర్శితం

22.0. పై రీతిని తెలుగు పద్యాల్లో రచింపబడ్డ లక్షణ గ్రంథాల నుండేకాక సంస్కృతంలో రచింపబడ్డ వికృతి వివేకంలోని కారికల కనువాద ప్రాయమైన సూత్రాలు త్రిలిఙ్గ లక్షణ శేషంలో చాలా వున్నాయి. వ్యాఖ్యానాలేవీ నిరూపించని ఈ క్రింది వాటిని పరిశీలించవచ్చు.

22.1. "కాంతి శబ్దాది శబ్దాస్తు ద్విరుక్తాస్సంతినేకకే
సాధారణాస్తు దన్యేచ, విచిత్ర్యం భూరివర్తతే"
(అజన్త ౬౫)

నిగనిగ, తళతళ వంటి కాంత్యాది శబ్దాలు ద్విరుక్త మౌతాయని, కొన్ని శబ్దాలకు ద్విరుక్తి లేదనే లక్షణం ఉన్నా "ధ్వన్యనుకరణ శబ్దంబులు ద్విరుక్తంబులయగు"నని అవధారణార్థకం వాడటం (సంధి ౨౦) సరికాదు.

22.2. "పూజ్యత్వేన ద్రుతః కారుః భేదకంతూ
భయాత్మికమ్
తచ్ఛబ్ద స్స్యాద్బహుత్వే స్యాత్తథా తత్ర ద్రుత
స్థితిః" (వి. వి. అజన్త. 72)

అను కారికను బురస్కరించుకొనియే ఆచార్యులవారు పూజ్యతయందు 'గారు' 'వారు' శబ్దములను నిర్ణయించెను. (శబ్ద. ౩౯నుండి ౪౧)

22.3. నిత్యైక వచనాంతములు –
నిత్యబహువచనాంతములు :

"ఏకత్వే సస్యవాచిత్వం, బహుత్వేధ్యాన వాచితా
లోపాదేశ వికారస్తు తత్ర తత్ర ప్రదృశ్యతే"
(వి. వి. అజన్త. ౬౭)

22.4. బిరుదాద్యుత్తర పదములు :

"కర్మధారయంబు బిరుదా ద్యుత్తర పదంబయ్యేనేని, ద్వ్యక్షరాదంత స్త్రీ పుం సంజ్ఞావాచకంబగు పూర్వ పదంబు నంత్యాక్షరంబున కంతట దీర్ఘంబు బహుళంబుగానగు" (సమాస. ౨)

"ఇటఁబూర్వపదంబు నత్వంబున కిత్వంబు బహుళంబు గానగు" (సమా. ౩)

"కొన్ని యెడల నిచ్చో ననాపామా యాగమంబులగు" (సమా. ౪)

"ద్వ్యక్షరాది చతుర్వర్ణ పర్యంతం జననామసు
లోపే స్యాద్యది వర్ణానాం శబ్దే రాజాదికే పరే
క్వచిదత్వం, క్వచిచ్చాత్వం, క్వచిదిత్వం క్వచిత్వతా
క్వచిన్మత్వం యథాయోగ మన్యచ్చ వ్యవహారతః"
(వి వి. అజన్త. ౧౧౮, ౧౧౯)

23.0. ఇట్లు సంస్కృతాంధ్ర భాషా విరచితమైన లక్షణ గ్రంథాలనుండేకాక 'సాహిత్య దర్పణము'నే సంస్కృతాలంకార శాస్త్ర గ్రంథాల్లోని కారికల్ని గూడా అనువదించి, అపూర్వ లక్షణంగా తమ త్రిలిఙ్గ లక్షణ శేషంలో చేర్చుకొన్నారు

న్యాయానికి అలంకార శాస్త్ర విషయానికి, వ్యాకరణశాస్త్ర విషయానికి సంబంధంలేదు. ఒకటి అర్థప్రధానమైంది. ఒకటి శబ్ద ప్రధానమైంది. వాక్యపద నిర్వచనాలు ఆర్థిక సంబంధమైన వాటినే తమ వ్యాకరణంలో చేర్చటం సముచితం అనిపించు కోదు.

23.1. 'వాక్యం స్యాద్యోగ్యతా కాంక్షాసత్తి యుక్తః పదోచ్చయః" అనే సాహిత్య దర్పణ కారికనే (II–1) అచ్చార్యుల

వారు "వాక్యమునా యోగ్యతా కాంక్షా సహితంబగు నర్థముగల యాసత్తి యుక్త పదసముదాయంబ" ని యనువదించారు. ఇందులో "కాంక్షా సహితం" అంటే 'అసహితం' అనే అర్థాంతరం కూడా స్ఫురించవచ్చు.

23. 2. "పదమనఁగాఁ బ్రయోగార్హాంబు ననన్వితంబు, నేకంబు నర్థబోధకంబునైన వర్ణము లేక వర్ణసముదాయము" (వాక్య. ౩) అనే సూత్రం సాహిత్య దర్పణంలోని (II–3) ఈ క్రింది కారిక కెంత సన్నిహితమో పరిశీలించేది :

"వర్ణాః పదం ప్రయోగార్హానన్వితైకార్థ బోధకాః"

23. 3 "వాక్యోచ్చయో మహావాక్యమ్" 'యథా— రామాయణ మహాభారత రఘువంశాది" అను సాహిత్య దర్పణ (II–2) లక్షణాన్ని, దాని వివరణాన్ని ఆచార్యులవారిట్లు పుణికి పుచ్చుకొన్నారు· "వాక్య సముదాయము మహావాక్యము నాఁబడు. అయ్యది రామాయణాదికము" (వాక్య. ౮).

24. 0. ఈ అన్వేషణం ఆధారంగా "త్రిలిఙ్గ లక్షణ శేషమ"నే పేరు సార్థకం కాదని నిరూపించవచ్చు. అయితే ఆచార్యుల వారు అంత నిరర్థకంగా ఈ పేరు పెడతారా ? అనే ప్రశ్న పుట్టక మానదు. వారి దృష్టిలో 'త్రిలిఙ్గ లక్షణం' అంటే 'బాలవ్యాకరణ'మేమో ! తెలుగు కావ్యభాషకు సామాన్య లక్షణ గ్రంథం బాల వ్యాకరణం. తెలుగు కావ్యభాషలోఉన్న విశేషలక్షణ ప్రయోగా లాధారంగా విరచితమైన శేషగ్రంథం అనే అర్థం చెప్పకోవాలని ఆచార్యులవారి ఆశయమేమో ! అనిపిస్తుంది. అలా సూటిగా చెప్పటం వారి కిష్టంలేక మొత్తం త్రిలిఙ్గ లక్షణానికే శేష గ్రంథం అనే అభిప్రాయం కల్గించారు ఆచార్యులవారు. ఏమైనా ఎక్కడో మారుమూలవున్న లక్షణాల్ని వెలుగులోకి దెచ్చిన ఘనత ఆచార్యులవారికి దక్కుతుంది. తెలుగు కావ్య భాషా విశేష స్వభావం వారి వ్యాకరణం చదివితేనే అవగత మౌతుంది.

అధోజ్ఞాపికలు

1 "ఏ తద్వ్యాకర్త స్వయముగ ముద్రింపించిన తొలి కూర్పునఁగూడ మొదటి 'పుటలో దీనికి ప్రౌఢ వ్యాకరణము'నునది నామాంతరమని తెలుపఁబడినది." సుబోధినీ వ్యాఖ్యానము : బులుసు వేంకటరమణయ్య, వావిళ్లవారి ప్రచురణ: 1966 పుట 2.

2 "నిర్దేశ విధానోచ్చారణంబులం దఱచుగ 'అ' వర్ణాదులు కారప్రత్యయాంతములును; ర వర్ణ మిఫప్రత్యయాంతము నగు. (ప్రౌ. వ్యా. సంజ్ఞా. 2)

3 శ్రీ భాష్యకారాచార్య ప్రణీతం : పుట 3–4.

4 బా. వ్యా. తత్స. 32 సూ.

5 ఈ విషయాన్ని గిడుగు వారు గుర్తించి, యిలా పేర్కొన్నారు. "ఇ, ఈ, ఎ, ఏ లను గూడిన చ, జ లు తాలవ్యములు అంటే సిద్ధమైన పదములలోని చ, జ, ల పట్ల చెల్లవలెను గాని, సంధి వశమున వచ్చిన వాటికి చెల్లగూడదు. 'రాజిక్కడలేదు' (రాజు + ఇక్కడ) చుంచీ గదిలో ఉన్నది (చుంచు + ఈ) ఇటువంటి చోట్లగల చ జ లకు దంత్యోచ్చారణమే కాని తాలవ్యోచ్చారణము లేదుగదా !" [వావిళ్లవారి అప్పకవీయము (1934), శ్రీ గిడుగువారి పీఠిక: పుటలు 55, 56]

6 పాండు రాజీవ రమాధుర్యము (రామాయణార్థం)
పాండురాజు ఈ వరమాధుర్యము (భారతార్థం)
(రాఘ. III–56)
ధర్మరాజిత జయమహోత్సాహుడు (రామా.)
ధర్మరాజు. ఇత ,, (భార.)
(రాఘ. III–122)
ధర్మరాజిత రక్షమాపాల (రామా.)
ధర్మరాజు ఇతర క్షమాపాల (భార.) (రాఘ. III–253)
(శ్రీ గిడుగు వారి పీఠిక : పుటలు 55, 56)

7 అప్పకవీయం II–137.

8 తత్త్వబోధినీ వ్యాఖ్యానం ఈ విషయాన్ని ఈ ఉదాహృతితో సూచించింది. పుట : 8. (తొలి ముద్రణం)

9 ఆంధ్రభాషా వికాసము (ద్వి. ము.) పుట 212 (5)

10 వికృతి వివేకము – సంధి - ౬ కారిక.

11 సమాసోఽనఞ్పూర్వేక్త్వోల్యప్. (అష్టా. VII–1-37)

12 రమణీయము (ప్ర. ము.) పుట 196.

13 తత్త్వబోధినీ వ్యాఖ్య పుటలు 25, 26.

14 క. సం· వి. I–15.

15 అందే I–18.

16 అందే I–19.

17 అందే I–20.

18 "నక్త్వః" (క్త్వార్థమునకు సంధి లేదు) అని తన సూత్రాంధ్ర వ్యాకరణమున ముందు నిషేధించినను, కవి ప్రయోగ సరణి వివేచించి, ప్రాచ్యతను గమనించి "క్వాపి సవర్ణే దృశ్యతే" అని సవర్ణములగు తాలవ్యాచ్చులు పరమగు నపుడు క్త్వార్థకసంధి క్వాచిత్కముగా సాధువేయని సూత్రించి యున్నాడు. (రమణీ. పుట 197)

19 రమణీ. పుట 197.

20 తిక్కన, నాచన సోమనల ప్రయోగాలు ప్రామాణికాలని ఆచార్యులవారి భావం. తిక్కన 'అందిమ్మ' అనేది శబ్ద పల్లవం అని, 'వెఱచిట్లు' అనే సోమన ప్రయోగం 'వెఱ నిట్ల'ని సంస్కరించ వచ్చునని, తక్కినవి ప్రమాణాలు కావని, ఈ సంధ నిషేధాన్ని సమర్థించే వారి వాదం.

21 బాలకవి శరణ్యం : (ద్వి. ము.) పుటలు 218–221.

22 కథలు గాథలు : పుట 68.

23 ఇందే పుటలు 296 297.

24 ఇందే పుట 365.

25 ప్రౌ. వ్యా. సంధి ౧.

26 వి. వి. సంధి ౪.

27 "అప్ప అయ్య అన్న, అరసవ్వ అమ్మక్క
ఆయి యనుపదంబు లదుకు సంధు
లుభయమునకుఁ జెల్లుచుండు నామాఖండ
వళులనంగ నూఁదఁబడకనైన. (అప్ప. III–221)

ఇందుకు ప్రదర్శితమైన 17 ప్రయోగాల్లో 9 స్వర ప్రాధాన్యానికి, 8 వ్యంజన ప్రాధాన్యానికి చెందినవి. 'ఆయి' అనేది శ్రేష్ఠతా వాచకం కాదు. ఆప్యాయతకు, మైత్రికి చెందింది.

అనంతుని ఛందస్సులోకూడా (I-120) ఈ యతి సూచితం. దీన్ని విస్తరించాడు అప్పన్న. అందుచేతనే అనుకొంటాను, ఆచార్యులవారు ఈ లక్షణానికి పూర్వకవి ప్రయోగాలు ప్రదర్శించలేదు. లక్ష్యాలిచ్చి వూరుకొన్నాడు.

'అమ్మ, అయ్య' మున్నగునవి శ్రేష్ఠతా వాచకాలని సంధిపరిచ్ఛేదంలో చెప్పి, సమాస పరిచ్ఛేదంలో 'అనాపామాయాగములు' అని వీనిని నిర్దేశించటం (౪ సూ.) వీనికి ద్విత్వాన్ని విధించటం (౫ సూ.) వింత ధోరణి అనిపిస్తుంది.

28 బాల సరస్వతీయను - కాకినాడ ఆంధ్రసారస్వత ప్రచురణ పుట : ౧౮.

29 "ధైర్య యుక్తి కిన్నరుదుగ" అనే నన్నయ ప్రయోగం. దీన్ని "ధైర్యవృత్తి కష్టరుదుగ" అనే సంస్కారపాఠం. 'అష్ట' అనే పదాన్ని నన్నయ 12 పర్యాయాలు ప్రయోగించినట్లు నన్నయ పదప్రయోగ సూచిక.

30 కస్తూరి రంగకవి కృతం : IV-6 స.

31 "ఎందిని యన్నేటి తరంగలన్" "ఎన్నడున్నేని మోఘము గాదు" అనేవి ఆదిపర్వంలోనివి. "ధైర్యశక్తి కిన్నరుదుగ" అనే ఆరణ్యపర్వ ప్రయోగం కవిజన సంజీవనిలో ఇవ్వబడిందే.

32 తత్త్వబోధినీ వ్యాఖ్య : పుట 27.

33 ద్రావిడ భాషలన్నింటిలోనీ రీతిగా ఏక హ్రస్వపూర్వకమైన పొల్లు హల్లుకు అచ్చు పరమైతే ద్విత్వం వస్తుంది :

పొణ్ + ఆస → పొణ్ణాస

(త) మణ్ + అకల్ → మణ్ణకల్

(క) పుల్ + ఇల్లం → పుల్లిల్ల

34 'పూఁదోఁట'అని సరళంగా శ్రుతమయ్యే రూపం సిద్ధించదు.

35 బా. వ్యా. సంధి. 25.

36 స. సా. పం. I-125.

37 ఇందే I–126.

38 కమ్మని లతాంతముల కుమ్మొనసి (భార.ఆది. V–137)

39 వృష్టిఁజేసె మ్మహానది (భార. ఆర. III–113) స. సా. సం. I–95,97 రుక్మాంగద చరిత్ర ప్రయోగం కూడా వుంది.

40 వి. వి. సంధి 12.

41 అహో. పుటలు 244, 245 (హైదరాబాద్ ప్రతి)

42 కవిజనమండన టీక – పుట 31 (1955 ముద్రణం)

43 ఇమ్ముగ సర్వలోక జను...లోకవ
ద్యుంబరముం।బరాశర సుతుం బ్రణమిల్లి కరంబు భక్తితోన్.
(భార. ఆది. I-77)

బిందు పూర్వక బకారప్రాస అయితే 'ఇంబుగ' అనే రూపం చేసుకోవాలి. సూ. వి. లో 'ఇంబుగ' అనే ప్రారంభమైంది. 'మునీంద్రలోక వంద్యుం బరమున్' అనటమే సమీచీనం. పరాశర సుతుడ్ని 'ముని' అని పేర్కొనటం అనవసరం.

44 బా. వ్యా. తత్సమ. 38.

45 ప్రౌ. వ్యా. కారక. 2. ఇందు కొకేయొక ప్రయోగం హరివంశంనుండి ఉద్ధృతం. దీన్నిబట్టి లోపమే ఎక్కువగా సంభవమని భావించవచ్చు.

46 "ఒకానొకచో నొక విభక్తికి మఱియొక విభక్తియునగు" బా. వ్యా. కారక. 21 : వారు సుఖమున్నారు– సుఖముతో నని యర్థము.

47 బా. వ్యా. నందు 'భవత్యర్థకముల' ప్రయోగం మాత్రమే సూచింపబడింది కాని వానికి లోపాన్ని నిర్దేశించలేదు.

గ్రీష్మతాపం

శ్రీ కలువకొలను సదానంద

ఏడుపు
ఎప్పుడు మొదలెట్టానో ఎరుగను కానీ,
ఏడుస్తున్నందుకు కారణాలేమిటో
ఆలోచించటం మొదలెట్టిన క్షణంనుంచీ
అవలోకిస్తున్నా —
ఆనాటినుంచీ
ఎండ
తీక్షణంగానేవుంది
కాగిన సీసాపెంకులా,
కాముక రాక్షస ప్రౌఢాంగన చూపులా !

'పిసినిగొట్టులా నవ్వుతూ
తేలిపోతున్న జలదమా !
అంత పెన్నిధి నీకెందుకు ?
నా ముంగిట్లో దుమ్ము చల్లబడేలా
నాలుగు చినుకులు రాల్చవూ ?'
అన్న వేడికోలే
ఇన్నాళ్ళూ నాకు ఉచ్ఛ్వాసమూ, నిశ్వాసమూనూ !
అయితే,
పర్వతంలా బలిసిన జలోదరం
బధిరత్వాన్నే నటిస్తోంది !

ఈరోజేకాదు,
నా గుండెస్పందనను
ఖాతరు చెయ్యకుండా నడిచివెళ్ళి
గూడు చేరుకుని
గొళ్ళెం పెట్టుకుని
గురక పెడుతున్న దశాబ్దాల
పొట్టలో జీర్ణించిన రోజులన్నీ
ఈరోజు లాంటివే !

చూస్తున్నావుకదా —
కణకణలాడే ఎండకు జడిసి
దుకాణాలు
అందాల రాచపడుచులకు మల్లే
గోనెపట్టాలతో
ముఖాలకు ముసుగేసుకున్నాయి;
పైనున్న పంకా
అలుపు లేకుండా నర్తిస్తున్నా,
శీతల పానీయ సుందరి
అప్పుడప్పుడూ వొచ్చి
పెదాల్ని ముద్దెట్టుకుంటున్నా,
దుకాణాల చంకల్లో
బొజ్జ మడతల్లో
ఘర్మజల స్రావం ఆగటంలేదు.
బొచ్చె నాక్కున్న బిచ్చగాడు
పేవ్‌మెంట్‌పైన బెత్తెడు నీడలో
తోలుతిత్తిని పారేసి,
కళ్ళ వాకిళ్ళలోపల గొళ్ళెం పెట్టుకుని
బ్రహ్మానంద లోకాల్లో విహరిస్తున్నాడు.
అది వాడికి సుఖమనుకుంటున్నావా ?
కాదు !
గతించిన రోజుల్ని చరిచి అడుగు —
అవి పీనుగుల్లా లేచి చెబుతాయి,
'పేవ్‌మెంట్ మీద మకాం పెట్టిన వాడు
బ్రహ్మానంద లోకాలకు
ప్రయాణమై వెళ్ళిపోతున్నా' డని !

ఏదో ఒక మేఘం దయతలిచి
వాడి ముఖాన నాలుగు చినుకులు విదిల్చితే,
బొందిలోనే వాడికి బ్రహ్మానందం దొరకదూ ?

అయితే, అలాటి అద్భుతం
ఇంతవరకూ నేను చూడలేదు.
మేఘాలకు ఒళ్ళు బరువేకానీ,
గుండెలు తేలిక !
వర్షించని మేఘాల గుండెలలో
ఏముంటుంది, శూన్యంకాక !
అయినా, ఈ నిరంతర గ్రీష్మతాపంలో సైతం
ఆశ చావటంలేదు,

చచ్చిన తాచుపిల్ల
చితి మంటలో మెలికలు తిరిగినట్లు !
ఆగిపోతానంటున్న నా గుండెకు
తూగుటూయలవేసి ఊపుతున్నది
ఆ ఆశే !
అలసి సొలసి,
అడుగు కదపలేకున్న పథికుల
వెన్ను నిమరమంటున్నదీ ఆ ఆశే !
మండుటెండల బారినుండి
పిడికెడు గుండెను
పదిలంగా దాచుకోలేక,
వడదెబ్బల్ని ఎదుర్కొంటూ
రోడ్డున పడ్డ మనిషీ !
ఇప్పుడే ఇక్కడే
ఈడిగిల బడకు !
పిడుచగట్టుకుపోయిన
నీ నాలుకను
తడపటానికి —
దారిలో
ఎక్కడైనా ఓ చలివేంద్రం
ఎదురు పడకపోదు !
అక్కడ ఆగి
గుక్కెడు నీళ్ళు తాగితే,
కాళ్ళుసాచి
మరి నాలుగడుగులు వెయ్యొచ్చు !
నిన్ను మాడ్చి, మసిచేసిన రోజులన్నీ
నీచేత ఓడిపోయి గతంలోకి జారుకున్నాయి,
నిన్ను చంపలేక !
బొబ్బ లెక్కిన నీ కాళ్ళకు
మంచిగంధం రాచే చల్లనిరోజు ఒకటుంది —
రేపు !-!!
దశాబ్దాలు గడవనీ,
శతాబ్దాలు గడవనీ,
కనిపించేది మాత్రం
కనుచూపు మేరలోనే కదా !
ఆ రేపు అందిందా,
బ్రతుకంతా చల్లని అనుభవం !
అందకపోయిందా,
అడుగడుగునా వుందికదా
అంతకంటే చల్లని ఆశ ?

గరీయసి

శ్రీ గూడ శ్రీరాములు

ఆ ముళ్ల పొదల ఎడారి
  ఒయాసిస్సు ఖర్జూరపు చెట్టు
ఆతత తపన తాపం నుండి
ఆశ్రయానికి చోటులేదని
కసిగా విసిరి కొట్టినపుడు
జీవిత పుటల్లో కాగి
మరిగిన అనుభవాల
ఆవిర్లు కొన్ని
ఆకాశాన పేరుకున్న
వెతల దూది పింజలతో
కలిసి చెలిమి కట్టినపుడు
ఈ బీటల లోయలోంచి
బైటపడి
అనంత సముద్రాల
ఆగని మౌనరుతి
అర్థాల లోతుల్లో
ఇమిడిపోయి
ఇగిరిపోయి
తొలకరి తొలిజల్లులో
ఓ చినుకునై
వర్షించాలని ఉంది.

శ్రీ ఎ. కృష్ణారావు

అరిస్టాటిల్ రాజ్యాంగతా వాదము

రాజనీతి తత్త్వశాస్త్ర వేత్తలలో ప్లేటో మొదటివాడైతే అరిస్టాటిల్[1] రాజనీతి శాస్త్రవేత్తలలో ప్రథముడు. రాజకీయ సంస్థలను పరిశీలించి, విశ్లేషించి, వర్గీకరించి రాజనీతిని శాస్త్రంగా రూపొందించిన ఘనత అరిస్టాటిల్‌కే లభించినది. 158 సమకాలీన రాజ్యాంగ విధానాలను నిశితంగా అధ్యయనంచేసి అరిస్టాటిల్ "పాలిటిక్స్" (Politics) అనే గ్రంథాన్ని రచించాడు. ప్లేటో[2] ఆగమన పద్ధతిని అనుసరిస్తే అరిస్టాటిల్ నిగమన పద్ధతిని అనుసరించినాడు. అతడు తాను ప్రతిపాదించిన భావాన్ని రాజకీయానుభవంతో దానిసార్థకతను నిరూపించేవాడు. ప్లేటో ఆదర్శరాజ్యాన్ని రూపొందిస్తే అరిస్టాటిల్ రాజ్యాదర్శాలను చర్చిస్తాడు.

రాజ్యంయొక్క స్వభావము

అరిస్టాటిల్ రాజనీతిని ఒక సహజ శాస్త్రంగా రూపొందించినాడు. "పాలిటిక్స్"లో రాజకీయజీవితం స్వభావాన్ని ప్రధానంగా చర్చించినాడు.[3] రాజ్యము సహజమైనసంస్థ. దానిని ఏ ప్రజా సముదాయమూ ప్రత్యేకంగా ఒక ప్రయోజనసాధనకు ఒకానొక ప్రత్యేక కాలంలో రూపొందించలేదు.

స్వయం సంవృద్ధి గుణం రాజ్యాన్ని సహజమైన సంస్థగా ఏర్పరుస్తుంది: రాజ్యం సహజమైన సంస్థ అనే ప్రమేయంతో అరిస్టాటిల్ మానవస్వభావాన్ని చర్చిస్తాడు. రాజ్యము సజీవమైనసంస్థ. అందులోని అన్ని భాగాలు ఒక్కొక్క అవసరమైన కర్తవ్యాన్ని నిర్వహిస్తాయి. ఇదే దృక్పథాన్ని రాజ్యప్రజలను రక్షకులు, సైనికులు, శ్రామికులుఅని మూడు విభాగాలుగా విభజించి అవి మానవ శరీరంలోని మూడు కర్తవ్యాలను నిర్వహిస్తాయని ప్లేటో చెబుతాడు.

అరిస్టాటిల్ మానవుడిని 'సాంఘిక జీవి' అని నిర్వచిస్తాడు. రాజ్యము ప్రకృతి సిద్ధంగా ఏర్పడింది. అది వ్యక్తికి పూర్వమే జనించింది. మానవుడు సంఘంలో ఏ విధంగా జీవిస్తాడు ? అనే ప్రశ్న సిద్ధాంతపరంగా ముఖ్యమైనది. మానవుడి సాంఘిక స్వభావంలోఉన్న ప్రత్యేకత ఏమిటంటే అతడు సంభాషణ పరుడుకాక నైతిక జీవి కూడా. రాజకీయ జీవిగా అతని అవసరాలు వాటినుంచి జనిస్తాయి. రాజ్యంయొక్క కర్తవ్యం ఈ అవసరాలను తీర్చటం.

రాజ్యంలో రెండువర్గాల ప్రజలుంటారు. ఒకటి పాలకులు, రెండు పాలితులు. ఈ రెండు వర్గాలమధ్య సహజమైన సమైక్యత ఉండాలి. లేకపోతే ఈ రెండు వర్గాలూ జీవించటం కష్టము. తెలివితేటలు, దూరదృష్టి ఉన్నవారు రాజ్యపాలన వహిస్తారు. శారీరక శక్తి ఉన్నవాళ్ళు పాలక వర్గం నిర్దేశించినట్లు పని చేస్తారు. రాజకీయ వ్యవస్థను ప్రజలు రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనేటట్లు రూపొందించాలి. రాజ్య ధ్యేయాలు మితంగా, ఆచరణ యోగ్యంగా ఉండాలి. "రాజ్యం మానవుడి ప్రాథమికావసరాలను తీర్చటానికి ఏర్పడి, అతనికి ఉత్తమ జీవనాన్ని కల్పించటానికి కొనసాగుతుంది." నైతిక రంగంలో రాజ్యం నిర్లిప్తత వహించలేదు.

అరిస్టాటిల్ - ప్లేటో

అరిస్టాటిల్ సమకాలీన రాజ్యాలను పరిశీలించటంతో తన చర్చను ప్రారంభిస్తాడు. ప్లేటో ప్రతిపాదించిన ఆదర్శరాజ్యాన్ని అరిస్టాటిల్ విమర్శిస్తాడు. ప్లేటో సూచించిన కమ్యూనిజం పాలకులకు ఆస్తి, కుటుంబాలను నిషేధించటం — అరిస్టాటిల్ తీవ్ర విమర్శలకు గురైనాయి. ప్లేటో ధ్యేయాన్ని అరిస్టాటిల్ అంగీకరించినా అతడు సూచించిన పద్ధతులను ఆమోదించలేదు. సమష్టి యాజమాన్యము, సమష్టి కుటుంబము—సమష్టి అనర్థానికి దారి తీస్తాయని అరిస్టాటిల్ వ్యాఖ్యానిస్తాడు.

అరిస్టాటిల్ మేధావి కాకపోయినా, రాజకీయ విశ్లేషణలో వివేకాన్ని ప్రదర్శించాడు. గతం అందిచ్చిన అనుభవాన్ని మరచిపోరాదంటాడు. ఎంతో మంచివయితే, ఉపయోగకరమైన వయితే కాని సంస్థలు చాలాకాలం కొనసాగవు. అనుభవాన్ని పూర్తిగా విస్మరిస్తే ఏ సిద్ధాంతమైనా తార్కికంగా సరిగ్గా ఉన్నప్పటికీ వాస్తవంలో అందులో ఏదో ఒక దోషం ఉంటుంది.

ఆదర్శ రాజ్యం గురించి ప్లేటో, అరిస్టాటిల్ మధ్య ఒక ప్రధానమైన భేదం ఉన్నది. అరిస్టాటిల్ ఉత్తమ రాజ్యం ప్లేటో ప్రతిపాదించిన ద్వితీయ ఉత్తమ రాజ్యమే అవుతుంది. అందువల్ల ప్లేటో ఆదర్శ రాజ్యాన్ని అరిస్టాటిల్ అంగీకరించలేదు. కనీసం దానిని ఒక ఆదర్శంగానైనా తీసుకోలేదు. అరిస్టాటిల్ ఆదర్శం రాజ్యాంగబద్ధమైన పాలనకాని నిరంకుశ పాలన కాదు.[4] నిరంకుశ పాలన ఎంత విజ్ఞతాయుతమైనా అరిస్టాటిల్ దానిని అంగీకరించలేదు.

చట్టంయొక్క ఆధిక్యత

ప్లేటో "ది లాస్"లో ప్రతిపాదించిన చట్టబద్ధమైన రాజ్యాన్ని – అంటే – ఉత్తమ రాజ్యంలో చట్టానికి సార్వభౌమాధి

కారం ఉంటుంది కానీ వ్యక్తికి కాదు అనే ప్రతిపాదనను అరిస్టాటిల్ అంగీకరించినాడు. చట్టం మానవ బలహీనతలకు సదుపాయంగా అరిస్టాటిల్ భావించలేదు. చట్టం ఉత్తమ ప్రభుత్వంలో అంతర్భాగము. అందువల్ల అది ఆదర్శ రాజ్యంలో ప్రధాన భాగం అవుతుంది. చట్టం పాలకులకు పాలితులకు మధ్య సంబంధాలను స్వేచ్ఛాయుత ప్రజలమధ్య సంబంధాలుగా నైతిక సమానత్వాన్ని ఏర్పరుస్తుంది.

రాజ్యాంగబద్ధమైన పాలన

రాజ్యాంగబద్ధమైన పాలన అనేది రాజ్యాన్ని మంచి పరిపాలకులు పరిపాలించాలా, లేదా మంచి చట్టాల ద్వారా పాలన జరగాలా అనే అంశాన్ని కూడా చర్చనీయాంశంగా చేస్తుంది. ఎందుకనగా మంచి ప్రభుత్వం చట్టానికి బద్ధమైనది అందువల్ల అరిస్టాటిల్ మంచి రాజ్యంలో చట్టానికి ఆధిక్యత ఉండాలని భావించాడు ఆదర్శ రాజ్యానికి ప్రత్యామ్నాయం ప్లేటో చట్టబద్ధమైన రాజ్యాన్ని ప్రతిపాదించాడు.[5] అరిస్టాటిల్ తాత్త్విక ప్రభువుల పాలన చట్టబద్ధమైన పాలనకు ప్రత్యామ్నాయం కాలేదని భావించాడు. ఎందుకంటే ఎంత తాత్త్విక ప్రభువైనా చట్టం అంత నిష్పక్షపాతంగా పరిపాలన చేయలేడు. అంతేకాక చట్టానికున్న ఆమోదం వ్యక్తిపాలనకు లభించదు. చట్టము హేతుబద్ధమైనది; అన్ని తాత్కాలిక ప్రయోజనాలకూ అతీతమైనది. నిష్పక్షపాతమైన చట్టము అధికారి స్థానాన్ని ఆక్రమించదు కాని అతని అధికారాన్ని చట్టబద్ధం చేస్తుంది. అధికారి అధికారానికి నైతిక విలువ నిస్తుంది.

రాజ్యాంగబద్ధమైనపాలన పాలితుని గౌరవానికి తగినట్లుంది. నిరంకుశపాలన ఆ విధంగా ఉండదు. రాజ్యాంగబద్ధమైన పాలకుడు ప్రజలను వారి అనుమతితో పరిపాలిస్తాడు. రాజ్యాంగపాలన ప్రజల ఆమోదంపై ఏర్పడుతుంది. ఇది నియంత పాలనకంటే భిన్నంగా ఉంటుంది.

అరిస్టాటిల్ ప్రతిపాదించిన రాజ్యాంగ పాలన లక్షణాలు మూడు. అవి :

1. పరిపాలన ప్రజల శ్రేయస్సుకు ఉద్దేశించబడింది. దాని లక్ష్యం ఒక వర్గం ప్రయోజనాలను సాధించటం కాదు; లేదా ఒక వ్యక్తి ప్రయోజనానికి పరిమితం కాదు.

2. రాజ్యాంగ పాలన ఉద్దేశం ప్రభుత్వాన్ని ముందుగా అంగీకరించిన కొన్ని నియమ నిబంధనలను అనుసరించేటట్లు చేయటం. వ్యక్తిగత నిర్ణయాల ప్రకారం, నిర్హేతుకమైన ఆజ్ఞలననుసరించి ప్రభుత్వం పనిచేయరాదు. ప్రభుత్వం సంప్రదాయాలను, వాడుకలను, ఆచారాలను, కట్టుబాట్లను విస్మరించరాదు. రాజ్యాంగ విధానానికి వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరించరాదు.

3. రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వం అంటే ప్రజలామోదించిన ప్రభుత్వం. ఇది బలప్రయోగం ద్వారా, నినాదాల ద్వారా, ప్రచారం ద్వారా కొనసాగే నిరంకుశ పాలనకంటే భిన్నమైనది.

అయితే అరిస్టాటిల్ రాజ్యాంగపాలన గురించి వివరంగా చెప్పలేదు, ఖచ్చితంగా నిర్వచించలేదు. పైన వివరించిన మూడు లక్షణాలు, వాటి మధ్య సంబంధాలను వివరంగా చర్చించలేదు. ఎందుకంటే క్రూర ప్రభువు ప్రజా శ్రేయస్సు దృష్ట్యా నిరంకుశంగా వ్యవహరించవచ్చు. లేదా చట్టబద్ధమైన ప్రభుత్వం ఒక వర్గం కంటె మరొక వర్గాన్ని అధికంగా ప్రోత్సహించవచ్చు; లేదా మేలు చేయవచ్చు.

అరిస్టాటిల్ ఉద్దేశంలో "చట్టము" తాత్కాలికమైన ఏర్పాటు కాదు నైతిక, నాగరిక జీవనానికి అది అత్యవసరము. "మానవుడు పరిపూర్ణుడైతే అతడు జంతువులలో ఉత్తముడు; చట్టం నుంచి, ధర్మం నుంచి అతనిని వేరుచేస్తే అతడు పశువు కన్నా హీనంగా ఉంటాడు." అని అరిస్టాటిల్ "పాలిటిక్స్" గ్రంథానికి వ్రాసిన ఉపోద్ఘాతంలో వివరించాడు. మానవుని అనుభవము, మేధస్సు క్రమంగా పెరిగి సాంఘిక సంస్థలను అవగాహన చేసుకొంటేనే కాని చట్టానికి, సంప్రదాయానికి ఇంత ప్రాముఖ్యం ఉండదు. గత కాలపు విజ్ఞానం వాడుక రూపంలో ఉంటుంది. దానిని గ్రహించి చట్టబద్ధం చేసుకోవాలి. దానికి ప్రజాభిప్రాయం కూడా అవసరమవుతుంది.

చట్టము ప్రజల సాముదాయిక మేధస్సుకు ప్రాతినిధ్యం వహిస్తుంది.[6] అందువల్ల చట్టము మేధావి అయిన పాలకుడి ఆజ్ఞకంటె అత్యున్నతమైనది. రాజకీయ జ్ఞాని హేతువాదం సాముదాయిక విజ్ఞానాన్ని ప్రతిబింబించే చట్టం నుంచి వేరుకారాదు.

ప్రభుత్వం వర్గీకరణ

అరిస్టాటిల్ ప్రభుత్వాలను గణాత్మకంగానూ, గుణాత్మకంగానూ ఆరు రకాలుగా వర్గీకరించాడు. అవి రాజరికము, శ్రేష్ఠజనుల పాలన **(Aristocracy)**, పాలిటీ **(Polity)**, క్రూరపాలన **(Tyranny)**, అల్పజన పాలన **(Oligarchy)**, ప్రజాస్వామ్యము. ఇందులో మొదటి మూడూ చట్టబద్ధమైనవి, చివరి మూడూవాటి వికృత రూపాలు.

చట్టబద్ధమైన ప్రభుత్వా	వాటి వికృత రూపాలు
రాజరికము	క్రూర ప్రభుత్వము
శ్రేష్ఠజనుల పాలన	అల్పజన పాలన
పాలిటీ	ప్రజాస్వామ్యము

అరిస్టాటిల్ ప్రభుత్వాలను స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించాడు. అవి: అధికారాన్ని నిర్వహించేవారి సంఖ్యనుబట్టి ఏర్పడినవి. వాటిలో రాజరికము — ఒక వ్యక్తి పాలన లేదా ఏకస్వామ్యము,

శ్రేష్ఠజనుల పాలన—కొద్దిమంది పాలన, పాలిటీ—అధిక సంఖ్యాకుల పాలన. రాజరికము, శ్రేష్ఠజనులపాలన, పాలిటీ—వీటిలో అధికారం మొత్తం ప్రజల శ్రేయస్సుకై వినియోగించటం జరుగుతుంది. అధికారాన్ని స్వప్రయోజనాలకోసం వినియోగించినప్పుడు రాజరికను క్రూరపాలన, శ్రేష్ఠజనుల పాలన, అల్పజన పాలన, పాలిటీ ప్రజాస్వామ్యం అవుతాయి.

రాజ్యాధికారం నిర్వహించే వారి సంఖ్య ఆ రాజ్యంలోని వర్గాలను సూచిస్తుంది. వివిధ రాజకీయ వ్యవస్థలలో ఈ సంఖ్య వివిధంగా ఉంటుంది. వర్గ ప్రాతిపదికే రాజకీయ వ్యవస్థకు మూలము. ప్రభుత్వాలను వాటిని నిర్వహించేవారి సంఖ్యనుబట్టి వర్గీకరించటం కేవలం యాంత్రికమైన పని అవుతుంది. శ్రేష్ఠజనుల పాలన, అల్పజన పాలన — ఈ రెండిటిలో అధికారం వహించేవారు కొద్దిమంది మాత్రమే. శ్రేష్ఠజన పాలనలో గుణవంతులు, అల్పజన పాలనలో ధనవంతులు అధికారాన్ని చేబడతారు. ఈ రెండూ కూడా కొద్దిమంది అధికారం వహించే ప్రభుత్వాలే. ఎందుకంటే ఏ సమాజంలోనైనా గుణవంతులు, ధనవంతులు కొద్దిమందే ఉంటారు.

గుణాత్మకంగా మంచి ప్రభుత్వాలు, చెడ్డ ప్రభుత్వాలు అన్న అరిస్టాటిల్ వర్గీకరణ స్పష్టంగా లేదు. ప్రజా క్షేమాన్ని గురించిన ప్రభుత్వాలు మంచివి. విస్మరించి స్వప్రయోజనం కోసం పనిచేసే ప్రభుత్వాలు చెడ్డవన్న వర్గీకరణ కొన్ని సమస్యలను కల్పిస్తుంది. ''ధర్మము''అనే అంశాన్ని ప్రభుత్వ స్వభావంలో చేర్చటం వల్ల శాస్త్రీయ వర్గీకరణ దెబ్బతింటుంది.

అల్పజన పాలన - ప్రజాస్వామ్యము

ఆరు ప్రభుత్వాలలో అరిస్టాటిల్ అల్పజన పాలనకు, ప్రజాస్వామ్యానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాడు. ఈ రెండూ ఉత్తమ ప్రభుత్వాల వికృత రూపాలైనా రాజనీతి శాస్త్రవేత్తగా ఆచరణలో ఉన్న రాజకీయ సంస్థలను పరిశీలించి విశ్లేషించటానికి ప్రయత్నించాడు. వీటిని పరిశీలించటంవల్ల తెలిసినదేమిటంటే మానవులు తమకు ప్రత్యక్షంగా లాభాన్ని కల్పించే ప్రభుత్వాన్నే అంగీకరిస్తారు; శిరసావహిస్తారు. వ్యవస్థలుకూడా వాటిని నిర్వహించేవారి ప్రయోజనాలు, ఉద్దేశాలు. వారు అధికారాన్ని ఏ విధంగా చేజిక్కించుకొన్నవో తెలుపుతాయి. అయితే ఆచరణలోఉన్న వ్యవస్థలు మంచివి కావని అరిస్టాటిల్ అనలేదు.

ప్రజా స్వామ్యానికి, అల్పజన పాలనకు ఉన్నతేడా ఏమిటంటే ప్రజాస్వామ్యంలో అధిక సంఖ్యాకుల ప్రయోజనం, అల్పజన పాలనలు అల్పసంఖ్యాకుల ఆసక్తి ఎక్కువగ ఉంటాయి ప్రజాస్వామ్యం అధిక సంఖ్యాకుల ప్రభుత్వం అయినప్పటికీ అల్ప సంఖ్యాక వర్గానికి తగిన

ప్రాతినిధ్యం ఇవ్వదు; వారి అభిప్రాయాలను మన్నించదు. గుణవంతులు ఈ ప్రభుత్వ వ్యవస్థలో పాల్గొనటానికి అవకాశం ఉండదు. అల్పజన పాలన కూడా అనేక నియమ నిబంధాలను రూపొందించి అశేష ప్రజానీకాన్ని రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనటానికి రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనటానికి అనర్హులుగా చేస్తుంది. ఆస్తి హక్కు పౌరులకే పరిమితం అవుతుంది. బానిసలకు పౌరత్వం ఉండదు. ఓటు హక్కు కొద్దిమందికే ఉంటుంది.

ప్రజాస్వామ్యంలో అందరికీ సమానత్వం ఉంటుంది. ధనవంతులు, నిరుపేదలు అన్న తేడా ఉండదు. గుణవంతులు, జ్ఞానులు, అజ్ఞానులు అందరూ సమానులు. ఈ ప్రజాస్వామ్యంలో తలలనే లెక్క పెడతారే కాని, అభిప్రాయానికి విలువ ఉండదు. అందువల్ల ప్రజాస్వామ్యం అల్ప సంఖ్యాకులకు, గుణవంతులకు, సంపద ఉన్నావారికి తావివ్వదు. అల్ప సంఖ్యాకులు, అధికసంఖ్యాకులు గంపినప్పుడు సమానత్వం అనే సూత్రం కింద అధిక సంఖ్యాకులనే ''రోడ్డురోలర్'' కింద అల్ప సంఖ్యాకులు నలిగిపోతారు. అజ్ఞానులు గుణవంతులపై ఘనవిజయం సాధిస్తారు.[7]

అయితే ప్రజాస్వామ్యము, అల్పజన పాలనకు ఉన్న వ్యత్యాసం అంత సులభం కాదు. ఎందుకంటే అల్పజన పాలన కూడా వాస్తవంలో అధిక సంఖ్యాకుల అభిప్రాయాన్ని తోసిరాజని ఎక్కువకాలం అధికారంలో మనలేదు. అదే విధంగా ప్రజాస్వామ్యంలో కొద్దిమంది నాయకులు ప్రజాదరణను సంపాదించి ప్రజాస్వామ్యాన్ని అల్పజన పాలనగా, క్రూర పాలనగా మార్చే ప్రమాదం లేకపోలేదు. 1975 నుంచి 1977 వరకు శ్రీమతి ఇందిరాగాంధి పాలన ఈ అంశాన్ని స్పష్టం చేస్తుంది.

సాంఘిక వ్యవస్థే రాజకీయ వ్యవస్థను, సంస్థలను రూపొందిస్తుంది. సాంఘిక వ్యవస్థ తీరు తెన్నులు, రాజకీయ సంస్థల కార్యకలాపాలను నిర్దేశిస్తాయి. సమాజం అల్పసంఖ్యాకులకు అనుకూలంగాఉంటే చట్టము, రాజకీయాలు ఆ సమాజంలోని ప్రబలమైన ధనికుల ప్రయోజనాలను ప్రతిబింబించే టట్లుంటాయి. చట్టము, ధర్మము — వాటిని గురించి చర్చించేటప్పుడు అరిస్టాటిల్ మరింత స్పష్టంగా వివరిస్తాడు. చాలామంది తత్త్వవేత్తలు చట్టము, ధర్మము అముక్తమైనవని, వాటికి స్వతంత్ర స్థితి ఉంటుందని, సమాజంనుంచి అవి స్వతంత్ర ప్రతిపత్తితో ఉంటాయని భావిస్తారని సమాజానికి అవి అతీతంగాఉండి, సమాజ జీవనానికి కావలసిన నియమ నిబంధనలను అవి చేకూరుస్తాయి.

అరిస్టాటిల్ సంస్కరణ వాదేకాని విప్లవవాదికాదు. హఠవాదాన్ని (Dogmatism) అతడు అంగీకరించలేదు కొన్ని సందర్భాలలో పరస్పర వ్యతిరేక భావాలను వెలిబుచ్చినాడేకానీ ఒకే ఆదర్శాన్ని చివరిదాకా నొక్కి వక్కాణించలేదు. అందువల్ల అతడు చట్టాన్ని, ధర్మాన్ని వర్గ ప్రయోజనాలను వ్యక్తంచేసే విధంగా ఉంటాయని ఒక సందర్భంలో అంటాడు. అల్పజన పాలనలో చట్టము, ధర్మము ధనికవర్గ ప్రయోజనాలను ప్రతిబింబిస్తాయి. ప్రజాస్వామ్యంలో పేదల ప్రయోజనాలను అవి సూచిస్తాయి. ప్రజాస్వామ్యంలో 'ధర్మము' అంటే సమానత్వము, అల్పజనపాలనలో అసమానత్వము. ఈ రెండు వ్యవస్థలలోనూ పాలకులు వాళ్ళు రూపొందించిన ధర్మము (Justice) చట్టబద్ధమైనదని అభిప్రాయపడుతారు. ఇది కొంత సందిగ్ధతకు దారితీస్తుంది. అల్పజన పాలనలో సంపదకు ప్రాముఖ్యం ఉంటుంది. సంపద ఉన్నవాళ్ళ ఆధిక్యత అందరిపై ఉంటుంది. ప్రజాస్వామ్యంలో సమానత్వము — ప్రజలు జన్మతః సమానులు—అనే భావం ప్రాతిపదిక. సమాజంలో వర్గాల ప్రాబల్యం బట్టి చట్టం వర్గప్రాబల్యాన్ని సూచిస్తుంది. ప్రతి పాలకుడు తాను నమ్మిన ధర్మాన్ని, తాను చెందిన వర్గాన్ని బలపరుస్తాడు. వాటికి అనుగుణంగా అధికారాన్ని చెలాయిస్తాడు.

రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యము

ప్రజాస్వామ్యం వికృత ప్రభుత్వమైనా సామాన్య మానవుని శక్తి యుక్తులను గురించి ఎన్ని సందేహాలున్నప్పటికీ అరిస్టాటిల్ రాజకీయాలలో సామాన్య ప్రజల భాగస్వామ్యం మంచిదని భావిస్తాడు. ''వంట పదార్థాల రుచి విందారగించేవారు చెప్పాలి, వంటచేసిన వాళ్ళు కాదు'' అంటాడు. సార్వభౌమాధికారం ఒక్కని చేతిలో ఉండేదానికంటే ప్రజలలో ఉండటం మంచిది. ప్రజాసార్వభౌమాధికారం అంటే కేవలం పరిపాలకులు ప్రజావసరాలను గ్రహించి బాధ్యతతో వ్యవహరించటంకాదు. ప్రజలు రాజకీయ కార్యకలాపాలలో ప్రోత్సాహంతో పాల్గొనాలి. సామాన్య ప్రజలకు తెలివి తేటలు, సామర్థ్యం ఉండవని అనటం తేలిక. అయితే ఈ సామాన్య ప్రజలందరూ కలిసి ఇచ్చే నిర్ణయాలు, తీర్పులు వారి సమష్టి మేధాశక్తికి దర్పణం వంటివి. వారి సమష్టి మేధాశక్తి ఒక పాలకుని విజ్ఞాతకంటే శ్రేష్ఠమైనది. దీని నాధారం చేసుకొనే నేటి ప్రజారాజ్యాలన్నీ ప్రజలకు సార్వజనీన ఓటుహక్కును ఇచ్చాయి.

రాజ్యంలో రాజకీయ సుస్థిరత ఉండాలంటే అధిక సంఖ్యాక ప్రజలకు రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనటానికి అవకాశాలు విరివిగా కల్పించాలి. వారిని రాజకీయాలకు దూరంచేస్తే వారిలో అసంతృప్తి పెరుగుతుంది. రాజ్య సుస్థిరత కది శ్రేయస్కరం కాదు.

ప్రజాస్వామ్యం రెండు రకాలుగా ఉంటుంది. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యం; రాజ్యాంగబద్ధంకాని ప్రజాస్వామ్యము. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం కొన్ని చట్టాలు, పరిమితులకు లోబడి వ్యవహరిస్తుంది. ఇందులో అల్ప సంఖ్యాక వర్గాలు, వారి హక్కులు పరరక్షింపబడుతాయి. రాజ్యాంగబద్ధం కాని మూక పాలన (Mobocracy) లో ఇటువంటి రక్షణ లుండవు.

రాజ్యాంగబద్ధంకాని ప్రజాస్వామ్యంలో పరిపాలకుల ఎవరుంటారు అన్న ప్రశ్నను అరిస్టాటిల్ చర్చిస్తాడు. ప్రజానాయకుడు సాధారణంగా ప్రజల భావాలను, ఉద్వేగాలను, ఆశలను ప్రతిబింబిస్తాడు. అధిక సంఖ్యాక ప్రజల భావాలను మూర్తీభవిస్తాడు.

ప్రజాభిమానాన్ని, ఆశలను ఆధారం చేసుకొని అధికారంలోకి వచ్చిన నాయకుడు కొన్ని విశేషాధికారాలను చెలాయిస్తాడు. మెజారిటీ ప్రజల నాకర్షించటానికి అనేక సాధ్యంకాని వాగ్దానాలను చేస్తాడు. "బీదరికాన్ని తొలగించాలి", "సామ్యవాదం వర్ధిల్లాలి", "నిరంతర విప్లవం కొనసాగాలి" మొదలైన భావాలన్నీ ఈ ప్రజానాయకుల నినాదాలే! ఈనాడు దాదాపు అమలులోఉన్న ప్రజారాజ్యాలన్నీ అరిస్టాటిల్ చెప్పిన ఈ కోవకు చెందినవే.

ప్రజా రాజ్యంలో అధిక సంఖ్యాకుల నిరంకుశత్వాన్ని అరికట్టటానికి ఏదో ఒక ప్రత్యామ్నాయం ఉండాలి. దానికి ఒక మార్గం ఏమిటంటే అధిక సంఖ్యాకులే ఒక విధంగా తమ పాలనపై నిగ్రహం ఉంచుకోవాలి. రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్యంలో అధిక సంఖ్యాకుల ప్రవర్తన చట్టబద్ధమై ఉంటుంది.

రాజ్యాంగతా వాదము

ప్రజాస్వామ్యంలో రాజ్యాంగము చాలా ముఖ్యమైన అంశము. రాజ్యాంగము పరిపాలకులను, అధిక సంఖ్యాకులను నియతం చేస్తుంది. పరిపాలకుల విచక్షణాధికారాలపై కూడా నియంత్రణ చేస్తుంది. అయితే చట్టం యొక్క ఆధిక్యతను ఏవిధంగా నెలకొల్పాలన్న విషయాన్ని, చట్టాన్ని ప్రజలు ఏవిధంగా గౌరవించాలన్నది అరిస్టాటిల్ వివరించలేదు.

సాంఘిక వ్యవస్థ అనేక పోటీ వర్గాలతో ఏర్పడి ఉంటుంది. ఈ వర్గాలు అధికారం కోసం పరస్పరం పోటీపడుతూంటాయి. అప్పుడు ఏ వర్గం అధికారాన్ని చేజిక్కించుకొంటుందో ఆ వర్గం తన ప్రయోజనాలను సాధించటానికి ప్రయత్నిస్తుంది. అయితే ఏ ఒక్క వర్గమూ మరొక వర్గంపై పూర్తిగా విజయాన్ని సాధించి పరిపాలన చేయలేదు. ముఠాలు రాజకీయ విజయాలను సాధించినా ఆ విజయాలు తాత్కాలికమైనవే. ఈ ముఠాల ప్రాబల్యాన్ని ఆధారం చేసుకొని ప్రభుత్వ విధానాలు తరచూ మారుతూంటాయి. దీని ననుసరించి ఎటువంటి ప్రజలకు ఎటువంటి రాజ్యాంగము సరిపోతుంది? అనే ప్రశ్నకు అరిస్టాటిల్ సమాధానం చెబుతాడు. అట్లాగే ఏ రాజ్యాంగము ఎటువంటి వ్యక్తులకు సరిపోతుంది? అనే ప్రశ్నకూడా పైదానికి అనుబంధితము

పై ప్రశ్నలకు సమాధానంకావాలంటే మనం మరొక ప్రాతిపదికతో చర్చ ప్రారంభించాలి. రాజ్యంలో రాజ్యాంగము కొనసాగాలన్న వారి సంఖ్య, అక్కరలేదనే వారి సంఖ్యకన్న ఎక్కువగానూ, బలీయమైనదిగానూ ఉండాలి. ఇక్కడ గుణము, సంఖ్య — ఈ రెండూ – రాజకీయ వ్యవస్థను రూపొందించటంలో తోడ్పడుతాయన్నది మనం జ్ఞాపకం ఉంచుకోవాలి.[8] గుణము అంటే పుట్టుక, సంపద, సంస్కృతి, సంస్కారము, ఉదాత్త, ఉదార భావాలు మొదలైనవి. సంఖ్య అంటే సంఖ్యాబలము గుణము ఒక భాగానికి, సంఖ్య మరొక భాగానికి ప్రాతినిధ్యం వహించవచ్చు. ఈ రెండూ కలసి రాజకీయ వ్యవస్థను రూపొందిస్తాయి. గుణాన్ని సంఖ్యాబలాన్ని సమతౌల్యం చేయటానికి మరొక అంశం అవసరము.

ప్రజాస్వామ్యం అన్ని వర్గాల సమ్మతిపై కొనసాగుతుంది. అంటే మెజారిటీ, మైనారిటీ వర్గాలకు సమానమైన విలువ లభిస్తుంది. అరిస్టాటిల్ అభిప్రాయంలో అన్ని సాంఘిక వర్గాల మధ్య సమ స్థితి ఏర్పడటం సాధ్యమవుతుంది. ఎందుకంటే అన్ని వర్గాలు రాజకీయాధికారాన్ని సంపాదించుకోటానికి తమ తమ వనరులను, బలాన్ని, అనుచరులను సమీకరిస్తాయి. ధనికవర్గం సంఖ్యాబలంలో అల్పసంఖ్యాకులైనా వారి సంపద అధికార సముపార్జనకు సాధనంగా ఉపయోగపడుతుంది. పేదలకు సంపద లేకపోయినా వారి సంఖ్యాబలం వారికి శ్రీరామరక్ష మిగతా వర్గాలకు సంపదకాని, సంఖ్యాబలంకాని లేకపోవచ్చు. వారిలో కొంతమంది కొన్ని సమస్యలను గురించి వెలిబుచ్చే అభిప్రాయాలు వాళ్ళకు కొంత హోదా, అధికారము కల్పిస్తాయి. వాళ్ళ వాళ్ళ ప్రయోజనాలను సాధించుకోటానికి ఈ వర్గాలన్నీ అనునిత్యం ప్రయత్నిస్తూంటాయి. ఇటువంటి ప్రజాస్వామిక ప్రాతిపదికనే రాజకీయాల సమతౌల్యము (Politics of balance) అంటారు.

రాజకీయాల సమతౌల్యం అధిక సంఖ్యాకవర్గాన్ని అదుపులో ఉంచుతుంది. అల్ప సంఖ్యాక వర్గం తన వనరు లన్నింటినీ సమీకరించి మెజారిటీ బలాన్ని నియంత్రణ చేస్తుంది. సంఖ్యాబలానికి విరుగుడుగా మైనారిటీ వర్గం పనిచేస్తుంది.

అరిస్టాటిల్ రాజకీయ సమతౌల్యం గురించి స్థూలంగానే చర్చిస్తాడు తప్ప వివరాల జోలికి పోలేదు రెండు వర్గాల ప్రయోజనాల మధ్య విపరీతమైన భేదాలుంటే సమతౌల్యం ఏర్పడటం కష్టము. అంతేకాక "ధర్మము" గురించి రెండు వర్గాల అభిప్రాయాలు ఒకరి విలువలను మరొకరు ఖండించేవి ఉండవచ్చు. ఈ కారణంవల్ల సాంఘిక నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించటానికి అరిస్టాటిల్ ప్రయత్నించాడు. దానికి ఎటువంటి ఆదర్శాలను ఆయన జోడించలేదు. రాజకీయ సంస్కరణలు ఆచరణ సాధ్యంగా ఉండాలి. లేకపోతే అవి సంస్కరణలు కాలేవు.

అరిస్టాటిల్ మితవాదము

అరిస్టాటిల్ మితవాది. అతడు ఆచరణ సాధ్యమైన భావాలనే రూపొందించాడు. సమస్యలను పరిష్కరించటంలో మధ్యేమార్గాన్ని లేదా మితవాద మార్గాన్ని అవలంబించినాడు. దీనిని అనుసరించే రాజ్యంలో ఏ రెండు ప్రబల వర్గాలకీ చెందని మధ్యతరగతి మరొకటి ఉంటుంది. ఈ వర్గం ధనిక పేద వర్గాల మధ్య సమతా స్థితిని నెలకొల్పుతుంది. రెండు ప్రబల వర్గాలమధ్య ప్రాబల్య సమతౌల్యాన్ని (Balance of power) ఏర్పాటు చేస్తుంది. అరిస్టాటిల్ మధ్యతరగతి ప్రజల సంఖ్య అధికంగా ఉన్న రాజ్యంలో రాజకీయ సుస్థిరత ఉంటుందని భావించాడు. అయితే ఆయన ఏ వర్గాన్నీ ఆదర్శ ప్రాయంగా తీసుకోలేదు. అతని ఉద్దేశము వర్గ

సంఘర్షణను తొలగించి అధికారాన్ని తగిన విధంగా పంపిణీ చేయటం. దానివల్ల సాంఘిక భద్రత, శాంతియుత వాతావరణం ఏర్పడుతాయి.

సంపద యాజమాన్యం రాజకీయ సిద్ధాంతంలో కేంద్రమైనది; కీలకమైనది. ప్లేటో దానిని రద్దు చేయాలని వాదించాడు. అరిస్టాటిల్ సంపదను సక్రమంగా పంపిణీ చేయాలంటాడు. రాజకీయ సుస్థిరతకు పరిమితమైన ఆస్తితో ఉన్న మధ్య తరగతి ప్రజల అవసరాన్ని రెండువేల ఐదువందల సంవత్సరాల క్రితమే అరిస్టాటిల్ గ్రహించాడు. ఈనాడు కూడా అదే అవసరం మనకు కలుగుచున్నది.

అధోజ్ఞాపికలు

1 అరిస్టాటిల్ ప్లేటో ప్రధాన శిష్యుడు. స్టాజిరా నగరంలో క్రీ.పూ. 384లో జన్మించాడు. ఇరవై సంవత్సరాలు ప్లేటో స్థాపించిన 'అకాడమీ'లో విద్య నభ్యసించినాడు. ప్లేటో మరణానంతరం ఏథెన్స్‌ను వదలి మాసిడోనియా నగరానికి వెళ్ళాడు. అక్కడ అలెగ్జాండర్‌కు విద్యా బోధకుడిగా పనిచేసాడు. చివరికి ఏథెన్స్ నగరానికి తిరిగి వచ్చి 'లైసీయమ్' అనే విద్యాలయాన్ని స్థాపించి విద్యా వ్యాసంగంలో కాలం గడపుచు క్రీ.పూ. 322లో పరమపదించినాడు.

2 ప్లేటో ''రిపబ్లిక్'' – వి. కృష్ణారావు, భారతి, జనవరి '79 చూడండి.

3 "Every State is a community of some kind and every community is established with a view to some good...; The state or political community, which is the highest of all, and which embraces all the rest aims, and in a greater degree than any other, at the highest good." (Book I of Politics by Aristotle).

"Hence it is evident that the state is the creation of nature and that man is by nature a political animal." (Ibid).

4 ప్లేటో ''రిపబ్లిక్''లో తాత్త్వికప్రభువుల నిరంకుశపాలనను ఉత్తమమైనదిగా భావించినాడు. పరిపాలకులు తత్త్వవేత్తలు కాబట్టి వారిని చట్టాల ద్వారా, ప్రజాభిప్రాయం ద్వారా పరిమితం చేయరాదని వాదించినాడు.

5 ''రిపబ్లిక్''లో చర్చించిన ఆదర్శ రాజ్యం ఆచరణ సాధ్యం కాదని భావించి, ప్లేటో ''ది లాస్'' అనే గ్రంథంలో చట్టాలకు ఆధిక్యతనిచ్చే రాజ్యాంగ సంవిధానాన్ని ప్రతిపాదించాడు.

6 "So a multitude is a better judge of many things than an individual" (Book III, Politics)

7 "But the advent of democracy weakens the power of minority groups; indeed, it may abolish it altogether. When elephants dance among chickens, the result is less a contest among equal parties and more a forcer dained victory of quantity over quality. – Andrew Hacker – POLITICAL THEORY: Philosophy, Ideology, Science.

8 అరిస్టాటిల్ తన ఉత్తమ రాజ్యాన్ని (పాలిటీ) చర్చించేటప్పుడు ఈ విషయాన్ని దీర్ఘంగా వివరిస్తాడు.



స్వేచ్ఛా స్పందనతో

శ్రీ మాదిరాజు రంగారావు

మేల్కొన్న ఉదయం ప్రాణి కళ్ళలో
    వెల్గేను బ్రతుకంతా యథార్థమై
లేవిప్పుడు నిజం దాచు నీడలూ
లోలోన నిదురై దువ్వు చీకటే.

మృదు హాసంతో వెలిగిన చాంద్రీ ధునులు
స్మృతి అంచుల్లోపల ప్రసరించేవిప్పుడు.
దిశలన్నీ స్నేహకళలు నింపే వెలుగు
ప్రియమే ! ఏ ఆకృతి కలదైనా ఎదకు.

నీరు ఉంది మంచులోనూ దాగి
దీని తీరు వేరు, అందం వేరు.
మైత్రిలోని ఆర్ద్ర రూపం వేరు
ప్రేమలో ప్రవాహకత్వం వేరు.

దూసికొని వ్రాలే రవికిరణాల ముందు
దీపశిఖ జాడే ఎవరికీ జ్ఞప్తిలేదు.
ఇప్పుడు మనం పోవేసిన దిక్కులన్నీ
నిల్చాయి రాగాంచిత హృదయాలు విప్పి.

ఎంత కాలంనుండో భవిష్యత్తు కోసం
వేచిచూచే ఆశాంచలాల్లో వికాసం !
ప్రాణిలో ఆరాటం, నవోత్సాహ రాగం
నింపుతూ శూన్యాన్నీ ఏదోకాంతితోనూ !

శిశువు కళ్ళు విప్పేప్పటికో
ఎదుట సర్వ శూన్యంమతికీ
శిశువు గుర్తుపట్టేప్పటికో
వివిధ వర్ణ సంధ్యాగగనం !

నిశలో చాలాభాగం నిదురలో కలలో !
ఉదయం ఐందే కానీ అవనిపై కదలే
తరలే ఎన్నెన్నో నీడలు పరంపరగా,
ఎదలోనూ బింబించేను భయరీతులతో.

పిడికిలినుండి విడివడింది ఆకాశం
అడుగుల చాటున ఒదిగింది భూగోళం !
స్మృతిని గతం జలధి గంభీరమై నిండే
తరగలుగా కథలు నటింపజేసేను !

అనుభవ సీమల్ని చుదుతూ
కదలికలో కాల శకలం !
హిమనగమై గాంగధునియై
స్మిత సుమమై ప్రాణభరమై.

నా కళ్ళు ప్రతిఫలించేను గగనం
ఈవేళ వెలుగుతో చిత్రమయమై !
చైతన్య కళలు నిండే పద పదం
ఈ సృష్టికి కలిగించేను విభవం !

ఆలోచనా విలోల తేజంతో
ఆకాశమై మనస్సు వాలింది.
భూభాగమై సమార్ద్ర రూపంతో
నిల్చింది సృష్టికోసమై శబ్దం !

ప్రతిభావన అందాలు నింపుకొని
ఒక ఆకృతి నిచ్చేను కల్పనకు.
ప్రతి రాగము వర్ణాలు కూర్చుకొని
ఎద అంచులు తాకేను ఆర్ద్రగతి !

(మిగతా 46 వ పేజీలో)

శ్రీ పెద్దాడ నారాయణశాస్త్రి

వ్యాసుడు : గ్రన్థచౌర్యమా!

నేను చిరకాలము నుండియు పురాణప్రవచనము గావించుచుందును. వాల్మీకములోని సుందరకాండ పారాయణ మొనర్చుట కూడ కలదు. ఒకపుడు భారతమందలి నలోపాఖ్యానము పురాణ ప్రవచనము గావించుచుండ సుందర కాండమున నాకుప స్థితి యందున్న నొక కొన్ని శ్లోకములు యథాతథములుగను, స్వల్ప భేదములతోను గోచరించెను, అందు ముఖ్యముగ హనుమంతుడు చూచిన సీత నుదేవుడు చూచిన దమయంతియు నొకే తీరుగ వర్ణింపబడిరి. వానిలో నొక కొన్నిటిని వ్రాయుచుంటిని. రామాయణ — భారతములలో నీ రీతిగ నుండెను:

రామా:— తాం సమీక్ష్య విశాలాక్షీం రాజపుత్రీ మనిందితాం
తర్కయామాస సీతేతి కారణై రుపపాదిభిః

భార:— తాం సమీక్ష్య విశాలాక్షీ మధికం మలినాం కృశాం
తర్కయా మాస భైమీతి కారణై రుప పాదయన్

రామా:— దుష్కరం కురుతే రామో హీనో యదనయా ప్రభుః
ధారయత్యాత్మనోదేహం న దుఃఖేనా వసీదతి.

భార:— దుష్కరం కురుతేఽత్యంతం హీనోయదనయానలః
ధారయత్మాత్మనోదేహం నశోకేనాపి సీదతి.

పై విషయముల గాంచి యచ్చెరువంది మతింత విమర్శనా దృష్టితో పరిశీలనకు గడంగితిని. చూడ జూడ నింకెన్నియో విషయములు పొడగట్టెను. యథాతథ శ్లోకములు—భావసామ్యత—పాత్రచిత్రణ—నాయికా నాయకుల సంయోగ - వియోగములు—సుఖ—దుఃఖములు - శత్రు—మిత్రులు - వనవాసము—పాతివ్రత్యప్రభావము — మొదలగు వ్యాస—రచనలు, వాల్మీకి రచనా వైశిష్ట్యమును తన నల చరిత్రలో చుట్టుత్రిప్పి చదువరులకు భ్రాంతి గొల్పునట్లుండెను. వేయేల; సారూప్య వైరూప్యములతో రామాయణము ననుకరించి వ్యాసుడు మించెనేగాని మరియొండుకానేరదు.

వాల్మీకి శ్రీమద్రామాయణమును త్రేతాయుగమున రచించెననియు, వ్యాసుడు ద్వాపరయుగావసాన కాలమున వేదవిభజన, అష్టాదశ పురాణ రచనలతో బాటు భారతేతిహాసము గూడ రచించెననియు గ్రంథములు తెలుపుచున్నవి. పురాణ వచనముల బట్టి యెన్నవ మహాయుగములోని త్రేతా — ద్వాపర యుగములలోని రామాయణ — భారతములు రచింపబడెనో వర్ణింపబడలేదు — ఇదియును గాక ''వ్యాస'' యనునది బిరుదనియు, వేర్వేరు వ్యక్తులు వ్యాసులై పురాణముల నిట్లే రచింతురని యుంటచే నెన్నవ వ్యాసుడొనర్చెనో యీ భారత మనునదియు వివాదాంశమే—వాసిష్ఠ రామాయణ మందలి వాక్యముల బట్టి నిప్పటికెన్నియో మారులు రామాయణ — భారతములు రచింపబడె ననుటచే నేరామాయణ — భారతములు ప్రస్తుతమున పఠింపబడుచుండెనో నిర్ణయింప జాలము—మరియొక విశేషమేమన ఉత్తర—దక్షిణాదిప్రతులు — లిపి భేదములు — పాఠాంతరములు—దీనిం బట్టి కూడ రామాయణ — భారత మూలగ్రంథ రచన లనూహ్యములు—పురాణములలో కల్పాంతర వృత్తాంతములు యుగాంతర వృత్తాంతములు, వచ్చిన గాథలు—పేర్లు మరల మరల వచ్చుచుండుటచే నాశ్చర్యమే గాక పఠితలకు శ్రోతలకు నసంబద్ధములనిపించును. అట్టితఱి భారత రామాయణముల నూతగగొని యీ వ్యాస రచనకు గడంగిన నా సాహసమును చదువరులు మన్నింతురు గాత !

వాల్మీకి రామాయణ సుందర కాండమున హనుమంతుడు శింశపా వృక్షము పైనుండి చూచుచుండ సీత వద్దకు రావణుడేగుదెంచి దుర్భాషలాడి వెడలును—పిదప రాక్షస స్త్రీలు బాధింపుచుండ వారితో సీత జవాబీరీతిగ నొసగెను—

దీనోవా రాజ్యహీనోవా యోమే భర్తా సమే గురుః
తం నిత్య మను రక్తాస్మి యథా సూర్యం సువర్చలా॥
... ...
నైషధం దమయంతీవ భైమీ పతి మనువ్రతా।
తథాహమిక్ష్వాకు వరం రామం పతి మనువ్రతా॥

దీనుడు కానీ, రాజ్యము లేనివాడు కానీ, నాభర్త యెవడో ఆతడే నాకు గురువు· సువర్చల సూర్యుని వలెనే నెల్లపుడు వానినే ప్రేమించెదను అని ప్రారంభించి పడతి యెంతటి దుర్దశలో నున్నను, దృఢమైన పాతివ్రత్యముతో నుండవలెనని యెందరు — పతివ్రతలనో దృష్టాంత మిచ్చి తాను కూడ అంతటి పతివ్రత ననునట్లుపన్యసింపుచు, సీత చివరగా నిట్లనెను— ''భీమసుతయైన దమయంతి నలమహారాజును, పతి ననుసరించుటయే వ్రతముగ్గా మెలగినట్లు, నేను ఇక్ష్వాకు వంశమునకు శ్రేష్ఠుడైన రాముని భర్తనుగా అనుసరించుట వ్రతముగా గలదాననై యున్నాను.''

ఈ సందర్భముగ నుదాహృతములగు వానిలో ''నైషధం దమయంతీవ భైమీ పతిమనువ్రతా'' అన్నచోట మాత్రమే పూర్ణోపమ కాననగుచున్నది. ఇట్లు + పమానోపమేయములు ఉపమా వాచకము, సమాన ధర్మము మిగిలిన వానియందు కానరావు.

వాల్మీకి, రామాయణమును రచించి కుశలవులచే సందందు గాన మొనరింపజేసి వెల్లడించుకొనెను—వ్యాసుడు స్వైతను ద్వాపర యుగావసానమున భారతమును రచించి శిష్యుల కొసగి వెల్లడించు కొనెను. అందరణ్య వాసమొనర్చెడి పాండవులకు బృహదశ్వ — మార్కండేయ మునులచే నలోపాఖ్యాన — రామోపాఖ్యానములను కథా సందర్భమున చెప్పించెను. ''కవికుల శిరోమణియగు కాళిదాసు,హనూను త్సందేశమును మనసున నుంచుకొని, మేఘ సందేశ రచన మొనరించె నేమో'' అని మల్లినాథసూరి తన వ్యాఖ్యానమున నూహించెను—అట్లే వ్యాసుడును రామాయణమును మనమున నిడుకొని నలచరితము వ్రాసెనేమోయని యనిపింపక మానదు—నలోపాఖ్యాన రచనా కాలమున వ్యాసుడు వాల్మీకమును స్మరించెనో, లేక అనుకరణము జేయనెంచెనో లేక వాల్మీకి కవితా శిల్పమును తనలో నిముడ్చుకొనెనేమో; ఎట్లైన నేమి వ్యాసుడు రామోపాఖ్యానము చెప్పుటకన్న ముందుగనే నల చరిత్రలో రామచరితను ధ్వనింప జేసినాడు.

రామచరిత్ర కంటె నలచరితను ముందే జరిగినదగుటచే ఆ నలచరితమును రామాయణముగా విపులీకరించి వాల్మీకి వ్రాసెనా, లేక వాల్మీకి యిచ్చిన దృష్టాంతమును వ్యాసుడు పెంపొందించెనా లేక రామాయణమును సంగ్రహముగ నలోపాఖ్యానమున నిముడ్చు కొనెనా యనునది సందేహాస్పదము- ఇక నలుని కాలము నిర్ణయించు టలో పంచాంగకర్తలన్నిటితో బాటు ''నలాబ్దాః'' అని కొట్లు కొలది సంవత్సరములు వ్రాయుచున్నంత మాత్రాన ''ఇదమిత్థమని'' ఏ కాలమునాటివాడో నిర్ణయింప వీలగుటలేదు — ఏది యెట్లైనను భారత రచనము కన్న రామాయణ రచనమే ముందని చెప్పవచ్చు.

వ్యాస వాల్మీకు లిరువురు మునిపుంగవులు, తపశ్శాలురు, స్వార్థరహితులు, త్రికాలవేత్తలు, ఉత్తమ రచయితలు, ధర్మమార్గ దర్శకులు, లోక కల్యాణ కారకులు అట్టి యెడ వేదవ్యాసుడు వాల్మీకి కవనమును గ్రన్థస్థ మొనరించుకొనుటలో నతనిపై యాదరమున శ్లోకములను, భావములను, పాత్ర చిత్రీకరణము లాది యాతని రచనా పటిష్ఠతను విడువక సంతరించుకొనెనేమో ! లేనిచో నష్టాదశ పురాణ రచయితయు, భారతేతిహాసకర్తయునగు నా సత్యవతీ సూనునకు గ్రన్థ చౌర్యము, అనుకరణములేల ? స్వతంత్ర రచనా శిలియగు నప్పారాశరి సారూప్య — వైరూప్యముల రామాయణమును నలచరిత్రలో సూచించుట తన పాండితికి పరాకాష్ఠయేమో ! లేనిచో నిరువది నాలుగువేల శ్లోకముల రామా యణ మెక్కడ? సహస్ర శ్లోక పరిమితమగు నలచరిత్ర మెక్కడ? ''కొండ యద్దముందు కొంచెమై యుండదా'' యన్నట్లు ప్రతి బింబింపజేసినాడు—రామోపాఖ్యానముకన్న ముందుగనే వ్యాసుడు తన పాండిత్య ప్రకర్షను వెల్లడించెను.

ఆధునికులు, భారత రచన తరువాత రామాయణ మనియు, కాదని కొందఱును వాదించుచున్నారు. శతకోటి ప్రవిస్తరమైన రామాయణము నుండి సకల పురాణములు బయలుదేరినవని కొంద అందురు. ఆ పురాణ పరిగణనలోనీ భారత రామాయణములకు తావేలేదు — భారత మితిహాసమనియు - రామాయణమాదికావ్య మనియు, పేర్కొందురు—కాలక్రమ భ్రమణమున ముందు వెనుకల భ్రాంతిని గల్గించుచుండును. ఎవ్వరేకాలమునాటి చరిత్రలను పల్కుటకైనను, అనుమాన ప్రమాణమే కాని ప్రత్యక్ష ప్రమాణ మేదియు దూరదర్శినివలె లేదు కదా !

వాల్మీకి - రాముడు

ఆసీత్ దశరథోనామ రథకుంజరవాజిమాన్
తస్యపుత్రః ప్రియోజ్యేష్ఠః తారాధిపనిభాననః

చతురంగ బలములు గల దశరథుడని ప్రసిద్ధికెక్కిన రాజుండెను. అతని పుత్రులలో పెద్దవాడు రాముడు. చంద్రబింబము వంటి మోము గల యాతడు [ధనుర్వేత్తలలో శ్రేష్ఠుడు. సకల ధర్మ రక్షకుడు—విశాల నేత్రములుగల్గి చూడ ముచ్చటైనవాడు.బ్రాహ్మణ ప్రియుడు. వేదవేదాంగ పారంగతుడు — సత్య — ధర్మముల నతిక్ర మింపడు. పట్టు విడుపులు గలిగి శిక్షణ — రక్షణ లొనర్చు చుండును.]

వ్యాసుడు - నలుడు

ఆసీత్ రాజా నలోనామ వీరసేన సుతోబలీ
ఉపపన్నో గుణైరిష్టైః రూపవాన్ అశ్వకోవిదః।

వీరసేన పుత్రుడును, నుత్కృష్ట గుణనిధియు, బలశాలియు, నగు నలుడను మహారాజు కలడు. అతడశ్వవిద్యా నిపుణుడు — రూపసి [బ్రాహ్మణ ప్రియుడు—వేద—వేదాంగముల దిట్ట — సత్య ధర్మము లతిక్రమింపడు మనువువలె రాజ్యపాలన మొనర్చును.] ఇట్లు.వ్యాస వాల్మీకు లిరువురు రూప—గుణ—పరాక్రమ -విద్యా- సత్య — ధర్మనిష్ఠలలో సామ్యముగల పుణ్య శ్లోకుల నెన్నుకొని రచనకు గడంగిరి. వాల్మీకి రామగుణముల బహుముఖముల జెప్పి నట్లే వ్యాసుడు కూడ నలుగుణముల నుద్ఘోషించెను.

హనుమ - రుద్రావతారము

శిలాద తనయోనంది శివస్యానుచరః ప్రియః
యోవైచైకాదశో రుద్రో హనుమాన్ స మహాకపిః॥

శిలాదపుత్రుడగు నందియను పేరుగల నొక యీశ్వర భక్తుడే, యేకాదశరుద్రాంశతో హనుమంతుడై జన్మించెను — కావుననే రామాయణమున హనుమంతుని రావణుడు చూచినపుడు ''నందీ సాక్షాదిహా గతః'' అని పలికెను. పుణ్య దంపతుల నొకచో చేర్చ హనుమను వాల్మీకి దూతగా జేసి కథాంతమున, కుపయోగించు కొనెను.

హంస - రుద్రావతారము

పూర్వ సత్కారరూపేణ మహాపుణ్యేన శంకరః
హంసరూపం విధాయైవ తాభ్యాం సుఖమదాత్ ప్రభుః

పూర్వము శివభక్తులగు భిల్ల దంపతులుండిరి. వారు నల దమయంతులై పుట్టిరి. యతినాథ శంకరుడు హంసావతారమెత్తెను. నల దమయంతుల పూర్వ సత్కారమున వారికి వివాహ మొనర్చెను—ఇందు వ్యాసుడు కూడ హంసేశ్వరావతారమును దూతగా జేసి ప్రథమముననే దంపతుల జతకూర్చెను.

స్వ యం వ ర ము

జనకుడు విశ్వామిత్రునితో ధనుస్సుజూపి యిట్లనెను — మహాత్మా మా వంశక్రమాగతమగు నీ శివధనుస్సును. దేవ గంధర్వ—రాక్షసాదులెవ్వరు—నెత్తజాలరు—విరువజాలరు — మనుజుల మాట చెప్పనేల ?

వీర్యశుల్కేతిమే కన్యాస్థాపితేయ మయోనిజా—
తేషాం వరయతాం కన్యాం సర్వేషాం పృథి వీక్షితాం
వీర్య శుల్కేతి భగవన్నదదామి సుతామహమ్—

మునీంద్రా ! అయోని సంభవయగు నీ సీతను వీర్యశుల్కగా నిశ్చయించి యింట పెంచుచుంటిని. ఎందరు రాజులేతెంచి 'యీమె నిమ్మని' కోరినను నిరాకరించుచుంటిని. వీరాగ్రేసరునికి మాత్ర మిచ్చెదను — ఇచట సీతా ప్రదానమువ వాల్మీకి వీర్యముకే ప్రాధాన్య మిచ్చెను.

దమయంతీ స్వయంవరము

''హంస దమయంతితో! ఓ భామినీ! మేము దేవలోకము సంచరింతుము నలుని వంటి రూపవంతు నెందును కానము'' — అని చెప్పుటయే గాక

తం దృష్ట్వా లోకపాలాస్తే భ్రాజమానం యధా రవిం
తస్థుర్విగత సంకల్పాః విస్మితా రూపసంపదా।

స్వర్లోకము నుండి యింద్రాది దేవతలు స్వయంవరమున కేతెంచుచు త్రోవలో నలుని జూచి తేజోహీనులై దమయంతి తమకు దక్కదనియే నిశ్చయించుకొనిరి. ఇందుచే లోకాతీత సౌందర్యఖనియగు నలుని యామె వరించుటం బట్టి వ్యాసుడు రూపమునకే ప్రాధాన్య మిచ్చెను.

రా వ ణు డు

శూర్పణఖచే సీతాసౌందర్యము విన్న రావణుడు కాముకుడై రామునిపై వైరమూని సీత నపహరింపదలచి మారీచుని సాయము కోరును.

తస్యభార్యాం జనస్థానాత్ సీతాం సురసుతోపమాం
ఆనయిష్యామి విక్రమ్య సహాయస్త్వమే భవ.

దేవతా స్త్రీవలె జనస్థానమందున్న రాము భార్యను బలిమిని తేదలచితిని. దానికై నీవు నాకు సాయమొనర్పుము. నీ కెవ్వరు సాటిరారు. ఉపాయజ్ఞుడవు, శూరుడవు, మాయలమారివి... పై విషయముల బట్టి కాముకుడగుట రావణుడు రామునిపై వైరమూనెనని తెలియుచున్నది.

క లి పు రు షు డు

స్వయంవరము ముగియగనే దేవతలు వెడలుచుండ ఎదురు వచ్చు కలి, ద్వాపరుల ''నెందేగుచుంటి''రని యింద్రు డడిగెను. కలి వారల కిట్లనెను ''అయ్యా! దమయంతీ స్వయంవరమున కేగుచున్నాను. ఆమెనుగూర్చి విన్నంతనే కాముకుడనైతిని. ఎట్లైన పెండ్లియాడుదున''నగ వారు నవ్వి జరిగిన సత్యము దెలిపిరి. అంతట తన కోర్కె నెఱవేరకుంటచే కలి కోపమూనెను. దేవతలు వెడలిన తర్వాత కలిపురుషుడు ద్వాపరుని జూచి

సంహర్తుం నోత్సహేకోపం నరే వత్స్యామి ద్వాపర —
భ్రంశయిష్యేమి తం రాజ్యాత్ న భైమ్యాసహ రంస్యతే—
త్వమప్యక్షాన్ సమావిశ్య సాహాయ్యం కర్తుమర్హసి—

''ద్వాపరా! క్రోధమడపజాలను. నలు నావేశించి రాజ్యభ్రష్టు నొనరింతును. నలదమయంతుల విడదీతును. జూదమాడించి యతని నోడింతును. నీవు పాచికలుగా మారి నాకు సాయమొనర్పుము.'' ఇచట రావణునకు మారీచునివలె కలికి ద్వాపరుడు సహాయమయ్యెను.

రాము వనవాసం

సీత రావణునితో తన వృత్తాంతము చెప్పుచు ''వివాహానంతరము పండ్రెడేండ్లు రామునితో కాపుర మొనర్చితిని.

తతస్త్రయోదశే వర్షే రాజామంత్రయత ప్రభుః
అభిషేచయితుం రామం సమేతోరాజమంత్రిభిః

తరువాత దశరథుడు రామునకు యువరాజ పట్టాభిషేకము చేయ సమకట్టెను. దాని కంతరాయ మొదవ వనమున జేరితిమి'' ఇట్లు చెప్పుటచే వివాహానంతరము పదుమూడవయేట వనవాసము.

నల వనవాసం

అధాస్య ద్వాదశే వర్షే దదర్శ కలిరంతరం

నల విరోధియగు కలి సమయమెపుడు దొఱకునాయని పండ్రెండేండ్లనుండి వేచియుండి పదుమూడవయేట నలునావహించి జూదమాడించి వనవాసమున కంపెను. ఇరువురు పదుమూడవయేట వనవాస మేగినను రాముడు రాజ్యసుఖ మెరుగనివాడు. నలుడు రాజ్య పాలన స్వేచ్ఛగ జేయుచున్నవాడు.

అ డ వి లో

శ్రుణుమైథిలి మద్వాక్యం మాసాన్ ద్వాదశ భామిని
కాలే నానేన నాభ్యేషి యది మాం చారుహాసిని.

రావణుడు సీతను జనస్థానమునుండి యపహరించి తెచ్చి యశోక వనమున నుంచి యిట్లనెను "సీతా! నా మాట వినుము. పండ్రెండు నెలలు నీకు గడువిచ్చితిని. ఈలోపుగ నన్ను గ్రహింప వేని నీ చావు తప్పదు." ఇట్లాతడు చెప్పుటచే వనవాసము చివర పదుమూడవయేట రావణవైర ప్రారంభము.

అడవికి పూర్వం

తథా తదభవత్ ద్యూతం పుష్కరస్య నలస్య చ
యుధిష్ఠిర బహూన్ మాసాన్ పుణ్యశ్లోకస్త్వజీయత—

కలి నలునిపై శత్రుత్వము వహించి పండ్రెండేండ్లు గడపి యతని నావహించి కొన్ని నెలలు జూదమాడించి యోడించెను. దీనినిబట్టి వనవాసమునకు పూర్వమే కలి వైరప్రారంభము:—ఇట్లు వ్యాస వాల్మీకులు వనవాసమునకు పూర్వాపరములలో కలి రావణ వైరప్రారంభములని భేదముగ బల్కిరి.

ముక్తి

రామలక్ష్మణులు సీతకై వెదకుచుండ జటాయువగుపడెను. వారు దాని ననుమానించి చంపబోవ నదియు

"మాం న మారయ భద్రంతే మ్రియమాణం స్వకర్మణా"

"మరణావస్థలోనున్న నన్ను చంపబోకుడు. మీకు శుభమగునుగాక. సీతను రావణు డపహరించెను" అని చెప్పగా విని రాముడు ద్విగుణీకృత తాపార్తుడై దుఃఖించి దాని మరణానంతర మగ్నిసంస్కార మొనరించి

"మయాత్వం సమనుజ్ఞాతో గచ్ఛలోకా ననుత్తమాన్
గృధ్రరాజ! మహాసత్త్వ సంస్కృతశ్చ మయా వ్రజ"

"పక్షిరాజా! నాచే సంస్కరింపబడితివి. నీ యిచ్చవచ్చిన యుత్తమ లోకముల కేగుము. నేననుజ్ఞ యిచ్చితి"నని పలుక దానికి ముక్తి కలిగెను.

విముక్తి

విరహార్తుడైన నలు డుద్యానమున విహరింపుచుండ నందు హంసల గుంపొకటి వచ్చి వ్రాలెను. నలు డందొక దానిని బంధింప నదియు దీనముగ

"హంతవ్యోస్మి న తే రాజన్! కరిష్యామి తవ ప్రియమ్
దమయంతీ సకాశే త్వాం కథయిష్యామి నైషధ!

యథాత్వదన్యం పురుషం నసా సంస్యతి కర్హిచిత్
ఏవముక్త స్తతో హంస ముత్ససర్జ మహీపతిః

''ఓ రాజా! నను చంపకుము. దమయంతి చెంగట నిను గూర్చి చెప్పి నిన్నే తప్పక వరింపజేసెదను'' అని పలుక విరహార్తుడగువి నిందొనర్ప యాతడా హంసకు విముక్తి కలిగించెను.

త్వన్నామానం కురుక్షిప్తం ప్రియా సందర్శనేన మాం.

శోకమును బోగొట్టెడి దానవగు నో యశోకమా! శోకోప హత చిత్తుడనగు నన్ను సీతా దర్శనమున శోకరహితనుగ నట్లొనర్చి వేగముగ నీ నామమును సార్థకమొనర్చుకొమ్ము.

దమయంతి

విశోకాం కురు మాంక్షిప్ర మశోక ప్రియదర్శన
వీత శోక భయాబాధం కచ్చిత్త్వం దృష్టవాన్ నృపం
యథా విశోకా గచ్ఛేయం అశోకనగ తత్కురు
సత్యనామా భవా శోక! అశోకః శోకనాశనః!

''ప్రియదర్శన మొసగెడి నో యశోకమా! శీఘ్రమే నన్ను దుఃఖ రహిత నొనర్పుము. శోక, భీతుల నెరుగని యా నలరాజుం గాంచితివా యేమి? ఓ యశోక వృక్షరాజమా! వీత శోకనగునట్లు చేయుము'' అశోకము శోకనాశక మను ప్రసిద్ధిని వీడక సార్థక నామధారి వగుము.

రాముడు

శార్దూల యది సా దృష్టా ప్రియా చంద్ర నిభాననా
మైథిలీ మమ విస్రబ్ధం కథయస్వ నతే భయం.

ఓ శార్దూలమా! చంద్రముఖియు ప్రియురాలునగు సీతను గాంచితివా యేమి? భీతిల్లక తెలుపుము.

దమయంతి

శార్దూలోభిముఖోభ్యేతి వ్రజామ్యేన మశంకితా
ఆశ్వాసయ మృగేన్ద్రేహ యం దృష్టస్త్వ యా నలః
అథవా త్వం వనపతే నలం యది నశంససి
మాం ఖాదయ మృగశ్రేష్ఠ! దుఃఖా దస్మా ద్విమోచయ.

అదిగో శార్దూల మెదురు వచ్చుచున్నది. నిర్భయముగ నెదురేగెద. ఓ మృగేంద్రమా! నలరాజుం జూచితివేమో తెలిపి నన్నూరార్పుము. లేనిచో నన్ను మ్రింగి దుఃఖ విముక్తి జేయుము.

రాముడు

పూర్వం మయా నూన మభీప్సితాని పాపాని కర్మాణ్య సకృత్ కృతాని
తత్రాయ మద్యాపతితో విపాకో దుఃఖేన దుఃఖం యదహం విశామి

రాజ్య ప్రణాశః స్వజనై ర్వియోగః పితుర్వినాశో జననీ వియోగః
సర్వాణిమే లక్ష్మణ శోకవేగ మాపూరయన్తి ప్రవిచిన్తితాని.

పూర్వమెన్నడో పెక్కు పాపకర్మముల జేసియుంటిని. ఆ కర్మ విపాక మిప్పుడు తటస్థించినది. లేనిచో యీ రీతిగ దుఃఖ పరంపర యేల? రాజ్యనాశము, భార్యా వియోగము—పితృమరణము—మాతృ వియోగము.

శాపముగల కబంధుడు

ముని శాపము — రాముని వలన ముక్తియు వరముగా గొన్న కబంధుడు రామునితో నో రామా!

మిత్రం చైవోపదేక్ష్యామి యువాభ్యాం సంస్కృతోగ్ని నా
యస్తాం జ్ఞాస్యతి తంవక్ష్యే దగ్ధస్స్వం రూపమాశ్రితః।
కింతు యావన్న యాత్యస్తం సవితా శ్రాన్తవాహనః
తావన్మా మవటేక్షిప్త్వా దహ రామ యథావిధి.

మీరు నా కగ్ని సంస్కార మొనర్ప నిజ స్వరూపమంది మీకు తగు మిత్రుని గూర్చి తెలుపుదును. అతడు సీతను గూర్చి తెలుపును. కావున సంజ పడక పూర్వమే నన్ను దహింపుడు.

వారట్లుచేయ నిజస్వరూప మంది కబంధుడు రామునితో

''శ్రూయతాం రామ వక్ష్యామి సుగ్రీవో నామ వానరః।
నివసత్యాత్మవాన్ వీరః చతుర్భి స్సహ వానరైః
నతే సహాయో మిత్రం చ సీతాయాః పరిమార్గణే.''

''రామా! సుగ్రీవుడను వానరుడు ఋశ్యమూకమున నల్వురు వానరుల గూడియున్నాడు - అతనితో మైత్రి యొనర్పుము. సీత నాతడు వెదకించగలడు.''

శాపముగల కర్కోటకుడు

నారదశప్తుడై నలునివల్ల ముక్తి యనుగ్రహింపబడిన కర్కోటకుడు వనమున కదలలేకపడియుండెను. ఇంతలో కార్చిచ్చు చుట్టి వచ్చుట గాంచి యా క్రోధను బోవు నలుని దీనముగ బిలచి యిట్లనియె—

ఉపదేక్ష్యామితే శ్రేయః త్రాతు మర్హతిమే భవాన్
సఖాచతే భవిష్యామి మత్సమోనాస్తి పన్నగః
లఘుశ్చతే భవిష్యామి శీఘ్ర మాదాయ గచ్ఛమాం.

ఓ పుణ్యశ్లోకా! నను రక్షింప మేలొనగూర్తును. తేలికగా నగుదును. కావున నన్నీ దావాగ్ని నుండి బయటికి గొనిపొమ్ము. అంతట నిర్భీతి నలుడు లోన ప్రవేశించి యాతని రక్షించుటయు మిత్రమా! పది యడుగులు వరుసగ లెక్కించుచు నడువుము మేలొన గూర్తు ననుచు ''దశ''యని పలికిన వెంటనే నలుని కాటువేసెను. నల రూపము మాఱెను.

గచ్ఛ రాజన్నితః సూతో బాహుకోహ మితి బ్రువన్
సమీప మృతుపర్ణస్య సహి చైవాక్ష నైపుణః

రాజా! ఇక నీ రూపము నెవ్వరు గుర్తింపజాలరు బాహుకుడ, సూతుడనని చెప్పుచు ఋతుపర్ణుని జేరుము. ఆత డక్ష విద్యా నిపుణుడు. నీకా విద్య లభింప దిరుగ భార్యాబిడ్డల రాజ్యము నంద గలవని చెప్పి యదృశ్యుడాయెను.

ఇచట కబంధ కర్కోటకులకు శాపమోక్షము సమానమైనను, కబంధుని రాముడు దహింప, కర్కోటకునిచే – నలుని కాటు వేయించుట వ్యతిరేకము–వాల్మీకి "దహ" అని పలికించి కల్పింప, వ్యాసుడును "దశ" అని శ్లేష కల్పించి పది.– కాటు వేయుటలు కల్పించి చమత్కృతిగ కాటు వేయించెను. తమ తమ మిత్రులట్లు కోరుటచే దహించినను, కాటు వేసినను దోషము లేదని మిత్ర లక్షణమట.

దేవాంశభూత వానరులు

"తాత్వయా ప్రాకృతేనైవ గత్వాజ్ఞేయౌ ప్లవంగమ
ఇంగితానాం ప్రకారైశ్చరూప వ్యాభాషణే నచ
తదుగ్రశాసనం భర్తుః విజ్ఞాయ హరిపుంగవాః
శలభా ఇవ సంఛాద్య మేదినీం సంప్రతస్థిరే–"

సుగ్రీవుడు, రామలక్ష్మణు లెవ్వరో–ఏల వచ్చిరో, వారి రూప – గుణ–చేష్టాదికముల మారువేషముతో గుర్తించి రమ్మని పంపునపుడును–రామాజ్ఞగొని సుగ్రీవుడు సీతను వెదకింప నియమనుల జెప్పి నలుదిక్కులకు బంపునపుడును దేవాంశభూత వానరుల నుపయోగించెను.

దేవాంశభూత నరులు

హృతరాజ్యే నలే భీమః సభార్యే ప్రేష్యతాం గతే
ద్విజాన్ ప్రస్థాపయా మాస నల దర్శన కాంక్షయా
సందిదేశచ తాన్ భీమో వసుదత్వాచ పుష్కలమ్
మృగయధ్వం నలంచైవ దమయంతీం చమే సుతాం

రాజ్యహీనులై నలదమయంతు లెందేగిరో తెలియకపోవుటచే భీమసేన మహారాజు కూతునల్లుని వెదకింప పుష్కలముగ ధనమిచ్చి ద్విజులను నలుదిక్కులకు బంపెను. ఒకరు భూదేవులగు నరులను; మరియొకరు దేవాంశలుగల వానరుల నుపయోగించిరి.

సుగ్రీవుడు

నదృశ శ్చాసి రామస్య విక్రమేణ బలేన చ
సహాయో దైవ తైర్దత్త శ్చిరాయ హరిపుంగవ
సాన్త్వయస్వ వయస్యం త్వం భార్యాహరణ కర్శితం.

లక్ష్మణుడు సుగ్రీవునితో "నోయీ! బలపరాక్రమములలో రామునకు సాటియైనవాడవు ఆతనికి దేవతలచే నీయబడిన మిత్రుడవు. నాతోవచ్చి భార్యావియోగమున దుఃఖించు మిత్రుని యోదార్పుము."

ఋతుపర్ణుడు

విదర్భాన్ యాతు మిచ్ఛామి దమయంత్యాః స్వయంవరమ్
ఏకాహ్నా హయతత్వజ్ఞ! మన్యసే యది బాహుక.

"బాహుకా! విదర్భదేశము నూరు యోజనముల దూరమున గలదు. దమయన్తి ద్వితీయ స్వయంవరమట జరుగునట. ఒక్కరోజే గడవు. నాకు చాల కుతూహలముగ నున్నది అచటికి చేర్చు భారము నీది. హయతత్వజ్ఞుడవు కదా! అనుగ్రహము జూపుదువా చేరుదును." అని ఋతుపర్ణుడు పలుకుటచే సుగ్రీవుని యాధారమున సీతాప్రాప్తి వలె, ఋతుపర్ణుని యాతచేతనే దమయన్తి లాభము నలునకని చెప్పవచ్చును.

సుగ్రీవుడు

"తవ ప్రసాదేన నృసింహ! రాఘవ! ప్రియాం చ రాజ్యంచ సమాప్నుయామహం." రామచంద్రా! నీ యనుగ్రహమున రాజ్యమును, ప్రియురాలిని బొందగల్గితిని.

"అహమానీయ దాస్యామి తవ భార్యా మరిందమ"–కావున మిత్రమా! నీ భార్యను నే దప్పక తెచ్చి యిత్తును. ముమ్మాటికి యీ మాట నమ్ము" మనుటచే ప్రత్యుపకృతి యొనర్చె ననుట తథ్యము.

శుభ సూచన

గజేన్ద్ర హస్త ప్రతిమశ్చ పీనస్తయోర్ద్వయో స్సంహతయో స్సుజాతః
ప్రస్పందమానః పునరూరు రస్యా రామం పురస్తాత్ స్థిత మాచచక్షే.

ఏనుగు తుండమును బోలినది, బలిసినది, కలిసియున్నవానిలో చక్కనిదియు నగు సీత తొడ కదలుచు శ్రీరాము డెదురుగ నుండినట్లు చెప్పెను.

శుభ వార్త

దమయంతీ మథోచుస్తే తాప సాస్సత్య దర్శినః
ఉదర్కస్తవ కల్యాణి! కల్యాణో భవితా శుభే.

"దమయంతీ! నీకు మేలు కలుగగలదు. తపో దృష్టితో తిలకించి తెలిపితిమి. అనతి కాలమున నలుని జేరగల్గుదువు" అని చెప్పిన పిదప నా మునులెల్లరు నామె వెనుదిరిగి చూచునంత నదృశ్యులైరి.

హనుమ చూచిన సీత

మందం ప్రఖ్యాయమానేన రూపేణ రుచిర ప్రభాం
పినద్ధాం ధూమజాలేన శిఖామివ విభావసోః
తాం సమీక్ష్య విశాలాక్షీం రాజపుత్రీ మనిందితాం.
తర్కయామాస సీతేతి కారణై రుప పాదిభిః

యధా రూపాహి దృష్టాప్పై తథా రూపేయ మంగనా.
పూర్ణచంద్రాననాం సుభ్రూం చారు వృత్తపయోధరాం
కుర్వంతీం ప్రభయాదేవీం సర్వా వితిమిరా దిశః
సీతాం పద్మపలాశాక్షీం మన్మధస్య గతిం యధా.

ఆమె మెల్లగా బయటపడుచున్న సౌందర్యముచే నందమైన కాంతి గలదై, ధూమ సమూహముచే గప్పబడిన యగ్ని జ్వాలవలెనుండెను. విశాలమైన కన్నులుగలది, మలినయై కృశించినదైయున్న యామెను జూచి, సరిపడిన కారణములచే సీతయని హనుమంతు డూహించెను. రావణుడు తీసికొనిపోవునప్పుడు ఏ రూపముగల స్త్రీ చూడబడినదో, యా రూపముగల దీమెయే.

పూర్ణచంద్రునివంటి ముఖము గలది, చక్కని కనుబొమలు గలది, అందమైన వర్తులమైన పాలిండ్లుగలది, తన కాంతిచే దిక్కులనన్నిటిని నంధకార రహితముగ నొనర్చు దేవియైనది. పద్మ దళముల వంటి కన్నులు గలదియగు నామెను, సీత యనుకొనెను. ఆమె మన్మధునకు సతియగు రతివలె నుండెను.

సుదేవుడు చూచిన దమయంతి

మందం ప్రఖ్యాయమానేన రూపేణా ప్రతిమేన తాం
నిబద్ధాం ధూమజాలేన ప్రభామివ విభావసోః
తాం సమీక్ష్య విశాలాక్షీ మధికం మలినాం కృశాం
తర్కయా మాస భైమీతి కారణై రుప పాదయన్
యధేయం మే పురా దృష్టా తథా రూపేయ మంగనా
పూర్ణచంద్ర నిభాం శ్యామాం చారువృత్త పయోధరాం
కుర్వంతీం ప్రభయాదేవీం సర్వా వితిమిరాదిశః
చారు పద్మ విశాలాక్షీం మన్మధస్య రతీ మివ.

రాజపురోహితుడగు సుదేవుడు చేది రాజాంతఃపురము నెట్లో చేరి యందున్న దమయంతింగాంచెను. ఆమెనుగూర్చి వర్ణనమిట్లుండెను.

ఆమె మెల్లగా బయటపడుచున్న సాటిలేని సౌందర్యముచే నందమైన కాంతి కలదై ధూమ సమూహముచే గప్పబడిన యగ్ని జ్వాలవలె నుండెను. విశాలమైన కన్నులు గలదియు, మలినయై కృశించినదైయున్నట్టి యామెను జూచి కారణములు సరిపోవుటచే భీమ పుత్రికగనే యూహించెను.

ఈమె బాల్యము నుండియు నంతఃపురమున కేగి వచ్చునప్పుడును నాచే నెట్టిరూపము చూడబడుచుండెడిదో యారూపమీమెదే.

పూర్ణచంద్రుని వంటి ముఖము కలది, యౌవనవతి, అందమైన వర్తులమైన పాలిండ్లుగలది, తన కాంతిచే దిక్కులన్నిటిని నంధకార శూన్యముగ జేయదగియున్నది, సుందరమైన పద్మ దళముల వంటి కన్నులు గలదియగు నామెను సుదేవుడు దమయంతియని భావించెను. ఆమె మన్మధు నిల్లాలగు రతీదేవివలె నుండెను. ఈ దమయంతీ వర్ణన మింతేకాదు. సుందరకాండ 15–16–19సర్గ ములలోని కొన్ని శ్లోకములు యధాతథముగ నున్నవి. మార్పులు చేర్పులతో నొక కొన్ని యున్నవి.

విమర్శనా దృష్టిం జూచిన కొలది నలచరిత్రమున నింకను విశేషములు కన్పట్టుచునేయున్నవి. వ్యాసుడు గ్రన్థ చౌర్యమా! కాదా! యన్నది చదువరులకు విడచితిని. మహర్షుల విమర్శింప మనబోంట్లకు తగదు కదా!

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు.

స్వేచ్ఛా స్పందనతో

(39 వ పేజీ తరువాయి)

కన్పిస్తాయి మనస్ శిఖరం నుండి
చూస్తే దాగిన జీవన దృశ్యాలు!
నీడల్లో నిదురించిన రూపాలు
స్వప్నంలో తలలెత్తిన లోకాలు!

ఎక్కడో శిథిలాల్లో ఎంత కాలమో
వేచిఉన్న ముఖంపై కాంతి చక్రమై
హత్తుకొంది ప్రభాతం బంధురేఖతో,
వర్తమాన తరంగంపై ప్రయాణమై.

దేశాల పొలిమేరలు దాటి
వర్షాల పొలాలన్నీ క్రమించి
వచ్చే వెలుగు ఇప్పుడు గుండె
కేదో చనవుగా చెబుతోంది,

భయం వదలి స్పందించనీ స్వేచ్ఛ
హిమం తరలి భాసించనీ కాంతి!
పదం కదలి నిద్రాజగం వీడి
మనస్సు అధిరోహించనీ శాంతి!

"వ్యాస భారతము నన్నయ పరిష్కారము"

ఇయ్యది శ్రీమదాంధ్ర విశ్వకళాపరిషత్తువారి 'డాక్టరేటు' పట్టముతోపాటు స్వర్ణపదక బహుకృతి నందిన సిద్ధాంత గ్రంథము.

గ్రంథకర్తలయిన డాక్టరు జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారు కళాశాల విద్యను స్వయంకృషిచే సాధించి ఆంధ్ర విశ్వవిద్యాలయమున బి. ఏ. (ఆనర్సు), (ఎం. ఏ) చదివి ఏతత్ విశ్వవిద్యాలయమునుండియే పిహెచ్. డి. పట్టమును 1974లో బడసిరి. వీరు ప్రారంభమున ఉన్నత పాఠశాలలలో నధ్యాపకవృత్తి గావించి తదుపరి ప్రభుత్వ కళాశాలలలో నుద్యోగమున కుదుటబడిరి.

వీరికి మహాభారతమన మక్కువ మెండు. దానికొక కారణము గలదు. తాము వీరేశలింగాస్తికోన్నత పాఠశాలయందు షష్ఠఫారములో సర్వోత్తమ విద్యార్థిగా నుత్తీర్ణు లయినందుకు మున్నంగి శర్మగారు పరిష్కరించి ప్రచురించిన విరాటోద్యోగముల ప్రతిని బహుకృతిగా బడసిరి. అందుగల 'వ్యాసుని కూర్పు—తిక్కన తీర్పు' అను వ్యాసము శ్రీ రావుగారిని విశేషముగా నాకర్షించి కవిత్రయ భారతమునంతయు మూలముతోబోల్చి వారి యపూర్వ కల్పనాశక్తిని పరిశీలింపవలయునను కోరిక కలిగినది. గ్రంథరచయిత చిన్ననాటి కోరిక నేడీ విధముగా గ్రంథరూపము దాల్చి కొంతవరకు ఈడేరినది. దీని తరువాత 'ఎఱ్ఱన పరిష్కారము'ను ముగించి అచ్చున కిచ్చినట్లు గ్రంథకర్తృ విషయము తెల్పుచున్నది. "తుదముట్టన్ రచియించు టొప్పు బుధసంతోషంబు నిండారగన్" అని తిక్కన చెప్పినట్లు మేమును చెప్పుచున్నాము.

గ్రంథకర్త సంస్కృత మహాభారతము గోరఖ్‌పూర్ ప్రతిని, పి. పి. ఎస్. శాస్త్రి దాక్షిణాత్య ప్రతిని మూలమున కాదర్శములుగా నెంచుకొని నన్నయ పరిష్కార మార్గమును తెలుసుకొనిరి. ప్రపంచ విఖ్యాత ప్రతి భండార్కరు వారి మూలకృతిగాని, ఉస్మానియా విశ్వవిద్యాలయమువారి సంశోధిత మహాంధ్ర భారతము ఆకృతినిగాని గ్రంథకర్త పరిశీలించినట్లు చెప్పలేదు. ఇందులకు కారణము మృగ్యము.

నన్నయ పరిష్కారమున రెండు భాగములు కలవు. ప్రథమ భాగమున మూలానువాదములు, ద్వితీయమున నన్నయ కవిత్వ వ్యక్తిత్వములు చర్చింపబడినవి. అవతారిక, నన్నయ యనుసరించిన మూలభారత ప్రతి. యథామూలకత, మూలకుంచనము, మూల ప్రపంచనము, అన్యథా ప్రకల్పనము, మూలత్యాగము, అమూలకత నన్నయ విడిచిన మూలరమ్యత ప్రథమ భాగ విషయ విభాగములు ప్రసన్న కథాకవితార్థయుక్తి, అక్షర రమ్యత, నానారుచి రార్థసూక్తి నిధిత్వము, నన్నయ వ్యక్తిత్వము, నన్నయ యాచార్యకము అనునవి రెండవ భాగమున వ్యాఖ్యానింపబడినవి. వ్యాసనన్నయల గ్రంథభాగములను సంపూర్ణముగా నవలోకించిన వారికిగాని ఇట్టి గ్రంథరచన సాధ్యముకాదు. సూరన చెప్పినట్లు "ఒక కథవిని యెదుతరి, వేఱొక కథపై దృష్టి యిడిన నొక యర్థము దోపకపోవు గావున వ్యాసునిలో నన్నయను, నన్నయలో వ్యాసుని సదా ఆవాహన చేయుచునే యుండవలయును. డాక్టరు మృత్యుంజయరావుగారు విధాత్రునకైనను నేరబోలని ఈ దుర్గమార్థజల గౌరవ భారత భారతీ సముద్రమును మథించుటకు 'నడుముకట్టు బిగించి, ఉడుముపట్టు' పట్టినారు. నన్నయ పరిష్కార కౌస్తుభము వెలసినది. ఎఱ్ఱన కల్పవృక్షము, తిక్కన కామధేనువు భారత పరమార్థ తత్పరులకు త్వరలో లభించగలవు. నన్నయ పరిష్కారము వేణుగోపాలస్వామి కంకితము.

కందుకూరి వీరేశలింగం పంతులుగారు నన్నయ అనువాద విధానమును గూర్చి సూక్ష్మముగా నిట్లు తెల్పియున్నారు —

"పరిశీలించి చూచిన పక్షమున భాషాంతరమంతయు నిదే ప్రకారముగా నుండునుగాని సరిగా మూలము ననుసరించియుండదు. మూలముతో సరిపోల్పక ప్రత్యేకముగా జూచునప్పుడు మాత్ర మాంధ్రభారత మతి మనోహరముగా నుండుననుటకు సందేహము లేదు. కొన్నిచోట్ల మూలముకంటెను హృద్యతరముగానుండి రసాతిశయము పుట్టించు ననుటయు నిర్వివాదాంశమే" (ఆంధ్రకవుల చరిత్ర పుటలు 35. 36 - 1917). వీరికంటె ముందుగా బ్రౌనుదొర కూడ నిట్టి అభిప్రాయమునే వెలిబుచ్చినారు.

"The Telugu poets who translated these doctrinal books have fearlessly abridged or altered or transposed or inserted new passages at pleasure." అని బ్రౌను భారత భాగవత రామాయణాంధ్రీకరణములను గూర్చి చెప్పియున్నాడు (తెలుగు—ఇంగ్లీషు నిఘంటువు పీఠిక పుట XIV - 1966)

[వ్యాసభారతము—నన్నయ పరిష్కారము : డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయ రావు. పుటలు 34 + 790. వెల రు. 50/– పబ్లిషరు శ్రీమతి జె. శకుంతల, రాజోలు—533242: ముద్రణ జనవరి 1979].

అక్షర రమ్యత - ప్రసన్నకథా కవితార్థయుక్తి

ఈ రెండింటిని గూర్చి ఆలోచించిన వారిలో మొదటి విమర్శకులు కట్టమంచి రామలింగారెడ్డిగారు. వారి అభిప్రాయ మిట్లున్నది :

"ఆదిపర్వములోని ప్రథమాశ్వాసమున 25వ పద్యమును పలికించిన 'అక్షర రమ్యత' ఒకటి, దానికంటెను శ్రేష్ఠమైన 'ప్రసన్నకథా కవితార్థయుక్తి' రెండు. కథ సాక్షాత్కరించినట్లు చేయు శిల్పనైపుణి యితఁడు చూపెనా? అట్లు సాక్షాత్కరించిన మూర్తిని మనోహరమైన శైలి యను వస్త్రమును ధరించినదిగాఁ జేసినాఁడా? తన కథ సొగసైన బహిరాకారమును, సత్వగరిష్ఠమైన జీవకళ గలదిగాఁ దీర్చినాఁడా? ఈ ప్రశ్నల కన్నింటికి నుత్తర మొక్కటియు. నిస్సందేహముగ, విస్పష్టముగ అంతర్బహిర్కళల రెంటిని సాధించెననుట" (అధ్యక్షుని వచనము. రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక-పుట 216-1922) నాటినుండియు విమర్శకు లీ లక్షణములను గూర్చి లోతుగా చర్చింప మొదలిడిరి. అక్షరరమ్యతపై ప్రత్యేకముగా రెండు గ్రంథములును, ప్రసన్న కథా కవితార్థయుక్తిపై నొక గ్రంథమును ప్రకటింపబడినవి. డా. దివాకర్ల వేంకటావధానిగారు నన్నయ భారతమను సిద్ధాంత గ్రంథమునందును, ప్రస్తుత గ్రంథకర్తలు తమ సిద్ధాంత గ్రంథమునందును, శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు 'సారమతి నన్నయ'యను గ్రంథమునందును నీ కవితా గుణములపై వ్యాఖ్యానము లొనర్చిరి. డాక్టరు మృత్యుంజయరావుగారు 790 పుటల తమ సిద్ధాంత గ్రంథమునందు 259 పుటలు 'నన్నయ ప్రసన్న కథా కవితార్థ యుక్తి' పైననే వ్రాసిరి. ఇదియే వీరి సిద్ధాంత గ్రంథములోని కండపట్టయిన భాగము. ఈ విషయమునే వీరు ప్రధాన వస్తువుగా తీసుకొని మరికొంత పరిశ్రమించినచో అటు విశ్వనాథవారి ఆత్మ శాంతికి, ఇటు సాహితీప్రియుల అభిలాషకు సరిపోయెడిది. 'అక్షర రమ్యత పై నొక సిద్ధాంత గ్రంథము వచ్చియే యున్నది. ఇక రావలసినది. 'నానారుచిరార్థ సూక్తినిధి'పైన.

మూలత్యాగము

మూలమున శకుంతల దీనురాలై దుష్యంతుని యాచించి నప్పుడు

"యది మే యాచమానాయా వచనం నకరిష్యసి
దుష్యన్త శతధా మూర్ధా తే వి ఫలిష్యతి"

అని తను నొల్లని భర్తయైన దుష్యంతుని శిరము ఇప్పుడే నూరు వ్రక్కలు కాగలదని శపించెను. పతివ్రతలకు శాపానుగ్రహ సామర్థ్య మేర్పడియుండుననుట నిర్వివాదము. సభలో బహుమంది యెదుట దన్నవమానముచేసిన భర్తను గూర్చి కోపోద్రిక్తయై యిట్లనినదన నౌచిత్యము స్ఫురింపనేరదు. ఈ యంశ మనువాదమున విడువదగినది కాదని శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు వ్రాసియున్నారు (భట్టారకుని భారతానువాదము వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రి షష్టిపూర్తి సంపుటము. పుట 60-1952). ఇది ఇట్లుండ ప్రస్తుత సిద్ధాంత గ్రంథకర్తలు "ఈ పలుకు లతిపరుషములు, ప్రతివ్రతాత్వ విరుద్ధములు" అని వ్యాసుని శకుంతలను గదమాయించినారు.

నన్నయ మూలానుసరణము

నన్నయలో, తెలుగున మూలములో లేనివానికి ఈ క్రింది అనుసరణలు కనిపించుచున్నవి.

ఘన దురితానుబంధ కలికాలజ దోషతుషార సంగతిన్
తన యుదయ ప్రభావమున దవ్వుగఁ జోపి" (ఆది 1-?)

ఇది "ప్రీతాః ప్రజానిః పవిత్ర చరిత్రతోయై
ప్రక్షాళయంతి కలికాం కలంక పంకః"

అని నన్నయ రచిత నందమపూడి శాసనమున శ్లోకమునకు ననువాదము.

ఘృతనదులును నోదన ప
ర్వతములు దధికుల్యములు నవారిత రసపూ
రిత బహు విధోప దంశో
న్నతి పుంజంబులును తత్క్షణంబున గురిసెన్
(ఆది 7-97)

"ఉష్ణాఢ్యస్యోదన స్యాత్ర
రాశయః పర్వతోపమాః
మృష్టాన్నానిచ సూపాంశ్చ
దధికుల్యాస్తథైవచ
నానాస్వాదు రసానాంచ
షాడబానాంతథైవచ (రామా. బాలకాండ 53-26)

శ్రవణాంజలి పుట పేయం
విరచిత వాన్ భారతాఖ్య మమృతః యశః
తమ మహమరాగమతృష్ణం
కృష్ణ ద్వైపాయనం వందే – (వేణీసంహారనాందీ ప్రస్తావనలో 3వ శ్లోకం) అను దాని కనువాదము–వేదవ్యాస స్తుతి.

ఇమ్ముగ సర్వలోక జనులెవ్వని యేని ముఖామృతాంశు బిం
బమ్మునను ద్రవమైన భారత వాగమృతంబు కర్ణరం
ధ్రమ్ముమనుజలింద విభిత్రావుదు రట్టి మునీంద్ర లోకవం
ద్యుం బరమున్ బరాశరసుతుం బ్రణమిల్లుచు (ఆది 1-76)

కృష్ణసారేత దచ్చక్షుస్త్వయి సాధిజ్యకార్ముకే
మృగానుసారిణం సాక్షాత్
తృశ్యామీవ పినాకినమ్. (శాకుంతలము 1.6)

మహాధనుర్ధరుండై యజ్ఞమృగంబు పిఱుందం బఱచు రుద్రుండునుం బోలె (ఆది. 2-164)

రూపం తదోజస్వితదేవ వీర్యం
తదేవ నైసర్గిక మున్నతత్వమ్,
నకారణాత్స్వాద్విభిదే కుమారః
ప్రవర్తితో దీప ఇవ ప్రదీపాత్ (రఘు 5 37)

నీ పుణ్యతనువు వలనన
యీ పుత్రకుఁ డుద్భవిల్లి యెంతయు నొప్పెన్
దీపంబువలన నొండొక
దీపంబు పుట్టించినట్లు తేజం బెసఁగన్ (ఆది 4-89)

గుర్వర్థ మర్థి (రఘు 5-24)

ఏనుగుర్వర్థమర్థినై (ఆది 1-94)

ప్రసాద సుముఖే తస్మిన్ చంద్రేచ విశదప్రభే
తదా చక్షుష్మతాం ప్రీతి రాసీ త్సమరసాద్వయోః
(రఘు 4-18)

అన్నరేంద్రునందు నాపూర్ణతరశర
దైందవా తపంబునందుఁ బ్రీతి
సమమకా సమస్త జనుల చిత్తంబు లా
నంద రసభరంబు నొందెఁ దాల్చె (ఆది 8-82)

హేమ్నస్సంలక్ష్యతే హ్యగ్నౌ
విశుద్ధిః శ్యామికాపి వా (రఘు 1-10)

కందుగల పసిండిఁ గాచిన
కంది వివర్ణమయినట్లు (సభా 2-89)

తథేతి శేషామివ భర్తురాజ్ఞా
మాదాయ మూర్ధ్నా మదనః ప్రతస్థే
ఐరావతాస్ఫాలన కర్కశేన
హస్తేన సస్పర్శ తదఙ్గమిన్ద్రః (కుమార 3-22)

లీలైరావత కుంభా
స్ఫాలన కర్కశ కరములఁ బలుమరును మరు
త్పాలకుఁ డంటుచునుండెఁ గు
లాలం కృతుఁడైన పార్థు నంగముఁ బ్రీతిన్.
(అరణ్య 1-356)

అశోక నిర్భర్త్సిత పద్మరాగ
మాకృష్ట హేమద్యుతి కర్ణికారమ్
ముక్తాకలాపీ కృతసింధువారమ్
వసంత పుష్పాభరణమ్ వహన్తీ (కుమార 3-53)

చారుసువర్ణహాసి నవచంపకభూషయు, సిందువారము
క్తారమణీయయున్ వకుళదామవతంసయునై యపూర్వశృం
గార విలాసలీల యెసఁగం దనముందట నున్నమాద్రి నం
భోరుహనేత్రఁ జూచి కురుపుంగవుఁ డంగజరాజమత్తుఁడై
(ఆది 5-141)

ఉపరాగాంతే శశినః
సముపగతా రోహిణీయోగమ్ (శాకుంతలమ్ 7-22)

నేఁడు పుణ్యదినము నెమ్మితో రోహిణీ
యుక్తుఁడయి శశాంకుఁ డున్నవాఁడు (ఆది 7-280)

సుకుమారః, సన్నయతి చన్ద్రచన్దన నిష్యన్దజడస్తవ స్పర్శః
(ఉత్తర రామచరితమ్ 6-6)

ఈ పుత్రగాత్రపరిష్వంగ సుఖంబు సేకొనుము ముక్తాహార
కర్పూర సాం
ద్ర పరాగ ప్రసరంబుఁ జందనముఁ జంద్రజ్యోత్స్నయుం
బుత్రగా
త్ర పరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శతమే
(ఆది 4-90)

ఘర్మత్రసం సితబన్ధనైస్స్వకుసుమైరర్చన్తి గోదావరీం
(ఉత్తర రామచరితమ్ ప్రథమాంక శుద్ధ విష్కంభం
9-శ్లో)

పరిఘజలంబులం...కుసుమంబులుం వెలయు దత్పురవప్రము
పాదపీఠికా
శిరసుల కొప్పు నర్చనలు సేసిన పువ్వుల యవ్విధంబునన్
(ఆది 8-76)

రత శ్శరచ్చంద్ర కరాభిరామై
రుత్సర్పిభాప్రాంశు మివాంశు జాలై

బభ్రాణమా నీల రుచిమ్ పిశంగీ
జ(ర)టాతటిస్త్వాం తమివాంబువాహః
(కిరాతార్జునీయము 3-1)

నీలగిరీంద్రశృంగమున నిర్మలమైన సువర్ణ వల్లరీ
జాలమువోని పింగళ విశాల జటాచయమొప్పఁగా వచః
శ్రీలలితుండు వచ్చి నిలిచెన్ హరినీల వినీల విగ్రహో
రాళ రుచుల్ వెలుంగఁగ పరాశరసూనుఁడు తల్లిముందటన్
(ఆది 4-240)

మధుకైఠవశానిలంభయ
న్నని తిరర్యంచి శనుం నిరీక్షితై
పరితః పటు బిభ్రద్ నసావ్
దహనం ధామ విలోకనక్షమవ్
సహసోపగతస్స విస్మయవ్
తపసావ్ రసూతిరావ్ వదావ్
తద్వశీ జగతీ భుజామని
స్సవ పుష్పానిన పుణ్య సంచయః
(కిరాతార్జునీయము 2-56)

పుణ్య తపోమయుండు మునిపుంజ్యుఁడు బ్రహ్మ సమ
ప్రభుండు బ్ర
హ్మణ్యుఁడు ప్రావృషేణ్య జలదాసిత వర్ణుఁడశేష కిల్బిషా
రణ్య దవానలుండగు పరాశర నందనుఁ డేగుదెంచె ద
త్పుణ్య చయస్వరూపమును బోలె కరంబుమనో ముదంబునన్
(ఆది 6-228)

మగ్నాన్ ద్విషచ్ఛద్మని పంకభూతే
సంభావనాన్ భూతి నుహోద్ధరిష్యన్
అధిద్విషామా తపసాం ప్రసిద్ధే
ష్మద్వినామాభృశమున్మనీభూ
(కిరాతార్జునీయము 3-39)

చ. అరికృత దుష్టరాభవ మహార్ణవ మగ్నుల మమ్ము నందఱన్
కరుణ సముద్ధరింపుము జగన్నుత అన్యుఁడు పూన ని యీ
భారము వహింప బూనిన యపార గుణాన్వితనిన్ను దిక్కుటున
తరణి యుసోముఁడున్నభము ధాత్రియు గొద్దను గాచుచుండెడి
(ఆది 1-235)

భారవి మూలమున గల 'మగ్నాన్' 'ఉద్ధరిష్యన్' అను పదము లట్లే గైకొనబడినవి.

వ. విధి విహితహోమతర్పిత వీతిహోత్రుండునై
ధౌమ్యాది మహీసురవరులను భాతృవరులన్ వీడ్కొని
(ఆరణ్య 1-282)

అధాభిపశ్యన్నివతిద్విషః పుర
పురోధసారోపిత వీతిహోత్రి
బ భారరమ్యోప వప్రస్పృభీషణం
గత క్రియాం మంత్ర ఇవాభిచారవ్
(కిరాతార్జునీయము 3-86)

అను జగురధిత్యం
దుంధుభిర్ధ్వాన మూనా
సురకుసుమనిపాతై
ర్వ్యోమ్నులక్ష్యైవితేన్
ప్రియమివకథ యిష్యాన్
న్నాలిలింగస్ఫురంతీ
భువమనికృత వేలావీచి బాహుః పయోధిం
(కిరాతార్జునీయము 3 60)

వీరుఁడుయోగవిద్యయును ఎల్లను దోడుగ నింద్రకీలమన్
భూరి నగంబుపై కడకు బోవగ పోయిన పోవకుందుము
గ్రారివిభేది నీవను మహామధురధ్వని వీచెనెంతయున్
బోదన నంతరిక్షమున బొల్చె నిరంతర పుష్పవృష్టియున్
(అరణ్య 1-287)

అకృత్రిమప్రేమ రసాభి రామవ్
రామార్పితవ్ దృష్టివిలోభ దృష్టవ్
మనః ప్రసాదాంజలి వినానికామవ్
జగ్రాహ పాథేయం మినేంద్రసూనుః
(కిరాతార్జునీయము 3-37)

''పాంచాల రాజపుత్రి తన స్నేహలాలస విలోలా
పాంగ విలోకంబులంబార్చు గృహీత పాథేయుం
జేయుచు తద్వియాంగ తరళంబైన హృదయం
బెట్టకేనియు నొక్కింత దిటవు సేకొనియుండె''
(ఆరణ్య 1-226)

ప్రస్తుత సిద్ధాంత గ్రంథకర్తలు కవిత్రయ కవితా విమర్శనమను గుఱ్ఱం వేంకటసుబ్బయ్యగారి గ్రంథమును జూచినట్లు కానరాదు. గ్రంథము చిన్నదైనను ప్రణాళిక గొప్పది. కోరాడ రామకృష్ణయ్యగారి ఆంధ్రభారత కవితా విమర్శనము, ఆకోండి వ్యాసమూర్తిశాస్త్రి 'భారతఫక్కి', తిరుపతి వెంకటకవుల 'భారత విశేషములు' పెద్దలెందరో కర్మఫలాపేక్ష లేకుండ వ్రాసిన వ్యాసములు ఇందు విస్మరింపబడినవి. సిద్ధాంత గ్రంథములోనివి లేకపోవుట చోద్యమే. బహుశః ఆంధ్ర విశ్వవిద్యాలయము పరిశోధన విద్యార్థుల కిట్టిదనవసరమని తోచి వాటిని అవలోకించుట మానివేసి యుందురు. ఏది ఏమైనను 'నన్నయ పరిష్కారము' నన్నయ కవితా స్వరూపమును చర్చించు గ్రంథములలో నొక్కటిగా నంగీకరించక తప్పదు.

కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

చలిచం సీత

కాకతీయ యుగమున న్యాయపాలన

బద్దెన 'నీతిశాస్త్ర ముక్తావళి'లో న్యాయము వాయుడున్ నృపతి నాడు సమస్తము పొడవునని; 'మర్యాద'యే రాజుకు అందమని; న్యాయపాలన వలన నమ్మిక, నమ్మిక వలననే భండారము అభివృద్ధి చెందును కనుక న్యాయమే రాజుకు నిజమైన భండారమనియు నిర్ధారించి రాజ్యమున న్యాయ ప్రాశస్త్యము నుగ్గడించినాడు.[1] తిక్కన 'వ్యవహారశుద్ధి సర్వప్రజా ప్రియకారి యదియ భూపతికి ధర్మాతిసయము, గీర్తియుఁజేయు...' అన్నాడు. మడికి సింగన 'సకలనీతి సమ్మతం'లో ధార్మిక ప్రభుడు ధర్మజనానురాగ సంగతుడు కావున శత్రువులచే నతడసాధ్యుడని ప్రసక్తమైనది. ఈ అభిప్రాయములనుబట్టి కాకతీయ యుగమున రాజ్య స్థితి లయములకు మూలము ఆ రాజ్యమున ప్రవర్తిల్లు ధార్మికపాలనయేనన్న విశ్వాసము బలీయముగ నున్నదని స్పష్టమగుచున్నది.[2]

రుద్రమదేవి ధర్మపాలనాభిరతిని ప్రస్తుతించిన మార్కోపోలో ఇట్లనెను. విచక్షణాత్మకమైన నలుబదేండ్ల పాలనా కాలములో ఆమె ధర్మ, సమానత్వ, శాంతికాముకత్వ గుణములు వెల్లడిమైనవి. ఆమె అధికారములో ప్రజలెవ్వరికీ కప్పములు చెల్లింపక స్వతంత్రనుగ నుండిరి. అంతకుపూర్వము ఏరాజును గాని రాణిని గాని అభిమానించనంతగ ఆమెను ప్రజలు అభిమానించిరి.[3] సోమేశ్వర దేవుడు అభిలషితార్థ చింతామణిలో అపరాధిని దండించుట, అమాయకుని ప్రమాదమునుండి కాపాడుట అనునవి న్యాయపాలనోద్దేశ్యములని తెల్పినాడు.[4] అపరాధిని శిక్షింపకుండుట; దుష్టుని చంపకుండుట అనునవి అనేకమంది సజ్జనులను చంపుటతో సమానమనియు ఆ కాలమున విశ్వసింపబడినది.[5]

విజ్ఞానేశ్వరము బలవంతుడు విచ్చలవిడిగ బలహీనుని బాధించినపుడు ఆ బలహీనుడు పరిహారము కొఱకు న్యాయస్థానమును వేడినచో, ఆ న్యాయస్థానము (ధర్మాధర్మ నిర్ణయము కొఱకు) పాటించు ప్రక్రియనే వ్యవహారమని తెల్పుచున్నది.[6]

చారిత్రకులలో "కాకతీయ యుగమున న్యాయస్థానములున్నట్లు ఆధారములున్నను, ఆ న్యాయస్థానములందున్న న్యాయాధీశులయొక్క సంఖ్యగాని, వారు ఏ వర్ణములకు చెందినవారని గాని సరియైన సమాచారము నందజేయు నాధారములు లేవు" అన్న అపోహయున్నది.[7] ఇది మిక్కిలి సత్యదూరమని, అసమగ్ర పరిశీలన ఫలితమని చెప్పక తప్పదు.

కాకతీయ యుగమున న్యాయపాలన గురించి లభించు ఆధారములు న్యాయ వ్యవహారమును గురించి సమగ్రమైన సమాచారమును నిస్సందేహముగ అందించు చున్నవని ఈ క్రింది పరిశీలన తెల్పగలదు. మంచన అల్పవిషయములు (వివాదములు) ప్రభుత చేపట్టినచో చిలికి చిలికి గాలివానయై చివరికి వివాది పక్షములకు రెండింటికి లాభము చేకూరదని చెప్పి ప్రజలు మాటిమాటికీ న్యాయస్థానములకు పోరాదని ఆదేశించినాడు.[8] అట్లే విజ్ఞానేశ్వరమునందును వీలైనంతవరకు వివాదములు తమలో తామే తీర్చుకొనవలెనని చెప్పబడినది. అందే 'తమలో తాము' అనగా ఎవరో ఈ క్రిందివిధముగ నున్నది.

గ్రంథస్థ విషయము	వివరణ
బంధుజనులు	కుల న్యాయస్థానము
ఒక్కపనివెంట వర్తించువారు	వృత్తి న్యాయస్థానము
ఒక్క యూరివారు	గ్రామ న్యాయస్థానము
రాజపురుషులైనవారు	ప్రభుత్వ న్యాయస్థానము (రాష్ట్ర, రాజ్య న్యాయస్థానములు)

వీరు మొదటినుండి 'అంతంత కధికులగుచు' (పైనిచూపిన వరుస క్రమములో–hierarchy) పాడికి కర్తలగుదురనియున్నది.[9] దీనినిబట్టి న్యాయవ్యవస్థలో ప్రాథమిక అంగము కుల న్యాయస్థానమనియు, వివాదము అందు పరిష్కృతము కాకున్న వృత్తి న్యాయస్థానము చేపట్టవలెనని, అందును న్యాయము లభింపకున్న గ్రామ న్యాయస్థానమును, ఆపై రాజాధికారులు, ఆపై ఆ ప్రాంతమును పాలించు రాజు, తుదిగ చక్రవర్తి ధర్మాసనమును పాడిని తీర్చునని అవగతమగుచున్నది. దీనివలన ప్రతి పై న్యాయస్థానమునకు పునర్విచారణ పరిధి కలదనియు విదితము. ఆ కాలమున ప్రతి వర్ణమునకు, ప్రతి వృత్తికి ప్రత్యేక 'సమయము'లుండి, వానికి అందరి సభ్యులపై శాసనాత్మక, న్యాయపాలనాధికారము లుండెడివి.[10] వ్యవస్థీకృతమైన ఇటువంటి న్యాయస్థానములేకాక నేరములను అప్పటప్పట విచారణ జరుపు సంచార న్యాయస్థానములును ఆ కాలమున ప్రవర్తిల్లినవని క్రీడాభిరామమున మదాలస వృత్తాంతమున తెలియవచ్చుచున్నది. సమీపస్థుడైన విప్రుని పాడిపంతంబు తీర్చునట్లు ఏర్పాటు చేసికొనుట ఇందలి సారాంశము.[10a]

న్యాయసభలో సభ్యుల (న్యాయమూర్తుల) సంఖ్య 3 లేక 5 లేక 7. ఈ బేసి సంఖ్య వివాదగ్రస్థ విషయము సంఖ్యాధిక్య

సభ్యుల సమ్మతితో పరిష్కృతమగుటకే నిర్ణయింపబడి యుండవచ్చు. రాజు క్రోధ లోభరహితులు, సద్ధర్మతత్పరులు; ప్రసిద్ధిచెందిన విప్రవంశములకు చెంది వేదజ్ఞులు, ధర్మశాస్త్రజ్ఞులు, లోకజ్ఞులు, సత్యయుతులు, ద్వేషరాగ రహితులై సమచిత్తులైన పండితులతో కూడి ధర్మవ్యవహార నిర్ణయము గావింపవలెనని విజ్ఞానేశ్వరమున ప్రసక్తమైనది.[11]

సభ్యుల లోకజ్ఞత్వ అర్హతవలన న్యాయపాలనలో ఆనాడు ఆనుకూల్యత ఉండెడిదని స్పష్టమగుచున్నది. సోమేశ్వరదేవుడు న్యాయస్థానమున జూరీ సభ్యుల ఉనికిని అంగీకరించి, ప్రాడ్వివాకుడు (ప్రధాన న్యాయమూర్తి) కోరినచో వారి అభిప్రాయమును ప్రకటించవలెనని తెల్పినాడు.[12]

ధర్మాసనమున సమన్యాయ పాలనను పరిరక్షించుటకై ప్రాడ్వివాక సభ్యులపై పరస్పర నిరోధములు విధింపబడినవి. జనపతి అన్యాయమున వ్యవహరించునెడల కార్యతత్త్వమెరిగించి అతనిని నిరోధింపక అతని నిర్ణయమును సభ్యులు అనుసరించినచో వారు పాపమున మునుగుదురని విజ్ఞానేశ్వరము ప్రవచించినది. అట్లే స్నేహముచేత, ధనలోభముచేత, భయముచేత సభ్యులు ధర్మముతప్పి న్యాయస్థానమున పలికినచో జనపతి వారిని కనికరింపక నిందారోపణము చేసి దండింపవలెననియు నీ గ్రంథమునందే కలదు.[13]

తిక్కన సాంప్రదాయిక న్యాయపాలనకు పునాదియైన సమచిత్త భావనను ఆమోదించి సమర్థించుచు "అక్షీణ సత్యులు, ధర్మపరులును నైన భూసురులు నీవుం ద్రాసులుంబోని చిత్తంబుల తోడుతం బ్రజ వివాదము లెడం బక్షముడిగి విని ధనవాంఛనై ధనికుల దెస వ్రాలి తీర్పక ధర్మంబు తెరువు దప్పకుండ బాడం" దీర్పుమని పలికినాడు.[14] సోమేశ్వర దేవుడు సమకాలీన వ్యవహారము దృష్ట్యా సత్యమైన దానినే న్యాయముగ స్వీకరింపవలెనని అభిప్రాయపడినాడు.[15] సభ్యుల లోకజ్ఞత్వ అర్హతవలననేకాక ఆయా కాలములందు లోకులవ్యవహారమునుబట్టి న్యాయనిర్ణయము చేయవలెనుట వలనకూడ న్యాయనిర్ణయమున సాంప్రదాయిక పారుష్యత (rigidity) లేదనియు, ధర్మశాస్త్ర నియమములను కాలానుగుణముగ లోక వ్యవహారాను గుణముగ న్యాయస్థానము వ్యాఖ్యానించి వివాదములకు అన్వయింప దగునని తెలియుచున్నది. ఇది ఆనాటి న్యాయస్థానపు ఆనుకూల్యతా (flexible) స్వభావమును ప్రకటించుచున్నది. పాలకుడైనను, పాలితుడైనను చట్టము దృష్టిలో సమానులే అని ఆ కాలపు నీతి శాస్త్రకారుల విశ్వాసము.[16] అనగా నిందితుడెవరైనను దండనకు మినహాయింపబడడు. కాని నిందాస్పదునికి విధింపబడిన నేర నిరూపణ పరీక్షలు, నేరస్థుని యెడ పాటింపవలసిన శిక్షాక్రమము వర్ణ ప్రాతిపదికపై నేర్పడినది. ఈ విచక్షణ ఆయా వర్ణముల ఆనాటి మానసిక, విజ్ఞానాత్మకమైన యోగ్యతనుబట్టి నిర్ణయింపబడి యుండవచ్చును.

నిందాస్పదుని దోషమును నిరూపించుపద్ధతిలో నీతి శాస్త్రములు విప్రునికి విధించిన పరీక్ష తులదూచుట. మొదటి రోజు నిందితుడైన బ్రాహ్మణుని బరువును ఇటుకలతో త్రాచునందుతూచి ఆ ఇటికలనెల్ల దాచవలెను. పరీక్షాదినమున అతనిని త్రాచునందొక వైపుంచి మరొకవైపు దాచిన ఇటుకల నన్నింటి నుంచి ప్రాడ్వివాకుడు తూర్పు ముఖమై "దైవంబులారా యితడు శుద్ధుడవునేని నెత్తుడు దింపుడు హీనుడైన" అని పలుకవలెను. అట్టిచో నిందితుడైన విప్రుడు తేలికయై అతనివైపు త్రాచు పైకి లేచినచో అతడు నిర్మలుడని, లేక బరువై అతనివైపు క్రిందికి దిగినచో అతడు నేరస్థుడని నిరూపించెడివారు.[17]

అట్లే క్షత్రియులకు అగ్ని; వైశ్యులకు జలము; శూద్రులకు విషము; ఇతర వర్ణముల వారికి కోశము (ధనము) అనునవి పరీక్షా సాధనములు.

సాక్షి సత్యాసత్య వచన నిర్ణయము చేయుటకు ఆయా వర్ణముల వారితో ఈ క్రింది విధముగ పలుకవలెను.

బ్రాహ్మణునికి నీవు అసత్యమాడిన 'సత్యమ'ంతయు చెడునని; అట్లే క్షత్రియునికి ఆయుధములు, వాహనములు వ్యర్థమగునని; వైశ్యునికి గో, ధన, ధాన్యములు కూడక చెడునని; శూద్రునికి పాపంబులన్నియు ప్రాప్తించునని చెప్పుచు సాక్షిని తూర్పుముఖమై యుండునట్లుగ నిలిపి మంచివారలు చెప్పిన మాటను మాత్రమే స్వీకరించి న్యాయనిర్ణయము చేయవలెను.[18]

వధా దండమునకు కేవలము విప్రులేకాదు స్త్రీలు, గోవులు, బాలురును మినహాయింపబడిరి. అయినను నేరస్థుడైన బ్రాహ్మణుని ధనమంతయు తీసికొని, తల గొటిగించి, కుక్కడుగు ఫాలమునందు వ్రాసి, గాడిదపై నెక్కించి గ్రామము నుండి బహిష్కరించు దండను వధతో సమానమైనదని ఆ కాలమున భావింపబడినది.[19] ఏలనన ఈ విధమైన శిక్ష మరణము కంటె అధికమైన మానసిక హింసకు నేరస్థుని గురిచేయును.

కరణము (ఆ కాలమున ఉద్యోగములలో నియమితులైన బ్రాహ్మణులు) దొంగిలించినచో (ప్రభుత్వ ధనమును స్వాహాచేసినచో) అతని పెదవులు, కరమును, ముక్కును, చెవులును ఖండించి సురియతో జంపవలెనని విజ్ఞానేశ్వరుడు భావించినాడు.[20] దీనినిబట్టి ఔద్యోగిక న్యాయము (administrative law) సాధారణన్యాయము (ordinary law) కంటె కఠినమైనదని స్పష్టమగుచున్నది ఉద్యోగులకు చట్టము నుండి మినహాయింపులు లేవనియు శాసనబద్ధమైన ప్రవర్తనకు వారు కఠినముగ కట్టివేయబడినారనియు ఈ క్రింది ఉదంతము ఇంకను ధ్రువపఱచును. ప్రభుత్వధనమును స్వాహాచేసిన కరణములకు ఆ కాలమున కఠిన దండము లమలు జరిపిరనుటకు 'కాటమరాజు కథల'లోని కలభూత గంగురాజు వృత్తాంతము నిదర్శనమగుచున్నది. అందు కరణములు రాజుకు చెందవలసిన శిస్తును 12 సం॥లు చెల్లింపక స్వవిలాసమునకై దుర్వ్యయము గావించిరి. వారికి విధించిన శిక్ష నీతిశాస్త్రములందు ప్రసక్తమైన విధముగ మానసిక/నైతికమైనదికాక భౌతికము, హింసాయుతము

నైనది. రెక్కలు విరిచి కట్టి చురుకైన సబుకులలో కొట్టుట, పండిన మిరపకాయల రసము వారి శరీరములకు పూసి ఎండలో నిలువబెట్టుట మొ॥నవి. బ్రాహ్మణులైన ఆ కరణములను నైతికమైన అవమానముతో పోనీయక శారీరకముగ కూడ బాధించిరి. కనుక ఈ వృత్తాంతము సాంప్రదాయికముగ వచ్చు అవగాహనకు విరుద్ధముగ నున్నదని తెలియనగును. అనగా మధ్యయుగమున బ్రాహ్మణులు అవినీతికి పాల్పడినపుడు సాధారణ చట్టమునకు మినహాయింపబడలేదని విశ్వసింపవచ్చును. ఆ కరణములు ఒక సంవత్సరము లోపల బకాయిపడిన ధనమును ఏదో విధముగ (శారీరక పరిశ్రమచేసి యైనను) చెల్లింతుమను షరతుపై వారి భార్యాబిడ్డలు రాజు అధీనములో అప్పటి వఱకు నుంచు హామీపై విడుదలచేయబడిరి. కానీ ప్రభుత్వసిబ్బంది అజాగరూకతవలన ఆ కరణములు తమ కుటుంబములతో సహా ఆ రాత్రియే పలాయితులై పొరుగురాజును శరణుకోరిరి. వారికభయమిచ్చిన ఆవుల వలురాజు (ఎఱ్ఱిగడ్డపాటి యాదవ వంశమునకు చెందినవాడు, కాటమరాజుకు పితామహుడు), వారు దుర్నీతులైనను బ్రాహ్మణులు కనుక, బ్రాహ్మణుల కిచ్చిన అభయము నెరవేర్చుకొనుటకు కలభూత గంగురాజుతో ఘోరయుద్ధముచేసి ఆతనిని చంపి ఆతని పుత్రుని అంతఃపుర స్త్రీల ప్రార్థనపై సింహాసనాధీశుని చేసి గాయముల బాధమెండై ప్రాణములు విడిచినాడు.[21]

ఈ వృత్తాంతమున విరుద్ధాంశములు కనిపించుచున్నవి. ఒకరాజు అధికారుల దుర్నీతిని మాత్రమే ప్రమాణముగ స్వీకరించి శిక్షింపగ మరియొకరాజు నేరస్థుల కులమునకు ప్రాధాన్యతనిచ్చి కాపాడినాడు. దీనినిబట్టి సంప్రదాయసిద్ధమైన న్యాయసూత్రములను అన్వయించుటలో కాకతీయ యుగమున అటనట మార్పులున్నట్లు తెలియుచున్నది. ఆచరణలో నేదియు నిరాఘాటమైన నియమముగ అమలు జరుగలేదనియు, న్యాయసూత్రముల అన్వయమున సారళ్యత (flexibility) కలదనియు విదితమగుచున్నది.

ఏది ఏమైనను నిందితుని విచారణ జరుపకుండ శిక్షింపరాదను నియమమున్నది, పాటింపబడినది. [22]

సోమేశ్వర, విజ్ఞానేశ్వరుల మతమున సాక్ష్యములు పత్రము, సాక్షి, భుక్తి అను మూడు విధములు.[23] బంధుజనులతో కూడిన కుల న్యాయస్థానమున, ఒక వృత్తికి చెందిన న్యాయస్థానమున లేదా ఒక గ్రామ న్యాయస్థానమున వివాదము పరిష్కరింపబడునెడ పత్ర సాక్ష్యమే చాలును.[24] ఇక సాక్షులు ఈ క్రింద తెలిపినట్లు ఐదు రకములు :

లిఖిత సాక్షి = పత్రముపై సాక్షి సంతకము చేసినవాడు

తలపు సాక్షి = తన జ్ఞాపకమునుండి సాక్ష్యమిడు నాతడు

పాటు సాక్షి = తన మార్గమున వివాదగ్రస్త విషయమును స్పష్టముగ విన్నవాడు

గూఢసాక్షి=వివాది పక్షము తెచ్చిన రహస్య సాక్ష్యము/సాక్షి

ఉత్తర సాక్షి[25] = ఇరుపక్షములకు సాక్షియైనవాడు.

ఏమైనను తపము, దానము, ఆర్జవ, కులీనత్వము, సత్యసంధత, ధర్మగుణము, సత్సంతానము, ధర్మశాస్త్రబద్ధమైన ప్రవర్తన కలిగి తెలివిహీనులు కాని సజ్జనులే సాక్ష్యమిచ్చుటకు యోగ్యులైనవారు. ఇట్టి గుణములు కలిగిన సాక్షులు లభింపనిచో వివాది పక్షముల కులమునకు చెంది, ధర్మపరాయణులైన వారిని సాక్షులుగ స్వీకరింపదగును. 'తిట్టాట, అంకు, ముచ్చిమి' మొదలైనవి వివాదగ్రస్త అంశములైనపుడు ఎటువంటి సాక్షినైనను స్వీకరింపదగును.[26] బాలుడు, వృద్ధుడు, పగవాడు, చుట్టము, బూతు, సూనగాడు, పాపి, అసత్యాలాపములాడువాడు, దొంగ, సుండరి, కొండీడు, త్రాగుబోతు సాక్ష్యమునకు పనికిరారు.[27] తనంత తాను సాక్ష్యమిచ్చుటకు పూనిన వ్యక్తి 'పాడిధనములోని పాలివాడు'. కాన అతని సాక్ష్యమును స్వీకరింపరాదు.[28] 'కోపి, మరులు, పుణ్యాపాపంబు లెయుగనివాడు, జూదగాడు' సాక్షి కాలేడు.[28a]

సాక్ష్యము కొనుటకు పూర్వము ఆయా సాక్షులకు వారివారి కులమునుబట్టి నేర నిరూపణ పరీక్షలకు ముందు వారికి చెప్పు విధముగనే చెప్పవలెను.[29]

తిట్లకు, హింసకు పత్రసాక్ష్యమక్కరలేదు, అనుభవమొక్కటే చాలును. సాక్షులను పైని చెప్పిన నేరనిరూపణ పరీక్షలకు ('దివ్య'పరీక్షలు) గురిచేసిన చాలును.[30] సాక్షి వివాదమునకు సంబంధించిన నిజమును సగమే చెప్పినపుడు మిగిలిన నిజమును రాబట్టుటకు 'దివ్య'పరీక్షలకు అతనిని గురిచేయవచ్చును.[31] దాన ధర్మములకు సంబంధించిన వివాదములు పరిష్కరించునెడ ముందు వ్రాసిన పత్రములకన్న తరువాత వ్రాసిన పత్రములే చెల్లును. ఉదాహరణకు ఋణమునకు సంబంధించిన పత్రము, దానిని చెల్లించిన పత్రములలో చెల్లించిన పత్రమే చెల్లును. అధికుడు ధన మరువు పుచ్చుకొన్నచో, గడువులోపల ఋణదాత (అప్పుడు) అడుగలేనిచో ఆ అధికుడు గడువు తీరిన తర్వాతి రోజునుండి అరువు పుచ్చుకొన్న ధనమునకు రెండింత లీయవలెను.[32] ఇది సామాజిక న్యాయ పరిరక్షణలో బలహీనవర్గాలకు అధికుల అవాంఛనీయమైన ప్రాబల్యము నుండి ఆనాటి న్యాయస్థానము శాసనబద్ధముగ కల్పించిన రక్షణయని తెలియనగును.

సాక్షుల సంఖ్యపై కాక న్యాయనిర్ణయము సాక్ష్యమునందలి గుణమును (నిజానిజములను)బట్టి చేయవలెను. అనగా శుభలక్షణము సద్ధర్మవర్తన, ప్రభుతనము లేనివారు అనేకులు సాక్ష్యమిచ్చినను దానిని లక్షింపకూడదు. ఉదాత్త జనుడైన ఒక్కవ్యక్తి సాక్ష్యమే న్యాయనిర్ణయమునకు చాలును.[33]

ఒకచో ప్రధాన న్యాయమూర్తి, సభ్యులు న్యాయనిర్ణయమున మోసగింపబడితిమని భావించినచో తీర్పునుమార్చవచ్చును. అట్టిచో న్యాయ నిర్ణేతలు, తీర్పు వలని లాభము పొందిన వ్యక్తి తమ తమ తప్పుల ప్రకారము దండువ చెల్లింపవలెను.[34] దీనిని బట్టి న్యాయ నిర్ణయమున అత్యంత జాగరూకత యుండెడిదని, ధర్మమును కాపాడుటలో న్యాయమూర్తులకు తమ తప్పులను సవరించుకొనుటకును, తమనుతాము శిక్షించుకొనుటకును అవకాశమున్నదనియు తెలియును. ఒకవేళ రాజు న్యాయస్థానపు తప్పుడు నిర్ణయము వలన ఒకని నుండి దండువ గొనినచో ఆ మొత్తము అతనికి తిరిగి యిచ్చుటయే కాక వర్ధాధిదేవత పేరిట ఆ మొత్తమునకు ముప్పది రెట్లు విలువైన ధనమును బ్రాహ్మణులకు దాన మొసంగవలెనని న్యాయశాస్త్రము లాదేశించినవి.[35] బాలురను, బంధువులను, పెద్దలను బెదిరించి తిట్టి, కొట్టి, అవమానించి చెప్పిన తీర్పు న్యాయము కానేకాదు.[36]

ఒక బ్రాహ్మణుడు వధార్హమగు నేర మొనరించెనేని అతని ఆస్తిని రాజు గ్రహించి, అతని తల గొరిగించి కుక్కచ్చును అతని ఫాలమున నిడి, గాడిదపై నెక్కించి, వీధులందూరేగింపుగ గ్రామము నుండి బహిష్కరింపవలెను ఈ దండమే వధతో సమానమని నీతి శాస్త్రకారు లభిప్రాయ పడిరి.[37] నేరస్థులు క్షుద్ర జాతికి చెందిన వారైనచో వధాదండమే విధింపవలెననియు తెలిపిరి.

సాధారణముగ గురువుపై శిష్యుడును, తండ్రిపై కొడుకు, యజమానిపై సేవకుడు, భర్తపై భార్య వివాదపడి న్యాయస్థానము నకు వెళ్ళరాదు. కానీ గురువు శిష్యుని తలపై మోదినపుడు శిష్యుడును పిత్రార్జితమైన ఆస్తిని తండ్రి దుర్వినియోగ పఱచినపుడు కొడుకును, తన భూషణము లన్నియు దొంగిలించి భర్త తనను ఇలువెడల ద్రోచినపుడు భార్యయు, యజమాని తన సేవను గుర్తించక తూలనాడినపుడు సేవకుడును, వారు న్యాయస్థానము నుండి న్యాయము కోరవచ్చును.[38]

రాజు కనుగొన్న ధనము లేదా అతనిని 'చేరిన' ధనము ఊరి వారెరుగకుండ దాచియుంచి యజమాని వచ్చి అడిగినచో అతనిని పరీక్షించి అతనికీయదగును. ఒక వత్సరము కాలము ఎవరును ఆ సొమ్మును అడుగనిచో అది రాజ ధనాగారమునకు చెందును. వ్యక్తి పోగొట్టుకొన్న ధనము లేదా 'చెడిన' ధనము రాజుదగ్గఱకు చేరినచో రాజు దానిని కాపాడి నిజమైన యజమానికి అడిగినపు డీయవలెను. అట్లు అడిగినవాడు ఆ ధనముపై తన స్వామ్యమును నిరూపించు కొనలేనిచో ఆ ధనము విలువంత దండువ నతడు చెల్లింపవలెను. నిధి లేదా 'పడిన' ధనము రాజు కంటబడినచో అందు బ్రాహ్మణు నకు సగమీయవలెను. దానిని బ్రాహ్మణుడే కనుగొనినచో నిధి మొత్తము నాతడే అనుభవింప నర్హుడు. నిధిని కనుగొన్న వ్యక్తి (ఇతర వర్ణములకు చెందినవారు?) రాజుకా విషయ మెఱుక పఱుపకున్నచో అతని నుండి ఆరవపాలుతప్ప మిగిలిన నిధియంతయు రాజు స్వీకరించి అతనికి యథార్హమైన దండమీయదగును. దొంగిలింప బడిన ధనము రాజు కనుగొనెనేని అతడు దానిని యజమాని కిప్పింప దగును. అట్లుగాక దానిని రాజు అనుభవించినచో ఆ ధనమును దొంగిలించిన దొంగ సంతరించుకొన్న పాపమంతయు రాజుకు సంక్రమించును.[39]

దీనినిబట్టి హక్కుదారులు కానివారు చేరిన, చెడిన ధనము లను కోరినచో నిరూపణపై శిక్షింపబడుచుండెడి వారని తెలియు చున్నది. అట్లే రాజును అనాయాసముగ లభించిన పాలితుల ధనమును తానేఅనుభవింప నిషేధించుటకై యజమానికొఱకై కొంత కాలపరిమితి వఱకు వేచియుండుట అను షరతు, పాపము సంక్రమించుట అను నైతిక నిరోధము కల్పింపబడినవి. ప్రజల ధనమాన ప్రాణములను రక్షింపవలసిన రాజే వానిని దురాక్రమణను చేసినచో తన నాశనమునకు తానే కారకుడగునను భావ మిట స్పష్టము. విజ్ఞానేశ్వరము వడ్డీరేట్లు ఆయా వర్ణముల వారికిట్లు విధించినది. బ్రాహ్మణునకు 2%, క్షత్రియునకు 3%, వైశ్యునికి 4%, శూద్రు నికి 5% బహుశా ఆ కాలమున ఆయా వర్ణముల వారి సంపాదనా శక్తినిబట్టి ఈ నిష్పత్తి భేదము విధింపబడియుండవచ్చు[40]

విజ్ఞానేశ్వరము సరిహద్దు తగాదాలు (గ్రామము, భూమి, ఇల్లు మొ॥ వానికి సంబంధించినవి) పరిష్కరించు విధానము తెల్పి నది. సరిహద్దు చిహ్నలు అంతరించిపోయినచో ప్రక్క గ్రామపు పెద్దల నుండి, గొల్లల కాపర్లనుండి, వేటకాళ్ళ నుండి సాక్ష్యము గొని వివాదములు తీర్పవలెను. భూమి సరిహద్దు వివాదములోచుట్టు పట్ల పొలము కలిగిన వారి సాక్ష్యము స్వీకరింపవలెను. వివాదగ్రస్తులైన వారిని లోగడ సరిహద్దునకు సంకేతప్రాయముగ పాతిన బొగ్గులను, ఇసుకను, రాళ్ళను, ఎముకలను, అచ్చోటి కట్టలను, చెట్లను, బావులను, కూపములను చూపుమని యడుగనగును. ఇవి ఏమియు లేనిచో చుట్టుపట్ల యూళ్ళ ప్రజల ఎదుట ప్రతిపక్షమునకు చెందిన వ్యక్తి సరిహద్దుతెలియునట్లుగ నడిచినచో అదియే సరిహద్దుగ నిర్ణయింపబడును.[41] ఇట్లు నడచుట, నడిపించుటద్వారా సరిహద్దు నిర్ణయము చేయు పద్ధతికి ఆధారము శాసనము లందును కనిపించు చున్నది.[42] కాకతి గణపతిదేవుని కరీంనగరు శాసనమొకటి గొనుగు కాలువ వివాదము పరిష్కరించుటకై గణపతిదేవుడు తన అధికారులను పంపినట్లును, వారు ప్రక్క గ్రామముల వారిని పిలిచి సాక్ష్యాదులు స్వీకరించినట్లును తెల్పుచున్నది.[43] సోమేశ్వరదేవుని మతమున శిక్షయే శాసనమును, శాంతిని కాపాడి ధర్మమును సంస్థాపించును. అంకుశముచే మదపుటేనుగు నిగ్రహింపబడునట్లుగనే శిక్షచే ప్రపంచము పాలింపబడును.[44] విజ్ఞానేశ్వరమున ప్రాయశ్చిత్త కాండలో ఏ నేరమునకు ఏ శిక్ష విధింపవలెనో వివరముగ తెల్పబడినది. అందు కొన్ని ఈ క్రిందివి :

	నేరము	శిక్ష
1	దేవ, భూదేవ, రాజదూషణ	ప్రతిదానికి 1000 పణములు
2	జూదము	మెడకు బాసికలు తగిలించి ముఖమున సున్నచుక్కవేయుట, జరిమానా
3	రోగిని, అంగవిహీనుని, వికలాంగుని, దుష్టాంగుని చూచి చెడనాడుట	3 రూకలును ఒక అడ్డుగు దండువ
4	గురువును, తల్లిని, తండ్రిని, తోబుట్టువును అకారణముగ నిందించుట	100 పణములు
5	వ్యక్తిని, కుటుంబ స్త్రీలను దూషించుట	520 పణములు
6	తనకంటె అధికుని, పరస్త్రీని దూషించుట	50 పణములు
7	అల్లుని దూషించుట	12 పణములు
8	శూద్రుడు బ్రాహ్మణునిపై ఉమియుట	శూద్రుని పెదవులు ఖండించి ఆ నిష్ఠ్యూతము నతడు తినునట్లుగ చేయుట
9	బ్రాహ్మణునికి నొప్పి కలిగించుట	ఏ అంగము వలన నొప్పి కలిగినచో నొప్పి కలిగించిన వాని ఆ యంగమును ఖండించుట.
10	కులశ్రేష్ఠుని, కులపెద్దను నిందించుట; బ్రాహ్మణుడు హతమార్చబడినాడను అపవాదము లేవదీయుట	504 పణములు
11	విప్రుడు క్షుద్రజాతి స్త్రీని కూడుట	1000 పణములు, దేశ బహిష్కారము, భగధ్వజ లాంఛన ఫాలము
12	నీచుడు బలాత్కారముగ కులీన వంశజను కూడుట	వధ
13	ఒంటరిగ పోవు స్త్రీని నెట్టుట, స్త్రీ తనను తాకవలెనని ఉద్దేశపడుట, స్త్రీ చీరను ఇతరులు చూచుచుండగ పట్టుకొనుట, స్త్రీతో ఏకాసనమున కూర్చుండుట, స్త్రీలకు తాంబూలాదులు, ప్రసాధనము, పూలు పంపుట, ఋతుస్నాతయైన స్త్రీతో సంభాషించుట, పరస్త్రీలతో రాత్రులందు మాటాడుట, కులీనులైన స్త్రీలను బలాత్కరించితినని గొప్పగా ఇతర స్త్రీల ముందు చెప్పుకొనుట[45]	ఇవి యన్నియు సజ్జనుడు కానివాడు చేసినచో అతనిని వేశ్యాలోలుని వలె శిక్షింపవలెను

స్త్రీలను పరోక్షముగ గాని ప్రత్యక్షముగ గాని అగౌరవపఱచినచో ఆ కాలమున అది గొప్ప సాంఘిక నేరముగ పరిగణింపబడినదని తెలియును. ఒక బాలిక ఉత్తమ కులమునకు చెందిన బాలుని వరించినచో ఆమె నతనికి పెండ్లి చేయవలెను.[46] శిక్షా పరిమాణము వేరయినను స్త్రీ గౌరవమును రక్షించుట ఆ కాలపు సంఘ గౌరవమును నిల్పుటలోని భాగమే యని విదితమగుచున్నది.

సోమేశ్వరదేవుడు వధ, విష, క్షుధ, దంతి, ఛేద, క్లేశ, సాహస దండములను, పాము, శస్త్రము, అగ్ని, నీరు మొదలైనవానిచే చంపుట అను శిక్షలను పేర్కొనినాడు. ఈతడు యథోచితమైన దండనునే సమ్మతించినాడు.[47]

శాసనములలో నేరములుగ పరిగణింపబడు చర్య (మరొక వ్యక్తికి కనిపించకుండ కూడ చేయునవియై యుండవచ్చు) లను నిరోధించుటకు శాపాత్మకమైన పద్ధతి యవలంబింపబడినది. ఇది శాశ్వతముగ వ్యక్తి మనస్సును వెన్నాడి పీడించు పద్ధతి. శాసనములలో పేర్కొనబడిన దానధర్మాదులను గౌరవించినచో, పరిరక్షించినచో (ప్రజాహిత నిర్మాణములు) సత్ఫలితములు, పుణ్యలోకములు ప్రాప్తించుననియు కలదు.[48]

అ ధో జ్ఞా పి క లు

1 బద్దెన, నీతిశాస్త్ర ముక్తావళి, శ్రీ నరేంద్రనాథ సాహిత్య మండలి, తణుకు, 196 ', పద్యములు 151, 44, 42, 3, 81, 98.

2 మడికి సింగన, సకలనీతి సమ్మతము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్, 1970, పద్యము 542.

3 Henry Yule, Travels of Marco Polo, John Murray, London, 1875, Vol. II, p. 347.

4 సోమేశ్వరదేవ, అభిలషితార్థ చింతామణి (మానసోల్లాస) మైసూరు, 1926, పుట 172, శ్లో. 1244/2.

5 బంగన, పద్యము 974.

6 మూలఘటిక కేతన, విజ్ఞానేశ్వరము, మానస పబ్లికేషన్స్, నెల్లూరు, 1977, వ్యవహారకాండ, ప. 8.

7 భారతి, ఆగష్టు 1977, పుటలు 14-15.

8 మంచన, కేయూర బాహు చరిత్ర, వేదము వెంకటరాయ శాస్త్రి బ్రదర్స్, మద్రాసు, 1970, ద్వి ఆ., ప. 87,95.

9 కేతన, వ్య. కా., ప. 51.

10 'సమయము' అను పదము సంస్థకు, నియమమునకు/ఒప్పందమునకు బదులుగా శాసనములలో ఉపయోగింపబడినట్లు ఈ క్రింది ప్రయోగముల వలన తెలియును.

(a) సంస్థ అను నర్థమున నుపయోగింపబడి దాని భిన్నవిధులు తెలియుచున్న ప్రయోగములు: తంగెడ స్థలము పదునెనిమిది సమయాలవారు, పదునెనిమిది సమయాల వారిని ఒడంబర్చి, నానాదేశ పెక్కండ్రు గూడి సమయకార్యము, పరమ మహేశ్వర సమయ చక్రవర్తి, కరివల్లభా సమయ చక్రవర్తి, వీర బలంజ్య సమయ ధర్మము, సమయ సేనాపతి, రాయ సమయ సేనాధిపతి, సమయద్రోహులు (ఆ సంస్థ ధర్మము నుల్లంఘించినవారు), సమయ దండము (ఆ సంస్థ నేరమునకు విధించిన శిక్ష), సమయానికి వెలి (ఆ సంస్థ సభ్యత్వము నుండి బహిష్కరణ).

(దక్షిణ హిందూ శాసనములు X, 495; వరంగల్లుజిల్లా శాసనములు, 84; ద.హి.శా. X, 473, 491, 526, 211; అదే, IV, 734; అదే, X, 721; అదే, VI, 136, 935; R. Narasimharao, Corporate life in Medieval Andhradesa, University Grants Commission, 1967, p. 25; హైదరాబాద్ ఆర్కియాలాజికల్ సీరీస్, సంపుటము 19, పుట 55; వరంగల్లు జిల్లా శాసనములు, 61.

(b) ఒప్పందము / నియమముగ ఈ క్రింది శాసనము లందు ప్రయోగింపబడినవి. (ద. హి. శా. X, 221, 502, 543; అదే, V, 26.)

(c) శాసనములలో మత సంబంధమైన సంస్థలుగ కూడ 'సమయము' ప్రయోగింపబడినది. (వరంగల్లు జిల్లాశాసనములు, 20, 22).

10a వేటూరి ప్రభాకరశాస్త్రి పరిష్కృత క్రీడాభిరామము, గంటి సూర్యనారాయణ శాస్త్రి, 1928, పుట. 82.

11 కేతన, వ్య. కా. ప 223; మానసోల్లాస, పు. 173, శ్లో. 1249.

12 మానసోల్లాస, పు. 173, శ్లో. 1251.

13 అదే, శ్లో. 1252; కేతన, వ్య కా. ప. 5–6

14 తిక్కన, శ్రీ ఆంధ్ర మహాభారతము, శాంతి పర్వము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్, 1977, ద్వి. ఆ. ప. 374.

15 మానసోల్లాస, పు. 177, ప. 1283.

16 బద్దెన, అనుబంధము, పు. 38, ప.50; సింగన, ప.79; తిక్కన, శాంతి పర్వము, ద్వి. ఆ. ప. 183, 247, 252; అదే, పం. ఆ., ప. 295.

17 కేతన, వ్య. కా., ప. 119, 113; అదే, ప్రా.కా; ప. 64.

18 అదే, వ్య. కా., ప. 118–121, 106.

19 అదే, ప. 42.

20 అదే, ప్రా. కా., ప. 102.

21 తంగిరాల వెంకట సుబ్బారావు (సంపాదకుడు), కాటమరాజు కథలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్, మొదటి సంపుటము, 1976, పు. 3–13.

22 అదే, పు. 4–6; కేతన, ప్రా. కా., ప. 91.

23 మానసోల్లాస, పు. 177, శ్లో. 1283; కేతన, వ్య. కా., ప. 32.

24 కేతన, వ్య. కా., ప. 33.

25 అదే, 100.

26 అదే, 101, 102.

27 అదే, 104.

28 అదే, 105

28a అదే, 108.

29 అదే, 106.

30 అదే, 34.
31 అదే, 35.
32 అదే, 36-39.
33 అదే, 102.
34 అదే, 40.
35 అదే, 41.
36 అదే, 52.
37 అదే, 42.
38 అదే, 53, 54.
39 అదే, 55-59.
40 అదే, 64.
41 అదే, 147.
42 దక్షిణ హిందూ శాసనములు, X, 261.
43 కరీంనగరుజిల్లా శాసనములు, అనుబంధము, కాకతి గణపతి దేవుని కరీంనగరు శాసనములు.
44 మానసోల్లాస, పు. 178, శ్లో. 1296-1298.
45 కేతన, ప్రా.కా., ప. 49, 41-48, 89, 108, 105.
46 అదే, ప. 110.
47 మానసోల్లాస, పు. 177, శ్లో. 1288, 1289 - 1291, 1292.
48 ఆ కాలమున దాదాపు ప్రతి శాసనము నందును కనిపించును.

గమనిక : వరంగల్లు జిల్లా, కరీంనగరు జిల్లా శాసనములు ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ ప్రచురించిన సంపుటములలోని సంఖ్యలు.

మాఘమాసపు మధ్యాహ్నంలో

శ్రీ మెతుకు మనోహర్ రెడ్డి

విశాలమైన పచ్చని పంట పొలాల్లో
పట్టపగలు ఏకాంతంలో చెట్టునీడలో
ఆకాశంకేసి చూస్తే, అంతాశూన్యం
ఆశూన్యపు రంగంతా నీలం.

పక్షుల కలకలారావాలు
చెట్ల కొమ్మల గాలి సవ్వడులు
దూరంగా కాలిబాటపై చెప్పుల, చేక్రల శబ్దాలు
దూరంగా లేత నీలం ముద్దగా నిల్చున్న కొండ
ఆ కొండను దాటి ఎగిరిపోతున్న విహంగాల గుంపు
పంటనీటి కాలువలో ఒంటి కాలిమీద దొంగజపం చేస్తున్న కొంగ
పచ్చిక బయల్లో మేస్తున్న ఆలమందల కదలికలు
గొర్రెల కాపరుల అదలింపులు, గోవుల ఆవులింతలు
బండ్ల బాటపై సవారిబండి[1] ఎద్దుల మెడల్లో గుంగురుల శబ్దాలు
తుమ్మచెట్టుపై నున్న ఉన్నట్లుండి చేస్తున్న కాకిగోల
కలుపుతీస్తూ ఒంటరిగా మావని గురించే పాడుతున్న కాపుకన్నె గీతం
నన్నీ ప్రపంచంనుండి ఊహాలోకాల్లోకి చేర్చింది!

1 తెలంగాణాలో ప్రయాణాని కుపయోగించే ఎద్దుల బండి.

కలగూరగంప

పండితారాధ్యుడి మతము

శివశ్రీ ముదిగొండ ఈశ్వరచరణుల వ్యాసం సాంతంగా, శాంతంగా చదివిన తరవాత జవాబుగా కొంత వ్రాయవలసి వచ్చింది. వారికి ఆరాధ్య సంప్రదాయంమీద ఉన్న అభిమానం సహజం. శివశ్రీ నిర్మల శంకరశాస్త్రిగారు ఆరాధ్య సంప్రదాయం యొక్క ప్రచారం కోసం శివాద్వైత సిద్ధాంత సంఘం ఏర్పాటు చెయ్యటమే కాక నీలకంఠభాష్యాన్ని అనువదించారని తెలిసి సంతోషించాను. శివశ్రీ ఝూలంపల్లి రాజశేఖరశాస్త్రులవారి 'నాందీ శ్లోకం', శైవ శాస్త్ర పారంగతులు సర్వశివశ్రీ ముదిగొండ నాగలింగశాస్త్రులవారు (మహామహోపాధ్యాయ—ఎవరు ఇచ్చింది ? బహుశ మహోపాధ్యాయ అయి ఉంటుంది) కోటయ్యశాస్త్రి అయ్యవార్ల పేర్లు విన్న తరవాత వారందరిని మరొకసారి దర్శించినంత ఆనందం పొందాను. ఆధారగ్రంథాలలో పెద్దపెద్ద పుస్తకాలను చూచిన తరవాత ప్రతి విమర్శ చెయ్యటం సబబుగా తోచలేదు. అయినా ఆరాధ్య సంప్రదాయం మీద ఉండే అభిమానంచేత నాలుగు ముక్కలు వ్రాస్తున్నాను.

(1) కీ.శే. కొమర్రాజు వేంకటలక్ష్మణరావుగారు శివతత్త్వసారాన్ని చక్కగా సంస్కరించి 15–11-1921న ఒక ప్రామాణికమైన పీఠిక వ్రాశారు. ఆ గ్రంథాన్ని 1922 లో ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు ప్రకటించారు. తిరిగి 47 ఏళ్ళ తరవాత కృష్ణాపత్రికా కార్యాలయం వారు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారి విపులపీఠికా సమేతంగా హైదరాబాదులో 1968లో ప్రకటించారు వ్యాసకర్త పేర్కొన్నట్లుగా 'సుమారు నలభై సంవత్సరాలకు' మాత్రం కాదు.

(2) "శ్రీ కొమర్రాజు మొదలయిన వారు శైవ సంప్రదాయములు తెలియనివారు" అని వ్యాసకర్త తమకు తెలియని విషయాన్ని తెలిసినట్లుగా వ్రాశారు. లక్ష్మణరావుగారు ఆరాధ్య బ్రాహ్మణులు. ఆయన పోయేవరకు యజ్ఞోపవీతానికి లింగం ఉండేదని ఆయన భోజనం చేసేముందు దానికి నైవేద్య మిడి తాము భుజించేవారని లక్ష్మణరాయ చరణ సన్నిధిని చిరకాలం గడిపిన స్వర్గీయ ఆదిరాజు వీరభద్రరావుగారు ఎన్నోసార్లు రేడియోలోను, వ్యాసాల్లోను వ్రాశారు. తెలుగుదేశపు నవయుగ వైతాళికులలో కందుకూరి, కాశీనాథుని, కొమర్రాజు వీరశైవులవటం వల్ల పట్టుదలతో పనిచేశారని ఆచార్య బిరుదురాజు రామరాజుగారి వంటి అనుభవంగల పరిశోధకులు అంటూ ఉంటారు. బహుముఖ ప్రజ్ఞాశాలి దిగంత యశోవిశాలుడైన లక్ష్మణరావుగారికి శైవ సంప్రదాయాలు తెలియవని తేలికగా అనవలసినమాట కాదు. శివతత్త్వసారాన్ని వారే పరిష్కరించి పీఠిక వ్రాయగల సమర్థులని ఆనాటి దిగ్దంతులయిన పండితులే ఆయనకు ఆ పనిని వదిలేశారు.

(3) పై వ్యాసంలో వ్యాసకర్త ద్వితీయ ముద్రణ పీఠికకర్త శ్రీ నిడుదవోలు వేంకటరావుగారి వాక్యా లనుకొని ఎత్తి వ్రాస్తూ —

"నీలకంఠశివాచార్యులు విశిష్టద్వైతియైనను, పండితుడు మాత్రము ద్వైతియనియే చెప్పవలయును. 'ఇది దారుణం.' సంప్రదాయం తెలియని వారు చేసిన తప్పునే తెలిసినవారు కూడా చెయ్యటం విచిత్రమైన విషయం" అన్నారు.

శ్రీ ఈశ్వరచరణులు వ్రాసిన వాక్యాలు ఎంత విపరీతార్థాలకు దారితీస్తున్నాయో చెప్పలేం! సంప్రదాయాలు తెలియనివారు లక్ష్మణరావు కదా! వారి వాక్యాలనే వేంకటరావుగారు కొటేషన్లు పెట్టకుండా తిరిగి వ్రాయడంవల్ల వేంకటరావుగారప్పుడు 'తెలిసిన వార'వుతారు. అటువంటప్పుడు వ్యాసకర్త తన వ్యాసాంతంలో ముక్తాయింపుగా వేంకటరావుగారికి స్థిరమైన అభిప్రాయాలులేవని లేదా ఉండవని ఎట్లా వ్రాయగలిగారు ? (వారి వ్యాసంలో మరో సారి కూడా సంప్రదాయం తెలిసినవారని వ్రాశారు). లక్ష్మణరావుగారి అభిప్రాయాన్ని స్వర్గీయ వంగూరి సుబ్బారావుగారు, స్వామి శివశంకరులు డా.కె.గోపాలకృష్ణారావుగారు "మొదలైన పెద్దలు" గతానుగతికంగా అనుసరిస్తే, లక్ష్మణరావుగారి వ్రాతలనే యథాతథంగా ఎత్తి వ్రాసిచూపి అనుసరించిన వేంకటరావుగారు పెద్దలు కాలేదా! అసలు పరిశోధకుడని అనుకొంటున్నవారు లక్ష్మణరావుగారి పూర్తి వాక్యాలు ఉద్ధరించకుండా మసిబూసి మారేడుకాయ జేసి విద్వత్ ప్రపంచానికి చాటి చెప్పడం న్యాయమేనా ? ఇదేనా సత్యాన్వేషణ ? లక్ష్మణరావుగారి ముద్రిత ప్రతిలోని 164 వ పుటలోని "మాయారాద ఖండనమునందు" మొదలుకొని "పండితుడు మాత్రము ద్వైతియనియే చెప్పవలయును" వరకు ఉన్న వాక్యాలు వారివేగదా! అసలు లక్ష్మణరావుగారి శివతత్త్వసార ముద్రణ వ్యాసకర్త చూశారా ? అని అనుమానం. ఆధార గ్రంథాలలో వేంకటరావుగారి ముద్రణే ఉండటం దీనికి కారణం. ఇదే ఈ వ్యాసానికి వచ్చినలోటు. మల్లికార్జున పండితుడు ద్వైతా! కాదా! అనడానికి చేయవలసిన శాస్త్రచర్చ మరో తీరులో నడుస్తుంది. అది వ్యక్తి ప్రధానం కాకుండా యుక్తి ప్రధానం ఉంటుంది. శాస్త్రవాదనకి మళ్ళీ శంకరశాస్త్రిగారే కావాలి!

(4) "బసవ పురాణమున సోమనాథుడు పండితుడు ప్రతిపాదించినది ఈశ్వరాద్వైతమని చెప్పియున్నాడు.

'అదిగాక విమండీశ్వరాద్వైతమనుట
ఇదియు సర్వాద్వైతమే యట్లుగాక'

అని వ్యాసకర్త ఉదహరించారు. అసలు బసవపురాణంలో పండితారాధ్యుని ఈశ్వరాద్వైతం ఎందుకు వస్తుందో ఊహించలేని వారు అతడు ద్వైతా! అవునా కాదా అనే జటిలమైన సమస్యలను లేవనెత్తడానికి అర్హులు కారని చెప్పడానికి ఆగ నక్కర

లేదు. పై పంక్తులు పండితారాధ్య చరిత్రలోనివి. పండితుని మాటలే! శివతత్త్వసారంలో

అద్వైతైకస్థితి నీ
యద్వైతమగాన యీశ్వరాద్వైతము స
ర్వాద్వైతమనగలేఁబు జ
గద్విపరీతమగు తత్త్వగతిగలదె శివా(64)

పండితుని శివతత్త్వసారంలోని పాదాలను సోమనాథుడు ద్విపదలలో పాదిగిస్తాడు. పుస్తకాలు చదివితే ఇటువంటి పొర బాటులు దొరలవు.

(5) వీరశైవం ద్వైతంతో మొదలుపెట్టి అద్వైతంలో పర్యవసిస్తుందని ఆ తత్త్వాన్ని పరిశీలించిన వారంతా అన్నారు. ద్వైతంలో జీవ బ్రహ్మలకు స్వామి భృత్యభావం చెప్పబడింది. బసవన తన భక్తి 'స్వామి భృత్య సంబంధమే నా భక్తి' అని 298 వచనంలో చెప్పాడు. ఇంకా కావలిస్తే 'నీ దాసుల దాసుని దాసుడ' (వచనం 341) అన్నాడు 'త్వద్దాసదాస చరమావధి దాసదాసః' అన్నట్లు. పండితారాధ్యులు కూడా ఈ సంబంధాన్ని వ్యక్తం చేశారు. ఏ నిశ్చయపరుఁడను, నీశానుఁడు నా స్వామి యనుచు సంతతమును సం. త్రాణగతి స్వామి భృత్యజ్ఞానంబున నిన్నెగొల్తు సర్వానందా! (67) స్వామి భృత్యసంబంధమునం బొదలిన కేవల భక్తికి నొదసిన కూటంబుగలదే! (456) ఈ దాస భావాన్ని పండితుడు మరో రెండు పద్యాలలో చెప్పాడు (220, 221).

శ్రీపతి పండితుడు "శ్రుత్యేకదేశ ప్రామాణ్యం ద్వైతా ద్వైత మతాదిషు! ద్వైతాద్వైతమతే శుద్ధే, విశేషాద్వైత సంజ్ఞికే! వీరశైవ సిద్ధాంతే సర్వశ్రుతి సమన్వితః!!" అని వీర శైవ సిద్ధాంతం ద్వైతాద్వైత మని పేర్కొన్నాడు.

షట్‌స్థల సిద్ధాంతంలో భక్తస్థల, ప్రసాదిస్థలాలలో భక్తుడు ఆత్మబల సాధనలో అతిక్రమించి ప్రాణలింగి స్థలంలో ప్రవేశించేటప్పటికి ద్వైతభావం వదలి అద్వైతాభిముఖుడవుతాడు. కాబట్టి వీరశైవం ద్వైతాద్వైతం అని శ్రీపతి పండితుడు చెప్పాడు. ఈ విషయాలు సిద్ధాంత శిఖామణిలో కూడా(10 - 39, 40) చెప్పబడ్డాయి.

దీనిని బట్టే లక్ష్మణరావుగారు మల్లికార్జునుడు ద్వైతి అని భావించారు. ఇతరులు వారి భావాలను తర్కించకుండా తల ఊపారు.

(6) వ్యాసకర్త పేర్కొన్న శ్రీకంఠభాష్యం ఆరాధ్య సంప్రదాయానికి అతి ప్రాచీనమైందని, శ్రీ శంకరులకంటె ముందని గట్టిగా చెప్పలేం. శంకర — రామానుజాచార్యుల వారి మధ్యకాలంలో పుట్టిఉండ వచ్చునని లక్ష్మణరావుగారు హిందు మహా యుగంలో వ్రాశారు. ఈ పుస్తకాన్ని కూలంకషంగా పరిశోధించిన శ్రీ ఎస్. ఎస్. సూర్యనారాయణశాస్త్రిగారు (Sivadwaita of Srikantha) దీన్ని వీరశైవభాష్యమని కాని ఆరాధ్యులకు ప్రామాణిక గ్రంథం అని కాని చెప్పలేదు. శ్రీపతి పండితుడు శ్రీకరభాష్యంలో చెప్పిన మాటలకు కర్ణాటక వీరశైవ పండితులు విపరీతార్థాలు కల్పించారు. అసలు శ్రీకరభాష్య రచన పండిత త్రయంలోని శ్రీపతివి కాదని ఎన్నో రకాల పరిశీలించిన వారు నిర్ణయించారు.

మల్లికార్జున పండితుని శివతత్త్వసారం సంపూర్ణంగా లభ్యం కాకపోవడం దురదృష్టకరం. లభించిన గ్రంథాన్ని దేశ కాల పరిస్థితులకు, శైవమతంలోని విభిన్న శాఖలకు ఎంతవరకు సమన్వయం అవుతుందో తేల్చి చెప్పవలసిన పని చాలా ఉంది. పండితుడు చండాలురు శివభక్తులయితే నెత్తెక్కించు కొమ్మన్నాడు (119, 121, 131). ఆరాధ్యులు ఇప్పుడు ఆ పని చేస్తున్నారా?

(ఒ వి)

పల్లె పదాలు - వేద మంత్రాలు

పల్లెపదాలు ప్రజా జీవనానికి వేదమంత్రాలు. ప్రకృతితో స్పందించే పల్లీయుల్లో ప్రకృతి తత్త్వం జీర్ణమైపోయి కనిపిస్తుంటుంది. వ్యవసాయమే ఫలసాయం. మూల చుక్కతో మేల్కొన్న దాదిగా బతుకంతా కర్మనిష్ఠాత్మకం. ఆ కర్మ నిష్ఠవల్ల వారు మంత్రద్రష్టలవలె పల్లెపదాల స్రష్టలవుతున్నారు. మంత్రమెట్లు స్వర సహితోచ్చారణాత్మకమో, పల్లెపదం కూడా లగువు బిగువులతో లయ గర్భితమయింది. ఆర్య జీవనానికి వేదాలెట్లో పల్లె జీవనానికి పల్లె పదాలట్లు నిదర్శనం. అంతేగాక, పెక్కు పల్లె పదాల్లో వేద మంత్ర ముద్ర లెట్లున్నవో పరికింపదగును.

వర్షారంభకాలములో పల్లీయులు వానదేవుని ప్రార్థిస్తూ - పాడెడు పెక్కు పదాలు ఋగ్వేదంలోని వరుణ స్తుతి మంత్రాలను దలపింపజేస్తుంటాయి. సకాలానికి వానలు పడకున్నట్లయితే వెంటనే పల్లెల్లో కప్ప కావడి గట్టి,

"కప్పమ్మ నీళ్లాడె కాలమెండీపోయె వానదేవో ఓ వానదేవా
ఇగనన్న దయలేద జగమేలు తలిదండ్రీ ఓ వానదేవా"

అంటూ పాడే సన్నివేశం ఋగ్వేదంలోని మండూక సూక్తాన్ని స్ఫురింపజేస్తుంటది. వర్షకాముడైన వసిష్ఠుడు పర్జన్యుని స్తుతించే టప్పుడు మండూకాలు అనుమోదించి బెకబెకా రావాలు చేసినయి.

"సంవత్సరం శశయానా బ్రాహ్మణా వ్రతచారినః
వాచం పర్జన్య జిన్వితాం ప్ర మండూకా అవాది షుః"
(ఋగ్వేదము 7-6-103-1)

ఆ బెకబెకలు పర్జన్యునకు ప్రీతికరమైన పలుకులని యెంచి వసిష్ఠుడు పది ఋక్కులలో మండూకాలను స్తుతించినాడు. అనగా వరుణ స్తుతి ననుసరించి మండూక స్తుతి యెట్లు చేయబడిందో అట్లే యిప్పటికీ పల్లీయులు ప్రతియేటా వానదేవుని పాటల ననుసరించే కప్పతల్లి పాటలు పాడుకోవటం సంప్రదాయమయింది.

''మృగశిరా కార్తిలో ముంచెత్తు వాన
విత్తనాలూదీసి విరజిమ్మ వయ్యా
ఒక గింజ కోటియై వర్ధిల్లు మీకు''

అన్నట్టి పల్లెపదం వ్యవసాయ జీవనానికి ఆశీర్వాదమైనట్లే, నూరు చేతులతో విత్తనాలు నల్లి వేయి చేతులతో పుష్కలమైన పంట పొందవలెనని –

''శతహస్త సమాహర సహస్ర హస్తసం కిర
కృతస్య కార్యస్య చేహ స్ఫాతిం సమావహ''
(అథర్వవేదం 3-24-5)

ఇట్లు చెప్పిన వేదమంత్రము గమనార్హం.

వానల్లు కురువాలె వానదేవుడా—వరిచేలు పండాలె వానదేవుడా
మా యిల్లు నిండాలె ,, మాయమ్మ వండాలె ,,
మా బొజ్జ నిండాలె ,,

అంటూ పల్లీయులు వర్షకాములై ఉత్సాహముతో బాడుట

''అయం నో నభస్పతిః సంస్ఫానో అభిరక్షతు
అసామతిం గృహేషునః'' (అథర్వ. 6–79–1)

వేదోక్తమైనది పంట చేలకు నష్టముదెచ్చు ఎలుకలు, మిడుతలు మున్నగునయి నాశనమై పోవాలెని ''కోతగాడు కోతగాడు నీపైరు—ముట్టకు అంటకు నా పైరు--గుడ్డిదానవైపో ఎలుకమ్మా—చెవిటి దానవైపో ఎలుకమ్మా'' అంటూ, చేను చుట్టూ దిరుగుతూ మంత్రించినట్లుగానే వాటి నాశనానికి వేదోపదేశాలు (అథర్వ. 6–50–1,2,3) ఉన్నయి.

''కొయ్యండల్లా కొయ్యండీ—కోసీ బణువూ లెయ్యండీ
....
కాలంసూత్తే సీతాకాలం—కొడవలిపాటూ జాగర్త్ర''

అంటూ చేని కోతలకై కొడవలి నుపయోగించు పద్ధతి –

''యు నక్తసీరా వి యు గా తనోత కృతే యో నౌవపతేహ బీజం
విరాజః శ్రష్టిః సభరా అసన్నో నేదీయ ఇత్ సృణ్యః పక్వమాయవన్''
(యజుర్వేదము 12–68)

ఇట్లు వేదకాలము నుంచీ వున్నట్లే – అనగా నాగళ్ల కెడ్ల నమర్చి భూమిని తగినట్లు పాతముజేసి, విత్తనం వేసి ఆ తర్వాత పంటకు వచ్చిన కంకులను సరియైన స్థితిలో కొడవలితో కోయాలని మంత్ర భావం.

''ఒలియొ ఒలియొ ఒలియొ ఒలియాలే
రావేలు గలవాడ రార పొలిగాడా!
రావేలు మీవయ్య రాశిమీదయ్య
పొలిగాడు గొట్టంగ పోయెరా రాశి
వచ్చెరా పొలిగాడు వాయువేగానా
దాగెరా పొలిగాడు దండ కట్టుల్ల''

అంటూ కళ్లంలో ధాన్యం రాల్చి, తూర్పారబట్టి, శుభ్రం జేస్తూ అన్న సమృద్ధి నాశించుటలో –

ఉపోహశ్చ సమూహశ్చ క్షత్తారో తే ప్రజాపతే
తావిహో వహతాం స్ఫాతిం బహుం భూమాన మక్షితం
(అథర్వ. 3–2-7)

అను మంత్రము ముద్రవైచుకున్నది. అనగా పైపాటలోని భావాన్ని ఈ మంత్రం పోషించిందని తోచును.

వివాహ సంబంధాల్లో మొట్టమొదట –

''అల్లవూరీవారు పిల్లనడిగేరూ–పిల్లవానికి రూపురేకలున్నాయిగా
పైటేట పండేటి భూములున్నాయిగా–వూరి పొలిమేర్ల తోటలున్నాయి
....
పిల్లదానికి తగిన యీడుజోడేనూ–కన్నెనిస్తామని కబురంపుదాము''

అంటూ వరవధూ వివాహయోగ్యతను నిశ్చయించుకోవటం -

''శుద్ధాః పూతా యోషితో యజ్ఞియా ఇమా బ్రహ్మణాం
హస్తేషు ప్ర పృథక్ సాదయామి
యత్కామ ఇదమభి షిఞ్చామి వోహ మింద్రో
మరుత్వాన్స దదాతు తన్మేః'' (అథర్వ. 6–122–5)

వేదోపదిష్ట సంప్రదాయానుగతమయింది.

వరున్ని యెన్నుకోవటములో –

''కియతీ యోషామర్యతో వధూయోః
పరిపీతా పన్యసా వార్యేణ
భద్రా వధోర్భవతి యత్సుపేశాః స్వయం
సామిత్రం వనుతే జనేచిత్'' (ఋగ్వే. 10–27-12)

ఇట్లు కన్యల కుండిన స్వాతంత్ర్యా నేదు అక్కడక్కడ కనుపించక పోదు. ఒక మేనమరదలు పెద్దలు కాదన్నాకాని స్వతంత్రించి మేన మామ కొడుకును వరించి ''మేనమామ కూతురు మేళము గట్టి – మేలము లాడుతు మేడ దిగనీదు.'' పెండ్లి పందిరిలో ''చేయి కల్పి కాలు దొక్కి నేయి పాలు తాగుదాము'' వంటి పెండ్లిపాట పాణిగ్రహణ పరమార్థాన్ని సూచిస్తుంది. ఆ పరమార్థ మీ మంత్ర ములో చూడవచ్చును –

ఓం గృభ్ణామి తే సౌభగత్వాయ హస్తం
మయా పత్యా జరదృష్టిర్యథా సహః
భగో అర్యమా సవితా పురన్ధిర్మహ్యాం
త్వా దుర్గార్హపత్యాయ దేవాహః
(ఋగ్వే. 10–85–36–1)

అప్పగింతలప్పుడు వధువు వాలింగనము చేసికొని తల్లి కొన్ని బుద్ధులు గఱపుతూ

''అత్తవారింటికి ఆనందముగ బొమ్మ
అత్తమామల భక్తి చిత్తములో నిలుపు
వారిపై ప్రేమ వాసుదేవుని పూజ.........''

''మాననీయులకు మానమే ప్రాణము
మంచికీర్తి కొంచమైనా చాలు
అత్తగారింటికి అమ్మగారింటికి
మంచి పేరు తెమ్మ.........''

''పతి కంటె ముందుగా పనులెల్ల దీర్చి
పతి పాదముల సేవ భక్తితో సేయుమా''

నుడివిన ఉపదేశము వేదమంత్రాలకు సమీపమయినది.

''సంరాజ్ఞీ శ్వశ్రురేషు సంరాజ్ఞ్యుత దేవృషు
ననాందుః సంరాజ్ఞీధి సంరాజ్ఞ్యుత శ్వశ్ర్వాః''
(అథర్వ. 14–1–44)

అనగా వధువు అత్తమామాదులలో గౌరవం పొంది మహారాణి వలె జీవించవలెనని భావము.

''స్యోనా భవశ్వశు రేభ్యః స్యోనా పత్యే గృహేభ్యః
స్యోనాస్యై సర్వస్యై విశేస్యోనా పుష్టా యై షాంభవ
(అథర్వ. 14–2–27)

అనగా వధువు మామ కోసం, భర్త కోసం, ఇతర కుటుంబ సభ్యుల కోసం, ప్రజలందర కోసం సుఖాన్ని ప్రసాదించేదిగా ఉండాలెని ఉపదేశం. ఇట్లు తల్లిచేత ధర్మోపదేశ మందిన వధువు ఆ తల్లి పాదాలంటి మొక్కుచుండ –

''కొడుకులు బిడ్డలు కొమరొప్ప గలుగనీ
నిండుముత్తైదవై వుండవే తల్లీ''

అంటూ తల్లి దీవించిన దీవన కూడా;

''యే పితరో వధూ దర్శా ఇమం వహతు మాగమన్
తే అస్యై వధ్వై సంపత్న్యై ప్రజావచ్ఛర్మ యచ్ఛంతు''
(అథర్వ. 14–2–73)

అను మంత్రాన్ని దలపింపజేస్తున్నది.

సంతాన విషయంలో –

''శమీమశ్వత్థ ఆరూఢ స్తత్ర పుంసవనం కృతం
తద్వై పుత్రస్య వేదనం తత్ స్త్రీష్వా భరామసి (1)
పుంసి వైరేతో భవతి తత్స్త్రియామను షిచ్యతే
తద్వై పుత్రస్య వేదనం తత్ప్రజాపతి ర బ్రవీత్ (2)''
(అథర్వ. 6–11–1, 2)

అనగా ఏ జమ్మిచెట్టుపై రావిచెట్టు మొలచునో, ఆ చెట్టుయొక్క వేరును గర్భాదానము నాటినుంచి రెండు మూడు మాసాలదాకా ఔషధంగా స్త్రీకి నిచ్చినచో పుత్ర సంతాన ప్రాప్తియగు నన్న వైదిక విజ్ఞానం, నేడు గోదావరీ ప్రాంతాలలో... గ్రామీణులు సంతానార్థమై –

''సింహాద్రి అప్పన్న గుళ్లముందారా
పద్దారు గొడ్రాళ్ల ప్రాణచారాలు...
ఈశ్వరుని గుళ్లకూ రాళ్ల మోసేవూ
రావిచెట్టుకు ప్రదక్షిణలు చేసేవూ''

ఇటు కేవలం రావి చెట్టుకు ప్రదక్షిణలు చేయుటవరకే పరిమితం చేసుకోవటం అవుతున్నది.

ఇల్లలికి ముగ్గు పెట్టి	వలలో	ఇంటి సుందారీ	వలలో
ఈ యింటి సుందారీ	''	ఎందూ వోయిందీ	''
తల్లిగారి వాడల్లో	''	నూడావోయిందీ	''
అమ్మ యేమన్నాదే	''	ఓ రామా చిలుకా	''
అమ్మ ఆరూ నెలలూ	''	ఉండీ పొమ్మానే	''
అయ్య యేమన్నాడే	''	ఓ రామా సిలుకా	''
అయ్య పొత్తుల అన్నం	''	తినీ పొమ్మానే	''
అక్క యేమన్నాదే	''	ఓ రామా సిలుకా	''
అక్క అద్దం రవికే	''	తొడుక్కాపొమ్మానే	''
చెల్లె లేమన్నాదే	''	ఓ రామా సిలుకా	''
చెల్లెలూ చెట్ల రవికా	''	తొడుక్కాపొమ్మానే	''
అన్న యేమన్నాడే	''	ఓ రామా చిలుకా	''
అన్న ఆవూ పెయ్యా	''	కొట్కా పొమ్మానే	''
తమ్ముడే మన్నాడే	''	ఓ రామా సిలుకా	''
తమ్ముడు తన పెండ్లీ	''	సేసీ పొమ్మానే	''

ఈ పాట పరస్పరానురాగ గర్భిత పల్లీయ కుటుంబ జీవనాన్ని కన్నులకు కట్టిస్తున్నది. తల్లిదండ్రులు, బిడ్డలు, పరస్పర మధుర వర్తనతో జీవించవలెనన్న క్రింది వేదమంత్రాలీ సందర్భంలో గమనిస్తే పై పాటలో వాని ముద్ర భద్రపరుచబడినట్లు తెలుసుకోవచ్చు.

''అనువ్రతః పితుః పుత్రో మాత్రాభవతు సమ్మనాః
జాయాపత్యే మధుమతీం వాచం వదతు శాంతివాం (2)
మా భ్రాతా భ్రాతరం ద్విక్షన్మా స్వసారముత స్వసా
సమ్యం చః సవ్రతా భూత్వా వాచం వదత భద్రయా (3)''
(అథర్వ. 3. 30–2, 3)

సమాజ జీవనాన్ని గూర్చి వేదం గొప్పగా ఉపదేశించింది. ప్రత్యేకంగా ఋగ్వేదంలోని సంఘటన సూక్తం దానికినిదర్శనం. ''సంగచ్ఛధ్వం సంవదధ్వం సంవో మనాంసి జానతాం.......... (ఋగ్వేదం 10–191–2)'' పరస్పరం కలిసి వుండటం, ప్రేమతో మాట్లాడుకోవటం, ఒకేతీరు మనసుతో జ్ఞానాన్ని (పరమాత్మను) పొందట్లం అన్న విషయం ఈ క్రింది పదంలో ఛాయామాత్రంగా గోచరిస్తుంది.

నీటిని నమ్మి	ఏలేలో	నేలున్నాదీ	హైలాసా
నేలను నమ్మి	,,	పంటున్నాదీ	,,
పంటను నమ్మి	,,	కాపున్నాడూ	,,
కాపునునమ్మి	,,	ప్రజలుండారూ	,,
ప్రజలను నమ్మి	,,	రాజ్యం వుండది	,,
రాజ్యం నమ్మి	,,	నువ్వున్నావు	,,
నిన్ను నమ్మి	,,	నేనున్నాను	,,

అనగా సమాజములో అందరు కూడా పరస్పర మాధారపడి విశ్వాసముతో చక్కగా జీవించాలెనన్న పల్లీయోక్తం సంఘటన సూక్తమే.

ఈ విధంగా పరిశోధిస్తూ పోతే వేద మంత్రాలవలె పల్లెపదాలు అపౌరుషేయాలై నిలుస్తుంటాయి. అతిప్రాచీనతను నిలుపుతుంటాయి. దేశ కాల పాత్రాతీతమైన వసుధైక కుటుంబతత్త్వాన్ని ప్రబోధిస్తుంటాయి. నిరాడంబరత్వం, నిష్కల్మషత్వం, ప్రకృతి పరిశీలనం, సర్వత్ర పరమాత్మ దర్శనం అనునవి పల్లీయ హృదయ తత్త్వాన్ని బుజావు పరుస్తుంటాయి. ఆ పల్లీయ హృదయతత్త్వం ఋషిహృదయతత్త్వం పైలక్షణాలలో ఏకత్వంగా భాసిస్తుంటాయి. అందువల్ల, పల్లెపదాలు, వేదమంత్రాలు మానవ జీవితానికి మౌలిక సూత్రాలుగా వర్తిస్తుంటాయి. శాశ్వత విలువలను పోషిస్తుంటాయి.

డాక్టర్ యెల్దండ రఘుమారెడ్డి

చెళ్ళపిళ్ళ - ఆదిభట్ల

చెళ్ళపిళ్ళ అంటే తిరుపతి వేంకట కవుల్లో ఒకరైన వేంకట శాస్త్రిగారు. ఆదిభట్ల అంటే హరికథా పితామహులైన ఆదిభట్ల నారాయణదాసుగారు. అదేం దైవ చిత్రమోకాని, ఈ ప్రతిభావంతుల జీవితాల్లో సాదృశ్యాలు అనేకం కన్పడతాయి. ఆ సాదృశ్యాల్ని వివరించడం ఈ వ్యాస లక్ష్యం.

శాస్త్రిగారు, దాసుగారు ఇద్దరూ, చెరో ప్రక్రియను బహుళ ప్రచారంచేసిన ప్రక్రియా ప్రచారకులు. శాస్త్రిగారు అవధాన ప్రక్రియను, దాసుగారు హరికథా ప్రక్రియను తెలుగుదేశంలో ప్రతి బజారికి పరిచయం చేసినవారు. శాస్త్రిగారు చేపట్టడానికిముందు అవధాన ప్రక్రియ, దాసుగారు చేపట్టడానికిముందు హరికథా ప్రక్రియ లోకంలో లేకపోలేదు. ఉన్నా, ఈ రెండు ప్రక్రియల్ని సంపూర్ణంగా ఎరిగినవాళ్ళు అక్షరాస్యుల్లో కూడా తక్కువే. కొంత మందిచేతమాత్రం నామమాత్రంగా పలకరింపబడుతూ ఎక్కడెక్కడో చెదురు మదురుగా వున్నయ్. ఇట్లా ఎక్కడెక్కడో మారుమూలల్లో అసూర్యం పశ్యలుగ, అనాథలుగా వక్కివున్న ఈ ప్రక్రియలు ఈ కళాకళత్రుల కరగ్రహణంతో సాటి ప్రక్రియల్లో పోటీబడ్డాయి. కొన్ని దశాబ్దాలు ప్రభుత్వం చేశాయి. పండితుల దగ్గరనుంచి పామరులదాకా అందర్నీ పలకరించాయి. శతావధాని అంటే వేంకటశాస్త్రిగారనీ, హరిదాసు అంటే నారాయణదాసుగారు అనీ వెంటనే గుర్తుకు వచ్చేటంతగా, ఈ ప్రక్రియలకి ప్రాణ ప్రతిష్ఠచేసి జనాకర్షణ యంత్రం కట్టిన ప్రక్రియారాధకులు వీళ్ళిద్దరు.

ఈ మహామహు లిద్దరూ నానారాజ సందర్శనం చేసి గజారోహణం మొదలైన అనేక సన్మానాల్ని పొందినవారు. అవధానాలనే వంకతో శాస్త్రిగారు, హరికథలనే వంకతో దాసుగారు రాజాస్థానాలన్నింటినీ శారదా పీఠాలుగా చేసినవారు. రాజాస్థానా లన్నింట్లో, అవధానాలంటూ శాస్త్రిగారు సాహిత్య సరస్వతికీ, హరికథలంటూ దాసుగారు సంగీత సరస్వతికీ ఆరతు లిప్పించినవారు. ఇట్లా ఈ ఇద్దరూ రాజాస్థానాలకు సరస్వతీ పురోహితులు.

వీళ్ళిద్దరూ అపారంగా శిష్య సంపద కలిగినవారు. దానికి కారణమిది. ఈ ఇద్దరూ చేపట్టకముందు ఆ ప్రక్రియల్ని ఆసరా చేసుకొని కవులు కాలక్షేపం చేసేవాళ్ళు. ఈ శారదా తనయులు చేపట్టిన తర్వాత, ఆ ప్రక్రియలే వీళ్ళిద్దర్నీ ఆధారం చేసుకొని బ్రతికాయి. మహాజ్యోతులై వెలిగాయి. ఇట్లా మహా జ్యోతుల్లాగా వెలుగుతున్న ఈ ప్రక్రియల్ని చూసిన ప్రతివాడూ ఆకర్షింపబడ్డాడు. అంతే. ఇక వీళ్ళిద్దరికీ అపారంగా శిష్య సంపద చేకూరింది. ఈ శిష్యకోటి దేశం అంతా ఎట్లా వ్యాపించిందంటే, దేశంలో గజ్జె కట్టినవాడల్లా దాసుగారి శిష్యుడే, పద్యం అల్లగల్గినవాడల్లా శాస్త్రిగారి శిష్యుడే.

కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు వేంకట శాస్త్రిని గూర్చి అన్నమాటల్లో ఒక పద్యం—

తన యెద యొల్ల మెత్తన—కృత ప్రతి పద్యము నంతకంటె మె
త్తన—తన శిష్యులన్న నెడదంగల ప్రేముడి చెప్పలేని మె
త్తనయయి—శత్రు పర్వత శతారము, సత్కవి చెళ్ళపిళ్ళ వెం
కన గుణవంచు జెప్పికొనగా నది గొప్ప తెలుంగునాడునన్.

అట్లాగే చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు నారాయణదాసు గారిపై చెప్పిన పద్యాల్లో ఒకటి—

దాసు నారాయణునకు నీతండు, వీని
దాసు లెల్లెడఁగల హరిదాసులెల్ల
నొక్క హరిదాసులేకాదు, నిక్కమితని
యెడల నాదృతి లేని వాఁడెవఁడు పుడమి.

ఆధునికుల్లో ఈ ప్రక్రియల్ని చేపట్టిన వాళ్లల్లో, వీరిద్దరికీ ప్రత్యక్ష శిష్యులో, పరోక్ష శిష్యులో, పరంపరా శిష్యులో, ఏకలవ్య శిష్యులో కాని వాళ్ళు లేరన్నది సారాంశం. జన్మ వంశానికి సంబంధించిన జ్ఞాతులకంటె, విద్యావంశానికి సంబంధించిన జ్ఞాతులు ఎక్కువగా కలవారు ఈ సరస్వతీ స్తనంధయు లిద్దరు.

శాస్త్రిగారు, దాసుగారు చేపట్టి అనుభవిస్తున్న ప్రక్రియా నిధులు వంశ పారంపర్యంగా వచ్చినవికావు. గురు శుశ్రూషా లబ్ధాలు అంతకంటె కావు. కేవలం దైవదత్తాలు. శాస్త్రిగారు అవధాన నిర్వహణ నైపుణ్యం, అట్లాగే దాసుగారు హరికథా కథన సామర్థ్యం

ఎవరి దగ్గరా అక్షరాభ్యాసం చేయించుకోలేదు. శాస్త్రిగారికి మాడభూషివారు, దాసుగారికి కుప్పుస్వామి అయ్యరు నిమిత్తమాత్ర ప్రేరకులు.

వీళ్లిద్దరూ ద్రావిడులు. భారద్వాజ గోత్రులు. భారద్వాజ గోత్రులగుటచే కాబోలు వీళ్ల ప్రక్రియలు భరద్వాజుని విందులైనాయి. ఆ భారద్వాజునికి (ద్రోణునకు) ఒక్కడే ఏకలవ్య శిష్యుడు. ఈ భారద్వాజులకో ఏకలవ్య శిష్యులు అనేకం.

సందర్భాన్ని కల్పించుకొని అయినాసరే, వీళ్ల మనస్తత్వాల్ని గ్రంథాల్లో నింపడం వీళ్లిద్దరికీ బాగావున్న అలవాటు. అంతదాకా ఎందుకూ ? వీళ్లే వీళ్ల గ్రంథాల్లో పాత్రలు గూడ అయ్యారు. శ్రవణానందం మొదట వ్రాసినప్పుడు, దాంట్లో నాయకుడు వేంకట శాస్త్రిగారే కదా.[1] ఇట్లాగే తిరుపతి వేంకటకవులు వ్రాసిన ప్రభావతీ ప్రద్యుమ్నం అనే నాటకంలో మూడు వంతులు వ్రాసింది వేంకటశాస్త్రిగారు. ఈ నాటకంలో శాస్త్రిగారు శుచిముఖిని అవధానిగా చిత్రించారు. అట్లాగే నారాయణదాసుగారు తారకము అనే సంస్కృత స్వతంత్ర ప్రబంధంలో నాయకుడైన తారకుణ్ణి (రాక్షసుడైన తారకుడు కాడు) మహాసంగీత విద్వాంసుడుగా చిత్రించారు. సారంగధర నాటకంలో మహాకవి గాయక పాత్రను ఒకదాన్ని సృష్టించారు. ఈ తారకుడి పాత్రలో, మహాకవి గాయకశిరోమణి పాత్రలో కనబడేది దాసుగారే.

వీళ్లిద్దరికీ తల్లిదండ్రులు పెట్టిన పేర్లు వేరు. లోకంలో పిలిచేపేర్లు వేరు. వేంకటశాస్త్రిగారికి తల్లిదండ్రులు పెట్టినపేరు వేంకటాచలం. లోకవ్యవహారంలో ప్రసిద్ధి కెక్కిన పేరు వేంకట శాస్త్రి అని కదా. అట్లాగే నారాయణదాసుగారి తల్లిదండ్రులు పెట్టిన పేరు సూర్యనారాయణ. లోకవ్యవహారంలో ప్రసిద్ధికెక్కిన పేరు నారాయణదాసు అని కదా. ప్రజలు వీళ్ల పేర్లను అదేపనిగా జపించడంచేత కాబోలు, వీళ్లిద్దరి పేర్లు ఇట్లా అరిగిపోవడానికి కారణం. పేరు పెరిగినకొద్దీ పేరు తరగడం పెద్దల్లో కన్పడే ఒక వింత లక్షణం.

ఈ ప్రక్రియా పితామహు లిద్దరూ వాళ్ల అవతారాల్ని చాలించడంలో కూడా సాదృశ్యం వుండడం ఇంకో విచిత్రం. శాస్త్రిగారు మహాశివరాత్రినాడు, దాసుగారు త్యాగరాజస్వామి జయంతినాడు వాళ్ల ప్రతిభా సంస్మృతుల గుర్తులను మాత్రం భూమిపై వదిలి స్వస్థానాలకు ప్రయాణం చేశారు. పర్వదినాలు స్వస్థాన ప్రయాణాలకు మంచివి కాబోలు.

వీళ్లిద్దరూ మీసాల పండితులు. సర్వతంత్ర స్వతంత్రులు. దోషవిరోధులు. గుణ పక్షపాతులు. యథేచ్ఛా శృంగార విహారులు. బహుగ్రంథకర్తలు. కృతి స్వీకర్తలు. గజారోహణాది ఘన సత్కారాలను అనేకం పొందిన శారదాదూతలు.

ఈ సమప్రతిభు లిద్దరూ సమకాలికులు కూడా కావడంచేత, ఒకరి ప్రతిభను మరొకరు చూసి మురిసిపోవడం కూడా జరిగింది. ప్రశంసించుకోవడం కూడా జరిగింది.

వేంకట శాస్త్రిగారు దాసుగారిపై చెప్పిన పద్యం –

ఆది భట్టితండయ్యేను హరికథలకు
ఆది భట్టితండయ్యె గేయపు ఫణితికి
ఆది భట్టితండయ్యె నాట్యంపు కళకు
ఆది భట్టితండయ్యె లోకాదృతులకు

నారాయణదాసుగారు వేంకటశాస్త్రిగారిపై చెప్పిన పద్యం –

ఉభయ భాషాకవులలో సమున్నతిఁగని
సకల రాజ సభలయందు జయముగాంచి
శతావధానంబు సల్పు పండితులు లేరు
భళిర - తిరుపతి వేంకటేశ్వరులు దక్క.

ఇట్లా ఈ సవ్యసాచులిద్దర్లో సాదృశ్యాలు అనేకం వుండటం, వాళ్లిద్దరిలోవున్న దైవాంశ ఏవమేకం అని లోకం గ్రహించడానికే.

---

1 చూడుడు నా వ్యాసం ''తిరుపతి వేంకటకవుల రచనా విభాగము'' స్రవంతి -- ఆగస్టు – 1973.

శ్రీ గుండవరపు లక్ష్మీనారాయణ

పిచ్చి కుదిరిందట !
రోకలి తలకు చుట్టాలట !!

['భారతి' కి పాఠకులకీ క్షమాపణలతో]

అంజయ్యగా మారిన 'అంకె'తో ముఖాముఖి !

'దాడి' బులెటిన్ మేం తీసామని ఎవరన్నారు ? విరసం వాళ్లనీ ఒక పత్రికా విమర్శకుడూ – అరసం వాళ్లనీ కొందరూ – ఏ ఐ ఆర్ వాళ్లని కొందరూ – ఎవరో స్టూడెంట్సనీ కొందరూ నేనూ మా సర్కిల్ మిత్రులనీ కొందరూ – మొత్తమ్మీద చాలా చాలా పుకార్లు లేపారు. కానీ, 'దాడి' కి నాకూ సంబంధం లేదనీ అప్పుడు అడిగిన వాళ్లతో చెప్పా. ఇప్పుడు పత్రికాముఖంగా చెబుతున్నా—దాన్ని అభినందించినంత మాత్రాన సంబంధం అంటగట్టే మూర్ఖత్వం కొందర్లో మూర్తీభవిస్తే ఏం చేస్తామ్మరి ? రూమర్లనీ తల్లో పెట్టుకోటం అబలత్వం. పోతే – ఎస్. ఆర్. నందిని రాసుకోటానికి కమర్షియల్ పత్రికలు పేర్లనిబట్టి రచన్లు ప్రచురిస్తాయని మూడేళ్లకింద కొన్ని రోజులు నేన్నమ్మటమే దాని క్కారణం ? ఇక--'ఇంటిపేరు' అనేది ఎలా వస్తుందో? పరిసరాల్ని బట్టి, ప్రవృత్తుల్నిబట్టి, వృత్తుల్నిబట్టి ఎలా మారుతుందో ? ఎందుకు మారుతుందో ఏమాత్రం తెలిసినా నా ఇంటిపేరు గురించి పట్టించుకోవాల్సిన 'అగత్యం' నీకు వచ్చేదికాదు. నాకు నచ్చినట్లు నేను మార్చుకున్నా.

ఇద్దరినీ సమర్థించాల్సిన అవసరం నాకులేదు. ''ఇద్దరు సూర్యుళ్లూ ప్రజల కోసమేనని వారి కవిత్వాన్నిబట్టి చెప్పొచ్చు. (భా. మా. 78) అన్నానే కాని, ఇరువురూ ప్రజాధ్యేయంలో పయనిస్తున్నారని నా అభిప్రాయంగా చెప్పలేదు. ఒకవేళ — శివారెడ్డిని ఎత్తుకోవటమే గనక నా ధ్యేయమయితే — ఆఫ్టరాల్ శేషేన్‌లా ఎందుకు? మహామహాకవులతో పరిశీలించేవాణ్ణి. అసలు సపరేట్‌గానే వ్యాసం రాసేవాణ్ణి. మహాకవి అనేవాణ్ణి. ఉషస్స్తార అనీ, యుగకవి అనీ దిండు పుస్తకాలు రాసేసేవాణ్ణి. అవన్నీ నాకు ఇష్టం కావ్. శివారెడ్డికి అక్కరలేవ్. నువ్విప్పుడు సమర్థించే శేషేన్‌కి 'అక్కర' పడినాయో, లేవో నీకు తెలువకపోయినా తెలుగు సాహిత్యానికి తెలుసు.

శివారెడ్డి ఎవరో ఏమిటో నీకు బాగా తెలుసు శివారెడ్డి కవిత్వం ఎందుకు నచ్చుతుందో వ్యాసాలు రాశావ్.

పేర్లు నానటానికి లేఖలు రాసుకోవాల్సిన ఆగత్యం ఎవరికొచ్చిందీ? కేవలం పేరుకోసం కలగూరగంప నెవరాశ్రయించిందీ, భారతి పాఠకులకి విదితం కాకపోదా? ప్రతీకలు కాకుండా, ఇజాలు కాకుండా. పాలిటిక్స్ కాకుండా, ప్రయోజనం కాకుండా, అనుభూతులు కాకుండా, ఆవేదనలు కాకుండా కవిత్వమంటే ఏమిటి? కవిత్వదృష్టి ఏమిటి? చొచ్చుకపోవట మొక్కటే కొలబద్దా? చొచ్చుకపోయేదంతా కవిత్వమేనా? మా (వచన) కవిత్వం 'గుంట' కాదు. ఇది 'ప్రవాహం' బాబూ!

ఫుల్‌స్టాపుల్ని ప్రశ్నార్థకాలుగా మార్చినంత మాత్రాన 'విమర్శ' కాదని చెబుతున్నా.

శేషేంద్రకాదు—శేషేంద్ర.

ఊసరవెల్లికాదు ఊసరవెల్లి

కొ. కు. రా. రా. అని రాసినందుకు విమర్శించావే, మరి, 'మావో' అని రాశావే! మావో—సేటుంగ్ అని రాసి నీ అతి పరిజ్ఞానాన్ని చాటుకోలేకపోయావా పాపం?

శ్రీశ్రీ పురాణ ప్రతీకల్లోంచి బయటపడలేదనీ — వేదకాలపు భావనే ఆసరాగా సూర్యుడిని వర్ణించాడనీ (ఆం. భూ.) అన్నది. ఎప్పుడైనా గుర్తుంటుంది. అదీ సమాజంలో ఉన్న కాన్‌సెప్టే. దేవుడూ సమాజంలో ఉన్న కాన్‌సెప్టే. కాదనను. అయితే—ఇక్కడ గమనించాల్సిందొకటి ఉంది. శ్రీశ్రీ ఆ 'కాన్‌సెప్ట్'ని యాజిటేజ్‌గా అందించాడు. శివారెడ్డి ఆ 'కాన్‌సెప్ట్'ని ఖండించాడు. నిరసించాడు.

శివారెడ్డిలో భావవైరుధ్యం చూపుతానని మరొక దుష్ప్రయత్నం చేశావ్. 'దుఃఖాన్ని ప్రేమించకు మనటం' — 'విషాదం ఛాయకింద నేను' అనటం గురించి కదా నీవాదం! కన్నీళ్లకీ దుఃఖానికి అంతరం ఒప్పుకున్నప్పుడు విషాదమూ దుఃఖమూ ఒక్కటెలా అవుతుంది? విషాదం అనుభూతి. దుఃఖం-పోరాటం దానికి రెండు పక్కలు. రెండు బహిర్గత క్రియలు. కొన్ని విషాదాలు బలహీనమైతే అసహాయాలైతే దుఃఖానికి దారితీయవచ్చు. కానీ — కొన్ని విషాదాలు సబలలై శాస్త్రీయాలై పోరాటాలకి దారితీస్తాయి. వాటి మధ్య చాలా అంతరం ఉంది. శివారెడ్డి చెప్పిన విషాదానికి 'ముగింపు ఏమిటో తెలుసుకో—'పెన్సిల్ ముక్కు జననం ఒక్క బ్లేడు తుంపుతోనే.' అది మరచిపోతే ఎలా? శివారెడ్డి చెప్పిన దుఃఖం ఎలాటిదో గుర్తుచేసుకో. గుడిహాళం రఘునాథం (భా. ఏ. 79) సూచించాడుగా. శివారెడ్డి పిలవొద్దన్నదీ, ప్రేమించొద్దన్నదీ ''నాజూకైన నిస్సత్తువ వేళ్ళున్న ప్రేయసి దుఃఖాన్ని.'' ఒకరుకాదు మరొకరు చెపుతున్నా వినకుండా పిడివాదం చేసే నీ మిడిమిడి తనాన్ని 'అజ్ఞాని' అని పిలుస్తున్నా. ఎన్నిసార్లైనా చదువు రక్తం సూర్యుడు. ఏడురంగులు మండుతూనేవున్నా అవన్నీ ఒకే కాంతి రంగుగా మిగుల్తాయి. [మళ్లా చూ. భా. మా. 78]

వేమన పద్యాలు మారుమూల పల్లెల ప్రజానీకంలోకి ప్రవహించడానికి సాధనాలుకాదు. కొందరువ్యక్తు లవసరమయ్యారు. సంవత్సరాలు కాదు శతాబ్దాలు పట్టింది. వేమనని సుమారు మూడువందల ఏళ్లదాకా ఎవరు, ఎందుకు అజ్ఞాతంగా తొక్కిపట్టాల్సివచ్చిందో, అతను వెలుగులోకి రావటానికి ఏయే వ్యక్తులు ఎంతెంత కష్టపడాల్సి వచ్చిందో ఏమాత్రం తెలుసుకోకుండా సాధనాలు గురించి మాట్లాడుతున్నందుకు —

ఎన్నో రెట్లు ప్రచార సాధనాలుండొచ్చు. అవి ఎవరి చేతుల్లో ఉన్నాయో? ఎవరిగీతల్లో నడుస్తున్నాయో? ఏ అవసరాలకు ఏ అధికారానికి 'రాం భజన చేసే ఏ కిరాయి కవుల కక్కర కొస్తున్నాయో?

[ఆఖరుగా—ఎవరు అయోమయం 'ఊబి'లో గింజుకుంటున్నారో వెనక్కి తిరిగి చూడు.]

మేధావి వర్గం అడంగి వెధవలన్నావ్, సరే (భా. జూ. 79) కవులు నపుంసకులన్నావ్ సరే—మన దేశరాజకీయ నాయకులందరూ దొమ్మరి గుడిసెల్లో చొచ్చేవాళ్లని (భా. ఏ. 78. పే. 70) అన్నావ్ సరే-ప్రజల్నేమో మూర్ఖులు దౌర్భాగ్యులు (భా. ఫి. 79 పే. 65) అన్నావు. రాజకీయాల పులుముడు అనవసరమే (భా.జూ.79) అన్నావూ సరే—అయితే 'దేశాభివృద్ధి' ఎలా మరి??

పోతే—పైన నువ్విచ్చిన ''లిస్ట్''లో చేరనివాళ్లు వ్యాపారస్థులు, భూస్వాములు మాత్రమే. దేశాన్ని వాళ్లే ఉద్ధరిస్తున్నారని వ్యంగ్యంగా చెప్పిన నీ అభిప్రాయం వింటుంటే నాకు భలే ఆశ్చర్యంగా ఉంది. ఒక దశలో కాపిటల్, ఫ్యూడల్ శక్తులు కూడా

గత్యంతరంలేక వాళ్ల వ్యవహారాలు సజావుగా ఉండడానికి 'కమ్యూనిజం' మేకప్ చేసుకొని స్టేజీమీది కొచ్చే ప్రమాదం ఉందని లెనిన్ ముందే హెచ్చరించిన విషయం నీ ద్వారా నిజమవుతుంటే ఆశ్చర్యంగా ఉండదూ మరి?

అంకే, ఇంకా నువ్ లేఖలమీదే పాప్యులర్ కావటానికి ప్రయత్నిస్తే ఏం చెయ్యగలం?

శ్రీ నందిని సిధారెడ్డి

శాలివాహన శకము

జూలై 1979 భారతిలో డా॥ కొ్రపాటి శ్రీరామమూర్తి గారి "శాలివాహనశకము" అను వ్యాసము చదివితిని. రచన చాలా ఆసక్తి కలిగించేదిగా ఉంది. రచయిత చాలా విషయాలు పురాణాల నుండి సేకరించిరి. వారికి నా ధన్యవాదాలు. కాని వారు సూచించిన ప్రతిపాదనలు ఏమాత్రం చరిత్ర సమ్మతములుగావు. పైగా వారి రచనలో పొందుబరిచి వెల్లడి చేసిన విషయాలు క్రొత్తవిగావు. 1964వ సంవత్సరములోనే డా. బి. యస్. యల్. హనుమంతరావు గారు "Journal of the Andhra Historical Research Society, Vol. XXVIII, (Parts 3 and 4) P. 23 ff" లో ఒక ఆంగ్లవ్యాసమును ప్రకటించియున్నారు. అది డా॥ కొ్రపాటి శ్రీరామమూర్తిగారు చూచినట్లు తెల్పలేదు. ఏలయన వారుయిచ్చిన సూచికలు జాబితాలో యీ 'జర్నల్' పేరులేదు. అయినా ఈ వ్యాసము డా॥ బి. యస్. యల్. హనుమంతరావుగారి ఆంగ్ల వ్యాసమునకు ఆంధ్రానువాదము గాకపోయినా సరిగ్గా వారు ప్రతిపాదించిన ప్రతిపాదనలే డా॥ శ్రీరామమూర్తిగారు వారి వ్యాసములో గూడా చోటుచేసుకొన్నవి. అంటే డా॥ శ్రీరామమూర్తిగారు చెప్పుకొన్నట్లు వారి వ్యాసములో వ్యక్తబరచిన విషయాలు వారి సొంతం గాదు. డా॥ బి. యస్. యల్. హనుమంతరావుగారి పేరును ఎచ్చటా వారి వ్యాసములో పేర్కొనకబోవుట గమనార్హము. ఇక డా॥ బి. యస్. యల్. హనుమంతరావుగారి వ్యాసముపై నా విమర్శ అదే "Journal, Vol, XXX (Parts 1-4), PP 21-31" లో 1965వ సంవత్సరములోనే ఆంగ్లమున ప్రచురితమైనది. ఇదియూ డా॥ శ్రీరామమూర్తిగారు జూచినట్లు బోధపడదు. సహజముగా చరిత్రాత్మక విషయంపై వ్రాయునపుడు దానిపై అప్పటి వరకు వెలువడిన అంశములన్నియు కూలంకషంగా అవగాహన జేసుకొని గాని వ్రాయుట సమంజసముగాదు. లేనిచో అది మన అల్ప జ్ఞానమును ఎత్తిజూపి అవహేళన జేస్తుంది. డా॥ శ్రీరామమూర్తి గారు చాలా విషయాలు సేకరించారు. కాని వాటిని చరిత్ర దృక్పథములో సమీక్షించలేకపోయిరి. చరిత్ర దృక్పథము లేకుండా దొరికిన ప్రతివిషయాలు పరిగణనలోనికి తీసుకొని చరిత్ర వ్రాయుట సాహసమే కాగలదు.

ఇక డా॥ శ్రీరామమూర్తిగారు వారి వ్యాసంలో చేసిన ప్రతిపాదనలు (చరిత్ర సమ్మతంగానివి) సూక్ష్మంగా యివి:-1. పంజటారు శిలా శాసనము. తక్షశిలా రజత వలయ శాసనములలోను, కుషాణ నాణెములలోను పేర్కొన్న కుషాణరాజు ఒకరే యగుట సంగతము. పై శాసనములలోని పేరులేని కుషాణరాజు 'కుజల కడ్ఫిసెస్ కాని, విమకడ్ఫిసెస్ ప్రతినిధికాని అగుటకంటె 'సోటెర్ మెగస్' అగుట సుసంగతము. పంజటారు శాసన కాలము క్రీ. శ. 65. తక్షశిలా రజతవలయ శాసన కాలము క్రీ. శ. 79. కాబట్టి 'సోటెర్ మెగస్' కాలం క్రీ. శ. 65–79. 'సోటెర్ మెగస్' అనంతరము 'విమకడ్ఫిసెస్' పాలకుడు. ఈతని ఖాలిస్తే శాసనకాలం క్రీ. శ. 79–127 లేక 130. ఇతని తదుపరి కనిష్కుడు పాలకుడు. అతని రాజ్యారంభ కాలము క్రీ. శ. 144వ సంవత్సరము. కావున శాలివాహన శకము కనిష్క నిర్ణీతము కాదని స్పష్టము.

ఇక రెండవది. శాలివాహనరాజు అనగా శాతవాహనరాజు. అయిన శాతవాహన రాజులందు శక శబ్దము శాశ్వతముద్ర పడిన శాతవాహనరాజు మాఢరీపుత్ర శివస్వాతి శకసేనుడు మాత్రమే. ఈతడు 28 సంవత్సరములు రాజ్యము చేసినట్లు వాయు, మత్స్య, బ్రహ్మాండ, భవిష్యోత్తర పురాణాలు తెలుపుచున్నవి. ఈతని రాజ్య కాలం క్రీ. శ. 78–106. భూమకుడను శకనృపుని జయించి క్రీ. శ. 78వ సంవత్సరమున మాఢరీపుత్ర శివస్వాతి శకసేనుడు శాలివాహన శకమును స్థాపించెను.

డా॥ శ్రీరామమూర్తిగారి మొదటి ప్రతిపాదన చాలా విడ్డూరముగా నున్నది. కుషాణ చక్రవర్తుల చరిత్రపై వెలువడిన పరిశోధనా గ్రంథములను డా॥ శ్రీరామమూర్తిగారు జూచినట్లులేదు. వెల్లడైన చరిత్రాంశములనుబట్టి కనిష్క చక్రవర్తికి ముందు ఇద్దరు కుషాణ రాజులు గలరు. వారే కుజల కడ్ఫిసెస్, వేమా కడ్ఫిసెస్. కాని ముగ్గురు మాత్రం గాదు. డా॥ శ్రీరామమూర్తిగారి చరిత్రసృష్టి చాలా చింతవ్యము. కుషాణ చక్రవర్తులు కల్గివున్న బిరుదములు వారి స్థితిగతులను ఖచ్చితంగా ధృవీకరించుచున్నవి. పైగా మనం గుర్తించవలసిన విషయం — కుషాణ పాలకులలో ఇద్దరు కనిష్కులు, ఇద్దరకు పైగా వాసుదేవులుండుట. ఒకే పేరుగల వారుండుట వలన నాటి పురాణకర్తలు (Chronicle writers) పొరబడి ఒకరి ప్రగతి మరొకరికి అంటగట్టి కుషాణ రాజుల చరిత్ర చిత్ర విచిత్రముగా వ్రాసియున్నారు. వాటి మూలంగా నేటి చరిత్రకారులకు భిన్నాభిప్రాయాలు పొడజూపినవి. ఇక డా॥ శ్రీరామమూర్తిగారు చెప్పినట్లు పంజటార్ శాసనములలోను, తక్షశిలా రజతవలయ శాసనంలో పేర్కొన్న పేరులేని కుషాణ రాజు ఒకరుమాత్రం గాదు. ఏలయన రెండు శాసనముల లోను పేర్కొన్నవారి బిరుదావళే ప్రత్యక్ష తార్కాణం. పంజటారు శాసనంలో పేర్కొన్న 'మహారాజ ఘుషాణ', తక్షశిలా రజత వలయ శాసనంలో పేర్కొన్న 'మహారాజాధి రాజ, దేవపుత్ర, కుషాణ' ఒక్కరు మాత్రం కాజాలరు. పంజటారు శాసనంలో పేర్కొన్న 'ఘుషాణరాజు' మొదటి కుషాణ రాజైన 'కుజల కడ్ఫిసెస్'. పైగా

యీ 'కుజల కడ్ఫిసెస్' తక్షశిల వరకు రాజ్య విస్తరణ జేసినట్లు తెలిపే చారిత్రకాధారం మృగ్యం. అతడు కుషాణ చక్రవర్తులలో 'మహారాజుగా' మిగిలిపోయినాడు. అదియునుగాక భారతదేశంలో కాలూనిన మొదటికుషాణరాజు 'వేమాకడ్ఫిసెస్'. ఇదిచరిత్రసత్యం. దీనిపై వివరణ గోరువారు "A Comprehensive History of India, Vol. II, P. 230 'జూచి తెలుసుకోవచ్చును. కాగా పంజ టారు శాసనకాలం క్రీ. శ. 64(V. s.122–58=64) కుజల కడ్ఫిసెస్ కడపటి రాజ్యకాలంగా చరిత్రకారులు పరిగణించిరి. ఇక తక్షశిలా రజితవలయ శాసనంలో తెల్పిన కుషాణరాజు వేమాకడ్ఫిసెస్. దీనికి సందియములేదు. ఏలయన, శాసనములో పేర్కొన్న బిరుదావళి యాతని చిత్రముగల వెండినాణెములపైగల బిరుదావళి ఒక్కటే. పైగా తక్షశిలా రజతవలయ శాసనం చివర చిత్రించిన 'త్రిశూలము లేక నందిపాద' గుర్తు, వేమాకడ్ఫిసెస్ వెండినాణెములపై గూడా వుండుట గమనించి చారిత్రికులు తక్షశిలా రజతవలయ శాసనంలో పేర్కొన్న రాజును వేమాకడ్ఫిసెస్‌గా గుర్తించినారు. పైగా వేమా కడ్ఫిసెస్ ధైర్యశాలి, సాహసవంతుడు దీనికి నిదర్శనం యాతని వెండి నాణెములపైగల గ్రీకు బిరుదావళే! – బేసిలోస్, బేసిలోస్ సోటెర్‌మెగస్. అదియునుగాక తక్షశిలా రజతవలయ శాసనంలో గల "దేవపుత్ర" బిరుదము వేమాకడ్ఫిసెస్‌యొక్క శాసనంలో గూడా పేర్కొనుట గమనార్హము. యాతని దేవకుల శిలాశాసనంలో యీవిధంగా వుంది– 'మహారాజాధిరాజ-దేవపుత్ర–కుషాణపుత్ర– సాహివేమ–తక్షమ'– పైని తెల్పిన చరిత్రాంశములనుబట్టి వేమా కడ్ఫిసెస్, 'సొటెర్ మెగస్' ఒక్కరే. గాని డా॥ శ్రీరామమూర్తి జెప్పినట్లు వేరుగాదు. అయిన తక్షశిలా రజతవలయ శాసన కాలం క్రీ. శ. 78 (136–58=78). వేమా కడ్ఫిసెస్ రాజ్యాంత కాలము. కాగా వేమా కడ్ఫిసెస్ రాజ్యాంతకాలం మొదటి కనిష్కుని రాజ్యారంభ కాలము ఒక్కటే (క్రీ. శ. 78). చారిత్రికులు ధృవీ కరించినదియు యిదియే. దీనిపై వివరణ గోరువారు నా ఆంగ్ల వ్యాసమును "Journal of the Andhra Historical Research Society, Vol. XXX, (Parts 1–4), PP. 21-31" లో జూడ వచ్చును. ఏలయన ఎప్పుడో చారిత్రికులు, వెల్లడైన చరిత్రాంశము లనుబట్టి నిర్ధేశించినవి తిరిగి యిచ్చట వ్రాయుట సమంజసము గాదు కావునా విషయములు బొందుపరచిన గ్రంథములను తెల్పుచూ వదిలివేయుచున్నాను. ఇది పాఠకులు గమనించగలరు.

ఇక డా॥ శ్రీరామమూర్తిగారి రెండవ ప్రతిపాదన కడు విడ్డూరము. వారు శకముల (Eras) పుట్టు పూర్వోత్తరాలపై వెలువడిన గ్రంథాలు జూచినట్లు లేదు. ఒకవేళ జూచినా అవగాహన జేసుకొన్నట్లు గానరాదు. శకాల చరిత్ర పరిశీలించిన ఒకటి స్ఫురి స్తుంది. అసలు శక నిర్దేశకులు ఒకరైతే చరిత్రలో నిల్చినది వేరొ కరి పేరుతో. సర్వ సామాన్యంగా శక నిర్దేశకులు చరిత్ర సృష్టిం చినవారు. కాని చరిత్ర తెలిపినవారు, అనామకులు గాదు. శకనిర్దేశ కుల లక్షణాలుగల వ్యక్తి చరిత్రలో ఎప్పుడైనా తారసపడితే యాత నికి అతని ముందు తరాలలో జీవించిన యుగపురుషులతో బోల్చి యాతడు ప్రారంభించిన శకానికి సురల జీవం పోస్తారు. లేదా ఎడ తెగని వాడుక (Continuous use) మూలంగా గూడా శకాల పేర్లు తరచూ మారుతూ వుంటవి. ఉదాహరణకు గుప్తశకను తీసు కుందాము. ఇది కృత శకముగా ప్రారంభింపబడి, గుప్తుల కాలంలో గుప్త శకంగా మారి, చివరకు కథియవాడలో వల్లభ శకముగా మారినది దీనినిబట్టి. కృతుడనే పురాణపురుషుడు (Mythical hero) ప్రారంభించిన శకము చివరకు చరిత్రలో వల్లభ శకముగా నిల్చినది అంటే కృతుడనే పురాణపురుషుడు ప్రారంభించిన శకము గుప్తులు విడువక వాడిన మూలంగా వారి కాలంలో గుప్త శకమై, తదుపరి వల్లభ నాయకుల కాలంలో వల్లభ శకమైనదని గమనించ వలెను. కాని గుప్తశకమును వల్లభులు ప్రారంభించారని పరిగణించ రాదు. అట్లే కనిష్కునిచే ప్రారంభింపబడిన కనిష్కకాలము, శక శకమై చివరకు శాలివాహన శకముగా చరిత్రలో నిల్చినది. శాసనాల పరంగా జూస్తే శకకాలము క్రీ. శ. 5వ శతాబ్దం నుండి చరిత్రలో స్థానం సంపాదించినది. శాలివాహన శకముగా క్రీ. శ. 12–13 శతాబ్దములో మారినట్లుతేలుచున్నది. దీనికిగల కారణాలుచూద్దాం. కుషాణ చక్రవర్తి కనిష్కునిచే ప్రారంభింపబడి కనిష్కకాలమై, పశ్చిమ భారతావనిని ఏలిన శకులచే ఎడతెగకుండా యీ శక నామం వాడబడి శక శకమై చివరకు యాదవుల రాజ్యకాలంలో శాలి వాహన శకముగా మారినట్లు శాసనాలు చెప్పుచున్నవి. దీనిపై వివ రణ గోరువారు 'Studies in Indology, Vol. II, P. 103' జూడవలయును. నా దృష్టిలో చెప్పాలంటే శక శకము, శాలివాహన శకముగా మారుటకు కేవలం "to Indianise the Saka-era" మాత్రమే. ఇది కేవలం నా వూహ మాత్రమే!! దీనికి యేచరిత్రా ధారము లేదు.

ఇక శాలివాహన శకమునకు శాతవాహనులకు ఎట్టి సంబం ధము లేదు డా॥ శ్రీరామమూర్తిగారు పేర్కొన్న 'మాఢరీపుత్ర శివస్వాతి' శాతవాహనరాజులలో అనామకుడు. శాసనపరంగా యాతని ఉనికి యింకనూ స్థిరపడలేదు. అతనికి శక కర్తృత్వము ఆపాదిం చుట సాహసమే!! పైగా వారు కీ. శే. డా॥ రామారావుగారి 'Satavahana Coins in the A. P. Govt. Museum' పుస్తకంను అనుసరించినట్లు గోచరిస్తుంది. అది 'తప్పులతడకగా' చారిత్రికులు నిర్ణయించినారు. దానిపై యాధారపడి ప్రతిపాదనలు చేయరాదు. శాతవాహనులలో ఏ ఒక్కరూ శకమును ప్రారంభించి నట్లు తెలిపే (యింత వరకు) ఏ ఆధారము దొరకలేదు. పైగా దాని భిన్నమునకు మాత్రం వారి శాసనాలే తార్కాణం ఏలయన వారి శాసనాలన్నియు ఏ శక కాలాన్ని తెలుపక వారి రాజ్యకాలాన్నే తెలుపుచున్నవి. ఇది గమనించియు డా॥ శ్రీరామమూర్తిగా "...... శాసన వ్యవహారం పూర్వ సంప్రదాయం. దేశవ్యవహారం నవ్యసంప్ర దాయం......గాబట్టి మాఠరీపుత్ర శివస్వాతి శకసేనుని శాలివాహన శక కర్తృత్వను శంకనీయము గాదని..." ముగించుట విడ్డూర ముగా వున్నది. ఈ విధంగా చరిత్ర రచన సాగిస్తే చరిత్రకు, 'పుక్కిటి పురాణాల'కు గల వ్యత్యాసం, శూన్యం.

డా॥ ఘంటా జవహరలాలు

ప్రజాకవి

జూన్ 1979 'భారతి'లో 'ప్రజాకవి'ని గురించి డా. మురళీధర్‌గారు రాసిన విషయాలు చాలా అసమంజసంగా ఉన్నాయి. అసలు 'ప్రజాకవి' అన్నది అర్థంలేని పదమన్నారు. గురజాడనూ, వీరేశలింగాన్నీ కాదని, వాళ్ళకంటే విశ్వనాథను గొప్పగా చేసి చెపుతున్నవారికి 'ప్రజాకవి' అవసరం ఉండకపోవచ్చుగాని, అది అర్థంలేని పదంమాత్రం కాదు.

ప్రజలంటే సమాజంలో ఉత్పత్తికృషిని పంచుకునేవాళ్ళు. సమాజంయొక్క మనుగడకు అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేస్తున్నవాళ్ళు. అంటే సామాజికశ్రమ మొత్తంలో ఎవరికి భాగస్వామ్యముంటుందో వాళ్ళు ప్రజలు. ఈ ప్రజలు ఏ దేశంలోనైనా ఉత్పత్తికృషిని అజమాయిషీ చేస్తున్నవాళ్ళకంటే, ఉత్పత్తి సాధనాలను స్వంతం చేసుకున్న వాళ్ళకంటే అత్యధిక సంఖ్యలోనేఉంటారు. మనదేశంలో దాదాపు 90 శాతం వరకున్న ప్రజలు ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారు. ఇంతమంది శ్రమఫలితాన్ని మిగిలిన 10 శాతం మంది దోపిడీ చేస్తున్నారు. సమాజంలో ఉన్నత వర్గాలకు చెందిన ఈ కొద్దిమంది తమ ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా ఫిలాసఫీని ఏర్పరచుకున్నారు అందులో ఒకభాగమే మతం. ఇది ప్రజలను అజ్ఞానంలో ఉంచడానికే పనిచేస్తుంది. ఈ మతాన్ని, ఇటువంటివే అయిన మరెన్నో తెరలను తొలగించి, ప్రజాజీవితాన్ని అధ్యయనంచేసి, వాళ్ళ సమస్యలను అర్థం చేసుకుని, వాళ్ళు అలా దుర్భర దారిద్ర్యంలో ఉండడానికి కారణాలను చెప్పి, వాస్తవ పరిస్థితులపట్ల చైతన్యాన్ని కలిగించినవాడు ప్రజారచయిత గాని, ప్రజాకవి గాని అవుతాడు.

ఒక కవిని అతడు ఏ తరహాకవి అని విచారించడం అనవసరం ఎంతమాత్రం కాదు. దానివల్ల, సాహిత్యంలో అతనికున్న స్థానాన్ని బట్టి, సాహిత్యం ఎటువైపు పోతున్నదో తెలుస్తుంది. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాయడాన్నిబట్టి కవి ప్రజాకవి అవుతాడు గాని, విప్లవ (రాజకీయ) నాయకుల నిర్ణయాలను బట్టి కాదు. ఈ ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా ఉండడంవల్లనో, ప్రతికూలంగా ఉండడంవల్లనో ఆయా రాజకీయ పార్టీలను గాని, రాజకీయ నాయకులనుగాని తదనుగుణంగా నిర్ణయించడం జరుగుతుంది. ఉత్పత్తిశక్తులు, ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సంబంధాలు, ఆర్థిక ప్రయోజనాలు—ఇవి ముఖ్యమైనవి. వీటిని అనుసరించే రాజకీయాలు గాని, మతతాత్విక విషయాలు గాని ఉంటాయి.

మన జీవితాలో ఆర్థిక సమస్యలేకాదు — కరుణ, జాలి, ప్రేమవంటివి కూడా ఉంటాయి. కాని ఇవి కూడా ఆర్థిక కారణాలకు అనుగుణంగానే ఉంటాయన్న విషయం గమనించడం అవసరం. ఒక భూస్వామి ఊళ్ళో చెల్లించుకుంటున్న తన అధికారానికి వ్యతిరేకంగా ఒక సామాన్యుడు ఎదురు తిరిగితే అతన్ని చితక కొడతాడు. తన బంధువుల్లోనో, తన వర్గంలోవో ఎవరినైనా కొడితే బాధ పడతాడు. అతనిలో కరుణ ఉందనాలా? లేదనాలా?

నన్నయ తన జాతికి ఒకభాషను అందజేయలేదు. తెలుగుభాష అంతకుముందే ఉన్నది. పాలకవర్గాల సంస్కృతిని ప్రజల్లో వ్యాప్తి చేయడానికి సాధనమైన భారతాన్ని అనువదించడానికి అవసరమైన సంస్కృతాన్ని తెలుగులోకి తెచ్చాడు. ఇటువంటివాళ్ళు ప్రజాకవులు కారు.

గురజాడ వలసాధిపతులను, వాళ్ళ దోపిడీని మన అదృష్టంగా కీర్తించాడని చెప్పడం ఆయన వాక్యాలను సందర్భంనుండి వేరుచేసి దుర్వ్యాఖ్య చేయడమే. సాహిత్యంలో ఫ్యూడల్ సాంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేసి ప్రజలకు చేరువగా ఉండే భాష, ఛందస్సు, వస్తువులతో రచనలు చేసాడు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకించకున్నా, సంఘంలో ఉన్న చెడ్డ ఆచారాలను నిర్మూలించడానికి కృషిచేసాడు. కందుకూరి సంఘ సంస్కర్తగా ఉండి సాహిత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకున్నాడు. గురజాడ గాని, కందుకూరి గాని విదేశ సాంస్కృతిక బానిసత్వాన్ని ఎంతమాత్రమూ కోరలేదు. ఇక విశ్వనాథ చెప్పిన ప్రాచీన భారతీయ సంస్కృతి ప్రాచీన కాలంనుండి పాలక వర్గాలు ప్రజలను మభ్యపెట్టడానికి పనికి వచ్చింది. నిద్రాణమైన జాతిని మేల్కొల్పడం కాకుండా, మేల్కొంటున్న జాతిని నిద్రపుచ్చడానికి విశ్వనాథ వ్యర్థమైన ప్రయత్నం చేసాడు. కందుకూరి, గురజాడలకూ విశ్వనాథకూ పోలికలేదనడం సమంజసమే.

కవి 'స్వేచ్ఛావిహంగం'వలె తనకు తోచింది రాసుకోవచ్చు. కాని అతడు ఎవరికి అనుకూలంగా, ఎవరికి వ్యతిరేకంగా రాస్తున్నాడో నిర్ణయించుకునే అవసరం ఎవరికైనా ఉంటుంది. నిజానికి సిద్ధాంతాలతో ప్రమేయంలేని 'స్వచ్ఛమైన కవి', మురళీధర్‌గారు ఊహిస్తున్నట్లుగా, అంటూ ఉండడు. తెలిసో, తెలియకో అతడు తన రచనలో ఏదో ఒక సిద్ధాంతాన్ని బలపరుస్తాడు.

ఇక పులిచెర్ల సాంబశివరావుగారు తమ వ్యాసంలోనూ, మే 1979 'భారతి' కలగూరగంపలోనూ చూపిన కారణాలతో సుబ్బదాసుగారిని ప్రజాకవి అనడం సమంజసంగాలేదు. అంటువ్యాధులు ప్రబలినప్పుడు ప్రజలకు ధైర్యం చెప్పడంలో తప్పులేదు గాని, "ఆంజనేయోపాసనతో అంటువ్యాధుల్ని తుదముట్టించా"రని నమ్మడంలో అజ్ఞానం ఉన్నది. జయప్రకాశ్‌కు వైద్యచికిత్సవల్ల వ్యాధి నయమయిందిగాని ప్రార్థనలవల్ల కాదని తెలుసుకుంటే మంచిది. మాదుగుల గ్రామానికి చెందిన ప్రజలను "మాదుగు"లని తిట్టిన కవి, ఆ ప్రజలను నీచంగా చూసిన కవి, "ప్రజాకవి" ఎలా కాగలడు? సుబ్బదాసుగారు సామాన్యులతోపాటు జీవించవచ్చు. కాని ఆయన వాళ్ళ భావాలకు అద్దంపట్టే కవితలు రాయలేదు. తన భావాలను సామాన్యుల్లో చలామణీ చేయడానికి ప్రయత్నించాడు.

గంగాధర

లే ఖ లు

శ్రీ కాళహస్తి జ్ఞానప్రసూనాంబికా నవరత్నమాలిక

నేను నవంబరు 1978 'భారతి'లో 'అపరమమ్మట శ్రీ వట్టిపల్లి నరకంఠీరవశాస్త్రి' యను వ్యాసమును ప్రకటింపగా, దానికి ''కృతజ్ఞతా ప్రకటనం శూన్యం'' అను శీర్షికతో తమకు కృతజ్ఞత ప్రకటింపలేదని కుపితులై శ్రీ దినకర్ డిశంబర్ 1978 'భారతి'లో నన్ను విమర్శించిరి. వారి విమర్శకు నేను జనవరి 1979 'భారతి'లో ప్రతి విమర్శ వ్రాయగా పై శీర్షికతో విజయశ్రీగారు మే 1979 'భారతి'లో నన్నాక్షేపించుచు 'దినకర్' వ్రాతలను బలపరచుచు వ్రాసిన దానికిది సమాధానము.

'1. 'విజయశ్రీ'గారి యాక్షేపణ నా కర్థము కాకున్నది. వారి విమర్శ కేవలము కుదృష్టితో కూడినదేకాక నేలవిడిచి సాము చేసినట్లున్నది. 'దినకర్'గారి వలననే నాకు శ్రీ నరకంఠీరవ శాస్త్రులవారి స్తుతిరత్నములు, నవరత్నమాలికను గురించి తెలిసినదను దురభిప్రాయమును దృఢీకరించుటకై విజయశ్రీగారు తమ యాక్షేపణలో యసంగతమైన విషయముల నెన్నింటినో నుడివి తమ తొందరబాటును తమకుగల లౌకిక జ్ఞానరాహిత్యమును, పరిశోధనా జ్ఞానరాహిత్యమును ఋజువు చేసుకొనిరి. నేను శ్రీ వ. న. శాస్త్రిగారి స్తుతిరత్నములను 'నాకీ స్తుతిరత్నములు ఒక లెక్కకు రావుకదా' యనుట శ్రీ శాస్త్రిగారి స్తుతులను కించ పరచుటకు కాక, వారి పాండిత్య ప్రకర్ష కేవలను స్తుతిరత్నముల మీద యాధారపడలేదు అని చెప్పుటయే నా తాత్పర్యము. ఈ విషయమును నేను నా వ్యాసములో బాగుగ వివరించితిని. కాని నేను స్తుతిరత్నములను చిన్నచూపు చూచితినని విజయశ్రీగారు నన్ను నిందించుట వారి దుర్వ్యాఖ్యా కౌశలమున కుదాహరణము. నా వ్యాసముపేరు ''అపర మమ్మట వట్టిపల్లి నరకంఠీరవశాస్త్రి''. శ్రీ శాస్త్రిగారిని అపరమమ్మటునిగా జూపుటయే నా ధ్యేయముగాని స్తుతికర్తగా కాదు. కావుననే వారి కృతుల పరిశీలనములో తొలుత 'కావ్యలక్షణ వాదమును' గైకొంటిని. కాని వారి జీవిత చరిత్ర వ్రాయునపుడు ప్రాసంగికముగా ఆ స్తుతిరత్నములను కూడ యుదాహరించితిని. నా ఈప్సితార్థములు నెరవేరిననేమి? నెరవేరకున్ననేమి? ప్రథమ శ్లోకమును బరిశీలింతమని దానిని గురించి క్లుప్తముగ చెప్పి వ్యాఖ్యానింపక పోవుట తప్పగునా? ఇది నా స్వవచో వ్యాఘతమా? గ్రంథవిస్తరభీతి, యసంగతత్వములను మనసున నిడుకొని క్లుప్తముగ వ్రాసిన నా వచనములెట్లు స్వవచన వ్యాఘాతములగుచున్నవో విజయశ్రీవంటి యుద్దండ పండితులకు తెలియునుకాని మాబోంట్లకు తెలియదు. నాకు 'శబ్దాడంబరశబ్దార్థం' తెలియదేమో కాని విజయశ్రీగారికి ''స్వవచనవ్యాఘాతం'' అను దానికర్థము తెలియదు కావుననే వారు చాలా తొందరపాటుగా అవహేళనగా వ్రాయకల్గిరి.

2. మరొక్క విషయము. ప్రతివ్యాసకర్తకు కొన్ని అభిప్రాయములు, లక్ష్యములుండును. సహృదయత లోపించిన పాఠకుల కవి యవగతములుకావు. రంధ్రాన్వేషణ తత్పరులకంతయు తప్పుల తడకగనే కన్పించును. నవరత్నమాలికాస్తుతిని 'వాసవదత్త'లో ప్రకటించుటగాని, వాటి కర్తృత్వ, పాఠభేదములను గూర్చిగాని 'ఆరాధన' పత్రికలో వాటి కర్తృత్వమును గూర్చి జరిగిన వాదోపవాదములను గాని నేను ఉద్దేశపూర్వకముగనే చర్చింపలేదు అంత మాత్రమున స్తుతిరత్నములు, నవరత్నమాలికను గురించి కేవలము శ్రీ దినకర్ గారి వలననే నాకు తెలిసినదనియు మరియు 'శంకరశతకము' వలన మాత్రమే తెలిసినదనియు భ్రమించువారు అజ్ఞానాంధకారమున మునిగియున్నారని పునః పునః చెప్పగలను. పరిశోధనా వ్యాసము వ్రాయువారు తమకన్నా పూర్వమీ విషయమున కృషిచేసినవారి ప్రామాణికమైన వ్రాతలనుండి యుదహరించుట సాంప్రదాయము, శాస్త్రీయము. అంతేకాక వివాదాస్పదమయిన విషయములను సంగతి, ప్రకరణశుద్ధిలేని తావులలో నుదహరింపరు. నా వ్యాసపు పరిధి శ్రీ శాస్త్రిగారిని 'అపరమమ్మటునిగా' చూపుటమాత్రమే కాని నవరత్న మాలికా కర్తృత్వ విచారము, శ్లోక, పాఠభేదములు చర్చించుటకాదు. అసంగతమైన విషయములను వ్రాయుట నాకు తెలియదు. తమకు కృతజ్ఞత తెల్పలేదని 'దినకర్' వాపోవుట, విజయశ్రీగారు సమర్థించుట మిక్కిలి హాస్యాస్పదము. అపూర్వ విషయములు తెలిపిన వారికి లేక గహన విషయములను వివరించుటలో సహాయపడిన వారికి లేక అపూర్వ గ్రంథముల నందజేసినవారికే కృతజ్ఞత లందజేయవలెను కాని కాళిదాసు రఘువంశము' వ్రాసెను అనునటువంటి సర్వలోక విదితమయిన విషయములను వ్రాసి తాము తెలియజేయనిచో ఇతరులకు తెలియదనుకొను పండితమ్మన్యులకు కృతజ్ఞత ప్రకటింపకుండుట మహానేరమనుకొను 'పబ్లిసిటీ' ప్రియులకుకాదు. కృతజ్ఞతను స్వచ్ఛందముగా హార్దికముగా పొందవలెనుగాని దానిని హక్కుగా భావించి దుర్విమర్శలకు పూనుకొనినచో వారికి నిరాశ తప్పదు.

డాక్టర్ కాశీభట్ల సేతురామేశ్వరదత్త

హరిశ్చంద్రునికథ - గౌరన- రాఘవాంకులు

ఆగస్టు 1979 'భారతి'లో ''హరిశ్చంద్రుని కథ'' గౌరన—రాఘవాంకుల పోలికలు చాలా బాగున్నాయి. గౌరన హరిశ్చంద్రుని అతి చమత్కృతితో తీర్చిదిద్దినాడు. తన హరిశ్చంద్రుని నక్షత్రకుడు అమ్మజూపినప్పుడు కోపోద్రిక్తుడై దూషిస్తాడు· దానిని నక్షత్రకుడు కల్పించుకొని చెప్పటములో గౌరన పాత్రను చక్కగా పోషించాడు.

కాని రాఘవాంకుని హరిశ్చంద్రుడు, తనని కొనుక్కొనేందుకు వచ్చే ధనవంతులకు గిడువుకాస్తా గడిచిపోతుందన్న విషయము, మరియు చండాలుడైన వీరబాహుణ్ణి పిల్చి క్షమాపణ చెప్పుకోవటం,

అంత వాస్తవముగాలేదు. నాటకీయతలో ఈ విషయము వేరొక సంఘాకు మలుపు తిరిగినట్లు ద్యోతకమౌతున్నది.

రాఘవాంకుని హరిశ్చంద్రునిపైగల సందేహ నివృత్తి తొలగించగలరని మనవి చేయుచున్నాను.

శ్రీ సి. బ్రహ్మయ్యాచారి

ఆగస్టు 1979 'భారతి'లో డా॥ తంగిరాల వెంకట సుబ్బారావు రచించిన కన్నడ 'భూమిగీత' తెలుగు 'వసుధైకగీతం' అను ఒక తులకనాత్మక పరిశీలనను చదవడం జరిగింది. అందులో 'ఈ భూమి గీతానికి కన్నడ సాహిత్యంలో విశిష్టస్థానాన్ని సంపాదించి పెట్టింది' అని వ్రాశారు. మానవాళి భావి ఉజ్వలంగా దివ్యంగా వుంటుందనే ఆశాభావంతో ముగుస్తుంది ఈ 'వసుధైకగీతం' అని వుంది. తిలక్ 'వసుధైక గీతం'లో సర్వమానవ సమానత్వమూ, కవి మనస్సుకు కావలసిన విశాలపరిధి, ఆర్ద్రత ఈ గేయంలో నొక్కి చెప్పబడ్డాయట. కావచ్చు. కానీ—తాత్విక చర్చలో మానవుని వ్యక్తిత్వానికి అంతకంటే కావలసిన దేముంటుంది?

శ్రీ యంచికంటి వెంకటేశ్వరరావు

వయస్సు

'భారతి' 1979 జూన్ నెల సంచిక 12 పుటలో నా వయస్సు గురించి వ్రాయబడినది. నా వయస్సు గురించి వ్రాసిన కొన్ని పద్యములిట ఉదహరించుచున్నాను. వీలైతే ఈ పద్యములను భారతిలో ప్రచురింపఁగోరెదను—

సీ॥ నిండె తొంబది వర్షముల్—నేటితోడ
వచ్చె తొంబది యొకటవ—వత్సరంబు
స్థిరుండు ముమ్మారు నా చుట్టు తిరిగివచ్చి
తరలిపోయె నన్నించుక—తాకకుండ—

రవి పదింటను, మూడింట రాహువుండ
ఆయమున శశి, బుధ కుజ—లకులియుండ
భాగ్యమున గురు కేతులు—వాహనమున
రవి సుతుండు, శుక్రుండుచ్చను—ప్రబలియుండ।
జన్మనుందితి నేను, మేషంబునందు

ఆ. వె. సర్వధారి నామ-సంవత్సరంబున।
మాఘమాసమందు మహిత శుక్ల
పాడ్యమిని ధనిష్ఠ—పాదంబు మూడింట
జన్మమందినాఁడ—జగతియందు

గీ. అసురగురు మహాదశలోన నసురగురుని
యంతరంబప్పు డరుదెంచె—నబ్జ నేత్ర।
వినుము గురు శుక్రు లిర్వురు ప్రేమతోడ
సేవొసంగిన పోయివ—చ్చెదను నేను।

గీ. శక్తియుడిగెను, జ్ఞాపకశక్తి తగ్గ।
కనులు కనరావు, చెవులకు—వినికి తగ్గె
నడక తడబడుచుండెను—చెడియె మతియు
కర్మమాత్రంబు మిగిలెను—కడకునాకు—

క. వేం. సత్యనారాయణమూర్తి
భారతీ తీర్థోపాధ్యాయ

నిజమైన ప్రజాకవి

ఈమధ్య 'భారతి' లేఖల శీర్షికలో శ్రీ ముడార్ వేణుగారు వ్రాసిన లేఖ చదివాను. చిరుమామిళ్ళ సుబ్రహ్మణ్య కవిగారెవరో తెలియకుండానే ఆ మహనీయుని గూర్చి వేణుగారు అవాకులు చవాకులు వ్రాయటం విచారకరం.

శ్రీ సుబ్రహ్మణ్య కవిగారు మా స్వగ్రామమైన ఓబులేశుని పల్లెలోనే జన్మించటంవలన, ఇప్పటికీ మా ప్రక్క గ్రామమైన ధర్మవరంలో వేలాదిమంది శ్రీవారి తిరునాళ్ళు వైభవంగా జరుపటం వలనా వారిని గూర్చి నాకు తెలిసిన విషయాలు పత్రికాముఖంగా తెలియజేయుచున్నాను.

మా పల్నాటి ప్రజలకు ప్రజాకవి అంటే చిరుమామిళ్ళ సుబ్రహ్మణ్య కవే! సుబ్రహ్మణ్య కవిగారి కృతులు మా పల్నాడు ప్రజలలోని నిరక్షరాస్యులకు సైతము నోటికవచ్చును. ఈ కవిగారి జీవిత విశేషాలనూ మహాత్మ్యాలనూ మా ఇండ్లలో ఎప్పుడూ చెప్పుకుంటూ ఉంటాము. ప్రజలు సుబ్రహ్మణ్య కవిగారి కృతులను అనేక పర్యాయాలు ముద్రించారు ఒక తెలుగు కవి దైవంలా పూజింపబడటం, నిజంగా తెలుగు కవి లోకానికే గర్వకారణం. ఈయనే ప్రజాకని కాకపోతే ఇంకెవరు ప్రజాకవి?

సుబ్రహ్మణ్య కవిగారి కవిత్వాన్ని కొలవటానికి శ్రీ ముడార్ వేణుగారివద్ద సరియైన కొలమానాలు లేవు. తమకు తెలిసిన ఒకరిద్దరే ప్రపంచంలో ప్రజాకవులనుకొనే మూఢాచారాన్ని వేణుగారు వదులుకోవాలి. ప్రజల్లోకి వచ్చి చూడాలి. ప్రజలకోసం నిజమైన ప్రజాకవిత్వం చెప్పిన సుబ్రహ్మణ్య కవిగారు ప్రజాకవి అని అప్పుడే వారికి తెలియగలదు. ప్రజలలో ఆస్తికులు నాస్తికులు ఉంటారు. ఆస్తికులంతా మూర్ఖులనుకొనేవాడు నిజమైన మూర్ఖుడనడంలో సందేహములేదు. కవిత్వానికి రాజకీయపు ముసుగులువేస్తూ, తాము భోగలాలసులై జీవిస్తున్న నేటి కుహనా ప్రజాకవులకంటే, వ్యవసాయం చేస్తూ ప్రజల కష్టసుఖాల్లో భాగం పంచుకుంటూ, వారికోసం కవితచెప్పిన శ్రీ సుబ్రహ్మణ్యకవి ఎన్నోరెట్లు మేలు.

నిజంగా ప్రజాకవి అంటే ఆయనే!

శ్రీ కోట లక్ష్మయ్య

గ్రంథ విమర్శలు

మేధావి - కవి

[బుర్రా వెంకటనాగేశ్వరరావు. డెమ్మి 1/8–34 పేజీలు; (రచన 16 పేజీలు మిగత అభిప్రాయాలు) వెల : 1–50; ప్రతులకు : గ్రంథకర్త; చోడవరం]

చాలమంది యువకవులు, మా మిత్రుడు — డా. ప్రొఫెసర్ పి. నారాయణరెడ్డికి తమ పుస్తకాలను అంకితమిచ్చి గుణ గౌరవం ఆర్జించుకొంటున్నారు. ఆ తిక్కనకు కేతన అంకితమిచ్చి ఈ సరస్వతీపూజ ప్రారంభించినట్లున్నది. ఈ రెడ్డి కవితాశిల్ప లక్ష్మిని ఎందరో భావుకులు ఇట్లా హృదయ సుమాలతో అర్చిస్తుంటే మా బోంట్లకు ఎంతో ఆనందంగా ఉన్నది. ''మీ ఆమోదముద్ర నేనంద గలిగిననాడు, రఘురాముని పాదుకలు మోసిన భరతుకన్న ధన్యుడిని'' అనడం, రచయితకు ఆ నవ్యకవితాయుగ వసంతుడు రెడ్డిపైగల గౌరవం వెలి కుబుకుతున్నది. ఇంతేగాక, ఈ చిన్న పొత్తాన్ని పేరెన్నికగన్న వారంతా పొగడడం, ఈ వ్రాతలోనే గాక అసలు మనిషిలోనే ఏదో ఒక ఆకర్షణ ఉన్నట్లున్నది. ఈయన చూపే నమ్రత అలంకారప్రాయమైనది. ''మేధావి - కవి'' ఒక్క కవేఏమి ? మేధావి కానివాడు దేనికీ కొరగాడు.

ఈయన నేటి కొత్తరకం కవులవలెనే ఉద్రేకం ఆరాటం ఆవేదన కలిగి తిట్లుగూడ బాగానే వడ్డిస్తాడు. ఈ ఆవేశంవల్లనే ఈ కవిత్వంలో శక్తి, మాటల్లో సత్తువ ఉన్నవి. ఒక వస్తువు బాగోగులు దానిస్థానాన్నిబట్టి అని — ప్రసూనాలనుంచి వీచేగాలి, శ్మశానాలనుంచి వీచేగాలి ఒకటే—తావుల్నిబట్టి తావిలో తేడా - అన్నది హృద్యంగా ఉన్నది. ''కట్టుతెగిన కలలవాగు'' ఈ ప్రయోగం భావంలో భాషలో బాగున్నది.

ఇకముందు వాశితో గూడ రాశిని గూడ పెంచి ప్రకటిస్తే బాగుంటుంది.

గోరంత దీపాలు

[యు. ఆంజనేయరాజు, క్రౌన్ 64 పేజీలు; ధర: రు. 4/–; ప్రతులకు : సామాన్య ప్రచురణలు, పిఠాపురం.]

ఈ గోరంత దీపాలు పెద్ద తిల్లికలయ్యే సూచనలున్నవి. చదువిచ్చిన లోకజ్ఞానాన్ని భావుకత పెంచుతున్నది; భాష వికసిస్తున్నది. ఈ కవి — ''కొత్త పాటల మేలికలయికల రుచి చూడాల''ని ఉవ్విళ్లూరుతున్నాడు. పరిచయ వాక్యాలలో (కాంతి రేఖలు) వచన కవితకు పదాల పొందిక అవసరమన్నారు. ఇది కీలకమైన మాట. దీనికి దోడు కుదింపు, తెనుగుకు ప్రాణమైన అనుప్రాస ఉంటే ప్రాణం పోసుకొంటుంది. ఈయనే భావాన్ని, తెలుపగలిగిన భాషకు ప్రాధాన్యమిస్తున్నాడు. ఇది లేక, నేటి వచన కవిత చాల మటుకు పేలవంగా అరాచకదారుల పట్టి ఉన్నది గదా. భావం పాతదైనా చెప్పే భాషా విధానంలోనేగదా ప్రాణము విశిష్టత ఉండేది.

కొందరు నియమాలు ప్రతిబంధకాలంటారు. కాని నిరక్షరాస్యులైన జానపదుల గీతాలు మని ఉండేదానికి లయ–ఛందోనియమాలే కదా కారణం. ఈ ఏల పదం చూడండి :–

చలవ చీర గట్టుకోని చాకిరేవుకు నేనుబోతే
సన్న మల్లెల వానకురి సబ్బే — పెడమల్లి చిన్నా,
సలవ చీర సగము తడిసబ్బే పెడమల్లి చిన్నా. ఇది పల్లెటూరి వారిపై మన్మథ విజృంభణం.

ఈ దృష్టితోచూస్తే ఈ గోరంత దీపాలు మంచి కాంతులనే విరజిమ్ముతున్నవి. కొన్ని భావాలు నుడికారాలు మధుర ఫణితిలో ఉన్నవి :— వలపు సంత! దుష్ట సిద్ధాంతాలు తిండిపెట్టవు; జీవించడం ఏలాగో చెప్పలేని చదువులు చదవడం దరిద్రం; కైపెక్కిన కీర్తికాంత; మంత్రాలకు చింతకాయలురాలవు (తెనుగు అనుప్రాసకు మామిడికాయలు అనిఉండాలి). నవ్వును గురించి మంచి వ్యాఖ్యానం ఉన్నది–నవ్వు నానా విధాలు గదా !

''అవినీతి''లో రోగార్తుడైన భర్త మందుల కోసరం మానం అమ్ముకుంటే అవినీతి ఎక్కడున్నది ? అని ధర్మవేదనతో ప్రశ్నిస్తున్నాడు. జార్జిబెర్నార్డ్‌షా–తన Mrs. Warrens' Professionలో, వ్యభిచారంతో ముగ్గురు కూతుళ్లను పెంచి పెద్ద జేసిన ఇల్లాలు పలికిన ధీరవచనాలు ఇట్టివే. భావం భాషలో ''అంతరాలు'' ఎల మానికంగా ఉన్నది.

ఇంత చదువరి కొంత పొరపాటు పడినాడు :- ప్రభుత్వ ఇరుసు గిరగిరా తిరుగుతున్నది అన్నారు. తిరిగేది చక్రాలు గాని ఇరుసు గాదు. (రైలు పెట్టెకు మాత్రం ఇరుసు చక్రం ఒకటిగా పోతబోసి ఉన్నారు.) ప్రతి భాషా పదాన్ని తన అక్షరాలతో వ్రాయగలిగిన సౌలభ్యం తెనుగుకున్నది. ఎందుకో చాలామంది ఆంధ్రులు ఇంగ్లీషు ఉచ్చారణను మర్డర్ చేస్తారు. వీరు దినపత్రికను డైలీ అంటారు; అది డెయిలీ, సామాన్య చదువరిగూడ అంటున్నాడు.

మైత్రి

[కృష్ణ కుచేలుల కథ, పులివర్తి సుబ్రహ్మణ్యం, క్రౌన్ – 40 పేజీలు; మూల్యం రు. 3/–; ప్రతులకు: గ్రంథకర్త, పేర్వాల, దేవరకొండ తాలూకా.]

ఆ దరిద్ర కుచేలునిమీద, సఖుడు కాంచన చేలుడు కురిపించిన మైత్రీ రస వర్షాన్ని — పాత కవితా రసాన్ని కొత్త సీసాలలో

సోసి ఇంపు పుట్టించిన చిన్న రసవత్తర కావ్య మిది. అకళంక స్నేహానికి చిన్న పెద్ద, భాగ్యవంతుడు దరిద్రుడు అనే తారతమ్యాలు లేవని, ఈ యుగబాధలకు ఈభావమే మందుఅని తెలుపనుకాబోలు, ఈ విద్వత్కవి ఈ కథను చేపట్టినాడు. ఈయన వృత్తి వైద్యంతో బాటు కవిత్వంలో గూడ వైదుష్యం సంపాదించినవారు.

నేటి కొత్త త్రోవల కవిత్వపు ఎడారిలో, ఇది ఒక సాంప్రదాయిక కవితా పల్వలం; కాసేపు సేద దీర్చుకోవచ్చు. సంస్కృత గంభీరధార, తేరిన మంచినీటివాగు జాలు వంటి తెనుగు, భావ ప్రౌఢ ప్రవంతి ఇందు త్రివేణి అయినవి. హాసంలో బాటు భావం, మదితోడ మేను వర్ణించడం తిక్కన పోకడ. ఈ రచనలో రమణీయ చిత్రీకరణ శిల్పం :— కల కల నవ్వు నేదియొ వికాసము మోమున గ్రొత్త తీరులన్; నుదు లాలకించుచు దృగంచల సుస్మిత రేఖలొప్పు; పడుచును లేచుచున్ గలంతఁబారు మనమ్మున మందభాగ్యులౌ కొడుకుల రూపముల్ మెదలఁ గుందుచుఁ గన్నుల నీరు నించుచున్; ఆడుచున్నవి విషాదచ్ఛాయ లామె మోము కెందమ్మిన్—మొదలైనవి.

కొత్త భావము – పదబంధ సౌరభం ఆఘ్రాణించండి :— ప్రభాత మలయ మరుదంకురముల స్పర్శలం బులకించు ప్రశాంత సంధ్య; ఒకటి సమయఁ జూడ బ్రతుక నొకటి జూచు — మధ్య నలగుచు కృశియించు మానధనుఁడు; నినుఁ జూచి సహింపలేక యంతంతలఁ జారిపోవు నొక యాచకునింగను లోభివోలె; మధుర మంజుల దరహాస మార్దవమున; గుసగుస లాడుచుం గుములు గూడెను తుంటరు లట్లు మబ్బు లాకసమున జేరి; బాష్పముల్ ముసు బుట్టె వెన్క జననం బేనెత్తితిన్.

దారి తలలో కుచేలుని దరి దదేవత కలుసుకొని మాయలు పన్ని మనసును మరలింపజేయ చేసిన ప్రయత్నం ఒక మెరుపువలె మెరుస్తున్నది. గ్రంథం సొంతం చదివి ఆనందించవలసినది.

సమతా జ్యోతులు

[కవితా సంకలనం· డెమ్మి 48 పుటలు; వెల : రు. 3/–; ప్రతులకు : కొల్లూరి సత్యనారాయణమూర్తి; సమతా రచయితల సంఘం; అమలాపురం – 533 201·]

''చైతన్యమైన సామాజిక జీవితానికి సాహిత్యం పునాది'' అన్న విశ్వాసంతో ఈసంఘం నెలకొల్పబడి సాహిత్యసేవ చేస్తున్నది. ఆ సభ్యులు వ్రాసిన ఖండికల సంకలనమే ఇది. ఈసంకలనాలు నవ కవి కుమారులకు ప్రోత్సాహకరాలు. ఇందు పలువురి రచనలున్నవి. ఈ వ్రాతలలో కసుగాయలు లేవుగాని, దోరగిలినవి ఉన్నవి క్రమేణా పండబారితే సాహిత్య స్వరూపాలౌతవి

వ్రాతగాండ్రందరూ నవ్యరీతులవారు – యతులు కృత్రిమాలని విడనాడినవారు. సంఘాన్ని ముందుకు తీసికొని పోవాలన్నదే వీరందరి తృష్ణ; అయినా పద్ధతిలో విభిన్నత ఉన్నది. ఇంపైన కొన్ని నుడికారాలు :— జీవిత జీర్ణ వస్త్రాలను ఆశల రేవుల్లో ఉతుక్కుంటున్నారు; ఊహల కావిడి బుజాన వేసుకొని నిశ్శబ్ద నినాదాలతో నడిచేవాడే కవి, నా మనస్సముద్రంలో ఎవళ్లకీ కనిపించకుండా తిరుగాడు తుంటాయి భావాల జలాంతర్గాములు; నక్షత్రాల పూలు పూయిస్తున్నప్పుడు.

భావం :— పసివాడు తల్లి పొత్తి ళ్ళ సుడ్డలోనుంచి క్రిందకు దూకాలని అనుక్షణం ప్రయత్నిస్తూనే వుంటాడు, కానీ తనయుడు తన కెక్కడ దూరమైపోతాడోనని మరింతగా తన బాహుబంధాలలో ఇరికించి వేస్తుంది తల్లి వాడ్ని; ప్రతిబింబాన్ని నమ్మక అద్దాన్నే శంకించేవాళ్ళు; సుమతి సుధ లత మా పెంపుడు కుక్కల పేర్లు గావు – పెండ్లి కావలసిన నా చెల్లెళ్ల పేర్లు. కొన్ని ఎత్తిపొడుపులు కొరడాలతో కొడుతున్నవి :— ఇంట్లో పిల్లి బయట పులి – ఇంట్లో సంప్రదాయవాది; బయట అభ్యుదయవాది; డబ్బు తింటే తిన్నావుగాని సిమెంటు గూడా తినేసి ఇసుకతో వంతెనలు కట్టేసి జనాన్ని నట్టేట్లో ముంచేయకు.

రంగుల పక్షి

[కవిత. వై. శ్రీరాములు· డెమ్మి 60 పొరటలు; ధర : రు. 3/–; ప్రతులకు : నవగానం, 12–462, 6వ క్రాస్ రోడ్, సాయ్‌నగర్, అనంతపురం–515 001.]

ఈ కవి చిన్న పుస్తకం ప్రచురించినా బంతిబంతిలో ఓరి కల్ గుణం—కవితాశిల్పమందామా ? — ఉద్దీపిస్తున్నది. ఊహలకు కొత్త మలుపులు, భాషకు కొత్తనగలు, పదబంధాలకు కొత్త వాసన విరజిమ్ముతున్నవి. దీనికి దోడు ప్రకృతి ప్రీతి (ఋషివ్యాలీ) ఆనందదాయకంగా ఉన్నది. భావవైశాల్యము భాషాగాంభీర్యం ఇంకా ముదిరి పండి రుమలూరించగలవని తోస్తున్నది.

జలశిల్పం అన్నమాట నా మటుకు నాకు అర్థంకావడం లేదు. ఈ భాగం ప్రేమరసపాత్ర యువకవులు (అభ్యుదయకవులు) ప్రేమజోలికి పోరాదని, కొందరు ఎండిన ఎదల వారన్న మాటను అర్. ఎస్ సుదర్శనంగారు (ఆశీస్సులు) బాగా విమర్శించినారు. నుడికారాలసొంపు భావబంధురత చూడండి:— బయట ఆకాశం ఆవరించింది, ఇంటినిండా చీకటి నిదురబోతోంది; బయటికి వస్తున్నాడు—వేడిబిడ్డ బాలసూర్యుడు; ఒర్పు వైశాల్యాన్ని కొలిచిన జీసస్‌రక్తం, నా కవితా చరణానికి కుచ్చిళ్లై వ్రేలాడుతున్నాయి నీ కిరణాలు; కవితలో తడిసిన చూపు; మట్టిల్లో నిదురించే పరిమళాన్ని తట్టిలేపే నాగలి; జీవి ఉన్నంతకాలం మృత్యువు ఎరుగని ఎత్తు శోధించని లోతు—తాకని అంచులులేవు; వసంతానికి ఎంత ప్రేమ లేకపోతే గ్రీష్మానికి చోటిస్తుంది; లోయల సౌందర్యం కొండ శిఖరాల తాకినట్లు; నీ స్మృతుల గాయాలకు మందువేయి; సూర్య కాంతిని వడబోసేటప్పుడు నీరెండల పరిష్వంగంలో ఒక ఇంద్రధనుస్సు శిశువు పుడుతాడు; కాడవిరిగిన వెన్నెల పువ్వు ఈ చంద్రుడు; కనురెప్పల బయట అడుగుబెట్టిన కన్నీరు—ఇట్లా ఎన్నో !

పద్మావతీ పరిణయము

[సంగీత రూపకము. చింతలపూడి వెంకటేశ్వర్లు, డెమ్మీ—32 పొరటలు; వెల: రు. 3/–; ప్రతులకు: టి. ఎస్. రావు, మెయిన్ రోడ్, రాజమండ్రి.]

ఈ చిన్న సంగీత రూపకం వ్రాసిన కవి ప్రతిభకు నాలుగు మోములు :— చిత్రలేఖనము, సంగీతము, ఆంధ్రసాహిత్యము గణిత శాస్త్రము. తన ఇష్టదేవత అయిన తిరుపతి వెంకటేశ్వర స్వామి పద్మావతీదేవిని పరిణయమాడిన ఆఖ్యాన మిది. తరిగొండ వెంగమాంబ వ్రాసిన పద్య కావ్య కథే ఇది. కాని, కొన్ని మార్పులు — తమకు ఉచిత మనిపించిన రీతిగా చేసినాడు. ఇట్లా చేర్చి మార్చే గదా మన పురాణాలు వేయి నాలుకలతో మాట్లాడుతుండేది!

ఈ నాటకం ప్రయోగంలో బాగా రక్తి కట్టేటట్లున్నది. వినేవారికి విసుగు పుట్టకుండా అనేక రాగాలు—లయలు ఉపయోగింపబడి ఉన్నవి. ఈ కవికి ఆ ఏడుకొండలసామిపై గల భక్తి ప్రస్ఫుటంగా గోచరిస్తున్నది.

ఇహంలో పరం

[కవితా సంపుటి. కొటికలపూడి వేంకట సూర్యనారాయణ మూర్తి, డెమ్మీ 48 పొరటలు; వెల: రు. 6/–; ప్రతులకు: శుభోదయ, రామనగర్, విశాఖపట్నం — 530 003.]

ఇంగ్లీషు బోధిస్తూ ఇంగ్లీషులో కవిత్వం వ్రాసిన ఒక విద్యార్థికుని తెనుగు కవన మిది. ఇంగ్లీషుకు బాగామరగిన ఈయన పేనుకు తెనుగు సరిగా అబ్బలేదు గదా, ఇక్కడ ఆ ఇంగ్లీషు చీడగూడ వదలలేదు. గిరీశం మాదిరి సామాన్య ఇంగ్లీషు పదాలు వాడితే మాబోంట్లకు తెలుస్తుంది గాని, ఇంతంత పెద్ద మాటలు వేస్తే ఈ రచనా సౌభాగ్యం మనసుకు ఎక్కదనుకొంటూ వీరు తమ ఇంగ్లీషు కవిత్వంలో నడుమ తెనుగు ఇరికిస్తున్నారా?

భావాలు చాలా మర్మధోరణిలో ఉన్నవి. దీనికితోడు తెనుగు నుడికారం ఇమిడి సొంపు గూర్చ లేకున్నది. చూడండి :— కుమ్మరి గుడిసె ముందు క్రర చక్రమట! దీనిని సారె అంటారు. సినిమాలో హీరోయిన్ ప్రణయాం చైతన్య శూన్యమంటారు, అరవైదాకున్న హీరోల ప్రేమ చైతన్యంగా ఉన్నదా? "రాజకీయం" తెనుగు అక్షరాలలో వ్రాసిన ఇంగ్లీషు కవిత్వం—సొంపులేదు. "బాటిల్‌పార్టీ"లో మంచి అవహేళనం ఉన్నది. ఆకాశంలో నక్షత్రాలు మిట్టమధ్యాహ్నం ఎండలో మిణుకు మిణుకు మంటున్నవట. ఈయన కండ్లు పెద్ద టెలిస్కోపులుగా ఉన్నవి.

బండి ఆకుల కిర్రు అట—ఇది ఇరుసు కిర్రు కావాల, ఆకులే కిర్రుమంటే బండే కూలిపోతుంది. "లీనింగ్ పీసా" అట. పీసా అనే ఒకానొక ఇటలీ నగరంలో ఉండే టవర్ (గోపురం) ఒకటి (ఒరిగి) లీనింగ్ అయిఉన్నది. అంతేగాని పీసా ఒరగలేదు. అంటే—కవి శ్రద్ధ లేకుండా అవరాబదరా వ్రాస్తున్నాడనాల. భావుకుడైన ఈ చదువరి నిలకడగా వ్రాస్తే బాగుంటుంది.

"శూన్యంలో నుంచి శూన్యమే ఉద్భవిస్తుంది" అన్న ఈ కవి సూత్రాన్ని అక్షర బ్రహ్మమనే మన వేదాంతంగాని, సైన్సుగాని ఒప్పుకోదు. మరలా ఈ కవే తర్వాతి వాక్యంలో శూన్యం నుండి ఏదీ పుట్టదంటున్నాడు. (జీవాత్మ పరమాత్మ నుండి ఆవిర్భవించి అందులోనే లీనమవుతుంది.) అంటే-తత్త్వం ఒంటబట్టలేదనాల.

ఇవి గుణ పక్షపాతంతో వ్రాసిన మాటలు — కోపానికి తావు లేదు. ఇందు కొందరిని పొగడను నాకు ఇంకేమీ కారణాలు లేవు: అందరూ ముక్కు మొగము ఎరుగని వారే.

కొండవీడు రెడ్డిరాజ్యమహోదయము

[బెళ్లూరి శ్రీనివాసమూర్తి, డెమ్మీ 196 పేజీలు; వెల: రు. 10/-; ప్రచురణ: అనంతపురం జిల్లా రచయితల సంఘం, అనంతపురం]

ఇది యాంధ్రావని వీర కావ్యమయి, సాహిత్య క్రియాదీప్తికా
స్పదమై, కర్షక జీవితాభ్యుదయ శోభన్ బొల్చి, వాగర్థ సం
పదకున్ గమ్మని పూలతోటయయి, సమ్మానార్హమై భారతీ
సదయాంతః కరణంబు చూఱగొనదో సర్వం కషాదర్శమై

అని—కళాప్రపూర్ణ డాక్టర్ దివాకర్లవారు కావ్య గుణమును చెప్పినది నూటికి నూరుపాళ్ళు సరిపోతున్నది. నిర్జీవ శిశిరాకృతి గల్గిన చరిత్రాంశాలకు మధుర మనోజ్ఞ మహాకావ్య రూపాన్ని కుదిర్చిన కవితాశిల్పి - ఈ బెళ్లూరువారు పెద్దలన్నట్లు — నన్నయ ప్రసన్న కథాకలితార్థ యుక్తి, తిక్కన రసాభ్యుచిత బంధముల తెనుగు తీపిదనము, శ్రీనాథుని ధారాశుద్ధి—చిత్రీకరణ వైభవము ఆంధ్ర పౌరుషానికి మగసిరిని కల్పించి, ఈ వీరకావ్యము పాఠకుని పులకల్రపోవుగా చేస్తున్నది. ఆంధ్ర పౌరుషగళిత మహిమను, రెడ్డి రాజుల నాగరక సంస్కృతులను, భాషా పోషక ఔదార్యాన్ని వర్ణించిన ఈ సాంప్రదాయిక కావ్యం ఆధునిక కవితా రంగాన వాసికెక్కిన కొద్దికృతులలో ప్రథమ శ్రేణికి చెందినదిగా ఉన్నది.

ఓరంగల్లు పతనానంతరం కాసయ సాగించిన స్వాతంత్ర్య సమరము, పంట రెడ్డి రాజుల కొండవీటి రాజ్యస్థాపనము — శౌర్య దీప్తి — పాలన — సాహిత్యవన వసంతము — విదేశ వాణిజ్యము — మొదలైన యశో వల్లభ్య విషయాలను గంభీర జీవ భాషలో శిల్ప విన్యాసంతో వర్ణించి, కవి చదివిన ఆంధ్రులను ఇంపున కరగింప జేస్తున్నాడు.

గ్రామ్య జీవన వర్ణనం వేమన తత్త్వ వివరణం ఎంతో సహజ మనోహరంగా ఉన్నవి.

ఆ దరిద్రకుచేలుడు మిత్రపురస్కారంగా కృష్ణునికి అటుకు లిస్తే, ఈ కవితా సంపన్నుడు — బళ్లారు రైతు ఇంద్రప్రస్థంలో రాష్ట్రపతి అయిన — నీలం సంజీవరెడ్డిగారికి, చిన్ననాటి చెలిమికి

కానుకగా ఈ మహాకావ్యాన్ని ఇస్తున్నాడు ఇది ఔచిత్య విశారద మైన సమర్పణము.

ఈయన భావాల సవ్యత భాషారుచిర బంధము ఒక శోభతో మెరసి, ప్రతిమాట ఒక రసగుళికగా రూపొంది ఉన్నవి :— పచ్చి మాంధ్రుల రాయిడిబడి నశింప భారత మహిళల కురుల కొవ్విరులు విరిసె; ఆంధ్రసేనాని రోష కషాయతాక్షులందు విస్ఫులింగ ప్రభలా వరించె; మూర్తిన్ బొందిన దేశభక్తి పరువంబు జిల్కె నాంధ్రోర్వికిన్; తెనుగు నేల కొత్త తీపి మరపె; అఘె తన యందమున లీన మయ్యె తానె; అసమానాంధ్ర వసుంధరా విజయ రేఖాంకూరముల్— మొదలైనవి.

సాహితీ పర్వంలో శ్రీనాథుని వర్ణన ఉత్తేజకరంగా, ఆ కవి సార్వభౌముని పాఠకుని ఎదుట నిలబెట్టుతున్నాడు. ఇంతెందుకు ? ఇది ఆద్యంతాలు మధురమైన కావ్యం.

కళాప్రపూర్ణ మరుపూరు కోదండరామరెడ్డి

ప్రజల మనిషి - ఒక పరిచయం

[''వట్టికోట ఆళ్వారుస్వామిగారి నవల ప్రజల మనిషి - ఒక పరిచయం'' — రచన : వరవరరావు; ప్రచురణ : యుగ ప్రచురణలు —హైదరాబాద్; వెల : రు. 3/–; పుటలు : 98; ప్రతులకు : 'సృజన', హనుమకొండ (వరంగల్)]

ఒక జాతి ప్రజల జీవన్మరణ సమస్యల పోరాటాలకు అద్దం పట్టి సజీవమైన చిత్రరువును అందించేది ఆ భాషలోని నిజమైన ప్రజాసాహిత్యం. అలా కాకుండా కేవల వ్యక్తిగతమైన చిన్న సమస్యలను కళాత్మకం చేయబూనే ఎలాంటి గొప్ప రచనా ప్రక్రియైనా పాక్షికంగానే నిలిచిపోతుంది. అన్యాయానికి, దోపిడికి అవినీతికి వ్యతిరేకంగా జనసామాన్యం చేసే వీరోచితమైన పోరాటం సాహిత్యంలో ప్రతిఫలిస్తే అది రాబోయే తరాలకు ఉత్తేజకరమైన ప్రేరణగా, అక్షరాల ఊపిరిగా సజీవంగా వుంటుంది. అలాంటి కోవలోకి వచ్చే నవలలే 'మాలపల్లి', 'ప్రజల మనిషి'.

ఉబుసుపోక కబుర్లు చెప్పుకునే ఈనాటి అనేకమైన సీరియల్ నవలలు సంకుచితమైన జీవన పరిధిచుట్టూ గానుగెద్దుల్లా తిరుగుతున్నాయి నవల ఒక జాతి సమగ్ర జీవన కావ్యం కావాలనే తపన లేకున్నా కనీసం ఒక ప్రజా సమస్యను లేదా సమకాలీన యధార్థ దృశ్యాన్ని చిత్రించాలనే నిజాయితీ ఈనాటి ఆడ మగ నవలా రచయితల్లో సీరియస్‌గా కొరవడింది. (అయితే కొన్ని మినహాయింపులు లేక పోలేదు.)

1952–55ల మధ్య రచించి తమ దేశోద్ధారక గ్రంథమాల ద్వారా జనవరి 1955 లో వట్టికోట ఆళ్వారుస్వామిగారు 'ప్రజల మనిషి' నవలను ప్రచురించారు. ఆ తర్వాత ఈ నవల 'విశాలాంధ్ర' ప్రచురణ కింద 1963 నుంచి 1978 దాకా నాలుగు ముద్రణలు పొందింది. 'ప్రజల మనిషి' నవలకు పూర్వమే 1952లో ఆయన తన జైలు అనుభవాలను 'జైలులోపల' పేరుతో కథలుగా ప్రచురించారు. ఆ తర్వాత 'గంగు' నవలను అసంపూర్ణంగా రచించి 1961లో ఆకస్మికంగా మరణించారు.

వట్టికోట ఆళ్వారు స్వామిగారంటే ఒక ఉద్యమం. ఆయన జీవితాంతం రాజకీయ చైతన్యంతో ప్రజా పోరాటాల్లో గడిపి సాహిత్యంలోకి వచ్చిన నిజమైన 'ప్రజల మనిషి'. అయితే తెలంగాణాలోని ఆనాటి ప్రజా పోరాటాలు ఆళ్వారుస్వామిని కమ్యూనిస్టుగా మార్చినా ఆ తర్వాత 1960తర్వాత వచ్చిన రాజకీయ పరిణామాలు ఆయనను కమ్యూనిస్టు పార్టీ నుంచి రాజీనామా చేయించి స్వైరా సోషలిజం భ్రమల్లోకి దింపింది. బహుశా అదే కారణమేమో ఆయన ''గంగు'' నవలను పరిపూర్ణం చేయలేకపోవడం.

1938 నాటి తెలంగాణాలోని గ్రామాల్లో జమిందారీ, జాగిర్దారీ, భూస్వాముల నిరంకుశపాలన కింద వెట్టిచాకిరితో ప్రజలు బానిసలుగా బతికారు. అన్ని వర్గాల ప్రజలకు తర తమ స్థాయిలో ఈ నిర్బంధ చాకిరి ఆ రోజుల్లో తప్పలేదు. ఈ నిరంకుశ ఫ్యూడల్ వ్యవస్థకు మూలపురుషుడు ఆనాటి నిజాం. ఆ నిజాం పాలనచుట్టూ దొరల దోపిడీ అల్లుకపోయింది. పైగా మతపరంగా నిజాం ఇస్లాం మతాన్ని రుద్ది హిందువులను బలవంతంగా మార్చాలని చూసాడు. అప్పుడు హిందుమత సంస్కరణంతో వచ్చిన 'ఆర్య సమాజ్' తిరిగి 'తురక' మతం పుచ్చుకున్నవాళ్ళను 'హిందువు'లుగా మార్చడంతోనే తృప్తి పడిపోయింది. కాని హిందూ భూస్వాములే నిజాం తైనాతీలుగా ప్రజలను పీడిస్తున్నారనే అంశాన్ని, 'భూమి సమస్యను' ఆర్య సమాజ్ ఏమాత్రం పట్టించుకోలేదు.

ఈ భూమికపై ''ప్రజల మనిషి'' నవల ఒక ప్రధానమైన సామాజిక ప్రయోజనాన్ని సాధించింది. వస్తువు రీత్యా — శిల్పం — భాష — సన్నివేశాల రూపేణ ఈ నవల ఈనాటికి 'కొత్త' గానే వుంటుంది. ప్రతి తెలుగు నవలా రచయిత ఈ నవలను 'అధ్యయనం' చేయవలసిన అవసరం వుంది.

సాహిత్యపరంగా, ఆనాటి రాజకీయ సాంఘిక జీవనపరంగా 'ప్రజల మనిషి' నవలను వరవరరావుగారు ఈ పుస్తకం ద్వారా పరిచయం చేస్తున్నారు. వివిధ అంశాలను కూలంకషంగా పరిశీలించి ఆ నవలను చర్చించారు. ఈ నవలలో ఆయన పరిశీలించిన అంశాలు 1. కథా పరిచయం 2. ఆధునిక చైతన్య ప్రతిపాదక నవల 3. ప్రజా చైతన్యానికి ఇరుసు - భూమి సమస్య 4. తెలంగాణా వాతావరణం 5. జాతీయోద్యమం 6. గ్రంథాలయోద్యమం 7. ఆంధ్ర మహాసభ 8. స్టేట్ కాంగ్రెస్ 9. మత పరివర్తన. ఇలాంటి పరిచయం ద్వారా ఒక ప్రజా నవలను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి అంచనా వేయవలసిన ఒక ఉత్తమ సాహిత్య విమర్శనా బాధ్యతను వరవరరావుగారు వోపిగ్గా నిర్వర్తించారు.

దాదాపు ఐదు దశాబ్దాల క్రితమే 'ప్రజల మనిషి'లోని కథానాయకుడు కంఠీరవం, ఆనాటికి చరిత్ర పురిటి నొప్పులు అనుభ

విస్తున్న కాలంలో తన వెంట నలుగురిని తీసుకొని ప్రజల సాంఘిక, ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం రాజకీయ పోరాటంలోకి దిగిన చైతన్యాన్ని పరిశీలిస్తూ వరవరరావు యథార్థ దృష్టితో యిలా వ్యాఖ్యానిస్తున్నారు —

''మనిషి ప్రజల మనిషిగా రూపొందే క్రమం నిరంతరంగా కొనసాగే పోరాటం. తనమీద తాను పోరాటం చేస్తూ, వ్యవస్థతో చేసే పోరాటం చరిత్ర ఎడతెగని సంఘర్షణల పుటలతో ఇట్లా రచింపబడుతూ పోతూనే వుంటుంది. కంఠీరవం కలగన్న 'మంచి ప్రభుత్వం', కులమత ప్రాంత చివరకు వర్గరహిత వ్యవస్థ ఏర్పడిన తర్వాత కూడా మనిషి ప్రకృతి శక్తులతో పోరాటం చేస్తూనే వుంటాడు. ఇదే ప్రజల మనిషి పదను పెట్టే జీవలక్షణం. ఈ విషయంలో రచయితకున్న చారిత్రక, భౌతిక, తాత్త్విక దృష్టి అవగాహన చాలా సరియైనవి. మధ్యమధ్యన కనిపించే చిన్నచిన్న లోపాలు, వైరుధ్యాలు ఈ సమిష్టి చైతన్యంముందు సరిచేసుకోగలవే ...'' (పుట - 33).

నిఖిల్

మలయాళ వాఙ్మయ చరిత్రము

[పి. కే. పరమేశ్వరన్ నాయర్ (అను) డా. దివాకర్ల వేంకటావధాని. సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ, 1978. వెల: 12-00]

కేంద్ర సాహిత్య అకాడెమీ వారు ప్రచురిస్తున్న వివిధ సాహిత్య చరిత్రాల్లో ''మలయాళ సాహిత్య చరిత్రం'' ఒకటి. దాని అనువాదం ''మలయాళ వాఙ్మయ చరిత్రము''.

ఈ రచనలో మొత్తంమీద ఇరవైనాల్గు అధ్యాయాలున్నాయి. కాల్డ్వెల్ తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ భాషల్ని ద్రావిడ కుటుంబం కింద చేర్చుతూ, మలయాళం తమిళానికి పుత్రిక అన్నారు. తర్వాత కొంతమంది భాషాశాస్త్రజ్ఞులు వాటి రెంటికి జన్యజనక సంబంధం గాక సోదర సంబంధం కలదని నిగ్గుతేల్చి చూపారు. పి. కే. పరమేశ్వరన్ నాయర్‌కూడా అలాంటి సంబంధాన్నే సమర్థిస్తూ, మూలద్రావిడ భాషకి అందరూ అనుకొంటున్నట్టు అభ్యంత సన్నిహితంగా వుండేది తమిళంగాక మలయాళం అని చెప్పేందుకు ప్రయత్నించారు. వీటితోబాటు మలయాళం శబ్దోత్పత్తి, వర్ణమాలాది విషయాలు మొదటి అధ్యాయంలో వివరింపబడ్డాయి.

మలయాళంలో బాగా ప్రచారం పొందిన సాహిత్య ప్రక్రియ మణిప్రవాళ ప్రక్రియం మణులలాంటి మలయాళ శబ్దాల ప్రవాళముల లాంటి సంస్కృత శబ్దాల కూడిక మణిప్రవాళం. ఈ ప్రక్రియకు పూర్వం ''పాట్టు'' అన్న మరో ప్రక్రియవుంది. దీనిలో మణి ప్రవాళంలో లా గాకుండా తమిళ మలయాళ పదాలు చోటు చేసుకొని వున్నాయి. యతి, ప్రాసల్ని వుపయోగించుకొంటూ ద్రావిడ ఛందస్సులో రాయబడ్డ ప్రక్రియ ఇది. ఈ ''పాట్టు''లో మనకు కనిపించే గొప్ప గ్రంథం ''రామచరితం''. రచయిత నిశ్చితంగా తేలక పోయినా, ఆ రచన చివరి భాగంలోని ''...చీరామన్ అంబి నొడియ నంబిన తమిళక్కవి వల్లోర్ '' అన్న పంక్తుల ఆధారంగా తత్కర్త ''చీరామన్'' అని తెలుస్తుంది. శ్రీరామన్‌కి తద్భవ రూపం చీరామనీ. దాన్ని ఆధారంగా ఉళ్ళూరు ఎస్. పరమేశ్వర అయ్యర్ క్రీ. శ. 1195 నించి 1208 వరకు తిరువాన్కూరు పరిపాలించిన శ్రీరామవర్మ అన్న రాజు తత్కర్తగా వూహిస్తున్నారు. మరికొంతమంది ''చీరామన్'' అన్న పదం శ్రీరామన్‌కి గాక ''శివరామన్'' కి ప్రాతినిధ్యం వహిస్తుంది కనుక శ్రీ వీరరామవర్మ దాని కర్త కాదన్నారు. ఈ విషయాల్తోబాటు ''పాట్టు'' ప్రక్రియకు పూర్వం వుండిన కొన్ని 'పాడుపు కథలు', 'స్తోత్రములు' లాంటి వాటినిగూర్చి రెండో అధ్యాయంలో వివరించబడ్డాయి.

''మణిప్రవాళము — ప్రాథమిక దశ'' అధ్యాయంలో లీలా తిలకం, ఉణ్ణునీలి సందేశం, వైశిక తంత్రం లలో లభిస్తున్న కొన్ని భాగాల్ని గూర్చి చెప్పబడ్డది. ఈ రచనల్ని పరిశీలిస్తే మణి ప్రవాళ ప్రక్రియలో సంస్కృత పదాల శాతం, మలయాళ శబ్దాలకి పోల్చి నపుడు చాలా తక్కువ అని అర్థం అవుతుంది.

'మణిప్రవాళ' ప్రక్రియ బాగా ప్రచారంలో వుండిన కాలం లోనే అంతకు ముందుండిన 'పాట్టు' ప్రక్రియ పునరుద్ధరింపబడింది. అయితే తమిళ పదాలు ఎక్కువగా వుండాలి ... ... అన్న నియమాన్ని సడలించు కొన్నారు, ఈ పాట్టు కవులు. వీళ్లలో నిరణమ్ కవులుగా ప్రసిద్ధిని పొందిన కణ్ణశ్శ కవులు రంగంలో కనబడతారు. మణి ప్రవాళ కవులు మానవుని శృంగార జీవితానికి సంబంధించి రచనలు చేస్తే, ఈ పాట్టు కవుల పురాణ సారస్వతాన్ని అనుసరించారు. భారతీయ భాషల్లో మొదటి గీతానువాదం చేసిన మాధవ ఫణిక్కర్, భారతాన్ని అనువదించిన శంకర ఫణిక్కర్, మలయాళంలో అత్యుత్తమ రచనగా కీర్తింపబడుతూన్న కణ్ణశ్శ రామాయణ కర్త రామఫణిక్కర్ కణ్ణశ్శ కవులు. ''కేరళ సారస్వతమునకు సంస్కృత సారస్వత భావనా విధానములతో సన్నిహిత సంబంధము కలిగించిన వారందటిలో కణ్ణశ్శులు ముఖ్యముగా రామఫణిక్కర్ అగ్రగణ్యులని తుది మాటగా చెప్పవలసి యున్నది'' (పు. 42). వీళ్ల రచనల్తోపాటు, ''పాట్టు'' ప్రక్రియలో వచ్చిన జానపద గేయాలు, కృష్ణగాథ మొదలైన వాటిని వివరించే అధ్యాయం ''ప్రాత పాటలు''.

పాట్ట ప్రక్రియ నియమాల్లో వచ్చిన సడలింపు లాగానే మణిప్రవాళ ప్రక్రియ నియమాల్లో కూడా జరిగింది. అంతగాలేని సంస్కృత పదాలు అమితంగా వాడబడ్డాయి. పురాణాంతర్గత వస్తువుల్ని స్వీకరించడం జరిగాక, తమ ప్రతిభా విశేషాల్ని చూపించడం కోసం మణి ప్రవాళ కవులు చంపూ కావ్యాల్ని రాశారు. వీళ్లని గురించి ''మణి ప్రవాళము - చివరిదశ''లో వివరింపబడ్డది.

ఇలా ''పాట్టు'' మణి ప్రవాళ ప్రక్రియలు రెండూ సరి కొత్త రూపాల్ని సంతరించుకొంటూ, దేనికది ప్రాముఖ్యాన్ని పెంచు

కొంటూవున్న సమయంలో ఎళుత్తచ్చన్ సాహిత్యరంగంలో కనబడతాడు. తన ప్రతిభా పాటవంచేత ఆ రెంటినీ సమన్వయించుకొన్నాడు. ఒక నూతన శైలిని, రీతిని కనుగొన్నాడు. అతన్నీ, అతని అనుయాయుల్నీ గురించి ''భక్తినీతి కవిత్వము'' అన్న అధ్యాయం వివరిస్తుంది.

కేరళంలో స్వతస్సిద్ధంగా వుండిన ''కూడియాట్టమ్'' అన్న బృంద నృత్యం, జయదేవుని గీత గోవిందం ఆధారంగా పరివర్తనం పొందిన కళావిశేషం కథకళి. ఇది నృత్యం, సంగీతం, సాహిత్యం మూటిని చక్కగా కలగల్పుకొన్న సారస్వత ప్రక్రియ. కన్నడంలో యక్షగానం, తెలుగులో ''వీధిబాగోతం''వలె మలయాళంలో కథకళి ప్రసిద్ధం. అలాంటి కథకళిని గురించి, నిర్మాణ విశేషాదికాల్ని గురించి తెల్పేది ''కథకళీ సారస్వతము'' అన్న అధ్యాయం.

ఇక పాట్టు, మణి ప్రవాళం, చంపు, కథకళిల లాగానే విశేష ప్రాచుర్యం పొందిన ప్రక్రియ తుళ్లల్. సాధకుడు కుంజన్ నంబియార్.

సరళము సుందరమ్మునయి సాగెడి కేరళ భాషయె భటో
త్కరమున కర్హమై యలరు, కష్టతరమ్మగు దేవ భాషలో
పరగు కవిత్వముం గవులు పల్కిన దాని గ్రహించు పెంతొ దు
ష్కరమగు, దాని ధాటియు వెసం బరువెత్తగ జేయువారలన్.
(పుట : 110)

అంటూ మృదుమధురమైన మలయాళ భాషాశైలిని తన కవిత్వంలో వుపయోగించుకొన్నాడు నంబియార్. రామాది పాత్రలన్నీ వివిధ పరిస్థితుల్లో దుఃఖితులైనట్లు చిత్రింపబడియున్నాయి కాని శ్రీకృష్ణుడు దుఃఖించినట్లు కానరాదు. అలాంటి కృష్ణుణ్ణికూడా బాష్పార్ద్రుణ్ణి చేయడం రామపురత్తు వారియర్‌కే తగుతుంది. 'కుచేల వృత్తాంతం'లో కుచేలుని భార్య రాత్రి చీకటిలో వడ్లని దంచుతుంది. ఆ బియ్యంలో వడ్లు రాళ్లు ఎక్కువగా వుంటాయి. అయినా చేసేది లేక ఆ పాట్లాన్ని భర్త చేతికిచ్చి శ్రీ కృష్ణుణ్ణి దర్శించి రమ్మంటుంది. కుచేలుడు కృష్ణుణ్ణి చూడవెళ్తాడు.

మలిన వస్త్రచ్ఛేదములు ధరియించి
భుజముమీద నొక ముక్క వ్రేలాడ
కక్షస్థితము పుస్తకమ్ముతో గూడ
గట్టిగా కట్టిన కట్ట చూపట్ట

*　　*　　*

కాయమందు విభూతి కలయంగ పూసి
చినిగిన గొడుగును చేత ధరించి
అలుతి రుద్రాక్షల సరమును దాల్చి
భక్తి జపించుచు భగవంతు పేరు
లాత్మ లగ్నము చేసి యాతని యందె
అల్లనల్లన అత డరుదెంచు చుండె

అలా వస్తున్న కుచేలుని శ్రీకృష్ణుడు ఏడవ ప్రాసాదం నించి చూస్తాడు. చూసి అతని రాకవల్ల కల్గిన సంతోషం పట్టజాలకనో, అతని లేమికి చింతించడంవల్లనో బాష్పార్ద్రుడైనట్లు రామపురత్తు వారియర్ వర్ణిస్తాడు. ఇలాంటి కవులందర్నీ ప్రజా కవులుగా గుర్తించి అదే పేరుగల అధ్యాయంలో వివరించారు.

ఆధునిక మలయాళంలో మిగతా భాషలలాగానే ఆంగ్ల ప్రభావం ఇనుమిక్కిలిగా వుంది. తత్ప్రభావంవల్ల నవల, కథానిక, నాటకానువాదం, కవిత్వంలో పునరుజ్జీవనం జరిగింది. ఈ విషయం కొన్ని అధ్యాయాల్లో వివరింపబడింది.

కాల్పనిక ప్రస్థానం ఆవిర్భావానికి ముందే దాని ఛాయలు కొద్ది కొద్దిగా మలయాళంలో కన్పడుతున్నాయి. కుండూరు నారాయణ మీనన్, కొడుంగల్లూరు కుంజిక్కుట్టన్ తంబురాన్, ఏ. ఆర్. రాజరాజవర్మ రచనల్లో కాల్పనిక భావాలు వున్నాయి. ఈ విషయాలన్నీ 'కాల్పనికోద్యమము' అధ్యాయంలో ఉన్నాయి.

ఇరవై శతాబ్ది తొలి దశాబ్దుల్లో మలయాళ సారస్వత విహాయసంలో తారలై వెల్గిన కుమారన్ ఆశాన్, వళ్లత్తోళ్ నారాయణ మీనన్, ఉళ్ళూరు ఎస్. పరమేశ్వర అయ్యర్‌లతో కాల్పనిక కవిత్వం మూడు పువ్వులు ఆరుకాయలయింది. వాళ్లని కవిత్రయముగా కీర్తించింది మలయాళ సాహిత్యం. వీళ్ల తర్వాత నాలప్పాట్టు నారాయణ మీనన్, కుట్టి పురత్తు కేశవన్ నాయర్, వళ్లత్తోళ్ గోపాల మీనన్, ఎం. ఆర్. కృష్ణ వారియర్, వి. ఉణ్ణి కృష్ణన్ నాయర్, సర్దార్ కె. ఎం. ఫణిక్కర్, పళ్లత్తు రామన్ లాంటి వాళ్లని గురించీ, కాల్పనికావేశం తగ్గిన పిమ్మట కనబడుతున్న కవుల్లో వెణ్ణికుళం గోపాల కురుప్, బాలామణియమ్మ, కుఞ్ఞి రామన్ నాయర్, కె కె. రాజా, ఎన్. గోపాలపిళ్ల, బోధేశ్వరన్ లాంటి వాళ్లూ వున్నారు. వాళ్లని గురించి చెప్పడం కొన్ని అధ్యాయాల్లోని విషయం.

మొట్టమొదటి జ్ఞానపీఠ బహుమతి గ్రహీత జి. శంకర కురుప్ (ఇటీవలనే కీర్తిశేషులు), మార్మిక కవిత్వాన్ని సుసంపన్నం చేసిన ఆధునిక కవి. అతని భావ చిత్రణలు భావానికి సంబంధించినవే కాని ఊహకు కాదు. అతని దృష్టిలో భౌతిక వస్తువుకి కాల్పనికత జోడించడమే కవిత్వం. కురుప్ మహాకవి.

ఆంగ్ల సాహిత్యంలోని షెల్లీ, కీట్సులకి వారసులా అన్నట్టు కనబడుతున్న కవులు ఇడప్పళ్లి రాఘవన్‌పిళ్ల, చంగంపుళ కృష్ణపిళ్ల వాళ్లలాగే యౌవనంలోనే కాలుని వాతబడ్డ వాళ్లు వీరు. వీళ్ల తరువాత వైలోపిళ్ల శ్రీధర మీనన్, ఎన్. వి. కృష్ణవారియర్, ఓ. యన్. వి. కురుప్, అక్కిత్తం, ఎన్. ఎన్. కక్కాడ్‌లతో బాటు పున్నప్ర వయలార్ వుద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన వయలార్ రామవర్మల గురించి చెప్పడం ఇరవై, ఇరవై ఒక్కటి అధ్యాయాల్లోని అంశం.

మిగతా అధ్యాయాల్లో జీవిత చరిత్రలు, విమర్శ మొదలైన ప్రక్రియల్ని గురించి చెప్పబడింది.

1956 వరకు మాత్రమే పరిమితం అయిన ఈ రచన తర్వాత జరిగిన మార్పుల్ని, కవుల్ని గురించి చెప్పడం కాదని. ఇరవై ఏండ్లపైన తెలుగులోకి అనువదించబడ్డ ఈ రచనకి మార్పులు, చేర్పులు చేసి అనువదించి వుంటే ఆధునిక సాహిత్యం లోని మరెన్నో విశేషాలు తెల్సి వుండేవి. అది కష్టంతో కూడుకొన్న పని అయినా ఎంతో ఉపయోగకారిగా వుండేది. మొత్తానికి ఈ రచనలో మలయాళ భాషలోని వివిధ ప్రక్రియలు, ప్రముఖ కవులు, వాళ్ల రచనలతోబాటు సాంఘిక పరిస్థితుల్ని కూడా వివరించారు రచయిత. కేవలం పేర్లని గుర్తించడం గాకుండా విమర్శనా దృష్టితో వాటిని తూచడం కన్పడుతుంది.

దీన్ని అనువదించినవారు లబ్ధ ప్రతిష్ఠులు డా. దివాకర్ల వేంకటావధానిగారు. జగమెరిగిన బ్రాహ్మణులు కనుక అనువాదం బహుచక్కగా చేశారు. పద్యానువాదాల విషయంలో చాలా జాగ్రత్త తీసుకొన్నారు మూలంలోని భావం, సొబగు చెడకుండా అనువదించారు.

కుంజన్ నంబియార్ వ్యంగ్యంగా కవితలల్లడంలో పేరు బడ్డవారు. ఒకసారి శివుడు మృత్యుదేవత అయినకాలుని సంహరిస్తాడు. అప్పటి భూదేవి పరిస్థితిని ఇలా వర్ణిస్తాడు–

పృథ్వియంతయు నిండె వృద్ధులతోడ
మరణించుటకు నెట్టి మార్గమ్ములేదు
కాలుండు మనుజులకై రానె రాడు

* * *

గణితమ్ముచే ప్రజాగణమ్ము వంచింప
కార్తాంతికులకును కష్టమైపోయె
వైద్యశేఖరునకు వైవస్వతునకు
స్నేహబంధము సుప్రసిద్ధమేయన
నా ప్రేతపతి సాయమై రాకయుంట
వైద్యుడెవ్వరిని చంపంగ జాలడయ్యె
హతమార్చు క్షుద్ర విద్యల కృతహస్తు
లైన వారికి నెక్కువయ్యె క్లేశమ్ము;
నేర్పరులైన మనీషులు కూడ
కాస్సైన నార్జింపగా జాలరిపుడు

(పుట : 114)

లాంటి అనువాదాలు మాతృకని యథాతథంగా చిత్రించినవి.

జనసమూహము పారవశ్యమున దేల్చు
భూరి పరిమళయుతమైన పుష్పమాల

* * *

కంతు పూముల్కివలె మెల్ల కదలెనామె

(పుట : 59)

ఇది పునం నంబూద్రి మణి ప్రవాళంలో రచించిన రామాయణ చంపువులోని

మందీభూతే జనేఘే, పరిమళ బహళం
కయ్యిలా దాయ మాలాం
మందారభోగ మందస్మిత మధుర ముఖీ
మంగలస్త్రీ సమేతా;
మందం మందం నయంతీ ఘన జఘనభరం
ప్రాభృత ప్రాయమగ్రే
మందాక్షాలం క్లతాక్షీ మనసిజ కలికా
మైథిలీ సా నడన్నాళ్

అన్న దానికి అనువాదం. ఈ పద్యంలో కయ్యిల్=చేతిన, నడన్నాళ్= నడిచింది: అన్న రెండు పదాలు మలయాళం పదాలు. మిగతావన్నీ సంస్కృత శబ్దాలు. మణి ప్రవాళ ప్రక్రియలో సంస్కృత పదాల్ని ఎక్కువగా వాడబడ్డాయనడంకి ఇలాంటివి వుదాహరణ ప్రాయాలుగా వుంటాయి.

ఆంగ్లంనించి అనువదించిన విషయం అక్కడక్కడ కనబడుతుంది. ''వడక్కన్‌పాట్టు''లో 'ఆరోమరు'' అన్న వీరుడు చేసే వీర్య పరాక్రమాల్ని వర్ణిస్తూ

....
దానిపై నండము తగనిల్పు, దాని
మీద సూదిని గ్రుచ్చు, సూది అగ్రమున
పెట్టును 'బ్లేడు', నా బ్లేడుపై నెక్కి
త్వరితగతి నేడు నృత్యము లాచరించు అని వుంది.

దీని మూలం

''.. .... ఒరు కోళిముట్ట
కోళిముట్ట మేల్ సూచినాట్టి
సూచి మునమేల్ చురిక నాట్టి
చురిక మునమేల్ మరి ఇన్ను నిన్నుం
నృత్తంగళ్ ఏళుం కళిచ్చవనుం''అని చురిక(ఛురిక)వుంది.

తమిళ, మలయాళంలలోని '' '' (ఴ) కారం తెలుగులో నన్నయకు పూర్వమే ''ళ, డ''లుగా మారిపోయింది. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొంటే, మరో అక్షరాన్ని ఇరికించాల్సిన అవసరం వచ్చి వుండేదికాదు. ఇలాంటివి ఈ అనువాదంలో చాలా కనబడుతున్నాయి. ఉదా॥ కఴకమ్, కజగమ్ (Kazhagam) చుట్టెఴుత్తు (Currezhuttu), వట్టెఴుత్తు, వత్తెఴుత్తు (Varrezhuttu), ఎళుత్తచ్చన్' ఎఴుత్తచన్ (Ezhuttaccan) లాంటి పదాల్లోవున్న ఴ, జ, ళ– అన్నవి ' ' కారానికి సమానార్థకాలు. ఇవి అన్నీ ఆంగ్లంలోని "Zha" ప్రభావ ఫలితాలు. వాటిలో కూడా ఒకక్రమాన్ని పాటించినట్టు కానరావడంలేదు. ఏది

ఇష్టమైతే దాన్ని వాడుకొన్నట్టు కన్పడుతుంది. భాషల్లో జరిగే మార్పుల్ని గుర్తించివుంటే ఇలాంటి వాటికి అవసరం వుండి వుండేదికాదు

ఇలాంటి అవకతవకలు మలయాళం రచయితల్ని, రచనల్ని, సాహిత్య ప్రక్రియల్ని రాయాల్సి వచ్చినపుడు కూడా కన్పడుతున్నాయి. ప్రచురణకిముందు మలయాళ భాషతో పరిచయుంవున్న వారినో లేక మలయాళ సాహిత్యము—పి. కే. పరమేశ్వరన్ నాయర్- ను నేరుగానో చూపివుంటే ఇలాంటి దారుణ పరిస్థితి ఏర్పడివుండేదికాదు అధిక శాతం రూపాలు మలయాళంకి న్యాయాన్ని చేకూర్చే రూపాలుకావు. కనీసం రెండో ముద్రణలోనయినా చక్కదిద్దగలరనే ఆశతో కొన్నిటిని కింద పొందుపరుస్తున్నాను.

ఉండేది	ఉండాల్సింది	పుట
నట్టుక్కుట్టవ్	నాట్టుకూట్టవ్	2
తిరువతిర	తిరువాదిర	4
నీన్	ఇన్	6
అయి	ఆయి	6
టట్	ట్ట (R R)	6
తున్నల్కరన్	తున్నల్ కారన్	7
అవియన్	అళియన్	7
అంగటి	అంగాడి	7
పట్టయమ్	పత్తాయం	7
ఇటు	ఈడు	7
ట్యా	తోణి	7
పవ	పావ	7
కనిక్కార్లు	కాణిక్కార్లు	9
వేదలు	వేడర్ / వేటర్	9
చట్టనార్	సాత్తనార్ / చాత్తనార్	15
కపిలార్	కపిలర్	15
అగననూరు	అగనానూరు	15
పురననూరు	పురనానూరు	15
వెనట్టు అడిగలు	వేణాట్టు అడిగలు	16
కడుతురితి	కడుత్తురుత్తి	36
కడుదురుతి	,,	37
కులవనియార్	కులవాణియన్	15
పరానార్	పరణర్	15
అంఘు టంపురాన్ పాట్టు	అంజు తంబురాన్ పాట్టు	23
న్యట్టు పాట్టులు	శాట్టు పాట్టులు	43
ఎలంజి ఛెట్టు	ఇలంజితోల్	45
నలుపదవ్	నాలు పాదవ్	48
కై మలుతే వరవు	కై మలుడె వరవు	48
కొలక్కలి	కోలడి	48
టచోలీ ఓటేనన్	తచ్చోళి ఒతేనన్	49
తచోలీ చాంటు	తచ్చోళి చందు	49
పలట్టు కోమన్	పాలాట్టు కోమన్	49
ఉణ్ణియార్ప	ఉణ్ణియార్చ	49
అల్లిమలార్క్కవు	అల్లిమలర్క్కావు	50
కాలరులకు	కళరిలకు	50
చెరుస్సరి	చెరుస్సేరి	52
హంసప్పట్టు	హంసప్పాట్టు	92
కొట్టారక్కర తంపురాన్	కొట్టారక్కర తంబురాన్	93
కప్పట్	కాప్పాడు	86
అయువంచేరి టంప్రక్కాలు	ఆళ్వాంజేరి తంప్రాక్కళ్	89
ఇలత్తూరం	ఇలత్తూళం	94
చెంగల	చేంగిల	94
కొట్టయత్తు తంపురాన్ కొట్టయత్తు టంపురాన్	కోట్టయత్తు తంబురాన్	97
ఉన్నయి వారియర్	ఉణ్ణాయి వారియర్	97
ఆట్టక్కథ	ఆట్టక్కథ	104
కొట్టరవ్ కథకళి యోగం	కొట్టారం కథకళి యోగం	104
ఇత్తిర రిస్స మీనన్	ఇట్టిరారిశ్శ మీనన్	105
పుటియక్కాల్ టంపాను	పుదియ య్క్కల్ తంబాన్	105
కిళిమనూరు విద్వాన్ కోయి టంపురాన్	కిళిమానూరు విద్వాన్ కోయిత్తంబురాన్	105
ఉట్రాం తిరునాళ్ మార్తాండ వర్మ	ఉత్రం తిరునాళ్ మార్తాండ వర్మ	107
కూతు	కూత్తు	109
కిళిప్పట్టు	కిళిప్పాట్టు	110
తుల్లాలు	తుళ్ళల్	112
ఒమన తింకళ్ కితవో	ఓమన త్తింగళ్ కిడావో	119
చెంకులట్టు కున్హిరామమీనన్	చెంగులత్తు కుఞ్ఞిరామ మీనన్	127

ఉండేది	ఉండాల్సింది	పుట
కొట్టాయము	కోట్టయం	127
కె. ఎం. పాణిక్కరు	కె. యం. ఫణిక్కరు	140
అఫన్తే మకల్	అఫన్టె మగళ్	140
రండి టంగళి	రండు ఇడంగళి	142
..ప్పుప్పుక్కొరనేంటర్పు	న్టప్పాప్పుయ్యొరానేణ్డార్పు	145
ముట్టతువాకే	ముట్టత్తు వర్కి	148
ఇన్నపవుకాల్	ఇన్నప్పావుగళ్	148
వడక్కన్ పట్టు	వడక్కన్ పాట్టు	189
నీనపువ్వు	వీణపూవు	199
చింతా విష్ట్వయాయ సీత	చింతా విష్ట్వయాయి సీత	204
ఒరు తీయక్కుట్టియుతే విచారం	ఒరు తీయక్కుట్టియుడె విచారం	207
ఒరు కిరతలయన	ఒరు కీరత్తలయణ	219
ఒరు అర్రిపవు	ఒరి అర్రిపావు	219
పట్టిల్ పోటింజట్క్కాళ్లి	పట్టిల్ పాదిఞ్ఞ తీక్కొళ్లి	220
ఉన్న నిల్ల, ఉదుక్కు నిల్ల	ఉణ్మానిల్ల, ఉడుప్పా నిల్ల	220
తుక్కుమార తిలవ్	తూక్కు మరత్తిల్	224
సుధారిల్ సుధన్	శుద్ధరిల్ శుద్ధన్	226
మలయాళ తింటెతల	మలయాళత్తిన్టె తల	227
నలప్పట్టు నారాయణ మీనన్	నాలప్పాట్టు నారాయణ మినన్	243
చెంక తిరుకళ్	చెన్ కదిరుగళ్ (చెంగదిరుగళ్)	259
ఇళం చుకిదుకళ్	ఇళం చుండుగళ్	259
ఎడప్పళ్లి	ఇడప్పళ్లి	260
తత్తరింటె కరచిల్	కాట్టారిన్టె కరచ్చిల్	262
వయుక్కుళ	వాళక్కుల	266
కొడుం కట్టు	కొడుం కాట్టు	266
ఇన్న తెనిల	ఇన్నత్తె నిల	266
స్పండిక్కున్న అస్తిమదవ్	స్పందిక్కున్న అస్తిమాడం	267
స్పందిక్కున్న అస్తిమతవ్	,,	284
పతనిక్కర్	పట్టణిక్కార్	267
తెంగు కళుతె విధితము	తెంగు కళుడె విద్ధితం	267
వ్యంగళ్ చొడిక్కున్	ఇంగళ్ చోదిక్కుం	270
నర్క్కక వల్లప్పరుప్	ఓర్కుక వల్లప్పోళుం	271
పడతల వంతె కత్తు	పడత్తలవన్టె కత్తు	271
అదర్కుల త్తిల్	అడర్కళత్తిల్	271
అస్సాం పానిక్కర్	ఆశాం పణిక్కార్	273
కురెక్కుటె నిండా కవితకళ్	కురెక్కాడి నిండ కవితగళ్	274
తివండి ఇళెపట్టు	తీవందియిలె పాట్టు	275
పరుయ పట్టు	పళయపాట్టు	275
అనక్కరన్	ఆనక్కారన్	275
పుత్తన్ కల్పున్ అరివలువ్	పుత్తన్ కలవుం అరివాళుం	275
కొంటయుం పులునుక్	కొందయుం పూణాలుం	276
నదింతే నాదవ్	నాడిన్టె నాదం	276
ఇలతలవ్	ఇలత్తాళం	277
కుళం బాడి	కుళంపు అది (కుళం పడి)	277
చిల్లువ తీళ్	చిల్లు వాదల్	277
అరలిప్పక్కళ్	అరళిప్పూక్కళ్	277
శాస్త్రతింతే గితి	శాస్త్రత్తిన్టె గతి	297
కలహినిద మానగిన్	కలహినీ దమనకం	311

శ్రీ నా భక్తవత్సల రెడ్డి

విమర్శ వేదిక

[శ్రీ అద్దేపల్లి రామమోహనరావు. మూల్యం రు 10/– ప్రతులకు : ప్రభాకర్ పబ్లికేషన్సు, 52–4–6, బిక్కాల వా.. వీధి, జగన్నాథపురం, కాకినాడ, తూ. గోదావరి జిల్లా]

ఈ విమర్శ గ్రంథంలో గురజాడ, కృష్ణశాస్త్రి, చలం, నండూరి, శ్రీశ్రీ, తిలక్, కుందుర్తి కవిత్వాలపై పదకొండు విమర్శ వ్యాసాలున్నవి. 'గురజాడ–ఆధునికత' 'పూర్ణమ్మ కథలో విషాదాంశ పరిపుష్టి' అనే రెండు వ్యాసాలు గురజాడ సాహిత్యానికి సంబంధించినవి. గురజాడ – ఆధునికత అనే వ్యాసంలో "కవుల్ని ఆ కాలపు భావాలతోనే కొలచి, అతని ప్రతిభను అంచనా వెయ్యాలి" ఇది రామమోహనరావుగారి కవితా విమర్శకు సంబంధించిన సిద్ధాంతం. అంచనా వెయ్యడం వరకూ ఆ కాలపు లక్షణాలతోనే అంచనా వేస్తారు కాని వర్తమాన కాలంలో వారి అస్తిత్వం ఏమిటి? అనేది సమాధానం లేని ప్రశ్న కాకూడదు. ఆధునికత కేవలం కాలవాచి గాదు. సమకాలీన కవులంతా ఆధునికులు కారు. ఎవడైతే అంతకు ముందున్న సంప్రదాయాన్ని కాదని క్రొత్తదారి తొక్కుతాడో వాడు ఆధునికుడు. సంప్రదాయాన్ని ఎదిరించడం ఆధునికత అని కొంతమంది భ్రమపడవచ్చు. సంప్రదాయం మార్పుని ప్రతిఘటిస్తూ, మృతప్రాయంగామారి, సమాజ సర్వాంగాల్లో మౌఢ్యాన్ని మాత్రమే ప్రచారం చేస్తున్నపుడు మేధావులు తప్పనిసరిగా సంప్రదాయానికి ఎదురుతిరిగి నూతన విలువల్ని ప్రతిష్ఠిస్తారు. సామాజిక వ్యవస్థలోనూ, సాహిత్యరంగంలోనూ ఈ మార్పు

అనివార్యమని గత చరిత్ర మనకు పాఠం నేర్పింది. ఈ దృష్టి నుంచి ఆధునికత, అంటే అటు ప్రక్రియలోను, ఇటు వస్తువులోను సమూలమైన, సజీవమైన మార్పును ప్రవేశపెట్టడం. అట్టి ఆధునికతకు తెలుగు సాహిత్యంలో గురజాడ అసలైన, సిసలైన ప్రతినిధి. రామమోహనరావుగారు ఎంతసేపూ శిల్పవివరణలో పడ్డారేగాని గురజాడ ఆధునికతకు మూలమైన వస్తు విశ్లేషణ చెయ్యలేదు. అదే వ్యాసంలో "ఆధ్యాత్మికవాదం భౌతికవాదంగా మారడంలో మధ్యనున్న మెట్టుగా ఈ కాలం కనిపిస్తుంది" అన్నారు రచయిత. నాకు బోధపడినంత వరకూ ఆధ్యాత్మికవాదం భౌతిక వాదంగా పరిణమించలేదు. ఆధ్యాత్మిక వాదంపై భౌతికవాదం ఒక పెరుగుబాటు మాత్రమే.

కృష్ణశాస్త్రిగారిపై 'అన్వేషణను' ఊర్వశి అనే రెండు వ్యాసాల్లో శాస్త్రిగారి అలౌకిక భావసిద్ధాంతాన్ని, అద్వైత భావనను అనితర సాధ్యంగా విశ్లేషించారు. కృష్ణశాస్త్రిగారి ఊర్వశి విశ్వప్రేయసి. విశ్వసౌందర్యానికి, ఆయనలోని అద్వైత భావనకు ఊర్వశి ఒక ప్రతీక.

"వేయివేలు యుగాలు, రేయినై పగలునై
అడరి కురిసిన ఏడ్పు, అలరి విరిసిన నవ్వు
బరువు కానుకగ, మనభాగ్య బంధమ్ముగా
చేర్చుకొని నాలోన కూర్చితిని నీ కొరకె"

అంటుంది ఊర్వశి. "కష్టమైనా బరువు కానుకయే. సుఖమైనా బరువు కానుకయే. సుఖాన్ని బరువుగా భావించడమే యిక్కడి రహస్యం" అన్నారు రామమోహనరావుగారు. దాని అర్థాన్ని ఇంకొక రకంగా అన్వయించవచ్చు రేయి, పగలు దుఃఖానికి, సుఖానికి ప్రతీకలైతే అడరి కురిసిన ఏడ్పు బరువు కానుకగ, అలరి విరిసిన నవ్వు భాగ్య బంధమ్ముగ అవుతుంది. రేయి, పగలు, సుఖ దుఃఖాలు ఇవన్నీ ద్వంద్వాలు. ఈ ద్వంద్వాలకు అతీతమైన మానసిక స్థితిని (అద్వైతం) కవి ఆశిస్తున్నాడు. 'హాలాహలానము, అమృత శీతల రసం' అనటంలోకూడ ఔచిత్యం ఇదే. కృష్ణశాస్త్రిగారిపై రెండు వ్యాసాలు కృష్ణశాస్త్రిగారి కవిత్వతత్త్వానికి దగ్గరగా ఉన్నవి.

చలంలోఉన్న అద్వైత భావపరమార్థాన్ని 'చలం అందించిన సుధ' అనే వ్యాసంలో వివరించారు. అరుణాచలం వెళ్ళకపూర్వం చలానికి, వెళ్ళిన తరువాత చెలానికి భేదం ఏమైనా ఉన్నదా? అని గాని, అసలు చలం రచనా ప్రణాళికలో వచ్చిన పరిణామస్థితులను గాని రామమోహనరావుగారు సూచన మాత్రంగానైనా చెప్పలేదు. కేవలం వ్యాసం ఒక్క సుధ కావ్యానికి మాత్రమే పరిమితమైంది. చలం అంతిమ తత్వాన్ని రామమోహనరావుగారు వివరించిన పద్ధతి గొప్పగా ఉంది.

కృష్ణశాస్త్రిగారి అద్వైతమూర్తి ఊర్వశి లాగానే ఎంకి, నాయుడు బావల లౌకిక, అలౌకిక భావ బంధాన్ని ఎంకి పాటలు వ్యాసంలో విశ్లేషించడం జరిగింది. మండువారి చెప్పిన వెలుగు నీడల్ని అలౌకిక, లౌకిక అనుభూతులకు ప్రతీకలుగా తీసుకొని ఈ వ్యాసాన్ని సాగించారు. "ఆకాశమో వొరుస ఆవలించిన రేయి" అనడంలో ఎంకి మనస్సులో యింకా విజృంభించిన భీతిని సూచిస్తోంది అంటున్నారు. ఆవలింత భీతికి ప్రతీక కాదు. ఒక నిరాశతో కూడిన అసహనానికి మాత్రమే ఇక్కడ ప్రతీక. నాయుడు బావకోసం ఎదురు చూస్తున్న ఎంకిలో నాయుడుబావ ఎంతకీ రాకపోవడంతో అసహనం ఆరంభమయింది. అంచేతనే 'ఒక్కతెను నాకేల గోపజాలని సుఖము' అంటుంది. ఆకాశం ఆవలించడం సమయం మించిపోతున్నదనే భావనకు, ప్రకృతికూడ నిద్ర కుపక్రమిస్తున్నదనే భావనకు ప్రతీక అదీకాక ప్రియుడు కొరకు ఎదురుచూసే ప్రియురాలి ఎదలో అసహనం, ఆవేదన ఉంటుందేతప్ప భీతికి ఆస్కారం ఉండదు. 'ఎనక జల్మములోన' అనే గేయంలో ఉన్న ఆధ్యాత్మిక అనుభూతిని బాగా విశదీకరించారు రామమోహనరావుగారు.

శ్రీశ్రీపై రాసిన రెండు వ్యాసాల్లో ఒకటి ఆయన రేడియో నాటికలపై, రెండు ఖడ్గసృష్టి కావ్యంపై. ఈ రెండు వ్యాసాల్లో రామమోహనరావు తేల్చిన సారాంశం కావ్యశిల్ప ప్రాధాన్యం. శ్రీశ్రీ మహాకవి అవడానికి ఆయన రచనా శిల్పమే కారణమని చాలమంది విశ్వసించినట్లుగనే రామమోహనరావుగారు కూడ విశ్వసిస్తున్నారు. శ్రీశ్రీ నాటికల్లో ఉన్న శైలిని, అతిలోకమైన భావనాశక్తిని, సాంకేతిక నైపుణ్యాన్ని, మానవుని మూల విలువల్ని ప్రశ్నించే ఆలోచనలని రచయిత మొదటి వ్యాసంలో చూపించారు. ఖడ్గసృష్టి విషయంలో రచయిత ఒక విధంగా సదసత్సంశయంలో పడ్డారు. మహాప్రస్థానంలో ఖడ్గసృష్టిని పోలుస్తూ "కొండ కొమ్ము నుండి ప్రళయ వేగాన దూకే జలపాతం మహాప్రస్థానం కాగా నేలమీద నిర్ఝరంగా ప్రవహించే నది ఖడ్గసృష్టి" అంటూ "నిస్సందేహంగా మహాప్రస్థానం మహోత్కృష్ట కావ్యం" అని రామమోహనరావు గారు తీర్పు నిచ్చారు. ఖడ్గసృష్టిమీద పదహారు పేజీలు వ్యాసం రాసినా అంతిమమైన తీర్పు దాని ప్రత్యేకతను కాదనలేమని 'రాసేది రష్యన్ గీతి — చేసేది నవ్యుగ్రహీతి' మొదలైన పాదాల్లో అంత్యప్రాసలు కృతకంగాను, తెచ్చిపెట్టినట్లుగాను ఉన్నాయని వారి అభిప్రాయం. నగరంలో వానపై ఆయనరాసిన వ్యాసంలో కుందుర్తి ప్రాస వాడినా, యతి వాడినా అది భావానికి లొంగిపోతుందని చెబుతున్నారు. 'కదులాడుతున్నట్లు — పలుకుతున్నట్లు' ఇక్కడ అంత్యప్రాసలో ఏ మహాశిల్పం దాగి ఉందో నాకు బోధపడటం లేదు. నగరంలో వానలో కవిత్వం లేదని కాదు నేననేది; ఖడ్గసృష్టికి రామమోహనరావుగారు అన్యాయం చేశారని మాత్రమే.

తిలక్‌పై అనుభూతివాదం, భావకవిత అని రెండు వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాల్లో తిలక్ మనస్సులోని అనుభూతులు ఎంత శిల్ప సహితంగా వెలికి తెచ్చాడో ఋజువు చేశారు.

"సృష్టిలోని అర్థం కోసం
జన్మలోని సాఫల్యం కోసం
జనన మరణాతీతమైన సురభిళ రహస్యంకోసం
ఎన్ని ఎడారిదారుల
కంటకిత కానన మార్గాల

పడుతూ లేస్తూ పడుతూ లేస్తూ
ఒక్కొక్క తీగ తెగుతూ
మిగిలిన ఈ విచిత్ర విపంచికను మీటుకుంటూ
ప్రతి గడపముందు ప్రతి గవాక్షం ముందు
నిలబడిపాడుతున్నాను పిలుస్తున్నాను.''

అనేకపాదాలను భావ కవిత అనే వ్యాసంలో ఉదహరించారు. ఈపాదాలు మానవతావాద ధ్వని ప్రధానమైనవి. ఎడారిదారులు, కంటకిత కానన మార్గాలు మానవతా సిద్ధికోసం చేసే ప్రయత్నంలో అడ్డంకులకు ప్రతీకలు. ఒక్కొక్క తీగ తెగటం సర్వ విలువల విధ్వంసమన్న మాట. మిగిలిన ఈ విచిత్ర విపంచిక ఒక్క మానవత్వం. ప్రతి గడప ముందు, ప్రతి గవాక్షం ముందు నిలబడి పాడటమంటె ప్రతి హృదయంలోనూ ప్రతిధ్వనించేటట్లు మానవతావాదాన్ని బోధించడమని మనం భావించాలి.

'విమర్శవేదిక' అనే ఈ గ్రంథం రామమోహనరావుగారి మేధాశక్తిని ప్రదర్శిస్తోంది. ఆయనదైన ఒక ప్రత్యేకశైలి ఆయన విమర్శలో ప్రతి అక్షరంలోనూ కనబడుతోంది. విమర్శ ఎవరి దృక్పథంలోంచి వాళ్ళు చేస్తారు. రామమోహనరావుగారి దృక్పథం కవిత్వానికి విషయంతో సంబంధంలేదని, శిల్పంతోనే సంబంధమని ఈ గ్రంథం చదివితే స్పష్టంగా అర్థం అవుతుంది. ఆయన మేధస్సు ప్రాచీన ఆలంకారిక శాస్త్రప్రమాణాలతో నిండిఉంది. ఆయన పాదాలు ఆధునిక జీవన చైతన్యంలో సంపూర్ణంగాకాకపోయినా కొంతవరకూ దిగిఉన్నాయి. ఈ రెండిటి సమన్వయ ప్రయత్నంలో వస్తువును అల్పం చేసిన కళాత్మక విలువలు గ్రంథాన్ని మింగేశాయి. ఉదాహరణకు గురజాడ, శ్రీశ్రీ ఈ ఇద్దరి వస్తుపరమైన చైతన్యం వాళ్ళను విశ్లేషించేటప్పుడు మృగ్యమైపోవడం గమనార్హమైన విషయం. ఏమైనా ఈ యుగంలో విశిష్టులైన కవులపై సాగిన విమర్శ ఇది. ఈ యుగ కవిత్వాగ్నిజ్వాలకు ఈ గ్రంథంకూడ ఒక సమిధలాగ తోడ్పడుతుంది.

శ్రీ టి. ఎల్ కాంతారావు

ఇద్దరు పెళ్ళాల మొగుడు

[పైడిపాటి సుబ్బరామశాస్త్రి. దేవీ పబ్లికేషన్సు, విజయవాడ. రు. 10-00.]

రామం భార్య అరుంధతి అనుకోని పరిస్థితులలో తనకు అత్తారుపెట్టిన నగలు తన తండ్రి అవసరంకోసం అద్దువేస్తుంది. ఆ కారణంగా ఆమె సంసారం నాశనమవుతుంది. రామం లలిత అనే మరో అమ్మాయిని రెండో పెళ్లిచేసుకుంటాడు. ఆనక తన తండ్రి, అన్నగారూ చనిపోయాక దిక్కులేక తెగించి అరుంధతి అత్తారింటికి చేరుతుంది. కేవలం పొట్ట గడవడం కోసం వచ్చాననీ, పనిమనిషిగా తనకు ఆశ్రయం యివ్వమనీ అత్తగారిని వేడుకుని ఆవిడ ఆశ్రయం సంపాదిస్తుంది. తన సవతి చేతిలో చేయివేసి, తనా ఇంటికి కేవలం పనిమనిషిగానే వచ్చాననీ, తనకే విధమైన సంసార వాంఛా లేదనీ తన కాశ్రయం యిచ్చినవారికి అన్యాయంచేయననీ వాగ్దానంచేస్తుంది. లలిత మనస్సు కూడా గెల్చుకుంటుంది.

పేజీలు దొర్లగా దొర్లగా లలిత మనస్సు పరిణామం చెందుతుంది. కొన్ని సంఘటనలు అందుకు దోహదం చేస్తాయి. తన భర్తమీద తనకున్న హక్కుకన్నా, అరుంధతికివున్న హక్కే ఎక్కువని పిస్తుందామెకు. తన భర్త తనను ప్రేమగా చూసేటపుడు, నిర్లక్ష్యం చేయనపుడు ఆయన తన మొదటి భార్యను ఏలుకుంటే మాత్రం ఏంపోయింది అని తర్కించుకుంటుంది. చపలత్వంతో మరో స్త్రీ సంపర్కంతో తన సంసారం పాడయితే మాత్రం చేయగలిగేది లేదుగనుక, తన మంచికోరే అరుంధతికి తనభర్తలో వాటా యిస్తే హానిలేదని అభిప్రాయపడుతుంది.

అనుకోని విధంగా ఏర్పాటయిన సత్యనారాయణ వ్రతం వల్ల, లలిత అనారోగ్యంవల్లా అరుంధతి తన భర్తకు కొంత చేరువవుతుంది. దానికి తోడుగా అత్తగారు ఆమెను ప్రోత్సాహించడమేగాక అవకాశాలు కూడా కలిగిస్తుంది. ఆరోగ్యం చక్కబడి పురుటికి పుట్టింటికి బయలుదేరిన లలిత ''అక్కా నువ్వూ వారూ పడుకుంటే నేను బయట విడిగా పడుకోవాలనే బాధతో...కానీ ఇప్పుడు పురిటికి పుట్టింటికి వెళ్తున్నాను. నా స్థానంలో నువ్వు వుండవచ్చు'' అని తన సవతి అరుంధతితో అని, అంతతో వూరుకోక తన భర్త చేతినీ, అరుంధతి చేతినీ కలిపి ''ఇది నా కోరిక అక్కను కూడా ఏలుకోండి'' అంటుంది.

ఇది చక్కని నవల. ఎటొచ్చీ కథలో సత్యనారాయణ వ్రతం తొమ్మిది అధ్యాయాల కథలనూ, తిరుపతి స్థల పురాణాన్నీ చాలా వివరంగా వ్రాశారు రచయిత. ఈ కథలు చాలా పెద్దవి పైగా మూలకథకు అంత వుపయోగం కూడా కాదు. ఆనక కథలో మాటిమాటికి అరుంధతి తన సవతి లలిత అందాన్ని మెచ్చుకుంటూ ఆమెను ముద్దుపెట్టుకుంటూ వుంటుంది. ఇద్దరూ కలిసి కోర్కెలతో ఒకే మంచంమీద (కౌగిలించుకుని) పడుకుంటూ వుంటారు. ఈ సంఘటనలు స్త్రీ నైజానికి, మనస్తత్వానికి ఎంత దగ్గరయినా కథాగమనానికి అంతగా అవసరం లేనపుడు వ్రాయనవసరం లేదు. స్త్రీ సహజంగా తన అందాన్ని పొగిడితే వివశురాలవుతుంది. గారం చేస్తే మైమరచిపోతుంది. పొగిడితే వుబ్బిపోతుంది. కానీ అరుంధతి లలితను తనవైపు తిప్పుకోడానికి, తను తన భర్తకు చేరువవడానికి యీ అస్త్రాలను వాడలేదు కదా! ఆమెకా వూహాలే లేవు కదా!

ఇవి మినహాయిస్తే యీ నవల చాలా చక్కనిది. రచయిత పైడిపాటివారు చాలా చమత్కారంతో సృష్టించిన సంఘటనలలో కొన్ని చదువరి మనస్సును తాకుతాయి. పాత్రల కష్ట సుఖాలలో తానేదో భాగం పంచుకుంటున్నట్టు అనిపిస్తుంది చదువరికి. చిన్న యితివృత్తంమీద చక్కని కథనంతో నడిచింది నవల. పైగా పేరు ''ఇద్దరు పెళ్ళాల మొగుడు'' కథ కెంతో న్యాయం చేకూర్చింది. పది రూపాయల ఖరీదుతో 246 పేజీలతో విజయవాడ దేవీ పబ్లికేషన్సువారు యీ పుస్తకాన్ని తెలుగు చదువరి ముందుంచారు.

పాలాక్షుడు

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.